భారతి

సాహిత్య మాసపత్రిక

ఏప్రిల్ 1980

రేపు!

రామకృష్ణ

దేవులపల్లి దీప్తి

పద్మనాభస్వామి

కృష్ణశాస్త్రి కవిత్వం

రామలింగం

బాలాబ్దము

సీతారామమూర్తి

రిజర్వేషనులు

మురళీమనోహర

జనార్ధన్ రావు

గడ్డిపువ్వు

నాగభూషణం

ఇంకా రామకృష్ణ, రామకృష్ణమూర్తి, పెన్నా శిరాకృ, రఘునాథం, రాంమోహన్ రాజు, సాంధ్యశ్రీ, రజాహుస్సేన్, రామబ్రహ్మం, రఘునాథరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మల్లికార్జునరావు, రంగాచార్యులు, శాస్త్రి, జవహరలాలు, జనార్ధన్, సంపత్కుమారాచార్య

ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

ఏప్రిల్ 1980

సంపుటము : 57　　సంచిక : ౪

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1980



12-4-1980 చైత్ర బహుళ ద్వాదశి శనివారము

కళాప్రపూర్ణ, దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి

112వ జయంతి

బాలాబ్దము

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

కల్ల కపుడు లేని కసి కక్కుఱితి లేని
యెడఁదతోడ వచ్చు నిలకు బుడుత,
మల్లెపూవు చందమామ పుణ్యమ్ముల
ముద్ద నిద్దమైన యద్ద మతఁడు.

కులమతాది భేదములఁ గల్మిలేములఁ
గటికి మచ్చరములఁ గ్రాఁగుజగము —
గాలి సోఁకినంత బాలుఁడు మెలమెల్ల
బాటదప్పి మైలపడును జెడును

లోక మెటులున్నఁ దలిదండ్రు లేకలంకు
లేని నడవడితో శ్రద్ధాను లగుచు
మనుపవలయును బిడ్డల మధురశీల
ధీ గరిష్ఠత గనునట్లు దిద్దవలయు.

ఆఁకొన్న పొట్టతో నసురుసురై యెంగి
లాకు నాకఁ దొడంగు ననదయందు
ఝుంఝూ హతికి నొచ్చి చచ్చిన పతిమీఁద
వ్రాలి వందురు పేదరాలియందు
గోఁచిప్రోఁతయు లేక యేచిన చలికి రా
బాటఁ గొంకరవోవు బడుగునందు
రక్కెస వడగాడ్పు రాయిడిలో శిలల్
వ్రక్కలించెడి పేదవానియందుఁ
దన్నుఁ జూడవలయుఁ దండ్రి, దురాశలు
వీడవలయు నిక్క మాడవలయు
సుతుఁడు సుతయు విశ్వహిత మెంతు రావేళ
నపుడె నవసమాజ మవతరించు.

నాకు నగ్గపడిన నైతికబలమెల్ల
నన్నుఁ గన్నవారి నడత పంట
శిరము వంతు వీరి చరణాలపై నన్న
గాంధిపల్కు మఱవఁగాదు పితలు.

నిత్య సత్యాశ్రయుండు గణేయ వినయ
కలితుఁ డౌదార్యమూర్తి నిష్కంప ధైర్య
రతుఁడు లంచంబెదుంగని ప్రగడ కీర్తి
రాశి నాతండ్రి యనె సబర్మతి మహర్షి.

గృహగత దైవతార్చన ముగింపక ముట్టదు భోజనంబు, న
న్వహమును సంజప్రొద్దు గుడి కాదట నేగి ముకుందుఁ
గొల్చు, దు
స్సహముల నౌపవస్త్రముల సైఁచును వేమఱు మత్పవిత్రి, త
న్మహిమ మపార మంచు మతిమన్మణి గాంధి కరంగు
నెంతయున్.

మగువ నంటక మద్యమాంసంబు లొల్లక
పొగడికల్ గనె భోగభూమియందు
చేసిన దోసముల్ మూసిపెట్టక చాటి
మప్పెఁ బాఠమ్ము సమాజమునకు
జగ మిచ్చినట్టి లక్షల కొలంది ధనమ్ము
వెచ్చపెట్టెను ప్రజావితతి కొఱకు
గుడులలో లేఁడయా గుహలలో లేఁ డని
చూపించె నీశ్వరు సూనృతమున

లోకమెల్ల నెదుర్కొనుగాక నిలిచి
గెలిచె నసిలేని కసిలేని కలను దీర్చి
బాపుజీ యెట్లుపడసె నీ ప్రాభవమ్ము ?
కన్నవారల నడవడికతనఁ గాక.

పిన్నలు సాగిసాగి మన పెద్దల గద్దెల నాక్రమించు ప్రొ
ద్దున్నది, వారి తీర్పులకు నుర్వి సెబాసని శాంతి సౌఖ్య సం
పన్నతమై మెలంగవలె, బాలల బాలురఁ దీర్చినప్పుడే
సన్నిధిసేయు నీ శుభము, చల్లపడున్ ప్రజ నేఁచునీరసల్.

పలుకుల్ సత్యసరస్వతీ పటుతర ప్రాకార కుడ్యంబులై
తలఁపుల్ విశ్వజనీనహార్ద కరుణాధారా ప్రసన్నంబులై
నిలుపు*ల్ ధర్మవిధేయ భవ్యపదవీ నిర్దిష్ట నిశ్రేణులై
గెలుపుల్ గూర్చుత బాలబాలికల కగ్రేయమ్ము లెల్లప్పుడున్!

---

* నిలుపు — బ్రదుకు.

[ఆకాశవాణి విజయవాడ వారి సౌజన్యముతో]

స్వర్గీయ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు

మన పంతులు గారు

[దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు 1938 ఏప్రిల్ నెలలో శివసాయుజ్యం పొందినపుడు "మన పంతులుగారు" అనే శీర్షికతో కథక చక్రవర్తి స్వర్గీయ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తమ 'ప్రబుద్ధాంధ్ర' పత్రికకోసం ఈ వ్యాసాన్ని వ్రాశారు. 1979 లో ఆంధ్ర విశ్వవిద్యాలయంనుంచి "శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు—సమగ్ర సమీక్ష" అనే పరిశోధన గ్రంథానికి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' డిగ్రీ పొందిన శ్రీ చావలి కనకయ్య ('కనక్ ప్రవాసి') గారు శ్రీపాదవారు వ్రాసిన ఈ వ్యాసాన్ని సేకరించి మాకు అందజేశారు. — సం]

ఆంధ్రపత్రిక ఆగిపోలేదు. ఆగిన్నీపోదు.

భారతి నిలిచిపోలేదు నిలిచిన్నీపోదు.

ఆంధ్ర గ్రంథమాల తెగిపోలేదు. తెగిన్నీపోదు.

ఇన్నింటినీ ప్రారంభించి, వీటికి సుస్థిర వసతులు సమకూర్చిపెట్టి, వొక్క మన నాగేశ్వరరావు పంతులుగారు మాత్రం వెళ్ళిపోయారు.

మరిరారు.

రా...రు.

కాని, భూమిమీద, ఆకాశాన, దిక్కుల, విదిక్కుల — ఎటు చూసినా పంతులుగారే. ఎక్కడ చూసినా పంతులుగారే. ఎంత చూసినా పంతులుగారే.

* * *

పరిమితమూ, భంగురమూ అయిన వుపాధి నాశ్రయించి వున్నంత కాలమూ ఆ తేజోమండలానికి సార్వత్రికావస్థానం యేర్పడ్డది; కాని ఆ అవస్థానం సాతత్యం కాలేదు.

అయితే : పంతులుగారి వ్యక్తిత్వం సర్వాత్మనా విశిష్టం కావడంవల్ల — అర్థతః వారు కారణజన్ములు కావడంవల్ల, విశాల దిగాదర్శాలమీది అవకుంఠనాలను యెగరగొట్టేసి, వారి మహోజ్వల మూర్తి, ఆ ఆదర్శాలలో ప్రతిఫలిస్తూ వుండినది.

ఇప్పుడు — ఇవాళ, దేశకాల పరిచ్ఛిన్నమైన ఆ వుపాధి నశించగా, ఆ నిత్యబుద్ధ ముక్తాత్మ ఆ ఆదర్శాలలో దివ్యరూపంతో అంకితం అయిపోయింది.

వాటిలో, అది, శాశ్వత బ్రహ్మకల్పంగా స్థిరపడిపోయింది.

అంచేతనే, వెళ్ళిపోయారన్నమాట వొక్కటే పుట్టింది కాని, ఎటు చూసినా, ఎక్కడ చూసినా, ఎంత చూసినా మనకి పంతులుగారు కనపడుతూనే వున్నారు.

ఎప్పుడున్నూ కనపడుతూనే వుంటారు.

* * *

కనపడుతూనే వుంటారు. నిజమే. ఆశ్చర్యం యేమిటీ? నిజానికి, యే కొద్దిమందికోగాని వారెక్కడ పుట్టారో తెలవదు. ఏ ఆత్మీయులకో గాని వారి తల్లిదండ్రుల పేళ్ళు తెలియవు. వారేం చదివారో, యెక్కడెక్కడ చదివారో, ఆ చదువు వారిలో యెలాంటి పరిణతి పొందిందో, వారి బాల్యం యెలా గడిచిందో యౌవనం యెలా గడిపారో, ఎంతో కొద్దమందికేగాని తెలిసిన విషయాలు కావు.

కాని, పంతులుగారి పేరు మాత్రం దేశం అంతటా—అన్ని జిల్లాల్లోనూ, అన్ని తాలూకాలలోనూ, అన్ని గ్రామాలలోనూ — చివరికి ప్రతీ యింటా తెలుసు. ఆబాల గోపాలమూ తెలుసు.

శ్రీరాముణ్ణి తలుచుకోని వారున్నారా? శ్రీకృష్ణుణ్ణి స్మరించుకోని వారున్నారా? వారి చరిత్రలు చదివే — బోధపరచుకునే — ప్రజలు వారిని స్మరిస్తున్నారా?

అలాంటిదే పంతులుగారి విషయమున్నూ.

వారెవరి తాలూకూ? మన తాలూకే. వారు మన నాగేశ్వరరావు పంతులుగారే. మన పంతులుగారే.

మన ఆంధ్రులలో యెవరిమట్టుకు వారికే వారు "మన పంతులుగారు."

తెలుగుదేశంలో — తెలుగు జాతిలో, ఇలాగ ప్రతీ మనిషి హృదయంలోనూ "మమ"కారం పుట్టించుకో గలిగిన వారు నాగేశ్వరరావు పంతులుగారు తప్ప, యిదివరకి మరొకరు పుట్టివుండలేదు. ఇప్పుడెక్కడా కనపడరు. ఇక ముందున్నూ వుండబోరు.

* * *

ఆంధ్ర జాతీయతను మళ్లీ నిర్మించడానికి పునః ప్రయత్నాలు ప్రారంభమైన యీ కాలంలో -- కాదు కాదు, పునః

ప్రారంభాలు సాగించడం కోసం — మనలో ముగ్గురు మహాపురుషు లవతరించారు.

వారిలో వొకరు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. రెండో వారు గిడుగు రామమూర్తి పంతులుగారు. మూడోవారు మన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు.

ఈ ముగ్గు**రూ** మన ఆంధ్రులకు యుగపురుషులు.

వీరేశలింగం పంతులుగారు, సంఘశకటాన్ని గతుకుల పుంతలో నుంచి తారు రోడ్డుమీదికి మళ్లించారు.

రామ**మూర్తి** పంతులుగారు నవ్య సాహిత్య నిర్మాతలకు ముద్ద **మా**టలు పో**గొట్టా**రు.

నాగేశ్వరరావు పంతులుగారు, ఆ రెండు వుద్యమాలవల్లనూ కలిగిన సంచలనం పునాదిగా చేసుకుని, నూత్న పద్ధతులతో, నవీన సాధన సామగ్రితో జాతీయసౌధ నిర్మాణం ప్రారంభించారు.

ఈ ముగ్గుర్నూ మనకు యుగపురుషులని చెప్పాను. అంటే వారు కారణ జన్ములు. ఆంధ్రదేశంలో వారే చెయ్యవలసిన పనులు కొన్ని వుండినవి. అవి మరొకరివల్ల కావు. మరెవరి వల్లనూ కాలేదు కూడానూ.

మనలో యికముందున్ను గొప్ప గొప్ప వారెందరో బయలు దేరతారు. సందేహం**లేదు**. ఇప్పుడూ కొందరున్నారు. నిజమే. **ఆయితే**, యీ ముగ్గురినీ పోలినవారు యిక అవతరించరు అవత రించవలసిన అవసరమున్నూ లేదు. ఏమంటే ? పునాదులన్నీ వీరే వేశారు. ప్రారంభాలన్నీ వీరే చేసేశారు. ఇక అభివృద్ధి కనపరచ డ**మే**గాని — మెరుగులు దిద్దడమేగాని తరవాతి వారికి మరే**మీ** పనులు **లేవు**.

అంటే ? యుగ యుగాంతరాలు గడిచినా జాతికి జాతి అంతా ఈ ముగ్గురి అడుగుజాడల్లోనే నడుస్తుంది.

* * *

జాతీయ పునర్నిర్మాణానికి పంతులుగారు వేసిన పునాదుల కంటే, ప్రజలు, వారి యీవినే **యెక్కువగా** గుర్తించినట్లున్నది. దానికే ప్రాధాన్యం యిస్తున్నట్టున్ను కనపడుతున్నది.

ప్రపంచ ప్రవృత్తినిబట్టి చూస్తే యిది ధర్మంగానే వున్నది.

నిజంగా మన పంతులుగారు చేసిన దాన ధర్మాలు, **మనలో** యే సంపన్నుడు చెయ్యగలుగుతున్నాడూ ? ఏ జమీందారయినా **చెయ్యగలుగుతున్నాడూ ?**

ప్రతిష్ఠాపనలకూ, తన్నిర్మాతలకూ, వుద్య**మా**లకూ, తన్ని ర్వాహకులకూ, కవులకూ, పండితులకూ, గాయకులకూ, శిల్పు లకూ—ఆశ్రితులకూ వొక్కొక్కమాటు — ఏక **మొత్తం**గా వేలకు వేలిచ్చిన వారు మనలో మరికొందరున్నారు. సత్యమే.

అయితే, వారిని సమీపించగలిగిన అర్థులెంద**రూ** ? ఆ సం దర్శించగలిగిన వారిలో కూడా సత్కారం పొందగలిగిన వారెంద**రూ**?

పోనీ, మన పంతులుగారి దర్శన భాగ్యం పొందలేకపోయిన అర్థి **యెవడూ** ? తిరస్కృతుడయి పోయిన అర్థిన్నీ యెవడూ ?

తృణ**మో**, కణ**మో** ఏ ధర్మకార్యంలో మన పంతులుగారి **డబ్బు కలవకుండా వున్నదీ** ?

మన పంతులుగారు నిరుపేదలకిచ్చారు. ధనికులకున్నూ యిచ్చారు విద్వాంసులకిచ్చారు. అంశువారీలకూ యిచ్చారు. సనాతన ధర్మవాదులకిచ్చారు· సంస్కార పరాయణులకున్నూ **యిచ్చా**రు. బ్రాహ్మణులకిచ్చారు. బ్రాహ్మ**ణే**తరులకున్నూ ఇచ్చారు. బ్రాహ్మణ ద్వేషులకు కూడా యిచ్చారు. **హై**ందవేతరులకిచ్చారు. **హై**ందవద్వేషులకీ యిచ్చారు.

''ఇతనెవరు? ఇతని ప్రవృత్తి **యేమి**టి ? మనమిస్తే యీ డబ్బేం చేస్తాడు ? మన అభ్యుదయానికీ, మన కీర్తి ప్రతిష్ఠల**కూ** యితనేమయినా వుపకరిస్తాడా ?'' ఇలాంటి ఆలోచనే లేకపోయింది వారికి.

వారెవరినీ యాచించి యెరగరు. యాచన హాలాహలంకంటే తీక్ష్ణమైనదని—అప్రియమైనదని వారికి తెలుసు. ఒక మనిషి ఎలాంటి—ఎంత**టి** యిబ్బందీ కలక్కపోతే సాటివాడి యెదట ఎంగి, దీన వదనుడై ''దేహీ'' అంటూ **చెయ్యి** చాపగలుగు**తాడూ** ? ఇదీ పంతులుగారు చూసినది. కనకనే అడిగిన వారి కందరికీ వారు డబ్బిచ్చారు.

అడగనివారికిన్నీ వారు చాలామందికిచ్చారు.

ఇవ్వడమే వారు తమ విధి అనుకున్నారు. ఇచ్చారు. ఇవ్వ గలిగారు. ఇచ్చి మరిచిన్నీ పోయారు.

* * *

ఇలాగ, మన పంతులుగారు, ఎవ్వరికీ యివ్వకుండా వుంటే— ఇచ్చినా యే కొందరికో మాత్రమో **యిచ్చి** వుంటే — ఆ కొందరి కయినా అడిగినంతా కాక కొంత కొంతే యిచ్చివుంటే, కల్పవృక్షం కాసిన అమృతాంజనం, వారిని కుబేరుణ్ణిచేసి వుండును.

మన పంతులుగారు కోట్లకు పడగలెత్తి వుందురు.

మనలో వొక్క కోటీశ్వరుడయినా బయలుదేరి వుండును.

సుమారు ఇరవై జిల్లాల భూఖండానికి—రత్నగర్భకు యీజ మాన్యం వహిస్తూ వున్న ౨౮౪ లక్షల జనసంఖ్య గల ఆంధ్ర జాతికి, వొక్కగా నొక్క కోటీశ్వరుడయినా వుండి పరపతికి **లోటు లేకపోయి వుండును.**

అయితే, కోటీశ్వరుడా నాగేశ్వరరావుగారా జాతికి భూషణం?

కోటీశ్వరుడు, ఇంకా డబ్బు సంపాదించవచ్చు, దాసదాసీ సహస్రాలు సంపాదించవచ్చు. జమీందారీలు—చివరికి రాజ్యాలే సంపాదించవచ్చు; కాని యే కోటీశ్వరుడు, మన పంతులుగారి హృదయం వంటి హృదయం సంపాదించగలడూ ?

కోటీశ్వరులు లేకపోయినా, మనలో లక్షాధికార్లు వేలూ లక్షలూ వున్నారు; కాని వుండి యేమి ప్రయోజనమూ? ఆ లక్షాధికార్లవల్ల జాతికి యేమి వైలక్షణ్యం కలుగుతున్నదీ ?

గుర్రానికి తోకవున్నది. ఉంటే ? ఏమిటి వుంటే ? ఆ తోకతో దానికదే విసురుకుంటున్నది; కాని యెవరికేమి వుపకారమూ?

మన పంతులుగారు కోటీశ్వరులే కావలసివుంటే ధనమే పావనమైన యే మారువాడీ యింటనో పుట్టి వుందురు. ఏ గుజరాతీ యింటనో పుట్టి వుందురు.

ఆదిలో మన పంతులుగారు, మారువాడీ కోటీశ్వరులకూ, గుజరాతీ కోటీశ్వరులకూ కాణాచి అయిన బొంబాయిలోనే వ్యాపారం ప్రారంభించారు, ఆ బొంబాయిలో వుండగానే వారు ఐశ్వర్యవంతులున్నూ అయినారు.

అంతే. అంతేగాని మరి ముందుకి వెళ్ళలేదు.

అంటే ? ఆ బొంబాయి కోటీశ్వరుల జీవన పథాలకు వారు వెళ్ళలేదు. అసలు, ఆ బొంబాయి వాతావరణమే వారికి వెగటయినట్టున్నది. అంచేతనే వారు మద్రాసు ప్రవేశించినట్టున్నూవున్నది.

అది వరకున్నూ మద్రాసులో మనవా రసంఖ్యాకు లుండినారు. అసలు మద్రాసే మనది; కాని అక్కడి అరవలు ప్రబలిపోయారు. అరవలువచ్చి మద్రాసులో మన ఆంధ్రులను మైనారిటీలోకి పడగెంటేశారు. ఆంధ్రులకు మద్రాసు విదేశం అన్నట్టు తయారు చేశారు. అంచేత అక్కడ అనాదిగా వుండిన మన ఆంధ్రులు, అరవల ప్రాబల్యం కింద మణిగిపోయి, వీధికివస్తే అరవంలో వ్యవహరించుకోవలసిన స్థితిలో కూలిపోయారు.

అప్పుడప్పుడు జిల్లాలనుంచి వెళ్ళి కొద్దిమంది ఆంధ్రులక్కడ స్థిరపడుతూనే వచ్చారు; కాని వారీవిషయం గమనించలేదు.

మన పంతులుగారు ఈ స్థితిలో మద్రాసు ప్రవేశించారు. వారపత్రికగా మాత్రమే వుండిన ఆంధ్రపత్రికను దినపత్రిక చేశారు.

దీనితో అక్కడ వాతావరణమే మారిపోయింది.

జిల్లాల ఆంధ్రులకు మద్రాసు ప్రయాణాలు తరుచయినవి. మద్రాసు వెళ్ళడం అంటే షికారన్నట్టు తయారయినది.

అక్కడి ఆంధ్రులలో చలనం పుట్టింది.

ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న కేకతో అరవలు దద్దరిల్లారు.

కోటీశ్వరులు కావలసిన మన పంతులుగారు, ఇలాగ, మనకు జాతీయ నాయకులైనారు. జాతీయ నిర్మాతలయినారు.

* * *

మన పంతులుగారు వారపత్రిక నడిపారు. దినపత్రిక నడిపారు. మాసపత్రిక నడిపారు.

ఇందులో వున్న విశేషం యేమిటంటే ?

ఆ వారపత్రికను పోలేది తెనుగులో మరొకటి లేదు. ఆ దినపత్రికను పోలేదిన్నీ తెనుగులో మరొకటి లేదు. ఆ మాస పత్రికను పోలేది కూడా తెనుగులో మరొకటి లేనేలేదు

ఏ పనిచేసినా గొప్పగా వుండాలి. అనన్య దుర్లభంగావుండాలి. ఇదీ వారి దీక్ష.

దుర్గాకళామందిరం వంటి థియేటరు మరొకటి తెనుగు దేశంలో మరెక్కడ వున్నదీ ?

ఇంగ్లీషు నేర్చిన వారు తెనుగులో మాట్లాడడమూ, రాయడమూ, చదవడమూ తప్పుగా— హీనాతి హీనంగా భావించేరోజుల్లో వారు ఆంధ్రపత్రిక ప్రారంభించారు.

ఏం ? తెలుగులో యెందుకు ప్రారంభించాలి ? ఇంగ్లీషు చేతకాకనా ?

మన పంతులుగారు, మకుటంలేని చక్రవర్తి అన్నట్టు, ఇంగ్లీషులో పట్టాలేని బి. ఏ.

పైపెచ్చు, వీధికి వెడితే యింగ్లీషే కాని తెనుగు చెలామణీ కాని బొంబాయిలో కాపరమూ, వ్యాపారమూనూ.

పత్రికా ప్రారంభం కూడా అక్కడే.

ఇంగ్లీషు పత్రిక నడపాలంటే బొంబాయిలో లేని సౌకర్యాలు లేవు. తెనుగు పత్రిక నడపాలంటే సౌకర్యాలదాకా యెందుకు, అక్కడ ప్రూపురీడర్లు — కంపోజిటర్లు కూడా లేరు.

నిజంగా, ఆ పత్రిక యింగ్లీషులో ప్రారంభించివుంటే అది యిప్పుడెంత మహోన్నతస్థితిలో వుండేదో ?

ఆంధ్రుల చేతిలో నుంచి పూర్తిగాజారిపోయిన ''హిందూ'', పంతులుగారి పోటీకి తాళలేక యెంత టకటక లాడిపోతూ వుండేదో ?

ఆ యింగ్లీషు పత్రిక చేయూతవల్ల తెనుగుజాతి హిందూ దేశంలోనే కాక, సీమలో కూడా యెంత ప్రఖ్యాతి పొందివుండేదో ? ఎంత పలుకుబడిన్నీ సంపాదించి వుండేదో ?

కాని, ఆంగ్ల విద్యాధికులలో కంటే అచ్చతెనుగు వారిలోనే పంతులుగారికి జీవం కనపడింది. వారిని ప్రబోధిస్తేనే ఆంధ్ర

జాతి కోలుకోగలుగుతుందని వారు గ్రహించారు. ఎప్పటికయినా, వారివల్లనే దేశానికి ముక్తి అని వారు గుర్తించారు.

పంతులుగారి **వూహ** లేశమయినా తప్పిపోలేదు.

ఆంధ్రపత్రిక వల మన తెనుగువారు చాలాముందుకి వచ్చారు.

ప్రయిమరీ అయినా పూర్తికాని తెనుగువారిలో, యివాళ, చక్కని ప్రపంచ జ్ఞానం కనపడుతున్నదంటే — రాజకీయాలలో అపరిమితమైన వుత్సాహోద్రేకాలు ప్రబలుతున్నదంటే — **అపూర్వ**మైన సంచలనం పురకలు వేస్తున్నదంటే కారణం ఆంధ్రపత్రిక.

ఆంధ్రపత్రిక ప్రారంభం కాకమునుపు, ఆంధ్రదేశంలో, మహాలయ అమావాస్యలా వుండేది ఇప్పుడు ? వసంత **పూర్ణి**మలా **వుంది.**

భారతి విషయం **కూడా** యిలాంటిదే.

భారతి అనేకమంది కవులనూ, కథకులనూ, పండితులనూ పరిశోధకుల**నూ** దేశానికి పరిచయం చేసినది. అనేకులను తయారు చేసినది.

ఆంధ్ర రచయితలు, తమ రచనలను భారతి స్వీకరించకపోతే అది తమకు పరాభవంగా భావించి కుమిలిపోయేటంతటి గౌరవం సంపాదించినదది.

ఎన్నిమార్లు ప్రయత్నించినా తన రచనలు భారతి తిరస్కరించినందుకు వున్మత్తుడయి, నాటికి నేటికీ భ్రష్టుడయివున్న యువకుణ్ణి నేను చూశాను.

మొత్తానికి, భారతి, ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో మహోజ్వలాలైన కొన్ని ప్రకరణాలు తయారు చేసింది.

తెనుగు దేశం**లో** పత్రికల ద్వారా, యింత పని యే సంపాదకుడు చెయ్యగలిగాడూ ?

* * *

ఒక వ్యక్తి యేక కాలంలో మూడు పత్రికలు నడపడం అంటే మాటల్లోది కాదు.

అందులోనూ తెనుగు దేశంలో — పైగా తెనుగు భాషలో.

ఇది మన పంతులుగారికి విలాస క్రీడగా వుండినది.

వారపత్రిక, దినపత్రిక, బ్రహ్మాండమైన భారతి—లక్షలుంటే గాని యివి నడిచేవి కావు.

దీనికి సాయం సంవత్సరానికి పాతిక ముప్పయి వేల నష్టం.

ఎవరు భరించగలరూ? ఎన్నాళ్ళని భరించగ**లరూ** ?

పంతులుగారి ఆఫీసులోకి ఒకవైపు నుంచి దుర్దమ ప్రవా**హంతో** వొక స్వర్ణవాహిని వురికేది.

దాని తాలూకు వొక చిన్న పాయను పంతులుగారు పత్రికల కేసి మళ్ళించారు.

సరి, అంతా సక్రమంగా వెళ్ళిపోయింది.

రెండు సంచికలు కలిపి ప్రకటించడం—పేజీలు తగ్గించడం, బొమ్మలు మానెయ్యడం—చచ్చు కాగితాలు వాడడం—పోస్టేజీ చాలక వొక్క రోజున పోస్టు చెయ్యలేకపోవడం—సాధారణంగా యివి తెలుగు పత్రికల సంప్రదాయాలు. కాని **ఈ** విషయంలో మాత్రం పంతులుగారి పత్రికలు తెనుగు పత్రికలు కావనే చెప్పాలి.

ఏమంటే ? వాటి సక్రమత యెప్పుడూ చెడలేదు. నామ మాత్రమైన దిగతీత అయినా యెప్పుడూ లేదు.

ఇంతేనా ? ఒకరోజు కంటే వొక రోజు కొత్త విశేషాలు. కొత్త అందాలు. కొత్తఆకర్షణలు. వీటికి వెనకాలే కొత్త నష్టం.

అయితేయేం ? పత్రిక నిలపడానికి వల్లకాదు కనక — లాభం కోసం యెప్పుడూ ఆశలేదు కనక—నష్టం యెలాగా తప్పదు కనక—ఆంధ్రులకు ఇలాంటి పత్రికలు ఇవ్వడానికి మరొకరెవ్వరూ **పూ**నుకోలేదు కనుక ఎంత కావలిస్తే అంతా ఖర్చుపెట్టడమే. ఎంతనష్టం వస్తే అంతా భరించడమే.

ఏ లోపమూ రానివ్వడానికి వల్లకాదు.

అయితే; నష్టం అనేది పంతులుగారి కొక్కరికేకాదు. అది తెనుగు**లో** పత్రికలు నడుపుతున్న తెనుగు వారి కందరికీ నిత్య ప్రసన్నమే.

ఈ విషయంలోనే అస్మదాదులకు పంతులుగారితో సాటి. తక్కిన సందర్భాల్లో మాత్రం వారు వేరు వీరు సర్వాత్మనా వేరు.

ఈ సందర్భంలో యింకో విశేషం.

తెనుగు పత్రికలకు బలవంతపు ఫ్రీ లిస్టులు తప్పవు. ఇది ఆంధ్రజాతికి గల ప్రత్యేక విశిష్టత.

''నా వొక్కడి కోసమే మీరు పత్రిక అచ్చు వేస్తారుటండీ? మీరు వేయించిన ప్రతులలో వొక్కటయినా మిగలదుటండీ ? అది నాకు పంపితే మీకు అదనంగా తగిలే నష్టం యేమిటండీ ? మా లైబ్రరీకి మీరు చందా యిచ్చామనుకోండి ! దేనికయినా ధర్మమనేది లేకపోతే యెలాగండీ ?'' ఇదీ ధోరణి.

పంతులుగారి ప్రవృత్తి — దర్జా వేరు కనక, ఈ ధోరణిలో కొంచెం మార్పు, మరికొన్ని కొత్త పోకడలు.

ఏమయినా, తెనుగు పత్రికలకు బలవంతపు ఫ్రీ **లిస్టు**లు **తప్పవు.**

ఒకమాటు, పంతులుగారు, ఆంధ్ర దినపత్రిక ఫ్రీ లిస్టు ౮ వందలని చెప్పారు.

౮ వందలు. ౧౯ వేల ౨ వందల రూపాయలు. గుండె ఝారుమని పోయింది.

ఏమి దేశం! ఏమిజాతి! ఏమి ముందంజ!

ఇది యిలా వుండగా!

తెనుగు పత్రికల అధిపతులలో అనేకులు తమ పత్రికసాటి పత్రికలకు ఎక్స్ఛేంజిగా కూడా పంపరు. అది తమ దర్జాకి లోపం. తమ పత్రికకు నామోషీ.

అది ఇతర్లపత్రిక తమ పత్రికతో సాటి అని అంగీకరించడం!

కాని, మన పంతులుగారు ఈ దర్జా లెరుగరు. ఈ ప్రతిష్ఠా పిశాచానికి లొంగలేదు.

ఇంతేకాదు.

తమ పత్రికవల్ల యేటా అపారమైన నష్టం వస్తూ వుండినా, పంతులుగారు, ఇతర పత్రికల కనేకాలకు బరువైన విరాళా లిచ్చేవారు. ''దేశానికి ఎన్నో పత్రికలు కావాలి. డబ్బులేదు. ఉత్సాహం వున్నది. దేశీయులకు ఇంగిత జ్ఞానంలేదు: ఏం చేస్తారు పాపం!'' ఇదీ వారి భావ సరణి దీనికి ముక్తాయింపే బరువైన విరాళ ప్రదానం.

*　　*　　*

ఏతామెత్తి సముద్రం తోడెయ్యడం—గాజుగొట్టాలసాయంతో ఆకాశంమీది చుక్కలు లెక్కపెట్టడం — మన పంతులుగారి జీవిత విశేషాలు వివరించడం— ఈ మూడూ వొకటే రాశిలోవి.

మన పంతులుగారి వంటి మహోదారుల జీవిత లక్షణాలను సంధించే, వ్యాసుడు, తన పురాణాలలో వుత్తమ పాత్రల నన్నిటినీ సృష్టించుకున్నాడు. ఆ కల్పితపాత్రలనే మనం పురాణ పురుషులని కీర్తించుకుంటున్నాం.

వాల్మీకి రామాయణం రచించాడు. వ్యాసుడు భారత భాగవతాలు రచించాడు. కాళిదాసు రఘువంశం రచించాడు. పూర్తిగా తరించారు, ఇప్పుడు మనలో మహాకవులనే వారుంటే ''కాశీనాథం'' రచించడానికి అభ్యంతరమేమిటి?

రాజ రాజ నరేంద్రుని తరవాత—ప్రతాపరుద్రుని తరవాత—కృష్ణదేవరాయని తరవాత—రఘునాధరాయని తరవాత, మన కవులకు మన పంతులుగారుతప్ప, కథానాయకుడుగా స్వీకరించతగ్గవారు మరెవరున్నారూ?

*　　*　　*

''పంతులుగారి గొప్పతనం మనమేమి గుర్తించగలిగామూ? వారికి మనమేమి పూజ చెయ్యగలిగామూ? వారిని మనమే విధంగా సత్కరించగలిగామూ?''

ఇవాళ, ఇలాగ, ఆంధ్రులంతా సిగ్గుపడుతున్నారు.

బాగానే వుంది.

ఇదే వారికి సత్కారం అంటున్నాను నేను.

ఏమంటే?

పంతులుగారే మనజాతి కళ్ళు తెరిచారు. అదివరకి, జాతి జాతంతా నల్లమందు మింగినట్టు మైకం కమ్మివుండినది. ఇప్పుడు మనమా దశ దాటేశాము. తప్పు గుర్తించడమూ, సిగ్గుపడడమూ మనకిప్పుడు చేతనయింది.

పంతులుగారి ఆత్మత్యాగం వల్లనే మనకీయోగ్యత కలిగిందని మనం గుర్తించగలిగాము.

ఇది వారిని తెలుసుకోవడం కాదూ? ఇదివారిని పూజించడం కాదూ? ఇది వారిని సత్కరించడం కాదూ?

కలగవలసిందే యీ సిగ్గు.

మనకి మంచి సమయంలోనే కలిగింది యీ సిగ్గు.

చూస్తూవుండండి. ఈ సిగ్గు, ముందు ముందు, మనచేత, ఎంతెంత గొప్ప గొప్ప పనులో చేయిస్తుంది.

మృత్యుంజయుణ్ని నేను

శ్రీ జెట్టిగుండ్ల రఘునాథరెడ్డి

భావాల గ్రుడ్లని
  గుండె గూటిలో
పొదుగుతున్నాను పక్షిలా.
అక్షరాల మేతపెట్టి
కాగితాల ఆకుల్లో

పెంచి పెద్దజేసిన నా పిల్లలు
పత్రికల రెక్కలతో
విశ్వమంతటా విహరిస్తున్నాయి.
అమృతం తాగిస్తున్నాయి నాకు.
మృత్యుంజయుణ్ని నేను!

రేపు!


డాక్టర్ మిరియాల రామకృష్ణ

పరుగెత్తుతున్న పాతతరాన్ని చూస్తూ
పడిలేస్తున్న కొత్తతరాన్ని గమనిస్తూ
సరికొత్త బాణీకి కట్టుబడుతూ
రాస్తున్న ఈ గీతాన్ని
నిన్నటి కంకితం చేయకుండా
నేటికి వినిపిస్తూ
రేపటికోసం భద్రపరుస్తున్నాను.
నిరుద్యోగాల పొగలేని నిప్పుగాలి కుంపటిమీద
ఈ ఆగామిని తయారుచేస్తున్నాను
విచ్చేయండి మనమంతా కలిసి భుజిద్దాం
నిండుకుండ లివిగో
పండువెన్నె లిదిగో
కాశ్మీరఖండ కేదారాలివిగో

రేపటికోసం నే కంటున్న కలల్లో
రేరాజుకోసం కడలి లేపుతున్న అలలు పడిలేస్తూ
ఉదయతీరాలను తాకుతున్న దృశ్యాలు
నా సాహితీ దినపత్రికకు పతాక శీర్షికగా వేస్తూ
రాస్తున్నాను ఈ వ్యాఖ్యలు
ఇవన్నీ రేపటి నా రచనలు
ధనదేవతలు కళలన్నీ త్రాగేశాకా మిగిలిన
ఈ లోకం చందమామను
తిరిగి తీర్చిదిద్దుకుందాం రండి
రేపు మనవంతు వస్తుంది లెండి
దీన్ని అనుభవించేందుకు పదండి !

'నిన్నగది'లో చీకటిని 'చీకటిగది'లో నిన్నని
కిటికీల కళ్లు కోల్పోయిన ఇళ్లనీ
క్రిక్కిరిసిన బాధలు నిండిన లోగిళ్లనీ
సహించలేనివారంతా నాతో కలిసిరండి
చూపిస్తాను నేను కట్టిన పునాదిని
అందరం కలిసి జీవిద్దాం
ఒక శతాబ్దం, ఒక తరం
లేకుండా ఏ అంతరం
మనల్ని ఆపడం ఎవరితరం ?
తొలకరిలోని తొలివాన చినుకులం మనం రేపు
లోకం ముక్కుచివర తగిలించుకునే ముత్యాలం మనం రేపు
పృథివీ పృథుస్తనాలమీద పసిపాపలం మనం రేపు

నా చెమటలో చెరిపివేస్తాను మీ నుదుటిరాతని
నా చూపులో కడిగివేస్తాను మీ కష్టాల్ని
విద్యుద్ధగద్ధగలు నిండిన నా భవిష్యత్ ప్రాసాదంలో
మనమంతా కలిసి మందమారుతాల్ని పంచుకుందాం
ఈర్ష్యల వర్షాకాలాన్నీ ద్వేషాల హేమంతకాలాన్నీ దాటి
అజ్ఞాన శిశిర శూన్యవాతావరణాన్ని గోటమీటి
మన పాకశాలలోకి తీసుకువద్దాం మధుమాస సమృద్ధిని
వికసించిన తమ్మిపూలను చూస్తూ
తుమ్మెదలమైపోతూ
అమృతాధరాలను చుంబిద్దాం
ఆనంద ధరాధరాలను అంతరంగాలతో స్పృశిద్దాం
నవజీవన కవిభావనలో యువభావిని ప్రకటిద్దాం
జన సంచయ గళరావంలో యుగనీతిని ప్రవచిద్దాం.



రసావిష్కరణ

సాంధ్యశ్రీ

మాట్లాడుతున్న పూలను
గొంతునులిమే
కర్కశ కరాలను
భయంగా విలోకిస్తున్న
జాలిలోని ఒక్కొక్కక్షణం
యుగాల
మన్వంతరాల
కరుణామయగాథ ...
మనోకుహరశయ్యా సుషుప్తి గరిమలో
నిదురించే మానవమేధను
ప్రశ్నిస్తూ వచ్చాను ఇన్నాళ్లు
అనుభూతి కెందుకు నెత్తురు
పూస్తారని...?

ఈతీరుగా
ఎన్నిక్షణాలను చరిత్ర నిష్ప్రయోజనంగా
పాడుచేసుకుంది...?
నీలి పర్వత నిశ్శబ్ద సానువుల్లోని
ఒంటరిగాలి నిట్టూర్పుల్లో
ఆకలి లేదు
ఆవేదన తప్ప ...
ఈ జాలిగాథావిష్కరణతో
కళ్లు
సాయం సంధ్యారోచిస్సున్న గిరుల్లా
ఎర్రబడ్డాయి
ఈ ఎరుపులో ప్రతీకారవాంఛలేదు
ప్రభాత దర్శనంతప్ప ...
ఇప్పుడు నన్ను నేను చూసుకున్నాను...

విహాయస నీలిపత్రంపై ఉద్రేకంగా
మెరిసే
నక్షత్రాక్షరాలను
ఆవాహనచేస్తూ
వెన్నెల సెలయేటిలో జలకమాడు
తున్నాను...
కావ్యాన్ని
కలల కలువపూల కౌగిళ్లలో
మధువు త్రాగుతున్న వధువుగా
వసంత సమీరంలో
దిశాంత పరిమళాల పైటజార్చుతున్న
వనకన్యగా
నాలో మలచుకొన్న శిల్పాన్ని
రసావిష్కరణ చేశాను.

నాలోని నువ్వు?

శ్రీ ఎ. రజాహుస్సేన్

ఎవరో వెకిలిగా నవ్వుతూంటే
తలెత్తి చూశాను
ఊహూ...ఎవరూలేరు
అంతా నిశ్శబ్దం!
కళ్ళుమూసుకొని నిద్రపోయాను
కలలను నా కళ్ళదాకా రానీయకుండా
మళ్ళీ అదేనవ్వు...!
కళ్ళు తెరచాను
ఎవరూలేరు ఎదురుగా
గదంతా వెదికాను

ఊహూ...లాభంలేదు
కనబడని ఆనవ్వుకోసం
ఎంతగానో వెదికాను
మరెంతగానో తిరిగాను
నిముషాలు, గంటలు
రోజులు, సంవత్సరాలు
కాలు కాలిన పిల్లిలా
తరాలు, యుగాలు
వెదికాను, వెదికాను
విసిగి వేసారాను
అయినా వదలకుండా

ఇంకా వెదుకుతూనే ఉన్నాను
మరింక లాభం లేదనుకొని
నన్ను నేనే తడుముకొన్నాను
మళ్ళీ అదే నవ్వు...!
అవును! నాలోనే...
లోలోనే ఆనవ్వు ...!
కళ్ళు తెరచాను
నాలో నిన్ను నేను తెలుసుకున్నాను
ఇంతకూ ...
నాలోని నువ్వు...
నా అహానివి!

గ్రాసాగ్రే నవ మౌక్తికం

రాత్రివేళ –
  ఎవ్వరికీ తెలియకుండా
ఎప్పుడు వచ్చి కూర్చుందో
ఈ హరిత శాద్వలంమీద !
పొద్దున్నే కిటికీలోంచి చూస్తే కనిపించింది !

నిశాకాంతా పదవిగళిత నూపురమా ?
తళతళా మెరిసిపోతోంది !

సూక్ష్మీకృత రసార్ద్ర భావనాగోపురమా ?
కళకళలాడిపోతోంది !

నారింజరంగు ఉదయపు ఎండలో –
కాషాయాంబరం దాల్చిన జ్ఞానిలాఉంది !
'కాలనిర్ణేత' కళ్లెర్రజేయగానే
అప్రయత్నంగా ఆవిరైపోయింది !
జీవన ప్రమాణాన్ని తనతో అన్వయించుకోమంది.

శూన్య ప్రణవం

నరకమో – నాకమో తెలియని
  లోకానికి చేరుకున్నాను.
ప్రమోద సంగీతమో
ప్రమాద సంకేతమో తెలియని
నాద పంజరంలో చిక్కుకున్నాను !

ఈనాడు నీ రూపస్మృతి పారాడుతున్న వేళ
నా మనస్సు శివలలాటాగ్ర భాగంలా ఉంది.
క్రింద – మహాగ్నిజ్వాల !
పైన – శీతాంశ; స్వర్గంగా హేల !

  జీవితం మంచుగడ్డలా
  మౌనంగా కరగిపోతోంది.
  ఈ జీవన ధుని
  అనేకానేక అనుభూతి తీరాలను పలకరిస్తూ
  మృత్యు సముద్రాన్ని సమీపిస్తోంది.

ఇప్పుడు నీ తలపు –
గంధక ధూమాన్ని పీలుస్తున్నవాడు
మల్లీ సువాసనా లహరిని ఊహిస్తున్నట్టుంది.
చంద్రికా సుస్నాత భావన –
కఠోర కంఠస్వరానికి త్రుళ్లిపడిన
పసివాడి గుండెలా చెదరిపోయింది.

  అధరాలమీద హాసకుసుమాల్ని పూయిస్తూనే
  కంటి కొసల
  కోప కర్పూరదీపాలు వెలిగిస్తావు నువ్వు !
  వెలుగువు నువ్వు.
  చీకటివి నువ్వు.
  ద్వంద్వాలను ఐక్యంచేసే
  అద్వితీయ శక్తివి నువ్వు –
  అమోఘ శూన్య రహస్యం – నీ నవ్వు.

శ్రీ కొంపెల్ల రామకృష్ణమూర్తి

డా॥ ఘంటా జవహరలాలు

దిమ్మగుడి శిలా శాసనం - విమర్శ

ప్రస్తుత శాసన శిల సుమారు రెండు అడుగుల పొడవుగల్గి నాల్గు వైపుల శాసన 'లిపి' కల్గివున్నది అసలీ శాసనపు వునికిని భారత ప్రభుత్వ పురావస్తు పరిశోధకులు 1920 లో కనుగొనిరి. ఇది అనంతపురం జిల్లా గుత్తి తాలుకా దిమ్మగుడి గ్రామానికి ఈశాన్యపు దిక్కున దొరికినది. దీని వివరణ క్లుప్తముగా 1920 సంవత్సరపు భారత ప్రభుత్వ శాసన వార్షిక నివేదిక[1] లో మొట్ట మొదటిసారిగా ఇవ్వబడినది. తదుపరి శాసన పాఠముతో సహా దక్షిణ భారతదేశపు 10వ శిలా శాసనాల సంపుటి[2] లో ప్రకటించబడినది. ఇక శాసన శిల ప్రస్తుతం లభ్యమైన ప్రదేశములో లేదు. అచ్చట నుండి పెద్ద వడుగూరికి వచ్చి, తదుపరి హైదరాబాదులో పురావస్తు శాఖ వారి కార్యాలయముచేరి పదిలముగా నున్నది.

శాసన వివరణ

దక్షిణదేశపు శిలా శాసనాల 10వ సంపుటి యందు యిట్లు ఇవ్వబడినది. ''చాళుక్య విక్రమాదిత్యుని 27వ రాజ్య వర్షములో నొసంగిన ధర్మశాసనం.'' శాసనం పూర్తిగా అరిగిపోవుట వలన శాసన పరిశోధకులకు సైతం శాసనం వివరణ పూర్తిగా బోధపడకున్నది. శాసనం అసలు 12 పంక్తులు కల్గివున్నది. మొదటి 6 పంక్తులు, చివరిపంక్తి మాత్రం ఇప్పటికి చదువగలిగిరి. అదియే ప్రకటించిరి[3] చదువ గల్గినది మాత్రం అవగాహన చేసుకొని, చారిత్రికులు చాళుక్య విక్రమాదిత్యుని 27 వ రాజ్య వర్షములో నొసంగిన శాసనంగా పేర్కొని, మొదటి చాళుక్య విక్రమాదిత్యుడు 27 సంవత్సరములు రాజ్యంచేసినట్లు నిర్ధారించిరి. ఇది అమలులో నున్న సిద్ధాంతానికి విరుద్ధం అంటే పూర్వపు సిద్ధాంతం ప్రకారం చాళుక్య విక్రమాదిత్యుడు 25 సంవత్సరములు రాజ్యం చేసెను.

శాసనంలో చక్రవర్తి వంశము తెలుపకపోయినా, శాసనంలో పేర్కొన్న బిరుదావళి[4] - (''స్వస్తిశ్రీ విక్రమాదిత్య సత్యాశ్రయ పృథివీ వల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర భట్టారక్'')ని పరికించిన చాళుక్య వంశమునకు చెందిన చక్రవర్తియని గుర్తించుట సరియైనదే. ఇక చక్రవర్తిని మొదటి విక్రమాదిత్యునిగా గుర్తించుట గూడా సమంజసమే. ఏలనన, బాదామి చాళుక్యులలో విక్రమాదిత్యులు ఇద్దరున్నను మొదటి విక్రమాదిత్యుడు మాత్రమే ఇరువది సంవత్సరములు పైగా రాజ్యం చేసినట్లు దాఖలాలున్నవి. పైగా రెండవ విక్రమాదిత్యుడు ఇరువది సంవత్సరములు పాలించినట్లు తెల్పు చారిత్రికాధారములు యింతవరకు లభ్యము కాలేదు.

ఇక శాసనంలో తెలిపిన రాజ్యవర్షమును పూర్వపు చారిత్రికులు సరిగ్గా అవగాహన చేసుకోలేదని చెప్పవలెను. మూలశాసనంలో పేర్కొన్న–''విజయ రాజ్య సంవంత్సరంబుళ్ ఇరుభది ఏణు''ను ఇంతవరకు 27వ పరిపాలనా సంవత్సరముగా గైకొనబడి మొదటి చాలుక్య విక్రమాదిత్యుడు 25 సంవత్సరములు పైగా రాజ్యం చేసినట్లు భాష్యం చెప్పిరి.[5] డా॥ కీల్‌హారన్ 'విక్రమాదిత్యుడు క్రీ.శ. 686 వరకు రాజ్యం చేసినట్లు' పేర్కొనిరి.[6] అనగా డా॥ ఫ్లీటు పేర్కొన్న 'విక్రమాదిత్యుని రాజ్యకాలం, (క్రీ.శ. 655–680)ను విస్మరించి డా॥ కీల్ హారన్ పేర్కొన్న దానిని యీ శాసనాధారంగా విధిగా నమ్మి చారిత్రికులు చరిత్ర వ్రాసిరి.

అసలు శాసన పాఠమును మన పూర్వ చారిత్రికులు సరిగా అవగాహన చేసుకోలేదని పైని చెప్పియుంటిని. ఏలనన ... విజయ రాజ్య సంవత్సరంబులు–'ఇరుభది – ఏండు' అను ప్రయోగము నందలి 'ఏండు' అనుదాని భావము సంఖ్యావాచకమైన 'యేడు' గాక సంవత్సరమగును. వ్యాకరణ దృష్ట్యా 'ఇరుభది యేండు' అనునది '27' కాజాలదు. ఏలనన 'యేండు' నందలి యనునాసికము సంవత్సరమును తెలుపునే గాని 'యేడు' అను తెలుగు సంఖ్యను తెలుపదు. కనుక 'ఇరుభది–యేండు' (అనునాసికమైన) 'యిరుబదియవ సంవత్సరము' అనియే చెప్పనొప్పును.[7] ఈ వివరణ సరియైనచో దిమ్మగుడి శాసనం మొదటి చాలుక్య విక్రమాదిత్యుని 20వ పరిపాలనా కాలములోనిదనియు, 27వ పరిపాలనా సంవత్సరములోనిది కాదనియు చెప్పవలెను. అనగా డా॥ ఫ్లీటు పేర్కొన్న విక్రమాదిత్యుని రాజ్యకాలం (క్రీ. శ. 655–680) కంటె రెండు సంవత్సరము లెక్కువ యీ శాసనం యివ్వజాలదు.

ఇక మూలశాసనంలో 'అపరిష్కృతంగా' వదలిన 6వ పంక్తిలోని పదమును 'కంచిని గొనిన'గా గుర్తింప వచ్చును. ఇటీవల, నేను కడప జిల్లా పులివెందల తాలూకా రామాపురం గ్రామంలో కనుగొన్న శిలాశాసనాధారంగా పై పదమును 'కంచిని గొనిన'గా గుర్తించితిని. అయిన మొదటి చాలుక్య విక్రమాదిత్యుడు తన 20వ పరిపాలనా సంవత్సరములో కంచిని ఆక్రమించెనని స్పష్టమగును గద్వాల తామ్రశాసనం[8] వలన గూడ మొదటి విక్రమాదిత్యుడు 'ఈశ్వర పోతరాజును' (మొదటి పల్లవ పరమేశ్వరవర్మ) తన పరిపాలనయందలి 20వ సంవత్సరము (క్రీ. శ. 675)న ఓడించి కంచిని స్వాధీన పరచుకొనినట్లు విశదమగుచున్నది. అయిన దిమ్మగుడి శిలాశాసన కాలం క్రీ. శ. 674–75 (20వ రాజ్య

వర్షము)గా గుర్తించవలనే గని, క్రీ. శ. 682 (27వ పరిపాలనా సంవత్సరం)గా నిర్ణయించ గూడదు.

శాసనకాలం తదుపరి, శాసనంలో పేర్కొన్న చరిత్రాంశమును పరికించవలెను. చాలుక్య విక్రమాదిత్యుడు తన 20వ రాజ్యకాలంలో (క్రీ. శ. 675) కంచిని వశపర్చుకొన్నట్లు పైని పేర్కొంటిమి గదా! అనగా మనం చాలుక్య విక్రమాదిత్యుడు కంచిపై దాడి చేయుటకుగల కారణాలు, కంచిపై దాడి తను రాజ్యానికి వచ్చి 20 సంవత్సరములు వేచి వుండుటకు గల కారణాలు ముఖ్యంగా తెలుసుకోవాలి. కంచి ప్రభువగు మొదటి పరమేశ్వరవర్మ దండ్రి మొదటి నరశింహవర్మ క్రీ. శ. 642వ సంవత్సరములో బాదామిపై దండెత్తి దానిని నాశనముచేసి, అప్పటి చాలుక్య ప్రభువగు రెండవ పులకేశిని వధించెను. ఆ రెండవ పులకేశి యీ మొదటి విక్రమాదిత్యునికి దండ్రి. నాటినుండి పదమూడు సంవత్సరములు (అనగా క్రీ.పూ.642–655వరకు) చాలుక్యుల రాజ్యపాలన అనామత్తు(abeyance)గ సాగినది. క్రీ. శ. 654–655వ సంవత్సరములో మొదటి విక్రమాదిత్యుడు రాజ్యానికి వచ్చెను. తన దండ్రిని చంపిన కంచి ప్రభువుపై దండెత్తి కంచిని వశపర్చుకొనుట, విక్రమాదిత్యుని ప్రతి శాసనంలోను ఉల్లేఖింపబడినది. అనగా ఆనాడీ దిగ్విజయమున కెంత ప్రాముఖ్యమీయబడినదో మనం గ్రహింపవలెను.

ఇక ఓడింపబడిన కంచి రాజులను తెలుసుకొందము. మొదటి విక్రమాదిత్యుని గద్వాలు తామ్రశాసనం (క్రీ. శ. 674) యిట్లు తెలుపుచున్నది—"ఈతడు (మొదటి విక్రమాదిత్యుడు) నరశింహుని గర్వము (glory)ను యణగ ద్రొక్కెను, మహేంద్రుని శౌర్యము కరిగి బోవుటకు కారణమైనను, ఈశ్వరుని గంటి జూపుతోనే జయించెను." అనగా విక్రమాదిత్యుడు ముగ్గురు పల్లవ చక్రవర్తులకు సమకాలికుడుగా మనం గ్రహింపవలెను. వారు మొదటి నరశింహవర్మ (క్రీ. శ. 630–638) రెండవ మహేంద్రవర్మ (క్రీ. శ. 668–670) మరియు మొదటి పరమేశ్వరవర్మ (క్రీ. శ. 670–690).

మొదటి విక్రమాదిత్యుడు క్రీ. శ. 654–55లో రాజ్యాభిషిక్తుడై కంచిని క్రీ. శ. 674–75వరకు వశపర్చుగొనక పోవటానికి కారణాలు ఏమైనా గలవా? పల్లవ చక్రవర్తులలో గొప్పవాడు మొదటి నరశింహవర్మ. అతను బ్రతికినన్నాళ్లు, అనగా క్రీ శ. 668 వరకు చాలుక్యుల దృష్టి కంచిపై బడకుండా గాచి కాపాడినాడు. తన స్వరాజ్య పరిస్థితులు గూడా విక్రమాదిత్యునకు కంచిపై దండయాత్ర గూర్చి యాలోచించుటకు అనుకూలంగా లేవు. తన కర్నూలు నాల్వ తామ్రశాసనమును, తన జ్ఞాతులందరిని (Kinsmen) నాశనంచేసిన తదుపరి యిచ్చిన శాసనంగా దానిలో బేర్కొనబడినది.[9] అనగా విక్రమాదిత్యుడు ముందుగా దన జ్ఞాతులందరినీ వశపర్చుకొని, స్వరాజ్యంలో శాంతి, సుస్థిరత యేర్పరచిన గానీ 'కంచి'పై దండయాత్ర జేయలేదని గ్రహింపవలెను. 'కంచి'లో గూడా, పల్లవులలో గొప్పవాడైన మొదటి నరశింహవర్మ జనిబోవుట, యీతన్ని తదుపరి దుర్బలుడైన రెండవ మహేంద్రుడు రాజ్యానికి రావటం మంచి యవకాశం గోసమే ఎదురు చూస్తున్న చాలుక్య ప్రభువుకు మంచి యదను దొరికినది. చరిత్రకారులు చాలుక్య–పల్లవ పోరులో పల్లవ ప్రభువు మహేంద్రుడు మడిసినట్లు భావించుచున్నారు. పల్లవ మహేంద్రుని తదుపరి మొదటి పరమేశ్వరవర్మ క్రీ. శ. 670లో రాజ్యానికి వచ్చెను. అప్పటికే చాలుక్యులు పల్లవ రాజ్యంలోని గొన్ని భాగాలను వశపర్చుకొని యుండిరి. మరియు మొదటి విక్రమాదిత్యుడు దిగ్విజయముతో పల్లవ రాజ్యమైన, 'చోళిక విషయం'లో ప్రవేశించెను. ఎరమేశ్వరవర్మ ఓడిన పల్లవ సేనలను గూడగట్టుకొని, తన రాజ్య సరిహద్దుల బందోబస్తు గిట్టుదిట్టంచేసి చాలుక్యసేనతో 'పెరువాల నల్లూరు' వద్ద తలబడెను. గొప్ప సంగ్రామము యిరుసేనలమధ్య చాలాకాలం భీకరంగా సాగింది. విజయంమాత్రం ఎవరిసొత్తో యిదమిత్థంగా యిప్పటికీ తెలుపలేకున్నాం. చాలుక్య శాసనాలు విజయం చాలుక్యులదే యని చాటగా పల్లవుల శాసనాలు విజయం వారి సొత్తుగా చెప్పుచున్నవి. ఇటువంటి పరిస్థితులలో చరిత్రకారులు గూడ చెరియొక వైపు మొగ్గుట చరిత్ర సత్యం. కొందరు పల్లవ శాసనాలకు ప్రాముఖ్యం యిస్తే మరికొందరు చాలుక్య శాసనాలకు ప్రామాణ్యత యిచ్చారు. డా. నేలటూరు వెంకటరమణయ్యగారు[10] పల్లవ శాసనాలను విశ్వసనీయంగా బేర్కొని మొదటి పరమేశ్వరవర్మ చేతిలో మొదటి విక్రమాదిత్యుడు ఓడింపబడినట్లు చెప్పిరి. దానికి సాక్ష్యాధారం 'కుర్రం' శాసనం[11] ఉదహరించిరి. ఈ 'కుర్రం' శాసనం పరమేశ్వరవర్మచే నొసంగినది ఎన్నో లక్షల సైన్యంగల చాలుక్యాధిపతియగు మొదటి విక్రమాదిత్యుడు పరమేశ్వరవర్మ ధాటికి తట్టుకోలేక చిరిగిన బట్టలతో యుద్ధభూమినుండి నిష్క్రమించినట్లు 'కుర్రం' శాసనం పేర్కొనుచున్నది. ఇదే విషయం, మొదటి పరమేశ్వరవర్మ తదుపరి పల్లవరాజుల శాసనాలలో[12] ఉల్లేఖించుట గూడా మనం గమనించదగిన విషయం. దీనికి వ్యతిరేకంగా ప్రొఫెసర్ నీలకంఠశాస్త్రిగారు[13] చాలుక్యుల శాసనాలకు ప్రాముఖ్యం యిస్తూ "మనం పల్లవుల శాసనంలో వుల్లేఖించిన 'పల్లవవిజయం' నమ్మదగినది గా' దని పేర్కొనిరి కారణాలు తెలుపకుండా ప్రొ. శాస్త్రిగారు చాలుక్యసేనలు చరిత్రకందని కారణాలుమూలంగా యుద్ధభూమినుండి తిరోగమించినవని గూడ వారే చెప్పిరి.

కాని, చాలుక్యుల శాసనాలను వివరంగా మనం పరిశోధించిన 'కుర్రం' శాసనంలోని విషయం పూర్తిగా నిరాధారంగాదని బోధపడ గలదు. వినయాదిత్యుని 'జెజూరి' శాసనంలో[14] వినయాదిత్యుడు దన దండ్రి యాజ్ఞానుసారం విజయోత్సాహంతో చాలుక్య రాజ్యంలోనికి జొచ్చుకొని వస్తున్న పల్లవసేనను అడ్డగించి తన రాజ్యంలో శాంతిని నెలకొల్పి దండ్రికి యానందం గొల్పెనని పేర్కొనబడినది. దీనినిబట్టి మొదటి విక్రమాదిత్యుని రాజ్య కాలంలోనే పల్లవదాడి చాలుక్య రాజ్యంపై జరిగినట్లు, ఆ దాడి సమయమున మొదటి విక్రమాదిత్యుడు దన రాజ్యంలో లేనట్లు బోధపడుచున్నది. మరియు

డా. నేలటూరి వెంకటరమణయ్యగారు 'పల్లవ దాడిని మొదటి విక్రమాదిత్యుడు స్వయంగా నెదుర్కొనలేదని చెప్పిరి; కాని దానికి కారణం సూచించలేకపోయిరి.[15] నా వూహానుసారం చెప్పాలంటే .. విక్రమాదిత్యుడు విజయోత్సాహంతో 'చోళిక విషయం'లో విడిది జేసినప్పుడు మొదటి పరమేశ్వరుడు 'సిరితొండరు' నాయకత్వంలో గొంత పల్లవసేనను చాలుక్య రాజ్యంపైకి పంపియుండును. ఏలయన 'పెరువాల నల్లూరు' యుద్ధం జరిగే సమయానికి చాలుక్య సైన్యంను రెండుగా చీల్చిన పల్లవ చక్రవర్తికి చాలుక్య సైన్యాన్ని ఢీకొనుట తేలిక. సిరితొండరు దాడి తెలుసుకొని మొదటి విక్రమాదిత్యుడు గొంతాందోళన జెంది వినయాదిత్యునకు పల్లవదాడి గురించి వర్తమానం బంపి యుండవచ్చును. చివరికి పెరువాల నల్లూరు యుద్ధంలో గూడ చాలుక్యులకు పూర్తివిజయం చేకూరక లేదా స్వరాజ్య రక్షణార్థం విక్రమాదిత్యుడే తిరోగమించి యుండవచ్చును. ఈ 'సందిగ్ధత' కారణంగా పల్లవులు చాలుక్యులు దమ తమ శాసనాలలో విజయం మాదంటే మాదని పేర్కొన్నారు. ఇచ్చట ఒక చారిత్రిక సత్యాన్ని జెప్పవలసియున్నది. సిరితొండరు నాయకత్వం[16]లో పల్లవసేన చాలుక్య రాజ్యంలో జొచ్చినప్పుడు, బాదామిని వినయాదిత్యుడు కాపాడుచుండినాడా? ప్రొఫెసర్ శాస్త్రి[17] గారు 'విక్రమాదిత్యుడు పల్లవులపై దాడి వెడలినపుడు దన కుమారుడు, వినయాదిత్యుడు, మనుమడు విజయాదిత్యుడు బాదామిని కాపాడుచుండిరి'' యని పేర్కొనిరి. ఇది చరిత్ర విరుద్ధం. విజయాదిత్యుని 'రాయగడ' తామ్రశాసనం[18]లో ''తన తాత దక్షిణ దిగ్విజయంలో నుండగా తను, దనదండ్రి వినయాదిత్యుడు ఉత్తరదేశ దిగ్విజయయాత్రలో నున్నట్లు'' తెలుపబడినది. వినయాదిత్యుని 'జెజూరి' తామ్రశాసనం,[19] విజయాదిత్యుని కెందూరి తామ్రశాసనం[20] లలో పల్లవ దాడిని యణచినట్లు పేర్కొనబడినది. ఇచ్చట మనం కొంచెం చరిత్రకందని సత్యాన్ని వూహించ వలసియున్నది. 'సిరితొండరు' చాలుక్య భూభాగంపై కాలిడినపుడు వినయాదిత్యుడు, విజయాదిత్యుడు ఉత్తరదేశ దండయాత్రలో నున్నందున సకాలంలో వారు పల్లవసేన నడ్డుకొనలేక పోయిరి. వారు వచ్చు సమయాన్కి పల్లవసేన బాదామిని చేరుకొని యుండవచ్చును. లేదా ఆక్రమించి దానిని నాశనంచేసి యుండవచ్చును. తదుపరి వినయాదిత్యుడు విజయాదిత్యుడు పల్లవసేనను త్రిప్పికొట్టి యుండవచ్చును. ఈ తాత్కాలిక పల్లవాక్రమణయే 'కుర్రం' శాసన కథనానికి నాంది గావచ్చును. అట్లే మొదటి విక్రమాదిత్యుని పల్లవ మహేంద్రునిపై విజయం, పల్లవ రాజ్యాక్రమణ, గద్వాలు తామ్రశాసనం, దిమ్మగుడి శిలాశాసనాల కథనానికి 'యుపలంబం' గావచ్చును. ఇంతకుమించి పల్లవ చాలుక్యుల శాసనాలలోని విరుద్ధ ప్రకటనలకు గల ఔచిత్యం నాకు బోధపడకున్నది. ఇది కేవలం నా అవగాహనయే. ఈ అపరిష్కృత సమస్యపై చారిత్రికులు శ్రద్ధ జూపవలసినదే!!

ఇప్పటివరకు మనం మొదటి విక్రమాదిత్యుడు తన 20వ రాజ్యవర్షంలో కంచిని వశపర్చుగొన్నాడని, దిమ్మగుడి శాసన కాలం మొదటి విక్రమాదిత్యుని 20వ రాజ్యవర్షంగానే పరిగణించవలెనే గాని, 27వ సంవత్సరముగా గుర్తించగూడదని తెలిసికొని యుంటిమి.

దిమ్మగుడి శాసన పాఠం

1 స్వస్తి శ్రీ విక్రమాదిత్య సత్యా—
2 శ్రయ పృథివీ వల్లభ మ—
3 హా రాజాధిరాజ పరమే—
4 శ్వర భటారకకు విజయ రా—
5 జ్య సంవత్సరంబుళ్ ఇరుభది ఏ—
6 ణ్డు అగునేటి [కఞ్చి గొణిన] —
7 ... ...
8 .. ..
9 ... ...
10 ... ...
11 ... ...
12 ... ... ఇచ్చిరి తిచ్చు వాన్ఱు పాతకు ...

సూ చి క లు

1 A. R. No. 364 of 1920.
2 S II, Vol. X, No. 24.
3 Ibid, X, No. 24.
4 A. R. No. 364 of 1920 and see also S. II X, No. 24. Text.
5 SII, X, No. 24.
6 A. R., 1921, P. 87.
7 నా ఆంగ్లవ్యాసము చూడుడు. Journal of the Oriental Institute, XXIII, No. 4, PP. 316 ff.
8 E I. X, P. 105.
9 The Kurnool plates IV: సర్వం దాయాదాన్ విజిత్య.
10 Madras Christian College Magazine, October 1927.
11 Kuram grant: SII, Vol. I, P 152.
12 Conjivaram Inscriptions Rajasimha (i.e., Mahendra III) SII, I, PP 13 and 23.
13 Early History of the Deccan, Parts I–IV. P. 224.
14 E I, Vol. IX, P. 62.
15 Mcc. Magazine, Oct, 1927.
16 Prof. Sastri, Early History of the Deccan Parts I–VI, P–224.
17 Ibid, P. 224.
18 Ep. Ind. X, p. 14.
19 Ep. Ind., XIX, pp 62 ff.
20 Ibid, IX, pp. 202 ff.

ఒంటరి పాంథుడు

శ్రీ పి. యస్. శాస్త్రి

నౌదారిని వెతుక్కుంటూ
నా చిరుగుల సంచీని భుజాన్ని మోసుకుంటూ
చెట్లమ్మట, పుట్లమ్మట,
దారిచేసుకుంటూ,
పొదలలోనుండి దూసుకుంటూ,
ముళ్ళను రాసుకుంటూ
వడి వడిగా నడుస్తూ
ఆఖరికి
దారిపొడుగునా రక్తం కారుస్తూ,
గుండెని బ్రద్దలుచేసే బాధని ఓర్చుకుంటూ
మెల్లిగా అడుగుతీసి, అడుగువేస్తూ,
జీవనారణ్యంలో నా ప్రయాణం!
అంతా,
ఒక్క పిసరు మనశ్శాంతికోసం!
ఒక్క రవ్వంత సంతృప్తికోసం!
ఎవరుమాత్రం
సమకూర్చి పెట్టగలరు వాటిని,
మరొకరికి?
ఈ జీవనారణ్యంలో ప్రతివ్యక్తీ
ఒంటరి పాంథుడే?

మంట పూలు

శ్రీ గుడిహాళం రఘునాథం

నిరాశనై, నిస్పృహనై......
 తలెత్తలేని శోక సముద్రాన్నై
పడున్న నా ఎదుట
చిక్కని చీకట్ల నల్లరేగడిలో
ఈ దీపాన్ని నాటిందెవరు ?
వల్లబడుతున్న నా తలను
ఈ వెచ్చని వేళ్ళు
నిమిరేట్టు చేసిందెవరు ?

ఒంటరిదే ఐనా
ఆ దీపం
తనచుట్టూ
అర్థంలేక పడున్న ప్రతి అంగుళానికీ
జీవితార్థాన్ని చెబుతుంది.
చైతన్యవంతమైన 'ఫోటాన్ల కరపత్రాల్ని'
అందిస్తుంది.

రాలిపోతున్న నా మాటలకు
నీళ్ళుపోసి
దీటుగా నిలబెడుతుంది
శక్తివంతాలైన నా మాటలతో
ఈ దీపాన్ని నాలోకి ఆహ్వానిస్తున్నా.
నా దేహాన్ని అప్పగిస్తున్నా.
దాన్ని నాపై దండయాత్ర చేయనీ.
నా సమస్తాన్ని ఆక్రమించనీ
నా చేతుల్నీ, కాళ్ళనీ తన వేళ్ళుగా చేసుకొని
తలలో 'మంటచెట్టు'గా మారనీ
శక్తివంతాలైన నా మాటల్ని తీగలుగా చేసుకోనీ.
పాడు వ్యవస్థలో పతనమై
చైతన్యం శిథిలమైన
ప్రతి పల్లెనీ
ఆ తీగలమాటున
ఒక కొత్త 'మంటపువ్వు'గా పుష్పించనీ !

శూన్యమైన వేణువు

పెన్నా శిరాకృ

స్వరాలు దారితప్పగా శూన్యంగా
 మిగిలిన వేణువు ఈదినం —
నా యాంత్రిక జీవితపు రస్తాలో
ఎన్నికన్నుల్లోనో పాటలు కన్పిస్తున్నాయి.
ఎన్ని కంఠాల్లోనో వెలుగులు విన్పిస్తున్నాయి
కనిపించే ప్రతిపాటను అడుగుతున్నా
నా స్వరా లెక్కడని ?
వినిపించే ప్రతి వెలుగు నడుగుతున్నా
నా కిరణా లెక్కడని ?
కృత్రిమమైన నవ్వులతో శూన్యమైన
నా పరిసరాలన్నీ కలుషితమైనాయి.
అసహ్యమైన కాంతిచేత నా స్వచ్ఛమైన
చీకటికూడ కల్తీచేయబడింది
నా వియోగబాధా కలశములో
ఎప్పుడు పడుతుందో సుధాబిందువు.
నీవేనా అంతస్సింధువు.

శ్రీ డి. రామలింగం

కాల్పనిక కవితకు కలికితురాయి కృష్ణశాస్త్రి కవిత్వం

కవిగా, వ్యక్తిగా ఒకవిధంగా అవలోకిస్తే కృష్ణశాస్త్రిగారు దివిలో ఏ గంధర్వ లోకంనుంచో దారితప్పి ఈ భువికి దిగివచ్చి ప్రవాస జీవితం గడిపి, జీవించినన్నాళ్ళూ దేనికోసమో అన్వేషించి చివరకు పోనీలే అని ఉపేక్ష వహించి మౌనంలో పడిపోయినవారిలా గోచరిస్తారు. మరి దారితప్పి వచ్చిన మనిషి ఎనిమిది దశాబ్దాలకుపైగా ఈ మర్త్యలోకంలో ఎందుకున్నారు అన్న ప్రశ్న వస్తే—మొదటిది ఈ లోకంలోని చైతన్య సమన్వితమైన ప్రకృతి వారిని ఎంతగానో ఆకర్షించిందని చెప్పాలి. ఇచటి వారిదములు, భూరుహములు, సెలయేళ్ళు, పులుగులు, పువ్వులు, మధుపములు, నక్షత్రముల, నదులు, వల్లరులు, చివురులు, ఇక్కడి వసంతము, వనలక్ష్మి. వాటిశోభలూ లావణ్యాలూ, ప్రకృతి అందాలన్నీ ఆయనను ఆకట్టుకొన్నాయి. రెండవది ఇక్కడి మానవుడు నిరుపేద, కలుషాత్ముడు, చిన్నిపాప, కన్నతల్లి, కాపుకన్నె, లోకమోహన మనోజ్ఞమూర్తి ప్రేయసి. మూడవ కారణం ఆయనకు లభించిన గురుదేవులు బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు. కృష్ణశాస్త్రిగారికి ఆ గురువు పురాణ భారత పుణ్యమూర్తి, ప్రహ్లాదుడు, శ్రీ శుకమహర్షి. ఆయన మనసు ప్రయాగ. ఆయన దయ అపూర్వము. ఈయన జడజీవితాన్ని ఆయన పలికించాడు. మానవోద్యమాన్ని గూర్చి, దానికి సంబంధించిన ఉన్నతోజ్జ్వలములైన లక్ష్యాలనూ ఆయన చెప్పారు. ఉర్దూ, పారశీక, సూఫీ, వంగ, వైష్ణవ, ఆంగ్ల సాహిత్యాల ఘనతనూ, వాటి సొబగులనూ, వాటి నిశ్వాసాలనూ ఎరుకపరిచారు. కలికి పాటల కోయిల కొలము ఈయనది. వీరి కులస్వాములు స్వాదుగాన జీవసారము కురియించి పాడుకొన్నారు. మరి పిక కుమారుడైన ఈయనా పాడుకొన్నాడు. ఆ చేసినది స్వేచ్ఛాగానము. క్రౌర్యము, కౌటిల్యము, కఠిన దాస్య శృంఖములు చెదరిపోవగా జగమునిండా స్వేచ్ఛాగాన ఝురులు నింపాడు. ఇంకేం, కావలసినంత సందడి. ఆ సందడిలో తల మునకలైన వాడికి మరొక దానిపైకి మనసు పోతుందా? ఆయన భావతరంగిణి నాలుగు విధాలు. మొదటిది స్వేచ్ఛాగానం. రెండవది ఆత్మానుభవాలవల్ల ప్రాప్తించిన దుఃఖం మరి ఆ హృదయభారాన్ని విడబోసుకుందుకు కావ్యరచనే లేకపోతే ఆ అనుభవాలవల్ల జీవితం ఎంత బరువుగా అయిపోయేదో! మూడవది ప్రేమ. అందులోనూ తాను ప్రేమించే ప్రేయసిలేదని కృంగిపోయి తానే ప్రేయసిని సృష్టించుకొన్నాడు నాల్గవది ఈశ్వరారాధన. సమస్తం ఈశ్వరార్పణం చేసి అన్యయానందం అనుభవించాడు. అది పూర్తిగా ఆత్మపరమైన దివ్యానుభూతి. ఈ నాలుగు పాయలుగా వెలువడిందీ ఆత్మాశ్రయ కవిత్వమే. ఒకవంక స్వేచ్ఛాప్రియత్వమూ, వేదనా, మరొక వంక ప్రేయసీ భగవద్భక్తీ – ఇవి గొప్ప కవితా సామగ్రి.

కృష్ణశాస్త్రిగారు వ్రాసిందీ, అతిగా మెచ్చుకొన్నదీ, పనికట్టుకొని సమర్థించిందీ – కాల్పనికావేగం కల ఆత్మాశ్రయ కవిత్వాన్నే దాన్ని గూర్చి ఆయన ఎంతగా చెప్పారో! అసలు కొంత కాల్పనికావేశమే లేకపోతే కవిత్వమే రాదని ఆయన నమ్మకం ఉత్తమమైన ఆత్మాశ్రయ కావ్యంలో ఉన్నంత కవిత్వ లావణ్యం మరొక కావ్యంలో ఉండదు, ఊపినచోట అది ఊపినంత మరొకటి ఊపదు, దానిని పఠించినవారి మనస్సు క్షాళితమై, పదునై పక్వమవుతుందని ఆయన అనుకొన్నారు. చదివే వారిలో ఆర్ద్రదృష్టి, కవితా హృదయముంటే ఆత్మాశ్రయ కవిత్వంలో చక్కదనమూ, కవిత్వగుణమూ కనపడతాయన్నారు. కవిత్వానికి కొంత ఆత్మీయత, ఆత్మపరత కావాలి. మరి వాటికి సన్నిహితమైన ఆత్మానుభూతి కావాలి— ఇలా ఆయన భావనాశక్తి, భావోద్రేకము, భావనాస్ఫోరకత్వము, హృదయాకర్షణము, రసోజ్జృంభణము మొదలగు ఆత్మపరకావ్య విశేషాలను గూర్చి ఎంతో చెప్పేవారు. ఆత్మపరమైన గేయ కావ్యానికి స్ఫుటమైన ఆకారమిచ్చిన బసవరాజు అప్పారావు కృష్ణశాస్త్రిగారికి అమరదూతగా కనపడేవాడట! ఆయన కావ్యాలను వీరు ఏకాంతంలో పాడుకొనేవారట. హృదయవాది, కేవలం అనుభవం వైపు మొగ్గే మనిషి, నిత్యయౌవనంతో తొణికిసలాడే హృదయం కలవాణ్ణి ఆత్మాశ్రయ కవిత్వమే కదుపుతుంది!

ఆంధ్రదేశంలో నవ్యకవిత్వాన్ని ఒక ఉద్యమంగా చేసిన ఘనత కృష్ణశాస్త్రిగారికి ఎంతగానో చెందుతుంది. ఈ విషయంలో స్వామి శివశంకరుల పాత్రను ఇక్కడ స్మరించకతప్పదు. కాని కృష్ణశాస్త్రిగారు దేశమంతా తిరిగి, ఆ దుస్తులు, ఆ కేశసంపదతో అచ్చమైన భావకవిగా ఎన్ని సభల్లో తనవీ, నవ్యాంధ్ర కవులవీ పద్యాలు ఎంత ఆవేశంతో చదివేరు! ఎంత చక్కగా పాడేరు! ఎంతమందిని తలలూపజేశారు! ఆ చదవడంలో ఒక కావ్యపంథా ఏర్పరచు కొన్నారట. కొత్త రచన మంచిది ఎవరినుండి వచ్చినా వెర్రి ఆవేశంతో చదువుకొనేవాడు. వాటిని కంఠస్థం చేశాడు. అవంటే అకలంక

మైన అనురాగమూ, ఆకర్షణా. ఆయనకు నిత్యమూ కవితోత్సవం కావాలి. నిజం చెప్పాలంటే ఆత్మపరమైన నవ్యకవిత్వానికి ఆంధ్ర దేశంలో కృష్ణశాస్త్రి ప్రతినిధి.

కృష్ణశాస్త్రిగారు నూటికి నూరుపాళ్ళూ కవి. కవిత్వ రహస్యం నిజంగా తెలిసినవాడు. శబ్ద సంస్కారాన్ని ఏమాత్రం జార నిచ్చేవాడు కాదు. శబ్దమహత్వం ఎరిగినవాడు. మాటలకు రంగూ, రుచీ, వాసనా ఉంటాయి అనేవాడు. పాతమాటలనే కొత్త వన్నె చిన్నెలతో జిలుగులతో, నగిషీలతో వింతగా ప్రయోగించేవాడు. అవి పరిమళాలు వెదజల్లుతున్నట్లుగా, కొత్త కాంతులీనుతున్నట్లుగా, కొత్త మూర్తులు కడుతున్నట్లుగా, కొత్త భావనా లోకాలలోకి వెలుగు ప్రసరింపజేస్తున్నట్లుగా కన్పట్టేవి. వాటిలో పదునూ అందమూ చూపేవాడు. కొన్ని కొన్ని మాటలు, ఒక రకం కూర్పు, అందులో విలక్షణమైన గానం, చదవంగానే ఒక మనస్థితి, ఒక ఆవేశం, ఒక అనుభవం స్ఫురించేవి. కాబట్టే ఒక సందర్భంలో ఆయన ''కవిత్వమునకు ఛందోబద్ధమైన మనోహర శబ్ద సముదాయముకూడ కావలెను'' అన్నాడు. ఆయన చేసిన ఏ రచన చూచినా విలక్షణమైన శబ్ద సంపద కన్పిస్తుంది. చివరకు వచనం వ్రాసినా అందులో ఒక లాక్షణికత, ఒక సాంస్కృతికత గోచరిస్తుంది. ఇక 'కృష్ణపక్షము' కావ్యం మొత్తం శబ్ద సంపదరీత్యా చూస్తే మేలిమి బంగారుముద్ద. ''ఏనాక వియోగ గీతిక'' అని ఎందుకు వ్రాశాడో ఆలోచిస్తే ఆయన రచనా కౌశలం బోధపడుతుంది. ఇక శిల్పం, జిగి, జీవం, బాణీ, పదచిత్రాలు, అద్భుత పూర్ణమైనదృష్టి, అలంకారాలు, మనోహరమైన నడకలు, విరుపులు, గడసరిమాటలు, కవిత్వపు లావణ్యాలు, లోతులు కావాలంటే కృష్ణశాస్త్రి కవిత్వం ఒక ఖని. కాల్పనికావేగం, లక్ష్యావేశం, విశృంఖలత, విజిగీష, సాహసం, వేదన, దివ్యానుభూతిని కలిగించే భక్త్యావేశం ఆయన కవితలో అపారంగా ఉన్నాయి.

కృష్ణశాస్త్రి స్వయంగా మహాకవి కావడమేకాదు, తెలుగు నాటి సాహిత్య కేదారంలో కవిత్వశ్రీ ఎప్పుడూ సమృద్ధిగానే ఉందని జ్ఞప్తికి తెచ్చుకొని ఉప్పొంగిపోయిన సహృదయుడు. ఆయనకు కవిత్వం ప్రాణం. ఎటువంటి కవిత్వమైనా గ్రహించి ఆస్వాదించడం ఆయనకే ఎరుక. కవి త్రికాలజ్ఞుడనీ, సమాజానికి పెత్తందారూ నాయకుడూ కవే అనీ, అనంత యాత్రామార్గంమీద జనం యాత్రికకోటి, దానికి మార్గదర్శి కవి అనీ, జీవిత యాత్రలో ఒక్కొక్కచోట ఆగిపోవడానికి ఎవరికయినా అవకాశం ఉంది కాని కవికి ఆ అవకాశమూ అధికారమూ లేవనీ, కవి ప్రాజాపత్యము స్థిరపరుస్తే బాగుండునని, అందాకా నవ్య కవితోద్యమం సాగవలసిందేనని షెల్లీవలె కృష్ణశాస్త్రి సమాజంలో కవులకుగల ప్రత్యేక స్థానాన్ని చాటాడు.

''భావకవిత్వం వ్రాయగల వాడొక్కడే, అతనిపేరు కృష్ణశాస్త్రి''అని కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారూ, ''కృష్ణశాస్త్రిగారి భావకృతులు సౌకుమార్య మాధుర్యములకు చరమసీమలు'' అని నారాయణరెడ్డి, ''కృష్ణశాస్త్రిగారి కవిత్వమంతా గొప్ప అన్వేషణ, అంత దిగులు, అంత నిరాశ'' అని చలంగారూ అన్నారంటే ఆయన కవిత్వపు ఆకృతినీ, ఆత్మనూ చక్కగా పోల్చుకొని అభిప్రాయమిచ్చారు

అటువంటి కవితా తపస్వి ఈ లోకంలో తనువు చాలించి, తిరిగి ఏ స్వర్గసీమలోనో, ఏ అమరపురిలోనో ఒక మహాపరిషత్తులో మహాకవిగా అగ్రపీఠం అలంకరించి ఉంటారు. ఆయన చుట్టూ ఎవరెవరు చేరిఉంటారో చెప్పడం పెద్ద గ్రంథమవుతుంది. కాని ఊర్వశిమాత్రం ఆయనమ్రోల నిల్చొని ''మహాకవీ, మీరు గతమ్మార పాడుకొన్న శోకగీతాలలో నేను శోక గీతినని ఆ లోకంలో పాడివచ్చారట. ఆ కావ్యం నాకు వినాలని ఉంది. వినిపించి నన్ను ధన్యురాలిని చేయాలి'' అని వలపులూరిస్తూ వేడుకొంటుంది. ప్రేమికుడైన కవి అనుగ్రహించకుండా ఉంటాడా?

మైనపువత్తి

శ్రీ శంకరగంటి రంగాచార్యులు

విద్యు దుజ్వల దీపకాంతి ఆడంబరము
 నీ వెలుంగుకు లేదు. కాని, మైనపువత్తి!
అది లేనినాడు నా గదిలో భయంకరము,
తమము వ్యాపింపగా, అద్దాని పరుగెత్తి
చనునట్లొనర్చి, నింపెదవు నీ మృదుకాంతి!
ధనవంతుల సహాయమును పొందలేనట్టి
నిరుపేద జనుల నిష్ఠుర బాధ పోగొట్టి
వారి కన్నీర్తుడిచి, వారి ఎడదల శాంతి
నింపి, మటుమాయమౌ దీనబాంధవునట్లు,
అవసరమ్ముల తీర్చి నక్కెదవు ఒకమూల!
చీకట్లు పోకార్ప నీ తనువు కరగించి,
జ్యోతివై వెలిగెదవు అత్యవసరపువేళ!
నా శక్తియుక్తులను అనదప్రజ అగచాట్లు
తీర్చుటకు వెచ్చింప వరమిమ్ము కరుణించి!

శ్రీ కొసల నాగభూషణం

గడ్డిపువ్వు

హాస్పిటల్లో ఆపరేషన్ థియేటర్ పక్కగదిలో కూచున్న కృష్ణమూర్తి తన కెదురుగ వున్న కిటికీలోంచి అవతల లాన్‌లో కనబడుతోన్న క్రోటన్ మొక్కలకేసే చూస్తున్నాడు నిలువు చూపులతో. రాత్రల్లా కురిసిన మంచులో ముద్దగా తడిసిన క్రోటన్లు ఏటవాలుగా పడుతోన్న ఎండలో వింతగా మెరుస్తున్నాయి రంగుటద్దపు పలకల్లా.

తనకీ, క్రోటన్లకీ మధ్య వరండాలో అటూ ఇటూ తిరుగాడుతోన్న చీరకుచ్చెళ్ళు, తెల్లగౌన్లు, కాకి నిక్కర్లు, బెల్ బాటమ్‌లు—ఏవీ అతని దృష్టిని ఆకర్షించడంలేదు. నీళ్లతో కలిపి ఆ వుదయం గదులన్నింటినీ శుభ్రంచేసిన ఫినైల్ తాలూకు వాసనపైన తిరుగుతోన్న ఫ్యాన్ గాలికి హాస్పిటల్ మందుల వాసనలతో కలిసి మరింత ఘాటుగా ముక్కుపుటాలకి తగులుతోన్నా అవేవీ అతని స్పుర్తింపుకి అనడంలేదు.

అతని ధ్యాసంతా నీరెండలో తళతళలాడి అంతలోనే మబ్బుల నీడకి వెలవెలపోయిన ఆ క్రోటన్ మొక్కలమీదే - విసురుగాలికి వూగిసలాడి ఎండవేడికి వాడి రాలే వాటి ఆకులమీదే!

''సరిగా ఈ మొక్కల్లాగే అయింది గౌరీ! నీ జీవితంకూడా'' అనుకున్నాడు తనలో కృష్ణమూర్తి.

ఇదిగో! ఈ మాట నేనంటోండగానే మనసులో ఈపాటికే మీరనుకోవడం—నా అనుమానం నిజమయితే అతనికీ, గౌరికీ మధ్య ఏదో ప్రేమ బాంధవ్యమే వుంటుందని - ఇదీ విరివిగా ఈనాడు ఉత్పత్తి అవుతోన్న కథానికల నవలల సాహిత్యంలో దాదాపు ఎనభై శాతం పైగా విస్తరించిన ప్రేమ ప్రభావం ఎంతో కొంత మీమీదా వున్నందువల్ల! అదీగాక ఒక కథలో ఆడా మగా కేరెక్టర్లని పరిచయం చేసేడంటే కథకుడు ఇక వాళ్ళు తప్పక హీరో హీరోయిన్లే అయి వుంటారనే నిర్ణయం చేసేసుకుని, ఆ ఇద్దరి ప్రేమకలాపాల కోసమే ఎదురుచూస్తూ వుంటారు పాఠకులు. వాళ్లలో ఆ రకమైన మెంటల్ ప్రిపేర్డ్‌నెస్‌ని కలిగించిన కథకులందరికీ ఒక్కమారు కృతజ్ఞతలు తెలుపుకుని నే చెప్పదల్చుకున్న కథనేదో కాస్త తేలిగ్గా చెప్పుకుపోవడమే ప్రస్తుతం నా కర్తవ్యం

ఈ కథలో గౌరి ఊరికే అలా నేలమీద గాలికే ఎగిరిపోయిన పిచ్చిమొక్క అయితే

ఆ పిచ్చిమొక్కని సున్నితంగా వేళ్లతోసహా తవ్వి తీసి భద్రంగా కుండీలో వుంచి పెంచాలనుకున్నవాడు కృష్ణమూర్తి.

ఆ కథా కమామీషేమిటో తెలుసుకోవాలంటే నాతోపాటు మీరూ కృష్ణమూర్తి జీవితంలోకి, ఓ పదేళ్ల గతంలోకి వెళ్లక తప్పదు.

* * *

అప్పటికా ఏడే మెడిసన్ పూర్తిచేసి మామగారి సాయంతో వున్న వూళ్లోనే కృష్ణమూర్తి ప్రైవేట్‌గా ప్రాక్టీస్ పెట్టుకున్న తొలిరోజుల్లో

ఒకనాడు —

హాస్పిటల్ ఎక్విప్‌మెంట్‌కోసమై స్నేహితుడు సుధాకర్‌తో కలిసి రైల్లో గుంటూరు వెళుతున్నాడు కృష్ణమూర్తి

ఆ రైలు బయలుదేరిన సమయానికి గోలగోలగా, గొడవగా చేపల మార్కెట్‌లా వుండిపోయిన వాళ్లెక్కిన కంపార్ట్‌మెంట్ చూస్తోండగానే, వింటోండగానే ఓ వేపునుంచి నిశ్శబ్దం కాసాగింది సద్దుమణుగుతోన్న కలకలాన్ని వెన్నంటి వేదనాపూరితమైన కంఠస్వరం రాగాలాపనతో వినవచ్చింది. మొత్తం కంపార్ట్‌మెంటే ఆ రాగాన్ని చెవులు రిక్కించి మరీ వినసాగింది.

కంఠంలో పూర్తిగా విషాదాన్ని నింపుకుని, ఆరోహణలో అల్లంతపైకి వెళ్లి అంచెలంచెలుగా కిందిస్థాయికి చేరుకున్న ఆ స్వరం అటు విరమించగానే అందుకు తగ్గవిధంగా గిలకడబ్బా మ్రోత ఒకటి నేపథ్య సంగీతంలా వినిపించింది. ఆపైన అవి రెండూ కష్టమూ, కన్నీళ్లూ కలగలిసినట్లు ఒకదానితో ఒకటి ఏకమై ఆ ప్రయాణీకుల ఏకాగ్రతని ఆకర్షించసాగేయి

ఆ పాట పాడుతోన్న వ్యక్తి వయసు నలభయికి పైబడే వుంటుంది. మనిషి ఎండిన మోడులా సన్నగా బక్కచిక్కి వుంటాడు. అతనికి కళ్లు రెండూ లేవు. తలవెంట్రుకలు గిరజాలు పెంచేడు. గడ్డం పెరిగింది. చిరిగిన బట్టలు మాసికలు పడ్డాయి. చేతొత్తు ఊతగా ఓ కర్రని పట్టుకున్నాడు. పాడుతోన్నంతసేపూ తలని ఆకాశంవేపుగా, ఆవేదనగా ఎత్తి వుంచుకున్నాడు. ఎదురు చూడని ఏదో మాయదారి రోగంతో తన ఇంటికీ, కంటికీ వెలుగైన ఇల్లాల్ని తీసేసుకుని, బ్రతుకుని ఇల్లా బుగ్గిపాలు చేసేసే వెందుకని చూడలేని తన కళ్లతో ఆ కనిపించని దేవునికి నివేదించుకున్నాడు.

అతని గొంతుకతో గిలకడబ్బా సంగీతాన్ని మేళవించిన ఆ కుర్రవాడు నూరేళ్ల బంగారు భవిష్యత్తునీ ముందుంచుకున్న అతని కొడుకు పదేళ్లవాడు. చిరిగిన నీలం నిక్కరూ, మాసిన తెల్ల

చొక్కా—అది యూనిఫాం కాదు. అసలు చదువుకునే అవకాశమే, అదృష్టమే ఆ పిల్లవానికి లేదు.

పాట ఆగేసరకు గిలకడబ్బాని వాయించేడు వాడు. ఆపైన కళ్లలో ఇంత దైన్యాన్ని నింపుకుని, సహజంగా పిల్లల్లో ఆ వయసుకి వుండవలసిన అభిమానం తెరల్ని చింపుకుని, ఆ గిలక డబ్బానే తిప్పి పట్టుకుని ప్రయాణీకుల్లో ప్రతి ఒక్కరిముందూ నిలవ సాగేడు. తనకేసి చూసేవారి గుండెల్లోని దయారసాన్ని ''అమ్మా, అయ్యా, బాబూ!'' అంటూ కొంత కొంతగా తోడుకోసాగేడు. అల్లాగే వొచ్చి కృష్ణమూర్తి ముందూ ఆగేడు. అంతవరకూ డబ్బాలో పడిన పైసల్ని పైకెగరేసి గలగలలాడించేడు డబ్బాని.

కృష్ణమూర్తి వానివైపోసారి చూసి, జేబులోంచి పది పైసలు తీసి వేసేడు అందులో.

కుర్రాడు డబ్బాని మళ్లీ గలగలలాడించి చూసేడు సుధాకర్ వంక.

సుధాకర్ వానివేపు చూసీ చూడనట్టు చూసి సైగచేసేడు ఎడంచేత్తో వెళ్లిపొమ్మన్నట్టు.

మొహం ఇంతలా చిన్నబుచ్చుకుని అతన్ని చూసి బెదిరినట్టు వెళ్లిపోయేడు వాడు వెనక్కి.

''డర్టీ రోగ్స్! ఇతర్ల దయాదాక్షిణ్యాలని సొమ్ముచేసుకు బ్రతికే వీళ్లంటే అసహ్యం నాకు'' అన్నాడు సుధాకర్ తను వాణ్ణి చీదరించినందుకుగల కారణాన్ని ఎక్స్‌పోజ్ చేస్తూ.

ఆ మాటని విన్నాడు కృష్ణమూర్తి. తిన్నగా తనలోనే నవ్వుకున్నాడు. బెగ్గింగ్‌పట్ల సరిగ్గా ఇల్లాంటి అభిప్రాయమే వున్న సోకాల్డ్ ఎడ్యుకేటెడ్ జెంటిల్‌మన్ గ్రూప్ కంతటికీ ప్రతినిధిలా కనిపించేడు సుధాకర్ అతని కంటికి.

అందుకనే అతనితో తన మనసులో మాట ఇల్లా చెప్పడం ప్రారంభించేడు ''యు వార్ కరెక్ట్ మిస్టర్ సుధాకర్!'' అంటూ. ''చిన్నతనంనుంచే అభిమానాన్ని చంపుకుని చెయ్యిచాచి యాచించే మనస్తత్వాన్ని అసహ్యించుకోవలసిందే మనం. కాని అదే సమయంలో ఏ పరిస్థితుల్లో వీళ్లిల్లాంటి వృత్తికి అలవాటుపడిపోతున్నారో దాన్నీ కొంత ఆలోచించాలిగా!''

ఇక ఇప్పుడు తన ఆర్గ్యుమెంట్‌ని సేఫ్ చేసుకోవలసిన బాధ్యత సుధాకర్ మీదుంది. అతనూ అందుకున్నాడు ''వెల్ ఎడ్వయిజ్‌డ్ మూర్తీ! బట్ వన్ థింగ్. నీ సైడ్‌నుంచీ ఈ సమస్యని నేనాలోచించలేదనుకోకు. నువ్వన్నట్టు ఆలోచించడం మొదలెడితే ఆఖరుకి హంతకుడయినా క్షంతవ్యుడే అవుతాడు, పరిస్థితుల దృష్ట్యా. ఓ సైకాలజిస్టే జడ్జి అయితే ఇక జైళ్లే వుండవు ఆ దేశంలో. అఫ్‌కోర్స్ ... కేస్‌ని సైకాలజిస్టుగానే స్టడీచేసినా విధిగా జడ్జిగా మారితీరాలి అతను శిక్షని విధించేప్పుడు. ఫలానా రాజుగారి పరిపాలనలో సుభిక్షంగా వుండేది దేశం అని ఇప్పటికీ మనవాళ్లు అదేదో వాళ్ల గొప్పదనానికి కారణమైనట్టు ప్రగల్భాలు పలికినా ప్రత్యక్షంగా ప్రజల్ని, పరోక్షంగా సొసైటీని ఇబ్బందిలో పెడుతుందీ భిక్షుకవృత్తి. కనక 'ఏదో సింపతీ క్వెశ్చన్. పోనీలే' అనుకుని ఇల్లా మనకి వీలయినంతలో వాళ్లకి కొంత పడెయ్యడంతో మనమూ ఆ వృత్తిలోకే వాళ్లని ఎంకరేజ్ చేస్తున్నాం అని నా అభిప్రాయం. పైగా మారుతోన్న సమాజంలో మనమూ ఈ వృత్తిని మాని స్వశక్తిమీద ఆధారపడదాం అని మాటవరసకయినా అనుకోని వీళ్లపై విపరీతమైన కోపంకూడా.''

సుధాకర్ తృప్తిపడ్డాడు తన అభిప్రాయం చెప్పి ముగించి. అయినా కృష్ణమూర్తి మనస్సులోని ఆర్ద్రతని అది సమాధానపరచలేకపోయింది. అతను మరింత సాఫ్ట్ అయ్యేడు ''ఎవరో అధికారంలో వున్నవాళ్లు మరిచినా అందరం మరిచిపోలేం సుధాకర్ మనస్సుని. మనం చేసే ప్రతి సాయమూ అవతలివాని ఇనెబిలిటీని ఫుల్‌ఫిల్ చెయ్యడానికే, ప్రోత్సహించడానిక్కాదు. ఫరిన్‌స్టెన్స్—ఇప్పుడొచ్చిన ఈ అబ్బాయినే తీసుకుందాం. వీనికి అన్ని సౌకర్యాలూ కల్పించి, మన పిల్లల్లా వీణ్ణీ చక్కగా ఎడ్యుకేట్ చేయిస్తే డెఫినెట్‌గా బాగుపడగలడు. అయినా వాణ్ణి ప్రస్తుతం వాడున్న పరిధిని దాటి రాకుండా అందులోనే కట్టిపడేసింది వాడి పరిస్థితి. కళ్లులేని తన తండ్రికి వీడిప్పుడు ఆధారం. వాణ్ణి ఆదుకోవడం అటుంచి ఏ కూలినాలి చేసుకునయినా గర్వంగా, ఇంతకంటే హాయిగా బ్రతకొచ్చనే ఊహని వానిలో కలిగించేవాళ్లు లేరు. అందుకే ఒడిలో తన నుంచుకుని 'బిడ్డ తల్లిని బాబూ! కనికరించండి' అంటూ తన తల్లి యాచించే అంత చిన్న వయసునుంచీనే వాని నరనరాల్లో జీర్ణించుకుపోతుంది 'బాబూ! ధర్మం చెయ్యండి' అనేమాట. ఇక వానికి చెట్లూ, ఓవర్ బ్రిడ్జీలే ఇళ్లవుతాయి. బస్టాండ్లూ, రైల్వే ప్లాట్‌ఫాంలే వర్కింగ్ స్పాట్స్ అవుతాయి. 'సార్, అమ్మా, బాబూ, అయ్యా'లే వొకాబులరీ అవుతుంది. అలా యాచించడమే వృత్తిగానూ, ఆ నరకమే స్వర్గంగానూ కనబడుతుంది. ఇక ఆ వూబిలోంచి బయటపడగలిగే అవకాశం, అసలల్లాంటి ఆలోచనా వానికి కలగవు. వాడి లోకం వాడిదై, ఈ లోకానికే ఓ సమస్యగా తయారవుతాడు వాడు.''

కృష్ణమూర్తి ఆగేడు. ఆ కంపార్ట్‌మెంట్‌లో దాదాపు అందరూ చదువుకున్నవాళ్లే వున్నారు. అందరూ వీళ్లవేపేచూస్తూ వీళ్ల మాటల్నే ఆసక్తిగా వింటున్నారు.

సుధాకర్ అందరినీ ఓమారు పరిశీలనగా చూస్తూ చెప్ప సాగేడు కృష్ణమూర్తితో ''ఎల్లాగూ మన సంభాషణ ఈ టాపిక్‌మీద వొచ్చింది కాబట్టి నాకు తెలిసిన ఇన్సిడెంట్ ఒకటి చెబుతాను. మా వూళ్లో 'జ్యోతి మహల్' థియేటర్ తెలుసుగా నీకు! అక్కడో అమ్మాయుండేది. రాత్రిళ్లు ఫస్ట్ షో వొదిలింతర్వాతయినా సరే నిలబడ్డ క్యూలవెంట వొచ్చేది అడుక్కుంటూ. అమ్మాయి వయసులో వుంది. కంటికి నదురుగానూ వుంటుంది. ఒంటిమీద చాలీచాలని చిరుగుబట్టలు కాలేజి కుర్రాళ్లు, రిక్షాలాగేవాళ్లు, తాగొచ్చినవాళ్లు, జూదగాళ్లు ఇక

జనం సంగితి ఎల్లా వుంటుందో ఆ పిల్లని చూసేప్పుడు ఆలోచించు—అసహ్యంగా కామెంట్లు, కన్ను గీటడాలు! పాపం, ఆ పిల్ల కాస్త మెంటల్ కండిషన్ తప్పినట్టు కనిపించేది. పట్టించుకునేది కాదు ఇవేవీ. చేతిలోబడ్డ పైసలే పంచప్రాణాలు దానికి. అలా చాలా రోజులుగా వుండేది అక్కడే, ఆ థియేటర్ దగ్గరే.

ఓ రోజు నేను హాస్పిటల్లో డ్యూటీలో వుండగానే పోస్ట్ మార్టమ్‌కి వొచ్చింది ఓ శవం. తీరా చూస్తే ఈ సినిమా పిల్లే. నిర్ఘాంతపోయేను క్షణంసేపు. బట్ట తొలగిస్తే అప్పుడు చూసి వుండాలి ఆ ఘోరం—ఒళ్ళంతా పంటి గాట్లు. అప్పుడపుడే ఎదుగుతోన్న పచ్చిప్రాయం. రాక్షసుల్లాంటివాళ్ళు — నలుగురైదుగురయి వుండాలి—చెరిచేరు ఆమెని రక్తపు మడుగులో కొనవూపిరితో కొట్టుకుంటోన్న శరీరాన్ని ఆ రాత్రికి రాత్రే లాక్కొచ్చి పడేసేరు బయట సెంటర్లో. ప్రాణం మరోగంటకి పోయినట్లు తేలింది పరీక్షలో. అమానుషంగా జరిగిన ఈ నేరానికి ఎవరిని శిక్షించాలి? ఎలా సానుభూతి ప్రకటించాలి? ఎంతో ఎదిగిపోయేడు మనిషి అని అనుకోవడమేగాని నిటారుగా నిలబడి మనిషి తనలోకి, తన మనసులోకి తనే చూసుకుంటే ఎన్ని ఘోరాలిల్లాంటివి? ఎన్ని నేరాలు? ఎవరు సాల్వ్ చెయ్యగలరీ సమస్యల్ని? తన బాగుకోసం మనిషి తనే స్వయంగా పాటు పడాలి తప్ప!''

సుధాకర్ చివరికి తన స్టేట్‌మెంట్ దగ్గరి కొచ్చేసేడు. దాని తాలూకు రిఫ్లెక్షన్ ఎల్లా వుంటుందో చూద్దాం అని అందరి మొహాల్లోకీ చూస్తూ తన జేబులోకి పోనిచ్చేడు చేతిని సిగరెట్ కోసం. అయినా వింటారుగాని, చూస్తారుగాని జనం అసలు పట్టించుకుంటారా ఇల్లాంటి వాటిని? ఎవరి మట్టుకివాళ్ళు పేపర్లతోనూ, బతాజీల తోనూ, కబుర్లతోనూ జీవించడం మొదలెట్టేరు.

కాని కృష్ణమూర్తి తన ఆలోచనల లోకంలోకి తను వెళ్ళిపోయేడు.

అతను జీవితం తొలిదశలోకి అప్పటి కప్పుడే అడుగుమోపినవాడు. తనలాగే మెడిసన్ చదివి, తనసీ అన్ని విధాలా అర్థం చేసుకుని, తనకీ పూర్తిగా అర్థమయిన అనుపమని అర్ధాంగిగా చేసుకున్నాడు. తమ ఇరువురి అనురాగాన్నీ ఆమెలో పండించుకుని ఇద్దరు బిడ్డలకి తండ్రి అయ్యేడు. జీవించడంలోని పరిపూర్తి, ప్రేమించడంలోని ఉన్నతీ తెలిసి విలువలపట్ల విశ్వాసాన్ని పెంచుకున్నాడు. ఆలోచనల వేడికీ, ఆదర్శాల ఒత్తిడికీ లోనయి అతనా క్షణంలో ఏదో ఒక బలమైన నిర్ణయాన్నే తీసుకున్నాడు. ఆ నిర్ణయం అతని మొహాన్ని సంతృప్తితో వెలిగించింది.

ఆమారు గుంటూరు వెళ్ళేక సుధాకర్‌కి తెలిసిన ఓ సర్జికల్స్‌లో హాస్పిటల్‌కి ఇంకా అదనంగా కావలసిన ఎక్విప్‌మెంట్ ఆర్డర్ చేసేడు కృష్ణమూర్తి. వాళ్ళ ఇంట్లోనే ఆ రోజు గడిపి మరునాడు తిరుగుముఖం పట్టేడు ఇంటికి.

అలా వొస్తోన్నపుడు రైల్లో ఖాళీగ వున్న కంపార్ట్‌మెంట్‌లో ఎదుటి సీటువేపుకి కాళ్ళు చాపి పత్రికలో తలదూర్చి చదువుకుంటోన్న కృష్ణమూర్తికి వెనకటికి లాగే ''బాబూ! దరమం'' అంటూ ఓ జాలి గొలిపే పిలుపు వినిపించింది.

ఆ పిలుపుతోటే తలయెత్తి చూసిన అతనికి అందమైన ఓ పాప కనిపించింది. పట్టుమని అయిదారేళ్ళయినా వుంటాయో వుండవో ఆ పాపకి.

మళ్ళీ అదే అభ్యర్థన ''దరమం బాబూ!''

చామన ఛాయలో కోలగావున్న కనుముక్కు తీరు. పచ్చగా మిసమిసలాడుతూ పందిరిమీదికి పాకి అల్లుకోవలసిన తీగ పాదులోని నీళ్ళింకి ఎండకి శోషిల్లినట్టు సరైన పోషణలేక సన్నగిల్లిన ఒళ్ళు. మొహంలో కళ వున్నప్పటికీ ఆ సమయానికి చెయ్యి చాపి యాచిస్తోన్నందువల్ల అందుకు తగ్గట్టే కళ్ళలోకి దైన్యాన్ని పట్టి తెచ్చుకుంది. ''అయ్యో పాపం!'' అనిపించేలా చూస్తోంది.

ఆ పాపని చూసిన కృష్ణమూర్తికి ఆ క్షణంలో ఆ పాపలో సుధాకర్ వినిపించిన సినిమా పిల్లే కనిపించింది.

''ఈ పిల్లా పెరిగి పెరిగి పెద్దదై ఏదో ఒకనాటి చీకటి రాత్రి ఆ సినిమా పిల్లలాగే మనుషుల్లోని పశుత్వానికి క్రూరంగా బలి కావలసిందేనా?'' ఆక్రోశించేడు కృష్ణమూర్తి మౌనంగా. వెంటనే తనలో స్థిరంగా అనుకున్నాడు ''నో .. అలా కావడానికి వీల్లేదు. ఈ మురికి కూపంలోంచి ఈ పిల్లని నేను తప్పిస్తాను. తప్పక రక్షిస్తాను''

కృష్ణమూర్తి ఎంతో ఆప్యాయంగా చేరదీసేడు ఆ పిల్లని.

''పాపా! నీ పేరేంటమ్మా?'' లాలనగా అడిగేడు.

మొదట కాస్త బెరుగ్గా చూసినా దగ్గరి కొచ్చింది పాప. అతని కేసి చూస్తూ అంది కళ్ళనాడిస్తూ ''నా పేరు గవురి.''

ఆ ఉచ్చారణొక్కటే బాధించింది అతన్ని. అయినా అడిగేడు ఆసక్తిగా ''మీ అమ్మా నాన్న ఏరీ? ఎక్కడున్నారు?''

''నాకు తెల్దు.''

''మరెక్కడుంటున్నావు నువ్వు?''

''తాత కాడ.''

''ఎక్కడుంటాడూ తాత?''

''అడ...రయిలు గేటుకాడ.''

''అన్నం పెట్టేదెవరు నీకు?''

''తాతే! రొట్టి యిస్తాడు.'' పిల్ల తెలివైందే. చెపుతోంది జవాబులు చక్కగా.

''మరయితే ఈ గౌను చూడు...ఎలా చిరిగిందో! మంచి గౌనొకటి కొనివ్వమనరాదూ మీ తాతయ్యని?'' అడిగేడు కృష్ణమూర్తి ఆ పిల్ల గౌనుని పట్టి చూపుతూ.

''అమ్మయ్యోయ్! తాత కొడతడు...''భయం వ్యాపించింది ఆ పిల్ల మొహంలో. మాసిన తన గౌనుకేసి చూసుకుంది దిగాలుగా.

''పోనీ ... నీకు మంచి గౌన్లూ, ఆడుకోడానికి బొమ్మలూ కొనిస్తాను. వొస్తావా నాతో. ఇంకా ఓ తమ్ముడూ, చెల్లాయీ వున్నారు మా ఇంట్లో.''

ఏమని అనుకుందో ఏమో మనసులో, ఆపిల్ల వొస్తానన్నట్టు తల వూపింది. అదే తడవుగ కృష్ణమూర్తి ఆదర్శాల శిఖరారోహణలో తను మొదటి మెట్టెక్కినట్టు సంబరపడ్డాడు.

ఊళ్లో దిగి ఆ పిల్లని వెంటబెట్టుకుని వెళ్లేడు ఇంటికి.

''ఎవర్నాయనా! ఈ పిల్ల?'' వాకిట్లోనే ఎదురై అడిగింది వాళ్ల అత్తయ్య అతన్ని.

''చిన్నప్పుడు నాతో కలిసి చదువుకున్న ఓ స్నేహితుని కూతురు. పాపం, చాలా పేదవాళ్లు. ట్రెయిన్‌లో కలిసేరు. మధ్య స్టేషన్‌లో టిఫిన్‌కోసం దిగేడు అతను. తీరా ట్రెయిన్ కదిలేలోగా అందుకోలేకపోయేడు. ఇక చేసేదిలేక తీసుకొచ్చేను నేనీ పిల్లని.'' బుకాయించేడు కృష్ణమూర్తి నిజం చెప్పి ఆవిణ్ణి ఒప్పించలేక.

అల్లుని కెదురుగా అంతకుమించి మరేంమాట్లాడలేని ఆవిడ కల్పించుకె లేదు, ఆ విషయంలో అంతకంటె ఎక్కువగా.

కృష్ణమూర్తి పనిమనిషిచేత ఆ పిల్లకి స్నానం చేయించి, అప్పటికప్పుడు బజారెళ్లి రెడీమేడ్ ఫ్రాకులు కొని తగిలించేడు. ఆ లోపున కాన్వెంట్‌నించి తిరిగొచ్చిన అయిదేళ్ల కూతురు రూపకి గౌరిని చూపి

''ఇదిగోమ్మా! రూపా! మీకో కొత్త ఫ్రెండ్ వొచ్చింది.. కూడా ఆడుకోడానికి'' అంటూ ఆ ఇద్దరినీ జత కలిపేడు.

ఊయెల్లో నిద్దరోతోన్న రెండేళ్ల బాబుని గౌరికి చూపి

''మీ ఇద్దరికీ తమ్ముడు. బావున్నాడు కదూ బాబు!'' అంటూ మురిపించేడు.

ఊయెలపైన తిన్నగా గాలికి తిరుగుతూ మ్రోగుతోన్న మ్యూజికల్ బెల్స్‌ని చూసి ''అయ్యోయ్! బాగుందది గంట'' అని ఎగిరి గంతేసిన గౌరిని

''తప్పమ్మా! అల్లా అనకూడదు'' అంటూ వారించి, ఆ మాటే రూపచేత పలికించి అనుకరింపజేసేడు.

''ఇక మీరాడుకోండి'' అని వాళ్లిద్దర్నీ మేడమీద వొదిలి, జాగ్రత్తగా చూసుకొమ్మని పనిమనిషిని హెచ్చరించేడు. తను స్నానం చేసి, బట్టలు మార్చుకుని అత్తయ్యతో చెప్పి వెళ్లేడు హాస్పిటల్‌కి.

అక్కడ తను లోపలికి ఎంటర్ కావడం చూసి వార్డుల వెంట చెకింగ్‌కి వెళ్లబోతున్నదల్లా ఆగి

''ఆలస్యం చేసేరే'' అంటూ సమీపించిన అనుపమని

''నీతో ఓ మాట అనుపమా! ఇటు రా, మాట్లాడుకుందాం'' అని తన కన్సల్టింగ్ రూంలోకి తీసికెళ్లేడు.

ఎదురుగా కుర్చీలో కూచుని, స్టెత్‌ని తీసి బల్లమీద వుంచుతూ 'ఆఁ ... ఇక చెప్పండి'' అన్నట్టు చిలిపిగా చూసిన అనుపమతో చెప్పేడు గౌరిని గురించి, తను ఆ పిల్లని తమ ఇంటికి తీసుకురావడం గురించి.

ఆఖరున ''నీతో చెప్పకనే నే చేసిన మొట్టమొదటి పని ఇదీ అనుపమా! ఏమంటావ్?'' అని అభ్యర్థనగా చూసేడు ఆమె కళ్లలోకి.

అనుపమ నవ్వుతూ అంగీకరించింది అతని అభ్యర్థనని. దానితో ఆదర్శం ప్రతిపాదనని ఆచరణ ఆమోదించినట్టయింది. ఫలితంగా ఓ పిచ్చిమొక్క పూలకుండీని చేరుకుంది.

అయితే కృష్ణమూర్తి ఆశయం అంతటితో నెరవేరలేదు.

ఒక ఆశయం సఫలం కావడానికి ఎన్నివిధాల సహకారం వుండాలో అనుభవ పూర్వకంగా తెలిసివొచ్చింది కృష్ణమూర్తికి.

అలా గౌరి తమ ఇంటిని చేరుకున్న ఓ నెలన్నరకి —

బాబుకి మూడోఏడు వొచ్చింది.

ఆ రోజున పుట్టినరోజు పండుగ జరుపుకుంటూ బంధుమిత్రుల్ని ఆహ్వానించేరు కృష్ణమూర్తి దంపతులు. అందరూ ఏవేవో ప్రెజెంటేషన్స్ ఇచ్చేరు.

అల్లుడూ కూతుళ్ళ ఫోటోలని లోపలవుంచి చేయించిన లాకెట్‌ని బాబు మెళ్ళో వేసింది వాళ్ళ అమ్మమ్మ.

''అబ్బో! గొప్ప బహుమానమే ఇచ్చేరు మీరు మనవడికి'' అంటూ అందరూ పొగిడేరు ఆమెని.

బంధుమిత్రుల కులాసా కబుర్లతో, కాలక్షేపాలతో కొత్తగా పెట్టిన హాస్పిటల్ పరామర్శలతో సందడిగా వుంది ఇల్లు.

ఆ సాయంత్రం ఇంటిముందటి లాన్‌లో గౌరితో, ఇంకా కొంతమంది ఇరుగుపొరుగు పిల్లలతో కలిసి బాబుని తెచ్చుకుని ఆడుకుంటోంది రూప. బాబుని మధ్యలో ఓచోట వొదిలి ఆటపాటలతో, కేరింతలతో, గిల్లికజ్జాలతో కాసేపు వెళ్లబుచ్చి బాబునెత్తుకుని వెళ్లింది లోపలికి.

వాణ్ని చేతుల్లోకి తీసుకుంటూ

''బాబు మెళ్లో లాకెట్ నీవుగాని తీసివుంచేవా అనుపమా?'' అని కూతుర్ని అడిగింది వాని అమ్మమ్మ.

''లేదమ్మా! నేనెందుకు తీస్తానూ ?'' అని పైనించి పలికింది అనుపమ.

అలా ''నువ్వు తీసేవా ?'' అంటే ''నువ్వు తీసేవా ?'' అంటూ అందరూ అడగసాగేరు అందరినీ. చివరగా వెదుక్కున్నారు గౌరిని ''అవును ఇంతకీ గౌరేదీ ?'' అని.

''అయ్యా బాబోయ్! ఆ పాపిష్టిపిల్లే చేసిందర్రా ఇంత పనీ. అబ్బాయేదో నాతో అప్పటికప్పుడు అల్లా బుకాయించి చెప్పినా ఆ వొచ్చిననాటినుంచీ అనుమానమే నాకు దానిమీద. పోనీలే అను కున్నాగాని ముష్టిముండ! చివరికింతకు తెగిస్తుందనుకోలేదు మొర్రో'' అని నెత్తీ నోరూ మొత్తుకుంది మెత్తగా.

అన్నట్టే గౌరీ కనిపించలేదు వాళ్లకి ఆ రోజుట్నుంచి.

లాకెట్ పోవడాన్నీ, గౌరి కనిపించకపోవడాన్నీ ఒకటిగా చేర్చి ఆ అనుమానాన్నే బలపరుచుకున్నారందరూ.

''నువ్వూ నమ్ముతున్నావా అనుపమా! ఈ విషయాన్ని?'' అని తను అడిగితే అందుకు బదులేం చెప్పక ఆమెకూడా మౌనంగా వుండిపోతే ఇక ఆ ముద్దాయికి మద్దతు నిచ్చినవాడిలా తల వొంచక తప్పలేదు కృష్ణమూర్తికి.

కాని ఆ లాకెట్‌ని పక్కింటి ప్లీడర్‌గారి అబ్బాయే తీసేడనీ, తీసి వాళ్లమ్మ చేతికిచ్చేడనీ, అది గుట్టుచప్పుడు కాకుండా వాళ్లమ్మ గారి వూరికి దాటిపోయిందనీ, తల్లి కడుపులోంచి బయటపడ్డ దగ్గర్నుంచీ తనకే మాత్రం పరిచయంలేని ఈ అప్పర్‌క్లాస్ సొసైటీతో ఎడ్జెస్ట్ కాలేకే దానికి భయపడి గౌరి దూరంగా పారిపోయిందనీ నిజం తెలిసిరాలేదు ఎవ్వరికీ.

అప్పుడనగా అలా నలుగురూ అంటగట్టిన దొంగతనాన్ని మోసుకెళ్లిన గౌరిని ఇన్నేళ్లకి తర్వాత ఇప్పుడు ఇలా నలుగురు మనుషులు స్పృహని కోల్పోయిన స్థితిలో మోసుకు రాగలరని ఏనాడూ వూహించలేదు కృష్ణమూర్తి. ఎక్కడెక్కడ తిరిగిందో, ఎలా ఎలా పెరిగిందో అంత పచ్చిప్రాయంలో విడిగీ విడగని వయసున చీకటి కౌగిట్లో, ఏ పశుత్వం గుప్పిట్లో నలిగిందో, ఫలితంగా తన కడుపున ఏ మాంసపు ముద్దని ప్రాణంపోసి పెంచిందో ఈనాడు తనలో పెరిగిన ఆ ప్రాణికోసం తన ప్రాణం విలవిల్లాడుతోండగా కళ్లు విప్పి తననీ, లోకాన్నీ చూడలేని స్థితిలో వొచ్చింది తన దగ్గరికి.

''అడుక్కునేది బాబయ్యా! పాపం పిచ్చిది. నీళ్లోసుకున్న కాణ్ణించి మాకాడే వుంది. పసిపిల్ల. కాన్పుకష్టమైతే తీసుకొచ్చేం. మీరే దిక్కు. తల్లినీ, పిల్లనీ ఏరుసేసి పున్నెం కట్టుకోండి.'' వెళ్లకిలా తిరగేసిన మంచంమీద గౌరిని తన ముందుంచి పల్లె మనుషులు మొరెట్టుకుంటే ఆశ్చర్యంతోపాటు అంతటి దుఃఖాన్నీ తనలో తానే దాచుకున్నాడు కృష్ణమూర్తి.

వెంటనే ఆపరేషన్‌కి అన్ని ఏర్పాట్లూ చేయించి, అనుపమని పిల్చి

''చూసేవా అనుపమా! ఇదీ విధి అంటే — ఏవో అదృశ్య శక్తుల నిర్ణయం కాదు — మన జీవితంలోనే పూర్వాపరాల జరిగే సంఘటనల సారూప్యం, ఛాన్స్! తనమీద నీకు సదభిప్రాయం లేకున్నా చివరికి నీ దగ్గరికే చేరింది గౌరి, ప్రాణభిక్ష కోసం. కొన్ని రోజులే అయినా నీ చేతి అన్నం తిన్న ప్రాణి. ఎలా చేస్తావో'' అంటూ ఆమెకి అప్పగించేడు కేస్‌ని.

''మీ భార్యనే నండీ నేను! ఆ మాత్రం నమ్మకం వుంచండి వాలు నా మీద'' అన్నట్టు భర్తవేపు క్షణం చూసి చేతులకి గ్లవుజెస్ తొడుక్కుంటూ ఆపరేషన్ థియేటర్‌లోకి యోగినిలా నడిచివెళ్లింది అనుపమ.

* * *

కాసేపటికి పురిటికేక వినిపించింది లోపల్నుంచి.

సంభ్రమంతో, సంతోషంతో లేచి గది వెలుపటికి నడుస్తోన్న కృష్ణమూర్తికి ఎదురైంది నర్స్.

''మగపిల్లాడు'' అంతే అంది.

ఆపైన వినిపించుకోక ఆ వూపున్నే వెళ్లేడు కృష్ణమూర్తి లోపలికి. టేబుల్‌పైని చూసేడు.

ఒళ్లంతా నెత్తురు మరకలతో ముద్ద గట్టుకుపోయిన పసి గుడ్డుపక్కన వూర్తిగా తెల్లబట్ట ముసుగుకప్పిన ఆకారం. అది శవం!

చిన్నబుచ్చుకున్న మొహంతో తనకి చేరువగా వొచ్చి అంది అనుపమ అతనితో సంజాయిషీ ఇస్తోన్నట్టు ''నా సాయశక్తులా ప్రయత్నించేనండీ! దురదృష్టవంతురాల్ని ... గౌరిని దక్కించుకో లేకపోయేను.'' వృత్తిధర్మంతో అంతసేపూ మాటుమణిగి వుండి పోయిన బేలతనం ఒక్కమారుగా ఆవరించింది అనుపమని.

''బాధపడకున్లే అనుపమా! ఇంత సీరియస్ అయిన కేస్ లోనూ ఈ ఒక్క ప్రాణాన్నయినా నిలపగలిగేవు, నీ సామర్ధ్యంతో నేగా!'' ఓదార్చేడు కృష్ణమూర్తి భార్యని.

''లోకం తెలియని ఈ నిసుగందుని అనాధని చెయ్యడం ఎందుకండీ! మనమే పెంచుకుందాం. మనకిక ఇద్దరుకాదు — ముగ్గురు పిల్లలు.'' అనుపమ వేడికోలుగా అంది అతని భుజంమీద వాలి.

ఆప్యాయంగా ఆమె చేతిని అందుకుంటూ అన్నాడు కృష్ణమూర్తి ''నాలో నేననుకున్నది నువ్వు మాటల్లో పలుకుతావు అనుపమా! నేనెంత అదృష్టవంతుణ్ని!''

''కాదు ... ఆ అదృష్టవంతుణ్ని నేను'' అన్నట్టు వేళ్ళని బిగించి, మొగ్గల్లా ముడుచుకున్న అరచేతుల్ని చాచి కెవ్వున అరిచేడు వాడు — ఆ అభాగ్యపు శిశువు — అప్పుడే విరిసిన గడ్డిపువ్వు!''

శ్రీ కె. జనార్ధన్

కళాశాల అధ్యాపకుల సాంఘిక, ఆర్థిక పూర్వ రంగము - ఒక పరిశీలన

I

సామాజిక పరిస్థితులకు మానవుని నడవడికి మధ్య అవినాభావ సంబంధమున్నది. తన చుట్టూ ఉన్న ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, మతైక పరిస్థితులు మానవుణ్ని ఎన్నో విధాల ప్రభావితం చేస్తాయి. ఈ విధంగా సామాజిక పరిస్థితులకు లోనైన వ్యక్తులు కొన్ని నిర్దిష్టములైన విలువలు, అభిరుచులు, అభిప్రాయాలు కల్గి ఉంటారు. దీనినిబట్టి ఒక వ్యక్తి యొక్క ఆలోచనా సరళి అతని పూర్వ రంగపు జీవిత విధానాన్ని బట్టి ఉంటుందని చెప్పవచ్చు. కనుకనే ఈనాడు వ్యక్తి యొక్క పూర్వ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇవ్వబడుచున్నది.

సామాజిక ప్రభావం వ్యక్తిపై బాల్యదశ నుంచే పడుతుంది. వ్యక్తి ప్రవర్తన, అతని విలువలు — అతడు పుట్టిన ప్రదేశము, కులము, మతము, విద్య, హోదా మున్నగు వాటినిబట్టి ఉంటుంది. విభిన్న జాతులుగల సమాజాలలో విభిన్నములైన సామాజిక పరిస్థితులు ప్రేరేపించుటచేత ఆ సమాజాలలో విభిన్నవిలువలు, సంస్కృతులు, అభిరుచులు, ఆలోచనా పద్ధతులుకూడా వేర్వేరుగాఉంటాయి. ఈ విధమైన విభిన్న జాతీయత గల ఏ సమాజమైన తన నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకోజాలదు; గమ్యాన్ని చేరుకోదు. ఎందుకంటే, 'సామాజిక ప్రగతి' ఆ సమాజంలో నివసించే వ్యక్తులపైన, ఆ వ్యక్తులు నిర్వహించే పాత్రపైన ఆధారపడుతుంది. అలాగే ఆవ్యక్తి ఆ సమాజంపై ఏర్పరచుకొన్న దృక్పథాన్నిబట్టి అతడు నిర్వహించే పాత్ర ఉంటుంది.

ప్రతి వ్యక్తి కొన్ని విలువలు కల్గి ఉంటాడు. ఆ విలువలే ఆ వ్యక్తి నడవడిని తీర్చి దిద్దుతాయి. విధాన నిర్ణయాలలో ఆ విలువలే అత్యధిక ప్రాధాన్యత వహిస్తాయని హెర్‌బర్ట్ ఏ. సైమన్ నొక్కి చెప్పాడు. అయితే విభిన్న ప్రమాణాలుగల సమాజంలో వ్యక్తుల విలువలు విభిన్నములుగా ఉంటాయి. ఎఫ్. డబ్ల్యూ.రిగ్స్ అనే పాలనా శాస్త్రవేత్త ఈవిషయాన్నే ప్రస్తావిస్తూ 'మానవుని ప్రవర్తనా — అతని విభిన్న ప్రమాణాలుగల సమాజంలో సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఉంటాయే తప్ప అతీతంగా ఉండవు. ఈ సామాజిక పరిస్థితులు, పరిసరాలు మానవుని ఎన్నో విధాల ప్రభావితం చేస్తా''యని అభిప్రాయపడ్డాడు. ఒక ఉన్నత స్థాయి నుంచి వచ్చిన వ్యక్తి ఆలోచనకి ఒక మధ్యతరగతి నుంచి వచ్చినవ్యక్తి ఆలోచనకి ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. అలాగే ఒక కులానికిగాని మతానికిగాని చెందిన వ్యక్తి విలువలు భిన్నంగా ఉంటాయి. ఈ విలువల భిన్నత్వం అతని ప్రవర్తనా, ఆలోచనా సరళిలో కూడా గోచరిస్తుంది. దీనినిబట్టి వ్యక్తియొక్క పూర్వ రంగానికి సంబంధించిన ఆర్థిక, సాంఘిక పరిస్థితులు అతని భవిష్యత్ జీవనాన్ని ఎన్నో విధాల ప్రభావితం చేస్తాయని చెప్పటలో అతిశయోక్తికి అవకాశమే లేదు.

విభిన్న జాతీయతకు నిలయమైన భారతదేశము వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆ విలువలలో వైవిధ్యం కనిపిస్తుంది. ఒక సమాజమును క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలంటే, ముందు ఆ సమాజంలో నివసిస్తున్న ప్రజల విలువలను, వారి పూర్వ రంగపు ఆర్థిక, సాంఘిక మొ॥లగు పరిస్థితులను తెలుసుకోవలె. కనుక పూర్వరంగ పరిస్థితులను నునిశితంగా పరిశీలించవలసి ఉంటుంది. సామాజిక అవగాహనకు పూర్వరంగ పరిశీలన అత్యంత దోహదకారి.

ఈ సమాజంలో వ్యవసాయ, అధ్యాపక, వైద్యా మొ॥లగు వృత్తుల వారున్నారు. ఒకరు వ్యవసాయదారుడు కావడానికి, మరొకరు వైద్యుడు కావడానికి, ఇంకొకరు అధ్యాపక వృత్తిని చేపట్టుటకు ఆయా వ్యక్తుల పూర్వరంగం ప్రభావమేగాని మరొకటి కాదు. ఈ విధంగా వ్యక్తుల పూర్వరంగ పరిశీలన సంపూర్ణంగా సమాజాన్ని అర్థం చేసుకొనుటకు తోడ్పడుతుంది.

ఈ పరిశీలనా వ్యాసంలో అధ్యాపక వృత్తి చేపట్టిన వ్యక్తుల పూర్వరంగమును పరిశీలించనైనది. అయితే ఇది వరంగల్ పట్టణంలోని 20 కళాశాలలకు చెందిన 500 అధ్యాపకులకు సంబంధించిన వయసు, సర్వీసు, కుల, మత, విద్య, పుట్టిన ప్రదేశము మొ॥గు వివరాలు సేకరించనైనది. వీటితోపాటు అధ్యాపకుల యొక్క తండ్రుల వివరాలు కూడా సేకరించబడినవి. ఈ వివరాలన్ని ఒక నిర్ణీత ప్రశ్నావళి ద్వారా సేకరించబడినవి. ఈ విషయ సేకరణలో కొన్ని సమస్యలను కూడా ఎదుర్కొనబడినవి. ఈ సమస్యలలో అతి ప్రధానమైనవి— (1) కొందరు తమ వ్యక్తిగత వివరాలు ఇచ్చుటకు నిరాకరించుట, (2) ఈ ప్రశ్నావళిలో పొందుపరచిన ప్రశ్నలకు సమాధాన మివ్వడానికి తగిన వ్యవధి వారికి లేకపోవుట. అయినప్ప

టికి చాలామంది ఈ కృషికి సహకరించుట వలననే విషయసేకరణ సాధ్యమైనది.

దిగువ పట్టికలలో ఇంటర్వ్యూతో పాటు ప్రశ్నావళి ద్వారా సేకరించిన అధ్యాపకుల వివరాలన్నీ పొందుపరచడం జరిగింది.

II

పట్టిక 1

అధ్యాపకుల హోదా వివరాలు

క్ర. సంఖ్య	హోదా	సంఖ్య	శాతము
1	ప్రిన్సిపాల్సు	9	1.8
2	ప్రొఫెసర్లు	29	5.8
3	రీడర్లు	12	2.4
4	లెక్చరర్లు	425	85.0
5	వైద్య అధ్యాపకులు	5	1.0
6	డిమాన్‌స్ట్రేటర్లు	20	4.0
	మొత్తము	500	100

ఇంటర్వ్యూ చేయబడిన అధ్యాపకులలో 85% లెక్చరర్లు. వైద్య కళాశాల అధ్యాపకులు చాలా తక్కువ శాతములో ఉన్నారు [1%]. రెండవ స్థానాన్ని ప్రొఫెసర్లు [5.8%] వహిస్తున్నారు. ఆ తర్వాతి స్థానాన్ని డిమాన్‌స్ట్రేటర్లు ఆక్రమిస్తున్నారు. అధ్యాపక వర్గంలో లక్చరర్లు అధిక సంఖ్యలో ఉండటాన్ని బట్టి వారి పాత్ర విద్యా బోధనలో గణనీయంగా ఉంటుందని చెప్పవచ్చు.

20 కళాశాలలలోని ప్రిన్సిపాల్సు 9 మంది నుంచే వివరాలు సేకరించుటకు వీలుచిక్కింది. వైద్య కళాశాలలో పనిచేసే డిమాను స్ట్రేటర్లు కూడా అధ్యాపక వృత్తికి సంబంధించిన వారగుటచే వారి వివరాలు కూడా సేకరించబడినవి.

పట్టిక 2

అధ్యాపకుల వయసు వివరాలు

క్ర. సంఖ్య	వయసు	సంఖ్య	శాతము
1	21–35 సం॥లు	201	40.2
2	36–50 సం॥లు	190	38.0
3	51 పైన సం॥లు	54	10.8
4	జవాబు ఇవ్వనివారు	55	11.0
	మొత్తము	500	100

అధ్యాపక వృత్తిని స్వీకరించిన వారిలో చాలామంది యువకు లని ఈ పరిశీలనవల్ల స్పష్టమగుచున్నది. అధ్యాపకుల సరాసరి వయసు సంవత్సరాలు అంటే నడివయస్కులు, వృద్ధుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది.

పై పట్టికలో 40.2% యువకులు (21 నుంచి 35 సం॥ముల మధ్య), 38% నడివయస్కులు (36 నుండి 50 సం॥ముల మధ్య), కేవలం 10 8% మాత్రమే 51 సంవత్సరాలు దాటిన వారు ఉన్నారు. 11% వరకు అధ్యాపకులు తమ వయసు వివరాలు ఇచ్చుటకు నిరాకరించినారు

పట్టిక 3

అధ్యాపకుల కుల వివరాలు

క్ర. సంఖ్య	కులము	సంఖ్య	శాతము
1	అగ్రకులాలు	184	36 8
2	వెనుకబడిన కులాలు	263	52.6
3	షెడ్యూల్డు కులాలు	2	0.4
4	ముస్లీములు	12	2.4
5	క్రైస్తవులు	9	1.8
6	జవాబు ఇవ్వనివారు	30	6.0
	మొత్తము	500	100

అధ్యాపక వృత్తిలో అత్యధిక శాతము (52 6) వెనుకబడిన కులాలకు చెందిన వారున్నట్లు పై పట్టికద్వారా స్పష్టమగుచున్నది. ఇది గమనించదగిన విషయమని చెప్పవచ్చు అనేక విషయాలలో అగ్రకులాలవారే అధిక సంఖ్యలో ఉంటారన్న సామాజిక దృక్పథానికి ఇది భిన్నంగా ఉంది. ఆ తర్వాత స్థానాన్ని అగ్రకులాలే ఆక్రమిస్తున్నాయి. వీరి శాతము 36.8 ఉంది. వీరిలో అధికులు రెడ్డి, వెలమ, బ్రాహ్మణ, కమ్మకులాలకు చెందినవారే. వెనకబడిన కులాలకు చెందిన వారు ఈ వృత్తిలో సంఖ్యావిషయంగా ఎక్కువే. కాని సమాజంలో వారి శాతమును బట్టి చూస్తే ఇది చాలా స్వల్పమే. ప్రభుత్వం ప్రకటించిన వెనుకబడిన కులాల జాబితాలో ఎన్నో కులాల వారు పొందుపరుచుటచేతను—ఆ కులాలన్నింటిని ఈ వ్యాసంలో 'వెనుకబడిన కులాలు' అన్న వర్గముగా చేర్చుటవలన ఈ వృత్తిలో వెనుకబడిన వర్గాలవారే అధికంగా ఉన్నారన్న భావం కల్గుచున్నది. మైనారిటీ వర్గానికి చెందిన ముస్లీంలు 2.4, క్రైస్తవులు 1.8% మాత్రమే ఉన్నారు. ఇక షెడ్యూల్డు కులాలకు చెందినవారు దాదాపు లేరనియే చెప్పవచ్చు. ఇంటర్వ్యూ చేయబడిన 500 మందిలో కేవలం ఇద్దరే ఉన్నారు. వారిద్దరూ షెడ్యూల్డు జాతికి చెందిన

వారగుట గమనించదగిన మరో ముఖ్యాంశం. 6% అధ్యాపకులు తమ కులాల వివరాలు వెల్లడించుటకు నిరాకరించారు.

పట్టిక 4

అధ్యాపకుల మత సంబంధ వివరాలు

క్ర. సంఖ్య	మతము	సంఖ్య	శాతము
1	హిందువులు	432	86.4
2	ముస్లిములు	12	2.4
3	క్రైస్తవులు	9	1.8
4	జవాబు ఇవ్వనివారు	47	9.4
	మొత్తము	500	100

పై పట్టికను బట్టిచూస్తే అధ్యాపకులలో అత్యధికశాతము (86.4) హిందువులేనని తెలుస్తున్నది. ముస్లిములు కేవలం 2.4% మాత్రమే ఉన్నను వారు రెండవ స్థానాన్ని పొందుచున్నారు. క్రైస్తవులు 18% ఉన్నారు. ముస్లిములు, క్రైస్తవులు శాతమును కలిపినను 5 శాతము కూడా లేకపోవుట గమనార్హం. తమ మతాన్ని తెలుపుటకు 9%కు పైగా అధ్యాపకులు నిరాకరించారు ఈ విషయమై మతమును ఎందుకు వివరించడం లేదని ప్రశ్నించగా, వారు "లౌకిక రాజ్యవ్యవస్థలో మత ప్రసక్తి లేనచ్చా?" అని ఎదురుప్రశ్న వేశారు. తమ కులాన్ని చెప్పుటలో నిరాకరించిన వారి శాతముకంటే. తమ మతాన్ని వివరించనివారి శాతమే ఎక్కువ అగుట మనం గుర్తించుకోవలసిన విషయం.

పట్టిక 5

అధ్యాపకుల నివాసము

క్ర. సంఖ్య	నివాసము	సంఖ్య	శాతము
1	పుట్టుకమంచే పట్టణము	162	32.4
2	15 సం॥ల వరకు గ్రామము	338	67.6
	మొత్తము	500	100

అధ్యాపకుల్లో 32.4% పట్టణాలలోనే పుట్టి పెరిగిన వారు కాగా, 67.6% గ్రామీణ ప్రాంతాలకు చెందినవారై ఉన్నారు. దీనినిబట్టి అధ్యాపక వృత్తిలో నున్నవారు గ్రామీణ ప్రాంత జనాభాతో పోలిస్తే ఇది తక్కువనే చెప్పాలి. దాదాపు 75% ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్న ఈనాడు 67.6 శాతము వరకే గ్రామీణులుండుట గమనించదగిందే. అంతేకాదు వీరంతా తర్వాత నగరీకరణ (Urbanization) చెందుతున్నారు.

పట్టిక 6

అధ్యాపకుల సర్వీసు వివరాలు

క్ర. సంఖ్య	సర్వీసు	సంఖ్య	శాతము
1	1–3	98	19.6
2	3-5	132	26.4
3	6–10	163	32.6
4	11-15	94	18.8
5	16-20ఆపైన	13	2.6
	మొత్తము	500	100

పై పట్టికవల్ల గత దశాబ్దంలో ఈ వృత్తిలో చేరిన వారి సంఖ్య 75%ను మించి ఉందని తెలుస్తున్నది. 20 సం॥లు ఆపైన సర్వీసు గలవారి శాతము కేవలం 2.6 మాత్రమే అంటే అనుభవం ఎక్కువ గడించినవారి సంఖ్య చాలా తక్కువ. అదేవిధంగా ఈ మధ్య కాలంలో అనగా గత మూడు సం॥రాల కాలంలో ఈ వృత్తిలోకి వచ్చినవారి సంఖ్య దాదాపు 20 శాతము ఉండుట గమనార్హం. అధ్యాపకుల సరాసరి సర్వీసు కాలము సంవత్సరములు.

పట్టిక 7

అధ్యాపకుల రాజకీయ చొరువ

క్ర. సంఖ్య	రాజకీయ చొరువ	సంఖ్య	శాతము
1	రాజకీయ ప్రవేశం ఉన్నవారు	26	5.2
2	రాజకీయ ప్రవేశం లేనివారు	322	64 4
3	జవాబు ఇవ్వనివారు	152	30.4
	మొత్తము	500	100

రాజకీయ ప్రవేశం ఉన్నదాయన్న ప్రశ్నకు కేవలం 26 మంది మాత్రమే రాజకీయ ప్రవేశం ఉన్నదని తెలుపగా 64.4% అధ్యాపకులు

తమకు ఆ విధమైన ప్రవేశం లేదని స్పష్టం చేశారు. ఆధునిక కాలములో అన్ని రంగాలలో రాజకీయాలు ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఏదో ఒక రూపంలో ప్రతి వ్యక్తిని ప్రభావితం చేయటంలో నిజం లేకపోలేదు. అటువంటప్పుడు అధ్యాపకులు పాల్గొనకుండా ఉంటారా? అన్నది గమనించదగిన అంశం. ఏది ఏమైనను అధ్యాపకులకు రాజకీయ ప్రవేశం ఉందని బహిర్గతంగా ప్రకటించడంలో కొన్ని ఆంక్షలు ఉండుటయే ప్రధాన కారణమై ఉంటుంది ఎందుకంటే అధ్యాపకుల్లో 30%కు పైగా తమకు రాజకీయ ప్రవేశం ఉందని కాని లేదా రాజకీయ ప్రవేశం లేదని కాని స్పష్టంగా తెలుపకపోవడానికి ఈ ఆంక్షలే ప్రబల కారణాలని భావించుటకు అవకాశం ఉంది. తక్కినవారు ధైర్యం చెప్పగల్గినారు.

ఇంతవరకు అధ్యాపకులకు సంబంధించిన వివరాలు తెలుపబడినవి. ఈ దిగువ పట్టికలలో అధ్యాపకుల తండ్రులకు సంబంధించిన వివరాలు పేర్కొనడం జరిగింది.

పట్టిక 8

అధ్యాపకుల తండ్రులయొక్క వృత్తి వివరాలు

క్ర. సంఖ్య	తండ్రియొక్క వృత్తి	సంఖ్య	శాతము
1	ప్రభుత్వ ఉద్యోగులు	130	26.0
2	వ్యాపారము	73	14.6
3	అధ్యాపక వృత్తి	72	14.4
4	డాక్టర్లు	21	4.2
5	న్యాయవాద వృత్తి	11	2.2
6	వ్యవసాయము	160	32.0
7	పారిశ్రామికులు	2	0.4
8	వ్యవసాయ కూలీలు	3	0 6
9	ఏ వృత్తి లేనివారు	28	5.6
	మొత్తము	500	100

అధ్యాపకుల తండ్రియొక్క వృత్తి వివరాలు తెలిపే పై పట్టికద్వారా చాలామంది వ్యవసాయ వృత్తికి చెందినవారు 32% అని తెలుస్తున్నది. రెండవస్థానాన్ని ప్రభుత్వ ఉద్యోగులు పొందుచున్నారు. అధ్యాపక వృత్తిగా కలవారు చాలా తక్కువ శాతము (14.4) కల్గి ఉండగా, వ్యాపారులు 14·6 శాతము ఉండి మూడవ స్థానాన్ని ఆక్రమిస్తున్నారు. దీనినిబట్టి తండ్రుల వృత్తులు వారి సంతానముపై ఏ విధమైన ప్రభావం చూపలేదని స్పష్టమగుచున్నది.

ఇక్కడ వ్యవసాయవృత్తి అంటే ఏదో 5 లేక 6 ఎకరాలకు పరిమితమైన భూమి కల్గినట్లు భావించరాదు. ప్రభుత్వ భూపరిమితి చట్టంలో నిర్దేశించిన గరిష్టస్థాయి భూమిని కల్గి ఉన్న భూస్వాముల సంఖ్యే ఎక్కువని గమనించవలె. ఇంటర్వ్యూ చేసిన 500 మంది అధ్యాపకుల తండ్రులలో కేవలం ఇద్దరు పారిశ్రామికులు, ముగ్గురు వ్యవసాయ కూలీలు కాగ ఏ వృత్తి లేనివారు (వృత్తిని తెలుపకపోవడం అప్పటికే తండ్రి మరణించి ఉండటం లేదా పదవీ విరమణ చేసి ఉండటం వంటివారు కూడా ఈ కోవలోకి వస్తారు) 10 మంది మాత్రమే. వెనుకబడిన వర్గాలకు సంబంధించిన ఈ వృత్తులవారు మొత్తం కలిపినా 7%నకు మించరు. దేశ జనాభాతో ముఖ్యంగా బలహీనవర్గాల జనాభాతో పోలిస్తే ఇది బహు స్వల్పమని చెప్పక తప్పదు.

పట్టిక 9

అధ్యాపకుల తండ్రుల ఆదాయ వివరాలు

క్ర. సంఖ్య	ఆదాయము	సంఖ్య	శాతము
1	సం॥నకు రు. 500లలోపు	53	10.6
2	" 501–1,500	279	55.8
3	" 1,501–3,000 ఆపైన	176	25.2
4	ఆదాయం తెలియదు	42	8.4
	మొత్తము	500	100

తండ్రుల ఆదాయ వివరాలు తెలిపే పై పట్టికద్వారా అధ్యాపకుల తండ్రులలో 55.8% సంవత్సరమునకు 501 రూ॥లు నుంచి 1500 రూ॥ల వరకు ఆదాయం పొందేవారి సంఖ్యే అధికంగ ఉంది. 1501 నుంచి 3000 ఆదాయం పొందేవారు 25.2% ఉండి రెండవ స్థానాన్ని పొందినారు. ఈ వివరాలనుబట్టి చూడగా అల్ప ఆదాయము పొందేవారి శాతం (10.6%) బహు

స్వల్పం. అనగా అల్పాదాయ వర్గంనుంచి అధిక సంఖ్యాకులు అధ్యాపక వృత్తిని చేపట్టక పోవడానికి ఈ అల్పాదాయమే ఒక అడ్డంకుగా చెప్పవచ్చు. ఎక్కువగా ఒక కళాశాల అధ్యాపకుడిగా పనిచేయాలంటే పోస్టుగ్రాడ్యుయేషను చేయాలి. ఈ ఉన్నత విద్యను అభ్యసింపజేయుట ఈ అల్పాదాయవర్గ ప్రజలకు సాధ్యమయ్యే పనికాదు. కొందరు అధ్యాపకులు తమ తండ్రుల ఆదాయ వివరాలు తెలుపుటకు నిరాకరించారు.

పట్టిక 10

అధ్యాపకుల తండ్రుల విద్యార్హతలు

క్ర. సంఖ్య	విద్యార్హతలు	సంఖ్య	శాతము
1	నిరక్షరాస్యులు	133	26.6
2	మెట్రిక్‌లోపు	48	9.6
3	మెట్రిక్	83	16 6
4	ఇంటర్మీడియట్	13	2.6
5	పట్టభద్రులు	180	36 0
6	పోస్టుగ్రాడ్యుయేట్లు	32	6 4
7	ఇతరులు	11	2.2
	మొత్తము	500	100.0

అధ్యాపకుల తండ్రుల విద్యార్హతలు పరిశీలించగా మనకు అత్యధికులు పట్టభద్రులని తెలుస్తున్నది. వీరితో పోస్టుగ్రాడ్యుయేట్లను కల్పినచో 40 శాతముకు పైగా అవుతారు. దీనినిబట్టి తండ్రిగారి విద్యార్హతలు కొడుకుని విద్యావంతుని చేయుటకు తోడ్పడిన దనుటలో సందేహమే లేదు. నిరక్షరాస్యులైన తండ్రుల శాతము రెండవ స్థానాన్ని పొందుచున్నది. అయితే ఈ నిరక్షరాస్యులు ఇదివరకటి పట్టికలో పేర్కొనబడిన వ్యవసాయ వృత్తికి సంబంధించిన వారిని గమనించవలసిఉంది. ఈ పట్టికలో ఇతరులు అన్న కాలమ్‌లో పేర్కొనబడినవారు పూర్వపు సాంప్రదాయకమైన విద్యలు అభ్యసించినవారు. అనగా ఏవో మౌఖికమైన శ్లోకాలు, పద్యాలు కంఠస్థం చేయటం లేదా ఏదో పూజాసంబంధ విషయాలు నేర్చి ఉండటం వంటివారు పరిగణలోకి తీసుకోవడం జరిగింది. మెట్రిక్ లోపువారి శాతము 9.6, మెట్రిక్ చదివిన వారి శాతము 16.6 కాగా, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారి శాతము 2.6 అని పై పట్టిక ద్వారా తెలియుచున్నది.

III

ప్రస్తుత పరిశీలనవల్ల అధ్యాపక వృత్తి యొక్క కొన్ని లక్షణాలు తీరుతెన్నులు మనకు తెలుస్తున్నవి. అధ్యాపక వృత్తిలో పని చేస్తున్నవారు చాలా మంది య వకులే. పైగా వీరంతా 21–35 సం॥ల మధ్య వయస్కులు ఈ వృత్తిలో అగ్రవర్ణాల కంటే వెనుకబడిన వర్గాలవారే అధిక సంఖ్యలో ఉన్నట్లు కన్పిస్తుంది కాని సమాజంలోని అగ్రకులాలు, వెనుకబడిన కులాల జనాభా నిష్పత్తులను బట్టి చూస్తే ఇది ఏమంత ఎక్కువ కాదని చెప్పవచ్చు. ఇందులో అధిక సంఖ్యాకులు గ్రామ ప్రాంతాలకు చెందినవారు అయితే ఈ సంఖ్యను కూడా పట్టణ, గ్రామీణ జనాభా నిష్పత్తులతో పోలిస్తే ఇది ఉండవలసినంత లేదనియే చెప్పవచ్చు. ఈ పరిశీలనలో తేలిన మరో ముఖ్యాంశం హిందూమతానికి చెందిన అధ్యాపకుల శాతం అత్యంత గరిష్ట స్థాయిలో ఉంది. మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లీం, క్రైస్తవులను ఈ అధ్యాపక వృత్తి ఆకర్షించకపోయినదని సుస్పష్టం. అంతేకాదు. రాజ్యాంగ రీత్యా షెడ్యూల్డ్ జాతులు, తెగల వారికి సముచితమైన శాతం మేరకు కొన్ని ఉద్యోగాలను రిజర్వ్ చేసినప్పటికిని వారి సంఖ్య ఈ వృత్తి వారిలో దాదాపు లేదనియే చెప్పాలి. దానికి కారణం వారి ఆర్థిక దుస్థితి మరియు సామాజిక వెనుకబాటుతనము.

విద్యాలయాలన్నీ చాలా వరకు పట్టణ ప్రాంతాలలోనే కేంద్రీకరించబడుటచేత పట్టణవాసులకు ఇతోధిక విద్యా సదుపాయాలు అందటం మూలానా వారు ఉన్నత విద్య నభ్యసించి ఉన్నత పదవులను పొందుచున్నారు. దీనికితోడు వారి తండ్రులు వ్యాపారులు కావడమో లేదా ప్రభుత్వ ఉద్యోగులో కావడం మూలానా వారు ఆర్థికంగా స్థిరత్వం పొంది వారి సంతానం వృత్తి సంబంధ ఉద్యోగాలు పొందుటలో సహకరిస్తున్నారు. ఈ పరిశీలనలో నిరక్షరాస్యులైన తండ్రులు కూడా లేకపోలేదు. అయితే వీరిలో 90శాతముకు పైగా పెద్దభూస్వాములేనని మరచిపోరాదు. గత దశాబ్దంలో అధ్యాపక వృత్తి స్వీకరించిన వారి సంఖ్య ఎక్కువగుట గమనార్హము. రాజకీయ ప్రవేశం ఉన్నదా? లేదా? యన్న ప్రశ్నకు ఉన్నదీ లేనిదీ స్పష్టపరచకుండా నిరాకరించడాన్ని బట్టి అధ్యాపకులకు తమ అభిప్రాయాన్ని సైతం స్వేచ్ఛగా బహిర్గతపరిచే స్థితిలో నుండుట - స్వతంత్ర భారత పౌరులుగా మనం విచారించదగినదేనని చెప్పటకు వీలున్నది.

ఈ పరిశీలన ఆధారంగా మరికొన్ని విషయాలు వెల్లడైనవి. తండ్రుల ఆదాయం, విద్యార్హతలు చాలా వరకు ఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పడినవి. దేశ జనాభాలో పారిశ్రామికులు, వ్యవసాయకూలీల సంఖ్య ఎక్కువ. దేశ జనాభాతో వీరి జనాభా శాతాన్ని పోలిస్తే, ఎంత మేరకు ఉండాలో అంతమేరకు లేకపోవుటయేగాక కేవలం

కార్మికులు ఇద్దరు, వ్యవసాయ కూలీలు ఇద్దరు మాత్రమే తమ సంతతిని అధ్యాపక వృత్తిని పొందేలా చేయుటలో కృతకృత్యులైరి. దీనికి ప్రధాన కారణం వారి ఆర్థిక పరిస్థితులు చాలా దుర్భరంగా ఉండుటయేగాని మరొకటి కాదని చెప్పవచ్చు. ఆర్థిక వెనుకబాటు తనం వ్యక్తిని ఎటు ప్రభావితంచేస్తుందో దీనినిబట్టి తెలుస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగం, వ్యాపారం, వైద్య వృత్తి, న్యాయవాద వృత్తి వంటివి సామాజికంగా గౌరవప్రధానమైనవి. అంతేకాదు ఆర్థికంగా కూడా ఎంతో లాభదాయకమైనవి. ఈ వృత్తులను లేదా పదవులను చేపట్టినవారే పట్టణ ప్రాంతాలకు చెందిన వారగుటచేత వారి పిల్లలకు మరికొన్ని సౌకర్యాలు, అవకాశాలు ఏర్పడి ఉన్నత విద్య అభ్యసించడంలోనూ, ఉన్నత పదవులను పొందడంలోను ఎన్నోవిధాల తోడ్పడుచున్నవి.

అధ్యాపకుల తండ్రుల ఆదాయ వివరాల పరిశీలనలో సం॥ రానికి 501 నుంచి 1500 రూపాయల ఆదాయం గడించేవారే ఎక్కువలయితే ఈ ఆదాయ వర్గములో 1,000–1500మధ్య వారి శాతమే ఎక్కువ. సంవత్సరానికి 1500 నుంచి 3000 ఆపైన ఆదాయం గడించే వారి సంఖ్య 25% కన్న మించి ఉన్నందున వారి తండ్రులు నిరక్షరాస్యులైనను తమ సంతతి వారికి ఉన్నత విద్యాభ్యాసానికి పట్టణాలకు పంపడం, ఎంతో ద్రవ్యాన్ని వెచ్చించడం జరుగుచున్నది. అంటే గ్రామాలలో ఉన్నప్పటికి ఆర్థికంగా వెనుకబడిన వారగుటచేత పట్టణాలకు పంపడం జరిగి అక్కడే చదివి అక్కడే ఏదో వృత్తి చేపట్టడం జరుగుచున్నది. కళాశాలలన్ని పట్టణ ప్రాంతాలలో కేంద్రీకృతమైనందున – కళాశాలల అధ్యాపక వృత్తిలో అగ్రకులాలు, వెనుకబడిన కులాల వారే అధిక సంఖ్యలో ఉండుట మనం గమనించదగిన ముఖ్యాంశం. అయితే వెనుకబడిన కులాలకు చెందిన వారైనప్పటికిని వారు 1500–3,000 మరియు 3,000లకు పైగా సాంవత్సరిక ఆదాయం గడిస్తున్న వారే. దీనినిబట్టి తండ్రుల ఆర్థిక సుస్థితి గూడా ముఖ్య పాత్ర వహిస్తున్నదని స్పష్టమగుచున్నది వ్యవసాయ రంగమునకు చెందిన తండ్రుల శాతము 32 మాత్రమే కాని అధ్యాపకులు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన శాతము 67 6 తో పోల్చినపుడు భేదము రెట్టింపుకు పైగా ఉంది. దీనినిబట్టి వ్యవసాయేతరుల సంఖ్య అధికమని తెలుస్తున్నది. అనగా వ్యవసాయ రంగం నుంచి వచ్చేవారి % చాలా తక్కువ.

ఈ పరిశీలన ద్వారా ఒక వ్యక్తి ఒక ఉన్నత వృత్తిని చేపట్టుటకు అతని పూర్వరంగపు పాత్ర గణనీయమైనదని స్పష్టమగు చున్నది. సామాజిక, ఆర్థికపరిస్థితులు, పరిసరాలు వ్యక్తిపై ప్రభావాన్ని చూపి తదనుగుణంగా అతని జీవిత విధానాన్ని మార్చగల్గుతాయి. కేవలం వ్యక్తియొక్క విలువలేకాదు. అతని కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితి, మతము, కులము, వయసు, విద్య వంటి ఇతర అంశాలెన్నో అతని జీవితాన్ని తీర్చిదిద్దుతాయి.

స్మృతి

శ్రీ కె. మల్లికార్జునరావు

సెలయేటి ఎడద అడుగున
  దాగిన కడలి మ్రోతలో
వెలికివచ్చి పలికే విరహగీతి;
ముత్యపు చిప్పలు స్వాతిలో
విప్పిన వాన చినుకుల కోసం
ఎదురుచూచి సాగించే సంభ్రమగీతి;
ఈ లలిత గీతికా తతులన్నీ కలసి
నామది వినిపించే
అమృతగానంలో కరగిపోయినపుడు
నా ఆశను ఆ నిశిలో నీ ముందుంచాను
కాని నాకు శిశిరమే మిగిల్చావు
సెలయేరు అలసి ఎండిపోయింది
ముత్యపు చిప్ప మూసుకుపోయింది
ఆ గీతులు మాత్రం
స్మృతులలో నిలచిపోయాయి
అవే
శిథిలమైన నా మది శిలను
నిరూపంగల శిల్పంగా రూపొందించాయి.

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

జానపద నాటక స్వరూపాలు

ఆది నుండి మానవుడు ఆనందాభిలాషి. అభిలాష అన్వేషణకు దారి తీస్తుంది. అన్వేషణా స్థితిని స్థాయినిబట్టి ఫలితము దక్కుతుంది. ఆనందము సంతలో సరుకుగాదు కొనడానికి. ప్రకృతిలో యథేచ్ఛగా లభ్యపడే వస్తువు కాదు అది మనో జనితమయినది.

ఆదిమానవుడు దిగంబరంగా అడవుల వెంబడి తిరిగాడు. ఆకులలములో గడ్డి దినుసులో తిని పొట్ట నింపుకొన్నాడు. అయితే కాలక్రమేణ అతడు ఆకులలముల్ని చెట్టు బెరడుల్ని మొలకు చుట్టుకొన్నాడు. అంటే—మానాభిమానాలపట్ల అతని దృష్టి మళ్ళిందన్న మాట ! ఉచ్చి పచ్చిగా పెరుక్క తింటుండిన గడ్డల్ని కాల్చి తినడానికి లేదా ఉడకబెట్టి తినడానికి అలవాటు పడ్డాడు. అంటే — ఆతని నాలుక రుచిని కోరిందన్నమాట !

దృష్టి మానాభిమానాల పట్ల మొగ్గుచూపడం ... నాలుక రుచిని కోరడంతో ఆతని మనస్సు ఆనందం కోసం అఱ్ఱులు చాచి ఉంటుంది. అక్కడే ఆతని అన్వేషణ ఆరంభమయి ఉంటుంది !

అన్వేషించడానికి ఏమున్నది ? ఎవరున్నారు? ఆతనిచుట్టు అతని లాంటి మనుష్యులే ఉన్నారు. ఆతని ఎదుట అనంతమయిన ప్రకృతి రూపంలో విశాల ప్రపంచం ఉంది.

పదిమంది ఒకచోట గుమిగూడినపుడు అందరి మనోప్రవృత్తి ఒకేరీతిగా ఉండడానికి వీలులేదు. హావభావాలు ఏకీభవించడానికి అసలే ఆస్కారం ఉండదు. అది సృష్టి చిత్రం. కాగా ఆ పదిమందిలో విభిన్నమయిన హావభావాలుగల మనిషి తన చుట్టూ ఉన్న వాళ్ళని ఆకర్షించిఉంటాడు. వింత మనోప్రవృత్తిగల మనిషి మాట తీరు వేరుగా ఉండి యితరుల్ని అలరించి ఉంటుంది. ఈ ప్రత్యేకతను గమనించిన మిగతవాళ్ళు దీనిని అనుకరించడానికి యత్నించి ఉంటాడు, ఆ అనుకరణలో ఆనందాస్వాదన అనుభవించి ఉంటాడు ఆదిమానవుడు.

తనలో తిరుగుతూ తనతో నివసిస్తూ ఉన్న మనిషి మాట తీరులో హావభావాల్లో ఆనందానుభూతిని వెదుక్కొన్న మానవుడు తనచుట్టూ ఉన్న ప్రకృతిని కూడా పరిశీలించి ఉంటాడు. ఆ పరిశీలనతో ప్రభావితుడై ఉంటాడు. ఉరుములు ఉరిమి, మెరపులు మెరసినపుడు ఆతడు ఆనందంతో ఎగిరిగంతులు వేసి ఉంటాడు. ఇంద్రధనుస్సులో యిమిడివున్న కాంతిదర్శనంతో ఆతడు కేరింతలు కొట్టి ఉంటాడు. నెమళ్ళ నృత్యాల్ని కోయిల పాటల్ని ఆతడు అనుభవించి ఉంటాడు. ఆనందంతో ఎగిరి గంతులు వేయడం ఆట అయితే ఆనందానుభూతితో కేరింతలు కొట్టడం పాటగా పరిణమించి ఉంటుంది. మనిషిలో నాగరకత అభివృద్ధి చెందేకొద్దీ ఈ ఆటపాటల్లో ఊహించలేనంత మార్పు చోటు చేసుకొనింది.

ఆకులలములు వదలిపెట్టి మొలకు బట్టచుట్టుకొనే స్థితికి మనిషి ఎదిగేటప్పటికి, ఆతని భావానికి భాష అబ్బేటప్పటికి ఆతనికి తోడూ గూడూ కూడా ఆవశ్యకమై ఉంటాయి. తోడూ గూడూ సమకూరేటప్పటికి సంఘజీవనం సమకూడి ఉంటుంది.

అలా రూపొందించిన సాంఘిక జీవనములో నాటి మనుష్యులు నగరవాసులని జనపదులని రెండు తెగలయ్యారు. నిరక్షర కుక్షులుగా శ్రామిక జీవనంతో గ్రామాల్లో నివసించేవాళ్ళు జానపదులయితే వాళ్ళకంటే భావములో భాషలో వేషంలో ఒక్కమెట్టు పైనున్న వాళ్ళు నగరవాసు లయ్యారు. జానపదులయినా, నగరవాసులయినా మనుష్యులు మనుష్యులే ! — మనిషికి మానసికమయిన ఆనందము ఆవశ్యకము. దీనిని సాధించుకోవడానికి అంతో యింతో విద్యావంతులు నాగరీకులయిన నగరవాసులు ఒక పద్ధతిని అవలంబిస్తే నిరక్షర కుక్షులయిన జానపదులు మరొక దారి పట్టారు. దారులువేరయినా యిరుపక్షాలకు లక్ష్యం మాత్రం ఒక్కటే !

అసలు ఏదేశ సహజ సంస్కృతిని కానీ ఆచార వ్యవహారాలను కానీ ప్రతిబింబించ గలిగినవీ లేదా చాటి చెప్పగలిగినవి జానపదకళలే! దేశీయత దీనికి కారణం. అయినా అదేమి దురదృష్టమో కానీ ఎంత శోధించినా తరగని ఎంతచెప్పినా తనివితీరని నిగూఢ నిక్షిప్త సాహిత్యసంపద మనకున్నప్పటికీ తెలుగుజాతి మాత్రం తనకుతానుగా ప్రభావితం కాలేకపోయింది. బహుశా అది ఆంధ్రుల అలవాటు కావచ్చు. లేకుంటే — బెంగాల్ దేశ జానపద సారస్వత విశిష్టతను **Modern Review** ద్వారా రామానంద ఛటర్జీ తెలియ చెప్పేవరకు ఆంధ్రులు తమ జానపదాన్ని గురించి ఆలోచించలేకపోయారు. అయితే మన జానపద కళలు ఏనాటివి ? పాల్కురికి సోమనాథుడే తన పండితారాధ్య చరిత్రలో విపులంగా ప్రస్తావించాడంటే — అవి అంతకు మునుపు ఎంతకాలంగానో బ్రదికి బట్టకట్టి ఉండాలి. ఈ విషయం తెలుగువాళ్ళకు తెలియకపోలేదు. అయినా మరొక్క దేశ జానపద విశిష్టత విన్నపుడే మనవాళ్ళు మేల్కొన్నారు. లేచాడంటే ఊరకుండే మనిషిగాదు తెలుగువాడు. లేడికి లేచిందే పరుగన్నట్లు వీరవిహారం చేస్తాడు. చింతా దీక్షితులు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, టేకుమళ్ళ కామేశ్వరరావు ప్రభృతులు మనదేశ జానపద సాహిత్యమువైపు దృష్టి సారించారు. ఇటీవలి కాలంలో బిరుదు

రామరాజు, నాయని కృష్ణకుమారి వంటి వారలు పరిశోధనా గ్రంథాలనే వెలువరించి డాక్టరేట్లు సంపాదించుకొన్నారు.

ఇక నాటకం సంగతి ఆలోచిద్దామంటే అదీ అంతే! సంస్కృతములో నాటక రచన కొనసాగింది ఆ నాటకాల ప్రదర్శనలు జరిగినట్లు కూడా ప్రబంధ కవులు తమ కావ్యాల్లో పేర్కొన్నారు. అయితే ప్రబంధ కవుల దృష్టిమాత్రం నాటక రచనపైపు మొగ్గలేదు. అధవా ప్రయత్నించినా సంస్కృతనాటకాలను చంపూ పద్ధతిలో తెనిగించారే కానీ స్వతంత్ర నాటక రచనకు పూనుకోలేదు. 'నాటకాంతం హి సాహిత్యమ్' అని భావించారేమో ?

బెంగాల్ జానపదంతో మన జానపదం వెలుగు చూచినట్లే ధార్వాడ కంపెనీవాళ్ళు మన దేశంలో నాటక ప్రదర్శన లిచ్చే వరకు తెలుగుజాతి మేలుకొనలేదు. ఆ కంపెనీవాళ్ళ నాటక ప్రదర్శనలతో ప్రభావితులయిన తెలుగువాళ్ళు నాటక రచనకు పూనుకొన్నారు. అటువంటి వారిలో ఆద్యుడు కోరాడ రామచంద్రశాస్త్రి. మంజరీ మధుకరీయం అన్న స్వతంత్ర రూపకాన్ని ఆయన రచించారు. ఆ తరువాత కొక్కొండ వేంకటరత్నం పంతులుగారు భాసుని నరకాసుర విజయ వ్యాయోగాన్ని తెనిగించారు. పరవస్తు వేంకట రంగాచార్యులు కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆంధ్రీకరించారు. వావిలాల వాసుదేవ శాస్త్రిగారు షేక్స్పియర్ జూలియస్ సీజరు నాటకాన్ని అనువదించారు. అయితే యివి ప్రదర్శనావకాశాన్ని పొందలేదు.

అటు తర్వాత ధర్మవరం కృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, కందుకూరి వీరేశలింగంపంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహపంతులు, వేదం వేంకటరాయశాస్త్రివంటి మహానుభావుల స్వతంత్ర నాటక రచనకు పూనుకొన్నారు. వీళ్ళందరు ఆంగ్ల భాషా ప్రభావితులు కాబట్టి తమ నాటకాల్లో రంగ విభజన అంక విభజన చొప్పించి నాటకాలకు ప్రదర్శన యోగ్యతను కల్పించారు.

మన ప్రబంధ సాహిత్యంపై పూర్తిగా సంస్కృత ప్రభావం ముద్ర పడితే మన నాటకాలపై సంస్కృతాంగ్ల భాషల ప్రభావం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. అయితే మనది మనదిగా తరగని పెన్నిధిగా స్వయం ప్రకాశమానమయింది మన జానపద కళలే !

ఇక మన సాహితీ గమనాన్ని పరిశీలిస్తే పద్యం నుండి గద్యానికి — గద్యం నుండి గేయానికి — గేయం నుండి వచన కవితకు దిగజారిందో, ఎగబ్రాకిందో నిర్ణయించవలసినది మేధావులయినా కావచ్చు; లేదా — కాలమే కావచ్చు. అయితే ఈ కుప్పిగంతుల్లోపడి అసలు సిసలయిన మనజాతి సంస్కృతీ సంస్కారాలకు ప్రతిబింబమయిన జానపదాన్ని మాత్రం వెనక్కు నెట్టేశాము. మహాసాగర సమానమయిన జానపదాన్ని ఉత్తుత్తి మాటలతో ఉద్ధరించడానికి ఉద్ధరిణి చేతపట్టుకొన్నాము.

అదే విధంగా ఆంగ్ల భాషా ప్రభావంతోనో లేదా ఇతర భాషా పరిచయంతోనో మన నాటక కళ ఎంతో ఎదిగి — ఎగిరి తెరమీదికి కూర్చున్నదని మనం మురిసిపోతున్నా—మన 'దేశి' కళలను మాత్రం మనం పూర్తిగా మరచిపోయామనే చెప్పాలి లేదంటే — ఎప్పుడో ఒకప్పుడు ఏదో యిలాంటి సమయమో? సందర్భమో? తటస్థిస్తే అప్పుడు మాత్రం మాట్లాడాలికాబట్టి చచ్చినవాడి కండ్లు చారడేసి అన్న తీరులో ఆ కళల్ని గురించి మాట్లాడుకోవడమే. అంతలో మరచిపోవడము మనకు సహజమైపోయింది.

అయితే ఏమిటీ జానపదుల విశిష్టత ?

సాహితీపరంగా ఎంతో సమున్నత స్థాయికి ఎదిగినామను కొంటున్న ఈరోజుల్లో భావసంక్లిష్టత అయోమయస్థితి అన్వయ పద్ధతి అడుగడుగునా అడ్డుపడుతున్నవన్న భిప్రాయం అందరినీ కాకపోయినా కొందరిని కలవరపెడుతున్నది. అయితే ఆనాటి మనిషి ఈలాంటి అభిప్రాయాలకు చోటివ్వలేదు. చెప్పదలచుకొన్నదేదో సూటిగా సూక్ష్మంగా ఎదకు హత్తుకొనేలాగా పలకడంలో పరిణతిని సాధించాడు. కడకు కర్తృత్వంతో తన కృషి మైలపడుతుందేమో అని కలవరపడ్డాడు. తన పేరు ప్రతిష్ఠల ప్రసక్తి లేకుండా కేవలం సమాజశ్రేయమే ధ్యేయంగా తాను చెప్పదలచుకొన్నది చెప్పాడు ''చందమామ రావే! జాబిల్లిరావే! కొండెక్కి పోవే! కోటివేలు తేవే!'' — ఏ మహాతల్లి పసికూనను చంకనిడుకొని గోరు ముద్దలు తినిపిస్తూ పండువెన్నెల్లో పరవశించి పాడిందో ? — తెలియదు కానీ — ఈనాటికీ ప్రతియింట ప్రతితల్లి నోటా ఈ పాట వినిపిస్తూనే ఉంది.

అదేవిధంగా అది భక్తితత్త్వమయినా, ముక్తితత్త్వమయినా, హితబోధ అయినా కడకు శృంగారహేల అయినా — ఆ జానపదులు తమదయిన ఒక వరవడిని అలవరచుకొన్నారు

భక్తి నుద్బోధించడానికి తలపెట్టాడు ఒక మహానుభావుడు. ఆయన అంటాడు -- రామనామమే లడ్డుంట ! — అది తినేవారికే తీపుంట !!'' — అని. రాముడున్నాడో? లేడో? ఆ రామనామజపం మంచిని పెంచుతుందో? త్రుంచుతుందో ? — అది వేరే విషయం. కానీ తాను నమ్మిన సిద్ధాంతాన్ని పదిమందికీ తెలియచెప్పడానికి ఆతడు త్రొక్కిన మార్గం మాత్రం గమనార్హం! పామరుని ప్రభావితుణ్ణి చేయడానికి ప్రయత్నించినా యింతకంటే సులువైన మార్గం కనుపించదేమో ?

పరలోకం ఉన్నదో? లేదో? మనకు తెలియదు. ఆ పరలోకంలోని పరమాత్ముని సంగతీ అంతే! నాటి మనిషి కానీ నేటి మనిషి కానీ నైతిక విలువల పరిరక్షణే సమాజ శ్రేయస్సుకు మూల కారణమని నమ్మినాడు. నమ్మికనాటి మనిషి ఊరకే ఉండలేదు. శక్తి వంచనలేని ప్రయత్నం చేశాడు. అందుకే అంటాడు —

మాయ చీకటి కోనలో—కొన్నాళ్ళు మార్గంబు కానరాక
ఏ ఉపాయము గానక—కొన్నాళ్ళు జన్మమెత్తితి రామ రామ॥
నిక్కమని సంసారము మది నమ్మి నీ స్మరణ చేయలేక
అక్కటా యమునికిపుడు—పిట్టవలె చిక్కితిని రామ రామ॥

వేద వేదాంత మూర్తులయినా, సర్వసంగ పరిత్యాగులయిన ముని ముముక్షువులయినా ఏదో మరేదో సాధించాలన్న తపనతో ఆలోచించి

ఆలోచించి ఎంతో ఎత్తుకు ఎదిగినామని భ్రమించి తుదకు తిరిగి చూడవలసిందీ చూచి ఆలోచించవలసిందీ ఈ మాయ చీకటి కోననే! ఈ పరమ సత్యాన్ని ఎంత సూటిగా గుండెకు తగిలేలా పలుకగలిగిన మహామనీషి ఎవ్వడో కానీ — ఎంతో దూరం ఈ త్రోవలో పయనించి తలలు పండిన మహనీయులు నిలబడి తిరిగిచూచిన చోటు నుండి తన తత్త్వాన్ని ఆరంభించాడు. అదే ఆతనిలోని విశిష్టత. ఇక సాహితీపరంగా ఆలోచిస్తే యింత సరళంగా యింత చక్కగా సామాన్యునికి అర్థమయ్యే తీరులో ఆతనికి అందుబాటులో ఉండే పదజాలంతో పరమ సత్యాన్ని నిర్వచించడం అంత తేలికయిన పనిగాదు. ఈనాటి సాహితీవేత్తలు ఈ తీరులో ఆలోచిస్తే ఆ జానపదుని చేతిలో పిట్టవలె చిక్కవలసిందే!

రావణుడు సీతను అపహరించాడు. సీతను తెచ్చుకోవడానికి వానరసేనతో రాముడు బయలుదేరాడు. మొట్టమొదటగా ఈసేనావాహిని విభీషణుని కంటపడింది. ఆతడు అన్నకు హితబోధ చేస్తాడు

రావణా ! రావణా ! రామధూళి కావు గప్పె !
రామదండు కదలి వచ్చెరో రావణా !
వద్దు వద్దు రావణా! బుద్ధిగల్ల రావణా !
వారి సీత వారి కంపరో ! రావణా !

ఇలా సాగిన పాటను జానపదులు కోలాటంవేస్తూ పాడుకొంటారు !

ఇందులో సాహితీ విలువల్ని పరిశీలిస్తే —

రామదండు వస్తున్నది; పరుగులమీద వస్తున్నది. ఆ పరుగులతో దుమ్ములేచింది. ఆ ధూళిని "రామధూళి !" అంటున్నాడు అపారమయిన సేనావాహిని కదలికలో లేచిన దుమ్ము 'రామధూళి' కావడములో అంతరార్థమేమి ?— అదిపుల్లదుమ్మో ? నల్లదుమ్మో ? తెల్లదుమ్మో ? ఎందుకు కాకూడదు? — బహుశా రామునిహృదయంగత మయినబాధ, కోపము, ఆవేశము—ముప్పిరిగొని పైకితీస్తే అది విభీషణుడికి 'రామధూళి'గా దర్శనమిచ్చిందేమో ? అదిగూడ 'కావు' గప్పింది అంటున్నాడు. కావిరంగు అంటే ఎరుపు రంగు. కావుకప్పడమంటే—ఎరుపురూపు దాల్చడం. ఎరుపు రానున్న ఆపదకుసంకేతమని భావన కాబోలు !—ఇకపోతే రావణుని ఎన్నో విశేషణాలతో వర్ణించవచ్చు కానీ — అవన్నీ వదలిపెట్టి 'బుద్ధి'గల్ల రావణా ! అని అంటున్నాడు. నిజమేకదా ? శివసందర్శనార్థం పొట్టచీల్చి ప్రేవులతో వీణవాయించిన భక్తి తత్పరుడు . ప్రత్యర్థి అయిన రాముడే అడిగితే యుద్ధానికి లగ్నం నిర్ణయించిన సకల శాస్త్ర పారంగతుడు — అంతకుమించిన సహృదయుడు - బుద్ధిమంతుడు కాక మరేమవుతాడు ? హితబోధకోసం యింతటి ధ్వనిపూరక పదాల్నిపాడిన జానపదుడు పామరుడా? లేక భాషలో

భావంలో జుగుప్సను అశ్లీలాలను చొప్పించి అవినీతి నిర్మూలనకు అదే మార్గమని దిగంబరత్వానికి దిగిన మనమా పామరులము?

ఇలా ఎన్నో ఎన్నెన్నో ఉదాహరణలను జానపద సారస్వత విశిష్టతను చాటడానికి ఉటంకించవచ్చు!

ఇక జానపదనాటకమూ అంతే! — కేవలం వినోదంకోసమే కాకుండా నాటి జానపదులు విజ్ఞానార్థం నాటకములాడేవాళ్ళు ఆనాటకాలను జానపదులు కోడికూసేవరకు కూర్చుని మంచు కురుస్తున్నా చలి కొరుకుతున్నా శ్రద్ధగా చూచేవాళ్ళు. అంటే — అవి అంత అద్భుత ప్రదర్శనలా? లేక — ఆనాటి మనిషిలో సహృదయత సర్దుబాటు తత్త్వము ఆస్థాయిలో ఉండినవా? - లేక - అవివేకులయిన జానపదులముందు కాస్తో కూస్తో తెలివితేటలున్న వాళ్ళు ఆడింది ఆట! పాడింది పాటగా! పరిణమించిందా? ఆలోచించవలసిన విషయమే! —

అసలు ఈ జానపద నాటకాల పుట్టుపూర్వోత్తరాలేమిటి? వీటి అసలు స్వరూపమేమిటంటే — జానపద నాటకానికి మొట్ట మొదటి స్వరూపం గేయమే!

ఈ గేయ రూపకాలను ఎవరు ప్రదర్శించేవాళ్ళు? ఎక్కడ ప్రదర్శించేవాళ్ళు? — అంటే, శ్రీశైలం, అహోబిలం, తిరుపతి, సింహాచలంవంటి పుణ్యక్షేత్రాలలో తిరునాళ్ళు జరిగేవి ఆ తిరునాళ్ళు చూడడానికని జానపదులు వెళ్ళేవారు. ఆ సమయంలో ఆటవిక జాతివారు అక్కడ చేరేవాళ్ళు. ఆ ఆటవిక జాతివాళ్ళు దైవసంబంధమైన గేయరూపకాల్ని ప్రదర్శించేవాళ్ళు. శ్రీశైలములో అయితే భ్రమరాంబా మల్లిఖార్జున కళ్యాణమని, అహోబిలములో అయితే చెంచులక్ష్మిని నృసింహుడు వివాహమాడడాన్ని చెంచునాటకంగానూ, అదే తిరుపతిలో అయితే పద్మావతీ పరిణయమని గేయరూపకాల్ని ప్రదర్శించేవాళ్ళు. రానురాను ఈ జానపదులలో 'జక్కులు' అనబడే ఓ తెగవాళ్ళు ఈ పాటలతో ప్రభావితులయినారు ఆ బాణీలను అనుకరిస్తూ తమ సొంతంగా కొన్ని బాణీలుకట్టి దైవసాన్నిధ్యంనుండి ప్రజల ముందుకు ఈగేయ రూపకాలను తీసుకవెళ్ళారు. బహుశా అది పొట్టగడుపుకోవడానికి మార్గంగా ఉపకరించి ఉండవచ్చు. అయితే ఈ జక్కుల పాటలతో శిష్టులు ఆకర్షింపబడ్డారు. ఈ పాటలకు సాహితీ గంధాన్నిపులిమి యక్షగానాలన్నారు.

అయితే ఈయక్షగానాలకు ఎపుడు సాహితీసౌరభం అబ్బింది?

భీమేశ్వర పురాణంలో భీమఖండప్రాశస్త్యాన్ని వివరిస్తూ శ్రీనాథుడు- 'కీర్తింతురెద్దాని కీర్తిగంధర్వులు—గాంధర్వమున యక్షగానసరణి!' అని యక్షగానశైలికి ఒక ప్రత్యేకతను పేర్కొన్నాడు. అలాగే అన్నమయ్యకూడా యక్షగానాల్లోని పదాలను తన సంకీర్తన లక్షణంలో సూచించాడు. దీనినిబట్టిచూస్తే—వీరిరువురికి పూర్వమే యక్షగానాలకు సాహితీ గౌరవం లభించి ఉండినదన్నమాట!

విమర్శకుల అభిప్రాయం ప్రకారం ఈ యక్షగానాలకు పుట్టినిల్లు రాయలసీమ. శాసనాలు, గ్రామనామాల, కైఫీయతులు ఈ అభిప్రాయానికి మద్దతునిస్తున్నాయి.

గ్రామగ్రామానికి ఒకదేవాలయమో? లేకుంటే నడిబొడ్డులో ఓ రచ్చబండో ఉండేవి. ఆ దేవాలయం ముంగిటనో లేదు రచ్చబండ వద్దనో పందిరి వేసేవాళ్ళు. ఆ పందిరికింద సింగి సింగడు - దివిటీల వెలుగులో నాయికా నాయకులై కథను నడిపేవాళ్ళు. వేషాడంబరాలుండేవికావు. గేయంతోపాటు వివరణ — సభికుల్ని హుషారుపరచడానికి రవ్వంతహాస్యం — ఈగేయరూపకాల్లో మిళితమై ఉండేవి.

దైవసాన్నిధ్యంనుండి జక్కులద్వారా గ్రామాల్నిచేరి శిష్టుల మన్ననలలో సాహితీగౌరవాన్ని పుంజుకొన్న గేయం తరువాత తరువాత సంవాద పద్ధతికి, సంవాదపద్ధతినుండి 17వ శతాబ్దంలో వీధినాటకంతో అభేదం చెందడం జరిగింది.

ఈ యక్షగానం దక్షిణాదిన తంజావూరు నాయక రాజుల కాలంలో విజయ భువన సభామంటపంలో సంస్కృతనాటకంలో సమ ఉజ్జీగా గజ్జెకట్టి రంగస్థలిలో రంగభోగ వైభోగంతో రాణించింది. ఇదే యక్షగానానికి సువర్ణయుగం. విజయ రాఘవ నాయనింగారు ఈ యక్షగానాలను స్వయంగా రచించడమే కాకుండా — ఆడించిపాడించి అశేషగౌరవాన్ని ఆపాదించాడు.

ఈ జానపదరూపకమయిన యక్షగానం 17వ శతాబ్దిని వీధినాటకంలో అభేదమయినపుడే — యక్షగాన నాటకమని వ్యవహరింపబడింది. అయితే ఈ పరిణామాన్ని గమనించని కొందరు యక్షగాన నాటకాలువేరు! — వీధినాటకాలువేరు! - అని అభిప్రాయపడ్డారు అదిసరిగాదు. అంతేకాకుండా ప్రాచీనకాలంనుండి, ఈ యక్షగాన నాటకాలలో కలిసి బెత్తెడు అటోయిటో తోలు బొమ్మలాటలు, పగటివేషాలు, బహురూపాలువంటి జానపద కళలు వ్యాప్తిలో ఉండేవి. అందుకే 'అరువది ఆమడ వెళ్ళి ఆవుల పబ్బం చూడాలి! తొంబది ఆమడవెళ్ళి తోలుబొమ్మలాట చూడాలి!'— అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసుకొన్నారనాటి మనుష్యులు. అయితే దేని ప్రభావంతో యేది మరొక్క దానిని వెనక్కునెట్టి యింకొకటి ముందుకు వెళ్ళిందో నిర్ణయించడానికి తగిన ఆధారాలు లభ్యంకాలేదు.

ఈ యక్షగానానికి ఆదిరూపము గేయమయితే తుదిరూపం వీధినాటకం. యక్షగాన సరళిలోయిది కాలక్రమేణ జరిగిన పరిణామం. అయితే ఎప్పటినుండియో 'కూచిపూడినాట్యం' ఉన్నదికదా? కూచిపూడి భాగవతులు రాజాస్థానాల్లో భామాకలాపాన్ని ప్రదర్శించేవాళ్ళుకదా? — సాంఘిక దురాచారాలను ఈ భామా కలాపంలో అంతర్నాటకంగా ప్రదర్శించి రాజులదృష్టిని ఆకర్షించేవాళ్ళుగదా? 15వ శతాబ్దిలో వీరనరసింగరాయల ఆస్థానములో కూచిపూడి భాగవతులు - సిద్ధవటం సీమలో సామంతరాజు సమ్మెట గురవరాజు పన్నులు చెల్లించలేని కుటుంబాలలోని స్త్రీల స్తనములకు చిరుతలు వేసి బాధించు ఉదంతాన్ని ప్రదర్శించి సమ్మెట గురవరాజుకు శిక్షింప చేశారుగదా? కాబట్టి కూచిపూడి నాట్యంకూడా జానపద

కళగా పరిగణింపబడుతుందా ? అని ప్రశ్నిస్తే- కాదనే సమాధానం చెప్పవలసి వస్తుంది.

ఎందుకంటే — యక్షగానాలతో ప్రభావితులయిన కూచిపూడి భాగవతులు భరతనాట్య శాస్త్రలక్షణాలను సమన్వయపరచి సాహితీ గౌరవాన్ని సమకూర్చినందున కూచిపూడినాట్యం శాస్త్ర సమ్మతమైనది. శాస్త్రలక్షణం కలిగిన కళను జానపద కళగా భావించడానికి వీలులేదు.

ఈయక్షగాన నాటకం ఎన్నోరూపాంతరాలుచెంది తుది రూపంగా వీధినాటకంగా నిలబడినా — ఈ వీధినాటకం సంస్కృతంలోని దశరూపకాలలో ఒకటైన 'వీధి' మాత్రంకాదు. ఈ వీధి నాటకాన్ని జక్కులవారినుండి ఒక్కొక్కప్రాంతములో ఒక్కొక్క సంచారజాతి స్వీకరించింది. ఈ సంచారజాతుల్లో పడిన వీధి నాటకం పొట్టకూటి విద్యగా మారి ఈనాటికి కాటికి కాళ్ళుచాచి కూర్చుని ఉంది.

ఈవీధినాటకం దాదాపు రెండు మూడు శతాబ్దాలుగా జానపదుల్లో తనకుమించి లేదన్నట్లుగా రాజ్యమేలింది. అందుకే — కార్వేటినగరాధీశులైన వేంకట పెరుమాళ్ రాజా ఆస్థాన అష్ట దిగ్గజాలలో ఒక్కరయిన సారంగపాణి కవి అంటాడు —

అగ్గితిరణాల్నంట — అజ్జునీ కతలంట
ఔరా ! ఎంతెంతసోద్దేవో ? ఎన్నెన్ని యింతలో
బారత కతలంట !
సుగ్గీజయం దాని సుట్టుబలాదూర్ !—

కందుకూరి రుద్రకవి 'సుగ్రీవ విజయం' అనుయక్షగానాన్ని రచించాడు. అదిప్రదర్శనలకు కూడా నోచుకొన్నట్లుంది. అయితే వీధినాటకంగా ప్రదర్శింపబడుతున్న భారత కథల ముందు సుగ్రీవ విజయం బలాదూర్ ! - అని ఓ పామరుని అభిప్రాయాన్ని పలికాడు సారంగపాణి. అంటే ఏమిటీ భారత కథలు ? — ఆ ప్రదర్శన ఎలా ఉంటుంది ?

ముఖ్యంగా ఈ భారతోత్సవాలు చిత్తూరుజిల్లాలో మంచి వ్యాప్తిలో ఉండేవి. ఓ పదిపదిహేను గ్రామాల్నికలిపి 'పాయకట్టు' అంటారు. ఆపాయకట్టుకు తలకట్టుగా ఓ గ్రామం ఉంటుంది. ఆగ్రామంలో ఊరివెలుపల ఆరుబయట ఈభారతోత్సవాలకు నిర్ణీత స్థలం కేటాయించుకొంటారు. ఆగ్రామస్థుల సమష్టికృషితో, శ్రమదానంతో ధర్మరాజు దేవళం కడతారు. ఆ దేవాలయానికి ఎదురుగా కొన్ని వందలమంది కూర్చొనడానికి వసతిగల కొటాయి నిర్మిస్తారు. ఆ కొటాయిముందు కనీసం కొన్నివేలమంది కూర్చొన డానికి వీలుగా ఆరుబయలు — ఆ ఆరుబయట చివర కొటాయి ఎదురుగా ఓ మూడంకణాల పూరిల్లు. అది ఆటగాళ్ళయిల్లు. ఆ యింటిముందు సుమారు నూరుఅడుగుల వెడల్పు, అరవై అడుగుల పొడవుతో మూడడుగుల ఎత్తుమట్టిని పోసి దిమ్మెస చేస్తారు. అది రంగస్థలము. ఆ రంగస్థలానికి ఆపుగా అంత వైశాల్యంతో పందిరివేస్తారు. ఆటగాళ్ళయింటికి వేదికకుమధ్య రాతిబండలతో ఈ కడనుండి ఆ కడదాకా తిన్నెలు అమర్చుతారు. ఆ తిన్నెలకు లోబడి తెరదింపుతారు.

కొటాయిలో పగటిపూట 'పగటికథ' జరుగుతుంది. అంటే — ఓ పౌరాణికుడు దినమునకొక్క పర్వం వంతున పదునెనిమిది రోజులు పదునెనిమిది పర్వాలు కథగా ప్రవచనం చేస్తాడు. సాధరణంగా పల్లీయులు శ్రామిక జీవకులుకాబట్టి — పగటిపూట వాళ్ళకు కుదరదు. అందువలన ముసలీ ముతక లేదా బాగా వేసులు బాటున్న కుటుంబీకులు 'పగటికథ' వినడానికి వెళ్ళుతారు. వీళ్ళ సంఖ్య వందలకు మించదు అయితే 'పగటికథ'ను రాత్రి వీధి నాటకంగా ప్రదర్శిస్తారు. ఆ ప్రదర్శనకుమాత్రం చుట్టుప్రక్క గ్రామాలనుండి వేలసంఖ్యలో జనంవస్తారు.

సాధారణంగా మలిజాము ప్రారంభదశలో అరంభమయ్యే ఈ వీధినాటకం కడజాము కడదాక జరుగుతుంది. ఆ ఆరుబయట కాళ్ళుబారసాచి కూర్చుని ఆకు వక్కా నములుతూ ఆరుబయట ఈదురుగాలి గూబలదరగొడుతూంటే లెక్కలేకుండా ఆనాటకాన్ని చూస్తున్న గ్రామీణులను గమనిస్తుంటే - నిజంగా వాళ్ళ సహృదయతకు సర్దుబాటు తత్వానికి చేతులు జోడించవలెనని పిస్తుంది.

పాత్రౌచిత్యము, ఆహార్యము, ఆంగికము, వాచికములాంటి పదాలకు వాళ్ళకు అర్థము తెలియదు. తెలుసుకోవడానికి ఆరాటపడరు. చెబుతున్నదేమిటి? ఎందుకుచెబుతున్నారు ? ఎవరికిచెబుతున్నారు?— ఇదిగ్రహించడానికి నిగ్రహంతో కూర్చున్నవాళ్ళకు మిగతయేదీ అవసర మున్నట్లు కనిపించదు.

మాటిమాటికీ ఆరిపోతున్న పెట్రోమాక్స్‌లైట్‌తో పడలేక విసిగి వేసారిన మనిషి రంగస్థలంవిూదనే ఆ పెట్రోమాక్స్‌లైటును తన్నుతున్నా లెక్కచేయరు ధర్మరాజు వేషంవేసినమనిషి — నాటకం జరుగుతూఉంటే ప్రక్కకువెళ్ళి బీడీ ముట్టించినా పట్టించుకోడు.

ఆనాటి నాటకం కీచకవధ. రంగస్థలంపై వలలుని వేషంలో భీముడు ఉంటాడు. సైరంధ్రి వేషంలోఉన్న ద్రౌపది భీముని కలుసుకొంటుంది. సైరంధ్రిగా తానుపడుతున్న బాధల్ని భీమునికి వివరిస్తుంది. ఎలా ?

ఇటుచూడు భీమా ! — నాచేతులు
పరగ గంధముతీసి — పద్మాక్షికిబూసి.

సుదేష్ణాదేవికోసం గంధంతీసి తీసి తనచేతులు కాయలుగాచినట్లు చేతుల్ని చూడమంటుంది భీముణ్ణి. ఆమె పాడుతుంటే — వెనుక పాట ఉంటుంది. వెనుకపాటను తెరవెనుకనున్న పాత్రధారులందరు కలిసి పాడతారు. అయితే చిత్రమేమిటంటే వింటున్న భీముడు కూడా వెనుక పాటనందుకొంటాడు. ఆదృశ్యం చూస్తుంటే ఎంత నిబ్బరించుకొన్నా నవ్వుఆగదు. కానీ — సహృదయులయిన ఆ ప్రేక్షకులుమాత్రం 'అయ్యో ! పాపం ! ! — మహారాణి భోగాలన బవించాల్సిన ద్రౌపదిగతి కడ కీడికొచ్చిందా ?' అని ఆవేదనపడుతూ

'రాతను తప్పించుకొనే దానికెవురివల్ల అవుతుందిలే!' అని సమాధానపడుతారు వాళ్ళల్లో వాళ్ళే!

ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భములో మగవాడు ఆడవేషం వేస్తాడు. ఆ వేషాన్నిచూచి ద్రౌపది అని సరిపెట్టుకోవడం చాల కష్టం. ముక్కుకాస్త సొట్ట — కన్ను కాసంతమెల్ల, అయినా గాత్ర సౌలభ్యముం పేచాలు. ద్రౌపది వేషానికి అర్హత లభిస్తుంది. ఆవేషాన్ని చూస్తుంటేనే నవ్వువస్తుంది. కానీ దుశ్శాసనుడు ఆర్భాటాలుచేస్తూ — "రావెరావె! పోదాము సుయోధనరాజు బిల్వబనిచెన్! మాయన్న బిలువబనిచెన్!!" అనిపాడుతూ దుమ్ము లేచేటట్లుగా అటతాళానికి అనువుగా అడుగువేస్తూ ఆమెను బలాత్కరిస్తుంటే — 'పతియాజ్ఞలు లేకనె పరులు బిలిచిన పడతులు రాదగునా! — అన్నా! దుశ్శాసనా!!' అని ఆమె బ్రతిమాలుతూంటే ఆజానపదులు మైమరచి దుశ్శాసనుడిపై మెటికలు విరుస్తూ ద్రౌపదికి జరుగుతున్నఅన్యాయాన్ని తలపోసి ముక్కుచీదుతుంటే — ఆ ప్రదర్శనం మీాదకంటే ఆ ప్రేక్షకుల మీాదనే గౌరవ భావం యినుమడిస్తుంది.

ఇలా ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఎన్నిఉదహరించినా తలదిరిగి నోటివద్దకు వచ్చినట్లుగా నాటిసామాజికులలో సందేశాన్ని సంగ్రహించే తత్త్వమే కొట్టవచ్చినట్లుకనుపించేది కానీ — తప్పులెన్ను తత్త్వం కనుపించేదికాదు. వేషంలోకానీ భాషలోకానీ అభినయంలోకానీ గురికికాస్త అటో యిటోగా ఉన్నా ఆ లోపాన్ని తోసిపుచ్చి అందులో మంచిని గ్రహించే మనస్తత్త్వం ఆనాటి సామాజికులకు ఉన్నందువలననే — పండిత పామరులమధ్య దూరం ఈనాడు ఉన్నంతగా ఆనాడుండేదికాదు ఈ దృక్పథంతో ఆలోచించినపుడు నేటిమానవునికంటే నాటిమానవుడే రసాస్వాదనపరంగా ఒక్కమెట్టుపైన న్నాడేమో అనుపిస్తుంది.

మనలో మనది పుట్టి మనదిగాపెరిగి మనకండ్లముందరనే తరిగిపోతున్న జానపద నాటక కళను పరిరక్షణా దృక్పథంతోపాటు ఫలితదృష్టితో చూడవలసిన ఆవశ్యకత — కూచిపూడి నాటకకళను పునరుద్ధరిస్తున్నట్లే పునరుద్ధరించవలసిన అవసరము ఎంతయినా ఉన్నది.

చివరగా 'నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనమ్!' అన్న ఆలంకారికసూక్తి జానపద నాటక కళపట్ల అక్షరశః వర్తిస్తుందని గ్రహించడం మన జానపద కళలను మనం గౌరవించినట్లవుతుందని మనవి చేస్తున్నాను.

ఒక దృశ్యం

శ్రీ కె. రాంమోహన్ రాజు

శిథిల మహానగరపు మొండిగోడలనుండి
దుమ్మురేగినట్లూ
ముక్కలైన జీవితంనుండి అప్పుడప్పుడూ
దుఃఖం పొరలు రేగి సుడులు తిరుగుతూ
మస్తిష్కాన్ని నలిపేసి
ఈ బ్రతుక్కి అర్థం ఏమిటోననే ప్రశ్నకు
జవాబు దొరికినట్లూ — అంతలోనే
మాయమయిపోయి ఎదురుగా ప్రపంచపు
దుర్మార్గ స్వరూపం సాక్షాత్కరించి
ఎవడో, ఎక్కణ్ణించో వికటంగా నవ్వినట్టయి
లోపల నిద్రిస్తున్న జ్ఞానం మేల్కొని
శక్తి సామర్థ్యమూ నిటారుగా నిలబడి
చిక్కని చీకటి అవివేకాన్ని హేళనచేసి
వివేకం వెన్ను చరుచుకుని
ముందడుగువేసి చూసినప్పుడు దిగంత పర్యంతం
ఒక్క పెట్టున స్వేచ్ఛ వీచి
ఆనంద లోకపు ఇంద్ర ధనుస్సు కిందికి
ఆహ్వానించినట్లు
ఒళ్ళంతా పులకలు పరుచుకుని
ఆహ్లాదం తెమ్మెరలుగా వీచి
మానవుడా నువ్వు అజేయుడవని
ఒకే ఒక్క నినాదం జగమంతా వ్యాపించి
సంతోష తరంగం ఎగురుతున్న
జెండాల పైనుంచి మస్తిష్కంలోకి
ప్రయాణించి కోటగోడలూ, ఇనుప బురుజులూ
కూలిపోయి
ప్రపంచమంతా చైతన్య సముద్రంగా మారిపోయి
మానవుడు జగత్ప్రభువైనట్లు
ఒక్కటే దృశ్యం!

శ్రీ ఏ. సంపత్కుమారాచార్య

ఎడారిలో ఇసుక రేణువులు

"అయ్యగండి!! ... అదిగో . ఆ బొమ్మ తొక్కుతారు! ... కాస్త జాగ్రత్తగా నడవండి! ... ఆ చెట్టుకింద చూసేరా? వాడే రంగా బొమ్మ వేసింది. ఆ కుంటిది వాడి పెళ్ళాం. అవతల అరుగు మీద బీడీలు కాలుస్తున్నారు చూడండి! ... వాళ్ళే రంగడూ రహీమూ. ఆ ఘరానా బిచ్చగాళ్ళ మకాం కూడా ఈ సందులోనే. ఆ ప్రక్కన కూర్చున్నది గుడ్డితాత యెంకటేసు. ఆ పెద్ద భవంతి చూడండి! ... కంట్రాక్టరు దయానందంగారని చెప్తుంటానే... వారిదే ఆ భవనం. అవతల కళ్యాణ మంటపంలో శ్రీ శ్రీ శ్రీ అలౌకికానందస్వామి ఉపన్యాసాలు జరుగుతున్నాయి. దానవతల ఓ బియ్యం కొట్టు ఉంది అది దాటితే కానీ మా దేశికులుగాడి అద్దె కొంప రాదు! మీకు ఇప్పుడేమంత పనిలేకపోతే ఓసారి సందు చివరి దాకా నాతో రారాదూ ... ... ?

★ ★ ★

'ఎన్ని పైసలొచ్చినయ్యి?'

'రూపాయిరవై పైసలు. అన్నీ మూడు పైసలూ రెండు పైసలూనూ. ఇయ్యాల అయిదు పైసల నానేలు తక్కువొచ్చి నయ్యే మరియా!' అన్నాడు యిర్రేలు.

'ఆ పైసల్తో యియ్యాలకి నూకలట్టుకురా. బువ్వొండుకు తిందాం. ఆకలేత్తుంది.' అంది మరియ.

బీడీ వెలిగించి డబ్బులు లెక్కపెట్టుకుంటూ వెళ్ళాడు యిర్రేలు. తనని నమ్ముకున్న బిచ్చగాళ్ళకూ ఇంత తిండి పెట్ట గలుగుతున్నానన్న తృప్తితో రోడ్డుమీద బొమ్మలోని జీసస్ నిట్టూర్చాడు!!

★ ★ ★

'ఇయ్యాల యెంతరా మన ఆదాయం?' కాలరు సద్దు కుంటూ అడిగాడు రంగడు.

'పదహారుం బావలా' రహీం జవాబిచ్చాడు.

వాళ్ళు ఘరానా బిచ్చగాళ్ళు. న్యాయంగా, జాలిగా అడు క్కోడం వాళ్ళకసహ్యం. పైగా దానివల్ల ఆదాయం చాలినంత ఉండదు. మందు కొట్టడానికి డబ్బులు మిగలవు. రెండు కట్టె పుల్లలూ ... ఓ పాత చీరా తీసుకుని ఇంటింటికీ వెడ్తారు. ముసలి తల్లి చచ్చిపోయిందనీ, ఆస్పత్రిలో చచ్చిన తల్లిని దహనం చేయ డానికి డబ్బులేదనీ ఎవరో ధర్మాత్ములు రెండు కట్టెపుల్ల లిచ్చారనీ ఏడుస్తూ చెప్తారు. ఏవైనా పాతగుడ్డలియ్యమని ప్రాధేయపడ్తారు. జాలిపడినవాళ్ళు రూపాయో .. అర్ధో ఇస్తే సాయంత్రానికి ఆ డబ్బుల్తో మందు కొట్టి, పాత గుడ్డల్నీ, కట్టె పుల్లల్నీ డబ్బుగా మార్చి తిండి తిని, ఇంకా మిగిలితే సినీమాకో మరో వినోదానికో పోతారు. తెల్లారిలేచి మరో పేటకి పోతారు. ఈ నాటకం విసు గొస్తే మరో నాటకం ఆడ్తారు!!

★ ★ ★

అరుగో! .. ఆయనే కంట్రాక్టరు దయానందంగారు. ఇప్పుడే భోజనంచేసి విశ్రాంతి తీసుకుంటున్నట్టున్నారు. రెండో అబ్బాయికోసం తాను కట్టిస్తున్న మేడ తాలూకు ప్లానుని తాపీగా పరిశీలిస్తున్నారు. సూర్యనారాయణపురంలో స్కూలు కట్టించే కాంట్రాక్టు పనిచేసే రోజుల్లోనే పెద్ద అబ్బాయికి ఓ మేడ కట్టించిచ్చారు. టౌన్‌లో అఫీషియల్ క్వార్టర్స్ కాంట్రాక్టు ప్రారంభించాక అమ్మాయికి పనిలో పనిగా మేడ కట్టించారు. ఇప్పుడు చాలా పెద్ద కంట్రాక్టు సంపాదించి సంఘసేవలో నిమగ్నులై, పనిలో పనిగా రెండో అబ్బాయికి మేడ కట్టిద్దామని తలపెట్టారు. ప్రతి రోజూ ఆదాయ వ్యయాలని స్వయంగా పరీక్షించనిదే నిద్ర కుపక్ర మించకపోవడం వారి విశిష్ట గుణాలలో ఒకటి!

★ ★ ★

ఆ మేడకి దగ్గిరగా రోడ్డుమీద కూర్చుని అడుక్కుంటు న్నాడే! వాడే గుడ్డితాత యెంకటేసు పగలంతా పాటలు పాడి సంపాదించిన రూపాయిలోపు పైసల్ని పదిసార్లు లెక్కపెట్టు కుంటాడు. సందు మొదట్లోని టీ కొట్లో 'పదేనుపైస లిడ్లీలు' నాల్గు తిని, ఓ చుట్టముక్క కొనుక్కుని ఈ రోజు కిదే మొదటి సారిగా నడుం వాలుస్తున్నాడు గుడ్డితాత యెంకటేసు!

★ ★ ★

అదుగో! ... ఆ పెద్దతాళం వ్రేలాడే షాపే గుప్తగారిది. బియ్యం, నూకలు, తవుడు వ్యాపారంలో ఆ పరిసరాల్లో ఈయనతో పోటీ చేసేవారు లేనేలేరు! . అంత పెద్ద వ్యాపారం ఆయనది!... ఈ రోజు పెందరాళే మూసినట్లున్నారు! ... స్వామివారి ఉపన్యా సాని కేమైనా వెళ్ళుంటారు! ... వీరు ఎవరినీ నమ్మకుండా, గుమాస్తాలకీ పనివాళ్ళకీ వందకు మించిన వేతనం యివ్వకూడదన్న నియమాన్ని సడలించకుండా, వ్యాపారం సాగిస్తున్న ఆదర్శ మూర్తులు! . మరో ముఖ్య విషయం ఏమిటంటే మానవుడికీ మట్టికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని బియ్యం వ్యాపారం ద్వారా

అనుక్షణం మనకి గుర్తు చేస్తుంటారు!! వీరి వేదాంత పరిజ్ఞానానికి దాన్ని ఒక గొప్ప తార్కాణంగా తీసుకోవచ్చు!!

★ ★ ★

అదే నూతనంగా లక్షలు ఖర్చుచేసి కట్టించిన కళ్యాణ మంటపం! ... భక్తులతో కిట కిట లాడిపోతోంది .. స్వామి అలౌకికానంద వంటి ప్రఖ్యాత పురుషులూ ... పారత్రిక జ్ఞాన సంపన్నులూ గీతామృతాన్ని పంచిపెడ్తుంటే రాకేమౌతారు జనం?

ఇప్పుడే ఉపన్యాసం సమాప్తమైనట్లుంది. అదిగో ... ఆ మాట్లాడుతున్నది వారి శిష్యుడే. స్వామివారి మఠం నిర్వహించే కార్యకలాపాలని గురించి వివరించి విరాళాల సేకరణ చేస్తారు. ఆ రోజు వరకూ విరాళాలను ప్రకటించిన వారి పేర్లు చదివిన తర్వాత ప్రసాద వినియోగం. స్వామివారికి 'భిక్ష' సమర్పించడానికి భక్తుల తహతహ మాటల్లో చెప్పలేం. స్వామి అలౌకికానంద ఏ గ్రామంలో బస చేసినా వారి విరాళాల సేకరణ నిరాటంకంగా సాగిపోతుంది. అదే వారిలోని ఔన్నత్యం!

వారు వెళ్ళిన తర్వాత ఈ కళ్యాణమంటపంలో రికార్డింగ్ డ్యాన్స్ ప్రోగ్రాం ఒకటి, అది జరిగిన నాల్రోజులకి భారతీ స్వాముల వారిచే భాగవతోపన్యాసాల పరంపర. ఇలా ఈ కళ్యాణమంటపంలో ఎప్పుడూ ఏదో కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది!

★ ★ ★

ఇదిగో! ... ఈ మురుగుకాల్వ పక్కనున్న చిన్న వాటాయే మా దేశికులుగాడుండేది. లోపల్నించి ఏదో సంభాషణ వినిపిస్తోంది. విందామా? అదిగో!...ఆ మాట్లాడే ఆవిడ అతని భార్య కమల!... ఈ కిటికీ వైపుకి నడవండి!...వాళ్ళు కనిపిస్తారు

★ ★ ★

'జీతం వచ్చిందాండీ?' కమల ప్రతినెలా అడిగే ప్రశ్నే అడిగింది.

జేబులోంచి మూడు కాగితాలు తీసి చూపించాడు దేశికులు. ఇంద్రజాలం చేసేవాడిలా ఆ నోట్లు పైకెత్తి,

'ఈ మూడు కాగితాల్లో ఇంటద్దె వందా ... బియ్యం ఎనభై ... కిరాణా వందా చాకలి పదిహేనూ ... కూరల కొట్లో ఇరవై .. చేబదులు ఏభై ... బట్టల కొట్లో వాయిదా ఏభై ... పిల్లల కాన్వెంటు ఫీజులు ఇరవై .. పై ఖర్చు సాతికా మొత్తం నాలుగు వందల అరవై ... బాకీమైనస్ ఆదాయం ఈజ్ ఈక్వల్ టూ నూటరవై ... ఇప్పుడిదంతా ఆలోచిస్తే బుర్ర వేడెక్కుతుంది కానీ...ఈ ఎవ్వర్‌గ్రీన్ ప్రోబ్లమ్‌ని గురించి ఎవ్వర్ సారోఫుల్ అవడం ఎందుకు?.. పిల్లల్ని తయారుచెయ్యి .. ఓ సినిమాకి పోదాం!...' అన్నాడు.

'మీరు చెప్పినదాంట్లో ఈసినిమా ఖర్చు చేరలేదండోయ్! .. మీ లెక్క శుద్ధరాంగ్!'

తాను దీనంగా నవ్వుతూ భర్తను నవ్వించడానికి ప్రయత్నం చేసింది కమల.

వాక్యాల్లో తేడా ఉన్నా, ప్రతినెలా ఒకటో తేదీ రాత్రి ఈ మోడల్ డైలాగులు మనకా వాటాలోంచి వినపడ్తూనే ఉంటాయి!

★ ★ ★

అయ్యా! .. ఈ సందులో కాస్సేపు నడవడంవల్ల మనకి కాస్త వేదాంత పరిజ్ఞానం కలిగినందుకు సంతోషించాలి! ... రంగడూ రహీమూ ఘరానాగా అడుక్కుంటూన్నా మనిషికి మరణానంతరం కావల్సినదేమిటో చూపిస్తూ ప్రచారం చేస్తున్నారు!... స్వామి అలౌకికానంద పేదసాదలని గురించి జాలిగా మాట్లాడుతూ, దరిద్రనారాయణులని ఆదుకోమని బోధచేయడంలో గీతలోని శ్లోకాలని చక్కగా ఉదహరిస్తూ విరాళాలు యధాశక్తి సేకరిస్తున్నారు!... సమీపంలో ఉన్న 'గుడ్డి యెంకటేసు' గురించి వారు పట్టించుకోలేదంటే అది వారి తప్పుకాదు! ... క్షణం తీరికలేని వారి కార్యక్రమాలు అటువంటివి!! .. కంట్రాక్టరు దయానందంగారు కాంట్రాక్టు పనిచేస్తూ పనిలో పనిగా పిల్లలకి మేడలు కట్టుకుంటున్నారు కాని ప్రత్యేకంగా ఏమీ చెయ్యడం లేదు. వారి సేవానిరతిని శంకించలేం.

ఎటొచ్చీ ఏ విధంగానూ తనకి గానీ, తన దేశానికి గానీ ఉపయోగ పడనివాళ్ళు ఈ చిన్న సందులోనే ముగ్గురున్నారు!! యిద్రజేలూ...గుడ్డి యెంకటేసూ...మధ్యతరగతి దేశికులూ.

ఈ మహాపట్నంలోని ఓ మారుమూల చిన్న సందులోనే ముగ్గురు పనికిరాని వాళ్ళున్నారంటే ఈ ప్రపంచంలో ఇల్లాంటి 'గుడ్ ఫర్ నథింగ్' జీవులు ఎందరున్నారో!!

సర్లెండి! ... ఆ పిచ్చి ఊహ మనకెందుకు? సందు చివరి కొచ్చేసేం కాని...మరివస్తా!...గుడ్‌బై!!

శ్రీ యామిజాల పద్మనాభస్వామి

'దేవులపల్లి' దీప్తి

తండ్రి విద్వాంసుడైతే కొడుకు విద్వాంసుడు కావడం అరుదు. తండ్రి శుంఠ అయి కొడుకు మహాపండితుడవడం ఉంటుంది. ఊరకే అన్నారా పెద్దలు 'పండిత పుత్రః శుంఠః' అని. దీనికి ప్రత్యక్ష విరుద్ధమైన పద్ధతి దేవులపల్లి వారి వంశములో కనిపిస్తుంది. కడచిన శతాబ్దము ఆంధ్ర విద్వచ్చరిత్ర చదివి తెలుసుకోదగ్గ అపురూప విషయం ఇది.

అది గోదావరీ పావన జీవన ప్రభావం ప్రభాత సంధ్యారుణ పరాగంలాగా పిఠాపుర ప్రాంతాన అలముకొన్న దివ్య సౌభాగ్య దశ. పిఠాపురానికి కొలది దూరాన ఉన్న చంద్రమపాలెం చిన్న గ్రామం. ఆ గ్రామానికి పేరు పెంపులు సంపాదించి పెట్టినవారు ఇద్దరు అన్నదమ్ములు. అన్న సుబ్బారాయశాస్త్రి, తమ్ముడు వెంకట కృష్ణశాస్త్రి ఉరఫు తమ్మనశాస్త్రి.

ఈ అన్నదమ్ముల తండ్రి, తాత, ముత్తాతలు కూడా వీన మిగిలిన విద్వాంసులూ, గ్రంధ రచయితలున్నూ. బుద్ధికి పదును పెట్టి శాస్త్ర పాండిత్యం సమకూర్చుకోవచ్చునని, సలక్షణంగా, సరసంగా గ్రంథాలు రచించడం గగన కుసుమోత్పత్తిగానే కనిపిస్తూంది. అందుకే

'శక్తిః కవిత్వ బీజం హి ప్రాక్తనీ సంస్క్రియామతా' అని ప్రాచీనులన్నారు. పూర్వజన్మ పుణ్యావాసనా బలంవల్ల సరస కవితా శక్తి అలవడుతుంది అయితే.

'బళి బళీ! మీతాత బల్లెంబు చేబూని
పుల్లాకు తూటుగా పొడిచినాడు' —

అనేది కవిత్వమేనా? ఆపద్యం చెప్పినవాడు కవేనా అంటే సమాధానం లేకపోలేదు. 'కవియను నామంబు నీటికాకికి లేదే' ...

గణ యతి ప్రాసలు సరిపోయి అవతరించిన పద్యానికిన్నీ, 'ఎలదేటి చిరుపాట సెలయేటి కెరటాల బడిపోవు విరికన్నె వలపు' — అనే దానికిన్నీ ఉండే అంతర్యం అర్థం చేసుకునే బుద్ధిని వాగ్దేవి అనుగ్రహించాలి ఈ పద్య పాదం పై సోదర కవుల ముద్దుబిడ్డడు శ్రీ కృష్ణశాస్త్రిది ..

ఇప్పటికి సుమారు మున్నూరేండ్లనుంచి దేవులపల్లి వంశ ముక్తామణులుగా జన్మించిన విద్వన్మణులందరూ పిఠాపుర సంస్థానాధీశుల సమాదర పాత్రులై అనన్య లభ్యములైన సత్కారాలను పొందుతూ వస్తున్నారు. కొందరు ఆ సంస్థాన ప్రభువులకు గురువులు, కొందరు మిత్రులున్నూ. వీరిలో పిఠాపురాధీశుల కొలువులో ఉన్ననూ విజయనగరం మొదలైన సంస్థానాలకు కూడా వెళ్ళుతూ ఆయా ప్రభువులవల్ల అగ్రహారాదులను పొందిన కవి శిరోమణులై కూడా చరిత్ర ప్రసిద్ధులైనవారున్నారు. వారిలో రామశాస్త్రిగారు పూసపాటి విజయరామ గజపతి మహారాజును తన విద్వత్కవితా వినోదముతో మెప్పించి వెలగడ అనే గ్రామం అగ్రహారముగా పొందినట్టు చరిత్ర చెప్తూంది. ఈతని తరువాతి కవి రత్నం బ్రహ్మన శాస్త్రి తన ప్రభువుపై 'తారావళి' అనే పేరను సంస్కృత కావ్యం వ్రాసి 'పగర్దీను పాలెం' అనే గ్రామం పారితోషికముగా పొందిన అదృష్టవంతుడు. రామశాస్త్రిగారి మనుమడు రామశాస్త్రి సంస్కృతములో రామచంద్రోదయ చంపువు, సాహితీ దర్పణం అనే అలంకారశాస్త్రం, బాలభాగవతానికి వ్యాఖ్య, మరికొన్ని నాటకాలూ వ్రాసి, పిఠాపురాధిపతులైన శ్రీ వేంకట నీలాద్రిరాయ ప్రభువరేణ్యులచే సాహిత్య చక్రవర్తి' అని బిరుదు పొందిన విద్వత్కవి. ఈ విద్వత్కవి తమ్ముని కొడుకు కృష్ణశాస్త్రి సుప్రసిద్ధమైన 'విశ్వగుణా దర్శము'నకు వ్యాఖ్య, తర్కసారం అనే న్యాయశాస్త్ర గ్రంథం, సాహితీసారం అనే అలంకారశాస్త్రం — వ్రాసిన విద్వాంసుడు, మంచి గురువున్ను. ఇతనికి గోదావరీ మండలమందు ఎందరో శిష్య ప్రశిష్యులు ఉండేవారట! ఈ విద్వత్కవి కవితా పద్ధతికి ఉదాహరిస్తున్నాను ఈ క్రింది శ్లోకం అవధరించండి ఎంత సరసమో! ఎంత చమత్కార భావమో!

'కాచిల్లతా, తమః కశ్చిత్
పీఠికాయాం సదద్భుతం
అపర్ణా సా సతు స్థాణుః
దదాతే కాంక్షితం ఫలమ్'—

పీఠికయందు ఒక తీగె, ఒక చెట్టు ఉన్నాయి. ఆతీగ అపర్ణ (ఆకులు లేనిది) ఆ చెట్టు 'స్థాణువు' (మొద్దు). కానీ ఆ రెండూ కోరిన ఫలాలు ఇస్తాయి ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం పీఠికాపుర మందున్న పరమేశ్వరీ పరమేశ్వరులను వర్ణించే ప్రధాన విషయం గ్రాహ్యం.

ఇలాగే అందరూ విద్వాంసులూ, కవులూ, గ్రంథకర్తలున్నూ అదొక విశేషమేమిటంటే ఈ దేవులపల్లి వంశీయు లందరూ శ్రీరామోపాసకులు - ఇది తెలిసి నేనొకనాడు కృష్ణశాస్త్రి గారిని అడిగాను 'మీ పెద్దలందరూ రామోపాసకులు కదా మరి రామ నామం తప్పించి వేంకట నామం మీవారి పేర్లలో ఎక్కువగా వినిపించడానికి కారణం ఏమిటి?' అని. దానికి ఆయన చిరునవ్వు

నవ్వి 'ఇదిగో యీ పుస్తకం చదవండి మీ ప్రశ్నకి సమాధానం దొరుకుతుంది' అని తమ పెదనాన్నగారు సుబ్బారాయశాస్త్రిగారు రచించిన 'మహేంద్ర విజయం' అనే ఆరాశ్వాసాల మహాకావ్యం ఇచ్చారు. 'రాముడూ, వేంకటేశ్వరుడూ ఒకటే'—అని సుబ్బారాయ శాస్త్రిగారు దీనిలో నిర్వచించడం గ్రహించి సమస్య తీరిందన్నాను— ఈ వ్యాసానికి ముందుగా చెప్పిన సుబ్బారాయశాస్త్రిగారు ఈయనే— ఈ మహానుభావుడు 1853 జనవరిలో జన్మించాడు. తండ్రి పేరు వేంకట కృష్ణశాస్త్రి. ఇతని తమ్ముడు వేంకట కృష్ణశాస్త్రి. అంటే నిన్న మొన్న అమరజీవి అయిన మహాకవి కృష్ణశాస్త్రిగారి తండ్రి అన్నమాట — తమ్మనశాస్త్రి అనేది నామాంతరం — అన్నదమ్ములు ఇద్దరూ తండ్రి వద్దనే ఎక్కువభాగం కావ్య నాటకాలూ. అలంకారం, తర్క వ్యాకరణాలూ చదువుకున్నారనాలి. తాత సీతా రామశాస్త్రివద్ద కాళిదాసత్రయం మాత్రం చదివినట్టు తెలుస్తూంది.

విద్యతోపాటు కవిత కూడా చిరుతప్రాయము నందే యీ అన్నదమ్ములకు అలవడ్డది. అదే విశేషం — ఏమిటది. ఆశువుగా చెప్పిన పద్యం కూడా ఓపికగా కూర్చుని వ్రాసిన దానికన్న రసవత్తరంగా ఉండే కవిత వీరికి అలవడ్డది.

శ్రీ గంగాధర రామరాయ మహారాజా కొలువులో శ్రీ మాడభూషి వారి అవధానానికి దీటుగా అవధానంచేసి ఆచార్యుల వారి చేతనూ, ప్రభువుల చేతనూ కూడా సన్నుతి గాంచిన అవధాని శిరోమణి యీ సుబ్బరాయశాస్త్రి. అప్పుడు ఈయన ఇంచు మించు పాతికేండ్లవాడు.

ఆ తరువాత ప్రభువులు తమ వంశచరిత్ర యీయనచే వ్రాయించి కృతినొంది ఆనందాతిరేకముచే సుబ్బరాయశాస్త్రిని సింహాసనముపై కూర్చుండబెట్టి మా రాజ్యమే మీకు బహూకృతిగా ఇస్తున్నా స్వీకరించండి అని అన్నారట ! అంతకన్న మిన్నగ పొందవలసే సత్కారం ఏముంటుంది? అయితే శాస్త్రిగారు అంతలుబ్ధులా! ప్రభూ! యీ రాజ్యభారం వహించగల శక్తి ప్రభువులకే గాని నా వంటి బడుగు బాపనికి ఎలా వస్తుంది తమరే స్వీకరించండని ప్రశంసిస్తూ సింహాసనం దిగారు. ఎంత సరసత !

ఈయన చాలా గ్రంథాలు వ్రాశారు. వాటిలో 'మహేంద్ర విజయం' కావ్యరత్నం (దీనికి వ్యాఖ్య వ్రాయవలసిందని కృష్ణశాస్త్రి గారిచ్చారు నాకు. అదే కాలేదు.).

ఈ మహనీయుని తమ్ముడు తమ్మనశాస్త్రి తక్కువవాడా ? నిల్చున్నపాటున గంటకు నూరుపద్యాలు ఏకధారగా చెప్పడం, అలాగే వ్రాయడమూ—రెండు శక్తులూ గలవాడని ప్రతీతి. ఆయన గ్రంథాలలో యతిరాజ వైభవం సుప్రసిద్ధం.

సుబ్బరాయశాస్త్రిగారిని గురించి చెప్పవలసేది ఒకటి ఉంది. 'మా పెదనాన్నకి ఉన్న బద్ధకం ఇంతాఅంతా కాదు. చురుకుదనమే ఉంటే యింకా ఎన్ని గ్రంథాలు రాసి ఉండేవాడో' అన్నారు కృష్ణశాస్త్రిగారు ఒకనాడు. అప్పుడు నేనన్నాను చిరునవ్వు నవ్వి 'ఆ గుణం మీకు వచ్చినట్టుంది అని ' అలాగే అనుకోండి అన్నారు ఆయన నవ్వుతూ.

ఆకాశవాణి మద్రాసు కేంద్రానికి కృష్ణశాస్త్రిగారు వ్రాసిన నాటికలు అన్నీ వెలకట్టని జాతి రత్నాలు. అలాగే ఆయన ప్రసంగించిన ప్రసంగాలున్నూ. భావం, భావానికితగిన భాష ఆయనసొమ్ము. చిన్నపుడు ఇంటిలోనే తండ్రులవద్ద సంస్కృతం ఆయలా పాయలా చదివానన్నారు. మా పెదనాన్నవద్ద ఉన్న సాహితీ కవితా శక్తులు నాకు అబ్బలేదు. ఆ బద్ధకం మాత్రం నాకు సంక్రమించింది—అని హేళగ అన్నారుగాని బద్ధకం మాట ఎలా ఉన్నా కృష్ణశాస్త్రిగారి పలుకుబడిలో ఉన్న సౌకుమార్యం, భావ సౌందర్యం తండ్రుల కావ్యాలకు ఒక ఆకు పైన ఉంటుందనే నిర్ణయానికి నేనేనాడో వచ్చి ఆయనతోనే అన్నాను. 'ఆఁ అంతమాట నాముందు అనవద్దు' అని మెల్లగా అన్నారాయన.

కృష్ణశాస్త్రిగారితో పరిచయం నాకు ముప్పదేండ్లదేఅయినా కృష్ణపక్షం చదివి చాలాకాలమయింది. ఒక్కటే మాట.

సలలిత శయ్యా సౌభాగ్యానికి ఆయన రెండవ నన్నపార్యుడు. కవితాతత్త్వం తెలిసిన సహృదయులు కాదనలేరని నా దృఢవిశ్వాసం. తెలుగు నుడులే కాదు గీర్వాణ భాష కూడా ఆయనది అదే తీరున ఉంటుంది. ఎవరి రచననైనా అనుకరించవచు నేమోగానీ కృష్ణశాస్త్రిగారి రచనను అనుకరించి కృతార్థుడైన కవిని నేనింతవరకు చూడలేదు.

వృత్తమేకాదు. సీసాదులే కాదు చలన చిత్రాలకు వ్రాసిన గీతాలలో కూడా ఆ సుకుమార సుందర పదబంధమే కనిపిస్తుంది. ఆ రచన ఎంత ఇంపుగా ఉంటుందో మూగవోకుండా ఉన్నంతవరకు ఆయన కంఠం కూడా అంత సొంపుగా ఉండేది.

193 లో విజయనగరం మహారాజావారి ఆంగ్ల కళాశాలలో ఇంటర్ కాలేజీ విద్యార్థుల వ్యాస రచన పోటీలు జరిగాయి. అప్పుడు కృష్ణశాస్త్రిగారు, శ్రీ శివశంకర శాస్త్రిగారూ వచ్చారు 'తన్ను మాలిన ధర్మము తగునా?' అని విషయం ఇచ్చారు. నేనప్పుడు సంస్కృత కళాశాలలో విద్యార్థిని. ఆ పోటీలో నేనూ ఉన్నాను. ప్రశ్నార్థకంగా ఉన్నది. ఇలాగు ఇవ్వకూడదని నేను వాదించాను అప్పటికి నా వయస్సు 18 ఏళ్లు కృష్ణశాస్త్రిగారు నా సమాచారం అడిగి తెలుసుకుని 'చెళ్లపిళ్లవారి శిష్యుగు కనుక అంత ధైర్యంగా అడిగాడు'—అని సమాధాన పరిచారు. ఆ రచనలో నాకు ప్రథమ బహుమతి, కాకినాడ కాలేజీ విద్యార్థి, పేరు రామారావు, అతనికి ద్వితీయ బహుమతి వచ్చాయి. ఆ సాయంకాలం సభలో కృష్ణశాస్త్రిగారు చదివిన పద్యాలు విని 'ఆ పదబంధ సౌందర్యానికి ముగ్ధుడనై 'నేనూ కవినేనా? సిగ్గు సిగ్గు పద్యం ఇలా అందంగా ఉండాలి.' —అని అనుకొన్నాను. అతనితో ప్రథమ పరిచయం అదే... తరువాత 1948 నుంచి యీ మద్రాసులో...

ఒకనాడు మా స్కూలుకి తోడ్తెచ్చి ఆయనచే మాటాడించాను 'స్త్రీ ప్రకృతి – పురుషుడు' – అనేది వివరిస్తూ కేవలం 'సౌందర్య లహరి' ఆధారంగా ఆయన మాటాడినది శ్రోతృ జనమును ముగ్ధులను చేసింది.

తెలుగు భారతములో ఆస్తీకుడు జనమేజయుని సర్పయాగం మాన్పించే సందర్భములో నన్నయ వ్రాసిన పద్యాలు ఆయనే చదవాలి, ఆయనే వివరించాలి–అని విన్నవారందరూ అనేవారు.

పాండురంగమాహాత్మ్యములో రామకృష్ణునిగడుసరితనమును నిగమశర్మోపాఖ్యానములో వివరిస్తూంటే ఈయన రామకృష్ణుడే కాబోలు అని అనిపించేది.

'శరద్ఘనం నార్దతి చాతకోపి' అనే కాళిదాసోక్తికి కృష్ణశాస్త్రిగారు ఒక గంట వ్యాఖ్య చేశారు. ఒకనాడు వారింటి కొలువులో

'కంఠం...చికిత్సా ఏమిటి? అని నేను విచారంగా అడగగా ఆయన వ్రాసి చూపిన పద్యం ఇది

'ఇంచు మించుగ ఏబది యేండ్లపాటు
కూసియున్నాను సభలలో కోకిలవలె
అలసిపోయితి నిక కూయనంచు తాను
మూగవోయెను వయసుతో నా గళంబు' –

పద్యమంతా ఒక యెత్తు. 'అలసిపోయితి' అనే క్రియాపదం ఒక ఎత్తు.

కృష్ణశాస్త్రిగారిని గూర్చి ఏదో 'భావకవి' అనే పేరుతో ఎవరెవరో ఏమేమో వ్రాసేరు ఆత్మాశ్రయ కవిత్వం అని భావ కవిత్వానికి ఒక పేరు పెట్టారు. అది ఏ కవిత్వమో చెప్పడం నాకు రాదుగాని నాకు తోచిన మాట ఎన్నో సభలలో చెప్పేను. అదేమంటారా ?

ఈ శతాబ్దానికి కృష్ణశాస్త్రిగారు సంప్రదాయ కవనానికి నన్నయ, గేయ కవితకు రెండో జయదేవుడు.

'ఎవ్వరేమంద్రుగాక నాకేమి భయము
నాకు తోచినమాట అన్నాను గాక' –

చూడండి 'శర్మిష్ఠ'లో ఒకచోట

'చలిత చలిత మచ్చరణ కటక మం
జీర గళ్ళస్రుప శింజితమ్ము విను
పిలిచి పిలిచినా పలుకరించినా

చలియింపదు జడశిలయో నీ యెద
తరళ తరళ మలయానిలలోల త
రంగ చలిత వసనాంచలములు విను
ఉసురుసురనినా గుస గుసమనినా
ఊగితూగదే కొరడో నీయెద'— అంటాడాయన.

ఆయన పేరు చెప్పకపోతే ఏ నన్నయగారినో ముందుకి తేవలసిందే. కాదంటారా? నమస్కారం.

'జయ జయ జయ ప్రియభారత జనయిత్రీ' — అనే గేయం మదరాసులో పాఠశాలల్లో పాడుతూఉంటారు. అది వింటూ ఉంటే ఏదో తృప్తి, తుష్టి.

'ఏడాది పొడుగునా'—లోని భాష అంత సొగసుగా ఉపయోగించడం ఆయనకే చెల్లింది. అటు తెలుగూ ఇటు సంస్కృతాన్నీ అంత నిండుగా సొంపుగా వాడి వడబోసి వాడిగా వాడిన మహానుభావుడు శ్రీ కృష్ణశాస్త్రి. కనుకనే వీధిబడి విద్యార్థి మొదలు విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్‌దాకా ఆయనను ఊచి తూచి హృదయాల్లో దాచుకున్నారు, దాచుకుంటారు

తాత తండ్రులూ ముత్తాతల్లాగా ఆయన కూడా పీఠికాపురాధీశులకు ఎంతో ఆప్తమిత్రులుగానే వ్యవహరించేవారు. విశేష మేమిటంటే దేవులపల్లి వారందరూ కవులూ పండితులూ అయి పిఠాపురాధిపతులకు కొందరు మిత్రులు, కొందరు గురువులు, అందరూ దర్బారు కవులు—ఆ గౌరవం కృష్ణశాస్త్రిగారికి కూడా దక్కింది. అలాగే సమర్థులకు సన్మానం జరగడానికి కృష్ణశాస్త్రిగారు ప్రయత్నించేవారు. భారతదేశం స్వతంత్రం కాగానే సంయుక్త మద్రాసు రాష్ట్రానికి తెలుగు, సంస్కృత, తమిళ, మళయాళ భాషలలో సుప్రసిద్ధులైన కవులను ఆస్థాన కవులుగా నియమించడములో శాస్త్రిగారు మాన్య శ్రీయుతులు బెజవాడ గోపాలరెడ్డిగారిని ప్రోత్సహించి కృతార్థులైనారు. వారి ప్రయత్నంవల్లనే మా కవితా గురువులు తెలుగు ఆస్థాన కవులైనారు.

కృష్ణశాస్త్రిగారు దేశంలో పలుచోట్ల వివిధ సంస్థలవల్ల ఎన్నో సమ్మానాలు పొందారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తగిన స్థానములో ఆయనకి సమ్మానాలు జరిపాయి.

ఆయన అనువంశికముగా వస్తూన్న సంపదకూ, సాహిత్య సంపదకూ ఏలాటి వెల్తిలేని వారసుడు అయి గోదావరీ మండలానికే కాక యావదాంధ్ర దేశానికీ సమ్మాన్యుడైనాడు. అలాగే ఈనాడు పేరు పొందిన పెద్ద లెందరో కృష్ణశాస్త్రిగారిని 'అదొక ప్రత్యేక కవితావతారం' అని ప్రశంసించారు.

'ఆయన కవితా ప్రభావ బంధము నుంచి బయటపడడానికి చాలా బాధ పడ్డానన్నాడు మహోద్ధత కవితా ప్రభంజనుడు.

శ్రీశ్రీ.

'అతని భాష అతనిదే. కొందరు కవులకొక విలక్షణమైన కూర్పు భగవంతు డిచ్చును. ఒక నాయని సుబ్బారావు, ఒక కాటూరి వేంకటేశ్వరరావు, ఒక దేవులపల్లి కృష్ణశాస్త్రి—

కవి సమ్రాట్టు మాటలివి.

'గొప్ప కవిత్వం ప్రధాన లక్షణ మేమిటంటే ఎవరి తాహతును బట్టి వారికి ఏదో కొంత అనుభూతిని అందించగలగడం, కొంత స్పష్టంగా తెలుస్తుంది. జయదేవుడి అష్టపదులు, కృష్ణశాస్త్రి గీతాలు మాటల అర్థంతో ఎంత చెపుతాయో ధ్వనితో, సంగీతంతో అంతకన్నా యెక్కువ చెపుతాయి—

చలం.

నిజమే 'అందాల మేఘమాల' ఎంత అందమైనదో మొన్న తెలుగు చేసిన ఆండాళ్ తిరుప్పావై గీతాలూ అంత అందమునూ సంతరించుకున్నాయి.

మొన్న ఆంధ్రపత్రిక సంపాదకీయం చెప్పినట్టు కృష్ణశాస్త్రిగారి కావ్యానుశీలనం సమగ్రంగా జరగాలి. అంతవరకూ కృష్ణశాస్త్రి గారంటే ఆధునిక తరములో కొంతమందికి అంతే ...

ఇటీవల ఆయన పెదనాన్నగారినీ, నాన్నగారినీ గురించి ప్రత్యేక వ్యాసాలు భారతీ సంపాదకులు శ్రీ రాధాకృష్ణుల సూచన మేరకు వ్రాయగా వారి ఛాయాచిత్రాలతోసహా ప్రముఖంగా భారతిలో ప్రచురించారు. అవి చదివి శాస్త్రిగారు పనికట్టుకుని వచ్చి 'నామీద కూడా ఒక వ్యాసం వ్రాయరూ!' అని అన్నారు. నేటికి ఈ విధంగా వ్రాయవలసి వచ్చింది.

తెలుగువాణికి నిసర్గ రమణీయములైన కావ్యాలంకారాలు తొడిగి అన్ని విధాలా చరితార్థుడై శాశ్వతమైన దివ్యజ్యోతిలో కలిసిపోయిన ఆ అమరజీవికి జోహార్లు !



శ్రీ విక్రాల శేషాచార్యులు

అమర శేషము - త్రికాండ శేషము

పురుషోత్తమదేవుఁడు తను రచించిన [1]త్రికాండ శేషములో మొదట —

"శ్లో॥ అలౌకికత్వా దమర స్స్వకోశే న యాని నామాని సముల్లిలేఖ
విలోక్య తై రప్యధునా ప్రచారమయం ప్రయత్నః
పురుషోత్తమస్య॥" ౨

అనెడు శ్లోకములో తా నాత్రికాండశేషమును రచియించఁబూనిన కారణమును నుడివియున్నాఁడు. దీనికి [2]శ్రీ శేషాద్రిరమణకవులు (శ్రీమాన్ దూపాటి శేషాచార్యులవారు, వారితమ్ములు శ్రీమాన్ వేంకట రమణాచార్యులవారు సుప్రసిద్ధులు, సంస్కృతాంధ్ర భాషలలో గొప్పవిద్వాంసులు అష్టావధానులు.) రచించిన టీకలో— శ్లోకములోని "అమరః" శబ్దమునుఁబట్టి అమరకారుఁడు అని అర్థము వ్రాసియున్నారు. దానిక్రింది శ్లోకము

"వర్గక్రమస్తథా నామలింగయోస్తూపదేశతా
పరిభాషాదికం సర్వ మత్రా ప్యమరకోశవత్.॥ [3]

అనెడు శ్లోకముయొక్క తాత్పర్యములోను "అమరకోశవత్" అను దానిఁ బట్టి "అమరకోశమునందువలె" అని తాత్పర్యము వ్రాసియున్నారు. శ్లోకమున కిది సరియైనయర్థము. ఆ గ్రంథముయొక్క పీఠికలోను మొట్టమొదట "త్రికాండ శేషమను పేర నామలింగను శాసనమున నుదాహరింపఁబడని పదములను సమకూర్చి బూనిఘంటురాజమును రచించిన మహామహుఁడు పురుషోత్తమదేవుఁడు . ." ఇత్యాదిగ వ్రాసియున్నారు. కాని చెన్నపురిలోనే ఆనంద ప్రెస్సువా రచ్చువేసిన సటీకామరకోశపు పీఠికలోఁ బ్రాచీన నిఘంటువులపేళ్లనుఁ దెలిపెడి కొన్ని పూర్వకృత శ్లోకములనుఁ దెలిపి యున్నారు. అవి

"శ్లో॥ మేది న్యమరమాలాచ త్రికాండో రత్నమాలికా
రంతిదేవో భాగురిశ్చ వ్యాడి శ్శబ్దార్ణవస్తథా ॥ ౧
ద్విరూపశ్చ కళిఙ్గశ్చ రభసః పురుషోత్తమః
దుర్గో౽భిధానమాలాచ సంసారావర్త శాశ్వతౌ ॥ ౨
విశ్వోవోపాలిత శ్చైవ వాచస్పతి హలాయుధౌ
హారావళీ సాహసాఙ్కో విక్రమాదిత్య ఏవచ ॥ ౩
హేమచన్ద్రశ్చ రుద్రశ్చా ప్యమరో౽యం సనాతనః
ఏతేకోశా స్సమాఖ్యాతా స్సంఖ్యాషడ్వింశతి స్స్మృతాః "॥ ౪

అని ఈ శ్లోకములలో "త్రికాండము" "అమరము" అని రెండు నామములు వేరువేరుగ చెప్పఁబడియున్నవి. నిఘంటు నామములవద్ద రచయితల పేళ్లు, నిఘంటు రచయితల పేళ్లవద్ద వారువారు చేసిన నిఘంటువుల నామములులేవు. ఈ శ్లోకములలో మేదిని, అమరమాల, త్రికాండము, రత్నమాలిక, శబ్దార్ణవము, ద్విరూపము (ఇదియే ద్విరూపకోశమేమో ?), అభిధానమాల, హారావళి, ఈ తొమ్మిది కోశములపేళ్లు. ఇఁకనునిఘంటు నిర్మాతలపేళ్లు — మేదిని మేదినికరకృతమైన అనేకార్థకోశమునే మేదిని యని వాడెదరు. కాన మేదినీ అనఁగా తత్కర్తృనామమే. రంతిదేవుఁడు, భాగురి, వ్యాడి, కళింగుఁడు, రభసుఁడు పురుషోత్తముఁడు, దుర్గుఁడు, సంసారావర్తుఁడు, శాశ్వతుఁడు, విశ్వుఁడు, వోపాలితుఁడు, వాచస్పతి, హలాయుధుఁడు, సాహసాంకుఁడు, విక్రమాదిత్యుఁడు, హేమచంద్రుఁడు రుద్రుఁడు, అమరుఁడు." ఇవి నైఘంటుక నామములు. ఈ శ్లోకములలో మొదట పురుషోత్తముఁడని వ్యక్తిపేరు, మఱియొకతావున తత్కృతమైన వేరొక నిఘంటువు పేరగు "హారావళి" పేర్కొనఁబడినవి. ఈపేళ్లలో "త్రికాండము" అని ఒక గ్రంథముయొక్క నామము, "అమరః" అని వ్యక్తినామమున్ను పేర్కొనఁబడినవి. అమరకోశములో మూఁడు కాండములున్నందున త్రయ కాణ్డాః యస్మిన్సః (మూఁడు కాండములుకలది) అను వ్యుత్పత్తిచేత నామలింగాను శాసనమునకును త్రికాండమని పేరు చెప్పఁదగును. కాని అట్లు చెప్పినలవాటు కానరాదు. పూర్వగ్రంథ వ్యాఖ్యానములలో నమరకోశ (నామలింగాను శాసన) శ్లోకములను శ్లోకపాదములను ఉదహరించి "ఇత్యమరకోశః" అని యమరకోశమనియే పెద్దలు పేర్కొని యున్నారు. ఇఁకను శ్లోకోక్తమైన "త్రికాండ" మిప్పుడు అలభ్యముగనున్నది. కావున తద్రచయితపేరు ఎఱుంగశక్యము కాదు. కాన నా "త్రికాండము" లభించి చూచువరకు తత్కర్తృనామముకూడా "అమరః" అనియే యెంచి పురుషోత్తమదేవుఁడు రచియించిన త్రికాండశేషము సదరు త్రికాండముయొక్క శేషమని భావించవచ్చునుకదా ? "అమర స్స్వకోశే" అనుచోట త్రికాండ కర్తృనామమే యని తలంచఁదగును. సంస్కృతభాషలో రఘువంశాది మహాకావ్య, శాకుంతలాది నాటకరచయిత సుప్రసిద్ధుఁడునైన మహాకవి కాళిదాసు తర్వాత కాళిదాసు అనియే పేరుకల సంస్కృత కవులే కొందఱున్నట్లు నామలింగాను శాసన ప్రణేతపే రమరసింహుఁడైనను "అమరః" అని చెప్పఁబడునట్టి అమరుడిపేరేకల మఱికొందఱు నైఘంటికులే యుండఁదగును. త్రికాండ శేషములో నానార్థవర్గ ప్రారంభములో

''శ్లో॥ స్వరకాద్యాది కాద్యంత క్రమా న్నానార్థస జ్గ్రహమ్ ।
విహాయాఽమరకోశోక్త॥ మకార్షీ త్పురుషోత్తమః''
అనియు,

శ్లో॥ లిఙ్గాది సఙ్గ్రహేఽనుక్తమమరేణాఽభిదధ్మహే ।
... ...

అని అమరకోశమం దని నుడివెనే కాని అమరసింహునికోశమం దనియొండే నామలింగానుశాసనమునం దనియొండె అమరకోశకారునియొక్క పూర్తిపేరునుఁగాని, స్వచికీర్షిత శేషగ్రంథమునకు మూలగ్రంథముయొక్క పేరునుఁగాని చెప్పలేదు. పైపెచ్చు ''త్రికాండశేష'' మని తనగ్రంథమునకు పేరు పెట్టినాడు గ్రన్థాన్తగద్యములోను ''ఇతి శ్రీపురుషోత్తమ దేవరచితస్త్రికాండ శేషాభిధాన కోశస్సమాప్తః'' అనియేవ్రాసెను.

ముందు చెప్పినట్లు ప్రాచీన వ్యాఖ్యాతలు నామలింగానుశాసన శ్లోక – శ్లోక పాదముల నుదహరించి ''ఇత్యమరః'' అని యనుటయు, ఆధునికులున్ను నామలింగానుశాసనమునకే అమరకోశమనుటయు, జూడ నీ త్రికాండశేషము – ఈ యమరకోశము యొక్క శేషమయ్యేనేని అమరశేషమనియో, అమరకోశ శేషమనియో, నామలింగానుశాసన శేషమనియో నామోచితమైయుండ త్రికాండశేష మనుటచేత నిది ''త్రికాండ'' నిఘంటువునకే శేషముగ రచించినది యనియు, సందరి శ్లోకములలోని ''అమర'' శబ్దము తత్కర్తృనామమని యూహించనై యున్నది. అమర శేషమని యొక రిద్దఱు చేసిన కోశములు నామలింగానుశాసన శేషములని పెద్దలు తెలుపుటకేదు. ఆ అమరశేష రచయితలు తాము రచించఁబూనినది దేనిశేషమో స్పష్టముగ నుడువవలెను. మద్రాసులో అడయార్ లైబ్రరీవారి సంస్కృత ప్రాకృత లిఖితగ్రంధముల ముద్రితపట్టిక (క్యాటలాగ్)లో ''అమరశేషః'' అని కర్తృనామ రహితముగ నొకకోశముపేరు కనఁబడుచున్నది. నేనుకూడా నామలింగానుశాసనమునకు శేషముగ నొకనిఘంటువును చేసి యుంటిని. దానికి పెద్దలు రచయితనైన నాపేరు, అదియొక పూర్వగ్రంథము యొక్క శేషమనియు స్ఫురించునట్లు దానికి ''శేషనిఘంటు'' వని పేరిడిరి. అందు ముందు శ్లోకములు.

''శ్లో॥ శ్రీనివాసం స్మృదౌ కృత్వాస్మరతాం ప్రీతివర్ధనమ్
ప్రారీప్సితస్య నిర్విఘ్నసిద్ధయేచ ప్రసిద్ధయే॥ ౧

విద్యావాచస్పతే ర్విద్యారణ్యపఞ్చాననస్యచ
విక్రాల రామచన్ద్రార్యగురో శ్శేషార్య ఆత్మజః॥ ౨

గ్రన్థవిస్తారభయతో నామలిఙ్గానుశాసనే
త్యక్తా న్యమరసింహేన నామా న్యత్రాఽఽహ కానివిత్'' ౩॥

అని.

ఈ త్రికాండశేషము దేనిశేషమో పండితులుతెలిపెదరు గాక.

విశ్వకోశము-విశ్వప్రకాశము

సంస్కృతభాషలోని నానార్థ నిఘంటువులలో విశ్వనిఘంటువు – విశ్వప్రకాశము అని రెండుపేళ్లు కనుపించుచున్నవి. ఈ రెండుపేళ్లు ఒక్కనిఘంటువునకేనా ? లేక వేరువేరు పుస్తకములవా?

చెన్నపట్టణములో శ్రీ వావిళ్లవారు ప్రచురించిన సటీక త్రికాండ శేషముయొక్క అట్టమీఁది వారి గ్రంథ ప్రకటనలో ''విశ్వకోశము–సటీకము'' అను పెద్దఅక్షరముల పేరుక్రింద ''ఇయ్యది మహేశ్వరసూరి విరచితమగు నొకప్రాచీన సంస్కృత నిఘంటువు .'' ఇత్యాదిగ తద్విషయమును కొంతవ్రాసి, పిదప దానివెలను వేసియున్నది. ఇందుచేత నీ విశ్వకోశము మహేశ్వరసూరి యను పండితునిచే విరచితమని తెలిసినది. కోశమనినను నిఘంటు వనినను నిఘంటునామములే కాన విశ్వకోశము విశ్వం నిఘంటువు అనెడు రెండు పేళ్లును నొక్క గ్రంధముయొక్కవే అని యను కొనవీలున్నది. లోకములో విశ్వకోశమునే విశ్వనిఘంటు వనియు, విశ్వనిఘంటువునే విశ్వకోశ మనియు పండితులు వ్యవహరించుట కలదు. ఇట్లు రెండుపేళ్లు నొక్కనిఘంటువువేకాదు. అవిమర్శిత జన్య మనుకొనినచో విశ్వకోశము విశ్వనిఘంటువు భిన్నకర్తృకమైన నిఘంటుద్వయమని భావించఁదగును.

ఇది యిట్లుండ పురాతనకావ్య – నిఘంట్వాది శాస్త్ర గ్రంథములయొక్క పూర్వపండిత ప్రణీత వ్యాఖ్యానములలో ''ఇతి విశ్వః – ఇతి విశ్వప్రకాశః'' అని ఉదాహరణములలో వేరు వేరు గ్రంథములుగ స్ఫురించునట్లు కలదు.

ఉదా : కాళిదాసుఁ డొక్కఁడే రచియించిన ఒక్కమేఘసందేశ కావ్యముయొక్క ఒక్క మల్లినాథసూరియే రచించిన వ్యాఖ్యానములో మొదటి సర్గములో– ''మందం మందం నుదతి పవనః'' అను తొమ్మిదవ శ్లోక వ్యాఖ్యలో ''గన్ధగన్ధక ఆమోదేలేశే సమ్బన్ధ గర్వయో. రిత్యుభయత్రాఽపి విశ్వప్రకాశః'' అనియు, దాని ప్రక్కనే ''తాం చాఽవశ్యం దివసగణనా తత్పరాం ...'' అనెడి పదియవశ్లోక వ్యాఖ్యలో ''ఆశా ది గతి తృష్ణయో రితి విశ్వః.'' అనియు నట్లే ఆమొదటి సర్గలో ౩౮వ శ్లోక వ్యాఖ్యలోను – దాని ప్రక్కనే ౩౯ శ్లోక వ్యాఖ్యానములోను –

ఇత్యాదు లభిజ్ఞు లెఱింగినవే.

వావిళ్లవా రచ్చువేసిన విశ్వకోశము మహేశ్వరసూరి విరచితము కాఁగా చెన్నపురిలోనే అడయార్ లైబ్రరీవారి పూర్వోదిత గ్రంథ

(మిగతా 54వ పేజీలో)

డా॥ కె. మురళీ మనోహర్ శ్రీ బి. జనార్ధన్‌రావు

రిజర్వేషన్లు - ఒక పరిశీలన

[డా. కె. మురళీమనోహర్ — కాకతీయ విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలనా శాస్త్ర శాఖలో అధ్యాపకులు.
బి. జనార్ధన్‌రావు — కాకతీయ విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలనా శాస్త్ర శాఖలో పరిశోధక విద్యార్థి]

పరిణామ క్రమంలో మానవ సమాజాలు అభివృద్ధి పంథాలో పయనిస్తున్నాయి. సమాజంలో ఉత్పన్నమయ్యే వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను ఆయా సమాజాలు తమ తమ మార్గాల్లో పరిష్కరించుకొనడానికి ప్రయత్నిస్తున్నాయి. వర్ధమాన దేశం అయిన భారతదేశంకూడా అనేక ఆర్థిక సామాజిక సమస్యల వత్తిడినుండి దూరంగాలేదు. అదేవిధంగా ప్రపంచ వర్ధమాన సమాజాలు భిన్న భిన్న ప్రవృత్తులతో, అనేక స్థాయిలలో అసమానతలతో అంతర్గత వైరుధ్యాలకు, సంఘర్షణలకు లోనై ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారం అనేది కొంతవరకు ఆయా సమాజాలలో ఉండేటువంటి ప్రజల చైతన్య స్థాయిపై ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. చారిత్రిక సామాజిక నేపథ్యంలో చూసినట్లయితే భారతదేశము మొదటినుండి సాంస్కృతిక వైరుధ్యంతో, భిన్న మతాల, భాషల, ప్రాంతీయ భేదాలతో, రకరకాల కుల ప్రవృత్తులతో సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలకు లోనై ఉన్నది.

ఆర్థిక అసమానతలు ఉన్న సమాజంలో సహజాతంగానే సాంఘిక అసమానతలు కూడా కొనసాగుతూ ఉంటాయి. ఈ అసమానత క్రమంలో ప్రపంచములో ఏ దేశంలో లేనటువంటి ప్రత్యేక లక్షణం భారతదేశానికి ఉంది — అదే కులము. కులంవల్ల సాంఘిక అసమానతలు మరింతగా పెరిగిపోవడం జరుగుతుంది. ఈ ''కులోద్భవం'' పై వాదోపవాదాలు ఎన్నో ఉన్నప్పటికినీ, ఈ అంశమువల్ల భారత సమాజం మరింతగా విభజింపబడి, క్రమానుగతంగా వర్గీకృత సమాజంగా పరిణమించినది. వర్గీకృత క్రమానుగత సమాజంలో, సమాజం హోదా పరమయిన శ్రమ - శారీరక శ్రమ చేసే వర్గాలమధ్య ''ఆధిక్య — న్యూనతా'' భావాలు ప్రస్ఫుటమవుతాయి. అట్లాగే భారత సమాజంలో కులం—వర్గము సమాంతరంగా ఉండడం గమనించదగ్గ విషయము హరిజన, గిరిజన, వెనుకబడిన కులాలు సాధారణంగా పేదవర్గం, అగ్ర, ఉన్నత కులాలలో ఎక్కువశాతం ధనికవర్గంగా ఉండడంవల్ల కులం — వర్గంలో ప్రతిబింబిస్తున్నట్లుగా కనిపిస్తుంది.

భారత సమాజంలో చారిత్రికంగా అనేకకారణాలుగా బలహీన వర్గాలు అణిచివేతకు అటు కుల పరంగా ఇటు వర్గ పరంగా గురి కావడం జరిగినది. ఈ చారిత్రిక, సాంఘిక, ఆర్థిక అణిచివేత కారణంగా ''అసమ పరిగణన'' (ఇన్‌ఈక్వల్ ట్రీట్‌మెంట్) కానీ, ''అసమరూప జీవనస్థాయి'' (ఇన్‌ఈక్వల్ స్టాండర్డ్ ఆఫ్ లివింగ్) కానీ ఏర్పడుతుంది. అసమరూప జీవనస్థాయి కొనసాగడం వల్ల సమాజంలో బలహీన—బలవంత వర్గాలు (ఆర్థిక, సాంఘిక, రాజకీయంగా) ఉత్పన్నమవుతాయి. అట్లాగే బలహీన — బలవంత వర్గాలు ఉండడం ద్వారా కూడా అసమరూప జీవనస్థాయి ఏర్పడుతుంది. ఈ రెండూ పరస్పర పూరకమయినవి. దీనిని రూపుమాపే క్రమంలోనే ఈనాటి ఆధునిక ప్రభుత్వాలు, బలహీన వర్గాల సంక్షేమం కొరకు గానీ, ఉద్ధరణకు గానీ వివిధ రంగాలలో కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్గచేయడం అవసరంగా భావిస్తున్నాయి.

అదే విధంగా భారతదేశంలో తరతరాలుగా ''చారిత్రిక అణిచివేత'' (ఏజ్ ఓల్డ్ అప్రెషన్)కు గురి అయిన హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాల సముద్ధరణకై స్వాతంత్ర్యానంతరము భారత ప్రభుత్వం కొన్ని ప్రత్యేక సదుపాయములను రిజర్వేషన్ల రూపంలో రాజ్యాంగములో పొందు పర్చడం జరిగింది. రాజ్యాంగములో రిజర్వేషన్లను ఏర్పాటు చేసే ముందు అవి కేవలం తాత్కాలిక ప్రాతిపదికగా మాత్రమే కొనసాగాలని, కాలక్రమంలో ప్రణాళికాబద్ధంగా చేపట్టబడే కార్యక్రమాల ద్వారా వారి అభివృద్ధి జరిగి, వివిధ కులాల మధ్య అంతరం తగ్గించడం సాధ్యమవుతుందని నాటి భారత ప్రభుత్వం నిర్ణయించడం జరిగినది. కానీ ఇటీవలిగా బీహార్, మరట్వాడా మరియు అనేక ప్రాంతాల్లో రిజర్వేషన్ల నిలిపివేతపై—కొనసాగుదలపై చెలరేగిన అశాంతి ఫలితంగా రిజర్వేషన్లను గురించి పునారాలోచించవల్సిన అవసరం ఏర్పడింది. దేశంలోని వివిధ వర్గాల నుంచి ఈ సమస్యపై భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చడం జరిగినది. అందులో ప్రధానంగా, రిజర్వేషన్లు సామాజికంగా ఉండాలా లేదా ఆర్థిక పరమయిన పునాదితో ఉండాలా అన్నది అతి ప్రముఖమయిన చర్చగా పరిణమించినది. బలహీన వర్గాలకు రిజర్వేషన్లను ఏర్పరచే ముందు ఏ విధమయిన ఆధారంగా ఏర్పరచాలన్న అంశముపై నాటి భారత ప్రభుత్వం కొంత చర్చ జరిపినప్పటికినీ, (రాజ్యాంగ నిర్మాణ దశలో) హరిజన, గిరిజన జాతుల విషయంపై

స్పష్టంగా తెల్పినప్పటికినీ, మిగతా వెనుకబడిన తరగతుల విషయంలో అస్పష్టంగా వదలివేస్తూ, ఆ నిర్ణయాధికారాన్ని రాష్ట్రాల స్వయం వివేచనకే వదలివేయడముతో, రాష్ట్రాలు కులం ప్రాతిపదికపై వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లను ఏర్పరచడం జరిగింది. తత్ఫలితంగా, అగ్రకులాలలో ఉన్న కొంతమంది పేద వర్గాలలో అసంతృప్తి ప్రబలిపోయినది ఈ అసంతృప్తి ఫలితమే, రిజర్వేషన్లు కులం ప్రాతిపదికగా కాక ఆర్థిక పరమయిన పునాదితో ఉండాలన్న వాదనా ముందుకు రావడం జరిగినది. ఒక రకంగా ఈ వాదనలో కొంత సమంజసం ఉన్నప్పటికినీ ''ఆర్థిక పరమయిన పునాదిని'' ఏలా నిర్ణయించాలన్నది కీలకమయిన అంశము. ఒక వ్యక్తి యొక్క ఆర్థిక స్థితిని ఖచ్చితంగా ఏలా నిర్ణయించాలన్న అంశముపై ఏలాంటి జవాబు ఈనాడు అందుబాటులో లేదు. అటువంటి పరిస్థితిలో, ఆయా ప్రజల పేదరికపు స్థాయి పైనన్నో, లేదా పేదరికాన్ని సూత్రీకరించే లేదా కొలిచే ఆదాయపు సర్టిఫికేట్ల పైనో ఆధారపడి వెనుకబడిన తనాన్ని నిర్ణయించినట్లయితే ప్రాబల్య కులాలు, ఉన్నత వర్గాలు కూడా పాలనా యంత్రాంగాన్ని ప్రభావితం చేసో, ప్రలోభపరిచో ఆయా సర్టిఫికేట్లను పొందవచ్చు తత్ఫలితంగా కుల ప్రాతిపదికపై పొందే ఆ కొద్దిపాటి ప్రయోజనం కూడా బలహీన వర్గాలకు దక్కక పోవచ్చు.

అందువల్ల ''వెనుకబడిన తనాన్ని'' నిర్ణయించడం కొరకు అయితేనేం, రిజర్వేషన్లను ఏ ప్రాతిపదికపై ఇవ్వాలన్న అంశముపై బలహీనవర్గాల సంక్షేమంకొరకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడానికై స్వాతంత్ర్యమునకు పూర్వంనుండీ ప్రయత్నాలు జరిగినాయి.[1] అయినప్పటికినీ ''వెనుకబడినతనాన్ని'' నిర్ణయించే అంశాల విషయంలో స్పష్టమయిన నిర్ధారణ జరగలేదు. ఈ అంశముపై భారత రాజ్యాంగములో ఉన్న పొందికను పరిశీలించినట్లయితే, రాజ్యాంగ నిర్మాతలు వెనుకబడినతనాన్ని ఏవిధంగా నిర్ధారించారో స్పష్టమవుతుంది.

వెనుకబడినతనం - భారతప్రభుత్వము నిర్వచించిన తీరు

వెనుకబడినతనాన్ని నిర్వచించడములో భారత రాజ్యాంగం చాల అస్పష్టంగా ఉంది. ప్రకరణం 366 (24) మరియు (25) లలో హరిజన, గిరిజన కులాలకు స్పష్టమైన అర్థం ఇవ్వబడింది. కానీ ఇతర వెనుకబడిన తరగతులనుగూర్చి భారత రాజ్యాంగములో తెల్పలేదు. ''వెనుకబడినతనం'' అంశముపై డా. అంబేద్కర్ చెపుతూ ఇలా అంటాడు.[2]

వెనుకబడినతనాన్ని నిర్వచించడం కష్టసాధ్యమయినపని. ఆరోగ్యం, విద్య, గృహ ఇత్యాది విషయాలకు ఆర్థికజీవనరంగములో సరిఅయిన అవకాశాలు లేక ''స్వయం అభివృద్ధి సాధించలేనిస్థితిగా'' వివరించడం జరిగింది. అందువలన ఆయన ఈ క్రింది అంశాలను ఆధారంగా చేసుకొని ''వెనుకబడినతనాన్ని'' వివరించినాడు.

1. తక్కువ ఆదాయము.
2. అక్షరాస్యత స్థాయి.
3. జీవనశైలికి సంబంధించిన ప్రమాణాలు. ము॥[3]

వాటిని వెనుకబడినతనాన్ని నిర్వచించడంలో ఆధారాంశములుగా తీసుకొన్నప్పటికినీ, వేరొకదశలో చెబుతూ ''వెనుకబడినజాతి నిర్ణయము అనేది ప్రభుత్వ ఉద్దేశ్యంలో ఏదైతే వెనుకబడినదో అదే వెనుకబడినజాతి అని తెలిపినాడు. అందువలన ''వెనుకబడినతనపు'' నిర్ధారణ రాష్ట్రాల అంశానికి వివేచనాధికారానికి వదలివేయడం జరిగినది.[4] ఈ విషయంపై ఎన్నో కమిటీలు నియామకం జరిగినా అవి ఎన్నెన్నో సూచనలు ఇచ్చినప్పటికినీ, ''వెనుకబడినతనం'' నిర్వచనంపై స్పష్టమైన వివరణ రాజ్యాంగములో కన్పించదు. రాజ్యాంగములో హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులకొరకు కొన్ని రక్షణలను, పాలనాపర ప్రత్యేక వసతులను ఇవ్వడం జరిగింది. వాటిని గమనిస్తే,

15వ ప్రకరణం ప్రకారం మతం, తెగ, కులం, లింగం, జన్మస్థానం ఆధారంగా చూపే వివక్షత నిషేధింపబడింది. కానీ హరిజన, గిరిజనులకు ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వబడింది. అట్లాగే ప్రకరణాలు 16, 17, 19, 23, 38, 46, ము॥ వాటిలో హరిజన, గిరిజనుల ఆసక్తులను రక్షించే స్వభావాన్ని పొందుపరిచినారు. ప్రకరణం 164 ప్రకారం మధ్యప్రదేశ్, ఒరిస్సా గిరిజన ప్రజల సంక్షేమార్థమై బాధ్యత వహించడానికి ఒక ప్రత్యేకమంత్రి నియామకం, 275వ ప్రకరణం ప్రకారం గిరిజన జాతుల సంక్షేమ నిమిత్తం, అస్సాం రాష్ట్రంలోని వెనుకబడినప్రాంతాల అభివృద్ధికై కేంద్రం రాష్ట్రాలకు గ్రాంట్లనిచ్చే అవకాశముంది. ఇదే ప్రకరణం ప్రకారం, హరిజన, గిరిజన జాతులకు రక్షణ కల్పించేటప్పుడు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లతో, కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ తప్పనిసరిగా సంప్రదించాలని నిబంధన ఏమీ లేదు. ప్రకరణాలు 330, 332, 333, 335, 338, 340, 341, 342, ము॥ హరిజన, గిరిజన జాతుల ప్రత్యేక ప్రతిపత్తిని గురించి తెల్పుతాయి.

పైన పేర్కొనబడినటువంటి రాజ్యాంగ రక్షకులు 18వ రాజ్యాంగ సవరణలో స్పష్టపరచబడి 1959 నుండి 1970 వరకు ఈ రిజర్వేషన్‌ల విధానము కొనసాగవలెనని నిర్దేశించింది. (ఇటీవలిగా, ఇంకా పది సంవత్సరాలు కొనసాగవలెనని కూడా ప్రకటించడం జరిగినది). కేవలం రాజ్యాంగ రక్షణలు మాత్రమే కాక, హరిజన, గిరిజన, వెనుకబడిన జాతులకు, కులాలకు కొన్ని ప్రత్యేకమయిన ప్రావిన్స్ ఉండినాయి. అవి ప్రధానంగా

1. శాసనపరిధి.
2. ఉద్యోగ విషయకపరిధి.

3. విద్యాపరిధి.

4. ప్రత్యేక ప్రావిన్సులు.

శాసనపరిధి :— రాజ్యాంగములోని 330, 332 మరియు 334 రాజ్యాంగ ప్రకరణల ప్రకారం హరిజన, గిరిజన తరగతుల వారికి లోక్‌సభలో, రాష్ట్ర శాసనసభలలో ప్రాతినిధ్య నిమిత్తము సీట్లను రిజర్వేషన్లద్వారా కేటాయించవలెనని ఉద్దేశించడం జరిగినది. ఈ అంశములో అస్సాం రాష్ట్రంను మినహాయించినారు, ఎందుకంటే ఆ రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు గిరిజనులే కాబట్టి.

ఉద్యోగ విషయక పరిధి :— 26 జనవరి, 1950 లో భారతప్రభుత్వము రాజ్యాంగములోని 15 (4), 325 ప్రకరణం ఆధారముగా హరిజన, గిరిజన తరగతులకు రిజర్వేషన్లను కేటాయించింది.[5] రిజర్వేషన్‌లలో పొందుపర్చిన నిబంధనలు ఈ విధంగా ఉన్నాయి.

భారత్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించే బహిరంగ భర్తీపోటీలలో కానీ, వేరే అధికారయిత సంస్థ ఏదైనా బహిరంగ పోటీద్వారా భర్తీ చేస్తున్నప్పుడు 12½% హరిజన జాతులకు, 5% చొప్పున గిరిజన జాతులకు కేటాయించవలనని నిర్దేశించినది. ఇటీవలే కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, వివిధ రాష్ట్రాలకు ఆజ్ఞలను జారీచేస్తూ 15% స్థానాలు 5% స్థానాలు గిరిజనులకు కేటాయించవలెనని సూచించినది వెనుకబడిన కులాల వారికి 25% స్థానాలు కేటాయించవలెనని తెలిపినప్పటికినీ, ఈ విషయంపై వివిధ రాష్ట్రాలు తమ తమ వివేచన ననుసరించి నడుస్తున్నాయి. ఇవేకాకుండా అతిముఖ్యమైన కొన్ని ''మినహాయింపులను'' కూడా ఇవ్వడం జరిగింది. అవి :—

1. వయఃపరిమితికి సంబంధించినవి (ఏజ్ లిమిట్): వివిధ ఉద్యోగ నియామక విషయంలో, భర్తీ విషయంలో హరిజన, గిరిజన అభ్యర్థుల వయఃపరిమితి లేదు సం. వరకు పొడిగించవచ్చు.

2. అర్హమయిన ప్రమాణాలు (మూటబిలిటీ ఆఫ్ స్టాండర్డ్స్) : (ఏ) పరీక్షద్వారా ప్రత్యక్ష భర్తీ (డయిరెక్ట్ రిక్రూట్‌మెంట్ బయి ఎక్సామినేషన్) :— వివిధ పోటీలకు, ఎంపికకు సంబంధించిన విషయాల్లో రిజర్వుడు అయిన స్థానాల కన్నా అభ్యర్థులు తక్కువశాతం అందుబాటులో ఉన్నప్పుడు లేదా సరిపోయే అభ్యర్థులు అందుబాటులో లేక స్థానాలు ఖాళీగా మిగిలినప్పుడు, క్రింది స్థాయిలో ఉండి, అవసరమయిన అర్హతలు కల్గి ఉండిన, హరిజన, గిరిజన అభ్యర్థిని సరాసరిగా పై స్థాయిలో నియమించవచ్చు. అయితే ఇది నియామక అధికారి ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉంటుంది.

(బి) పరీక్ష పద్ధతి ద్వారా కాక ప్రత్యక్ష భర్తీ (డయిరెక్ట్ రిక్రూట్‌మెంట్ అదర్ దాన్ బయి ఎక్సామినేషన్):— కనీస విద్యా, సాంకేతిక అర్హతలున్నటువంటి హరిజన, గిరిజన వ్యక్తిని ఇతరుల కన్నా తక్కువ ప్రమాణాలు కల్గి ఉన్నప్పటికినీ ఆ అభ్యర్థి పై స్థాయిలో నియామకం కావచ్చు.

(సి) ఎంపికేతర ఉద్యోగాలకు పదోన్నతిని ఇవ్వడం (ప్రమోషన్ టు నాన్ సెలెక్షన్ పోస్ట్స్) :- సీనియారిటీ లేదా అత్యధిక అనుభవ ఆధారంగ పదోన్నతి లభించేటువంటి ఉద్యోగాలకు సంబంధించి దృఢమయిన, ఖచ్చితమయిన సూత్ర సముదాయానుసరణ ప్రధానం కాక, హరిజన గిరిజన అభ్యర్థులను సానుభూతితో పరిశీలించవలెనని రాజ్యాంగంలో తెల్పడం జరిగింది.

(డి) ఎంపికయ్యే ఉద్యోగాలకు పదోన్నతి (ప్రమోషన్ టు సెలెక్షన్ పోస్ట్స్) :— ఎంపికచేసి పదోన్నతిని ఇచ్చే ఉద్యోగాల విషయంలోకూడా హరిజన, గిరిజన అభ్యర్థులకై మినహాయించిన ప్రమాణాలను (రిలాక్స్‌డ్ స్టాండర్డ్స్) దృష్టిలో ఉంచుకొని సానుభూతి వైఖరితో పరిశీలించవలెనని రాజ్యాంగములో తెల్పినారు.

(ఇ) రుసుములు (ఫీస్) :— హరిజన, గిరిజన అభ్యర్థి ఏ పదవికయినా, పరీక్షకయినా, ప్రవేశంకొరకు అయినా హాజరు కాగోరుతున్న లేదా అవుతున్న పక్షంలో ఆతనికి రుసుములు ¼ వంతులు తగ్గించబడ్డాయి. ఈ విధంగా ఉద్యోగ విషయక పరిధిలోనే కాక, విద్యా పరిధిలో కూడా హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.

విద్యా విషయక పరిధిలో రిజర్వేషన్లు

ఉద్యోగ విషయక పరిధివలనే వివిధ విద్యా సంస్థలలో, వాటి అనుబంధ అంశాలయిన రుసుములు, స్కాలర్‌షిప్‌లు ముII సౌకర్యములు అందచేయడం జరుగుతుంది. 15 (4), 29(2) క్లాజుల ప్రకారం ప్రభుత్వం, ఏ వర్గాన్నైనా సామాజికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన తరగతులు అని భావించిన పక్షంలో ఉద్ధరణ చర్యలు తీసుకోవచ్చు. పై విధంగా ప్రభుత్వం నిర్దేశించినప్పటికినీ, గమనించదగ్గ విషయమేమిటంటే, అలీఘడ్ విశ్వవిద్యాలయం, బీహార్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ముII రాష్ట్రాలలో కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో ఈ ప్రత్యేక సదుపాయములను అమలు జరుపడం లేదని తెల్పడం జరిగింది.[6]

ఈవిధంగా భారత సమాజంలో చారిత్రిక అణిచివేత కారణంగా ఉత్పన్నమయిన ఆర్థిక అసమానతలను దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వపాలనా యంత్రాంగములో సరిఅయిన ప్రాతినిధ్యం కల్పించడానికి, సమాజంలో సముచిత భాగస్వామ్యాన్ని ఏర్పరచేందుకు బలహీన వర్గాలకు రిజర్వేషన్లను ఏర్పాటుచేయడం ఒక విధానంగా నిర్ణయించడం జరిగింది. ప్రభుత్వ లక్ష్యం ఏమయినప్పటికినీ రిజర్వేషన్లపై సమాజంలో కొన్ని అనుకూల ప్రతికూల వాదాలున్నాయన్నది నిజం. అనుకూల అంశాల దృక్కోణం నుంచి వాదించేవర్గం రిజర్వేషన్ల కొనసాగుదలను సమర్థించగా, ప్రతికూల అంశాల దృక్కోణంనుంచి వాదించే వర్గము రిజర్వేషన్ల కొనసాగుదలను వ్యతిరేకిస్తున్నారు. ఆయా వాదాలను ఈ క్రింది విధంగా క్లుప్తీకరించవచ్చు.

అనుకూల అంశాలు మరియు సమర్ధనా వాదం

1 రిజర్వేషన్లు కల్పించడంవల్ల, చారిత్రిక అణిచివేతకు గురిఅయిన వెనుకబడిన, హరిజన, గిరిజన, నిమ్న వర్గాలకు ఇతరులతో సమాన ప్రాతినిధ్య అవకాశం, సాంఘిక న్యాయము, ఆయా వర్గాల నిరుద్యోగ సమస్యా పరిష్కారం కావచ్చు.

2. దళితవర్గాలకు అనాదిగా జరిగిన అన్యాయానికి రిజర్వేషన్‌లు ఒక ఉపహార ప్రక్రియగా పనిచేస్తూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందింప చేస్తుందంటారు.

3. రిజర్వేషన్లు సాంఘిక సమానత్వాన్ని సాధించడంలో ఉపయోగపడుతూ, అమానుషపీడనకు, అగ్రకులాల ఆధిపత్య విధానానికి, ప్రాబల్య వర్గాల పెత్తనానికి వ్యతిరేకంగా బలహీనవర్గాలకు ఒక రకంగా చేయూతనిస్తుందని అందువల్ల రిజర్వేషన్లు అవసరము అని అంటారు.

4. బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యమివ్వడం ప్రజాస్వామ్య సంప్రదాయం కాబట్టి, వాళ్ళ ఉద్ధరణకై రిజర్వేషన్లు అవసరం అని అంటారు. ఈ రకంగా అనుకూల సమర్థనా వాదం ఉంటే, రిజర్వేషన్ల వల్ల వచ్చే దుష్పరిణామాల ప్రభావంచే వాటిని వ్యతిరేకించే ప్రతికూల వాదంలో కూడా కొన్ని అంశాలు ఉన్నాయి. అవి క్లుప్తంగా

రిజర్వేషన్లపై ప్రతికూల వాదం

1. బలహీన, నిమ్న, హరిజన జాతులకు, కులాలకు ప్రాతినిధ్యం కల్పించడం వల్ల "అగ్ర వర్ణాలకు" నిరుద్యోగ సమస్యను సృష్టిస్తుందన్న వాదం ఒకటి ఉంది.

2. రిజర్వేషన్ల వల్ల, యోగ్యతా సూత్రం దెబ్బతిని, యోగ్యులయిన వారికి ప్రాతినిధ్యం లభించక అసమర్థులకు అవకాశాలను కల్పించడముతో పాలనా సామర్థ్యం దెబ్బతింటుందనియు ఒక వాదనా ఉంది.

3. కుల ప్రాతిపదికపై ప్రాతినిధ్య అవకాశాలు ఇవ్వడంలో నిరంతరం కులాన్ని గుర్తుచేస్తూ, కులతత్వాన్ని రెచ్చగొడ్తూ, జాతి విచ్ఛిన్నతకు దారి తీస్తుందనియు, పరస్పర ఉద్రిక్తతకు కారణమవుతుందన్న ఒక విమర్శ కూడా ఉంది. దీనిపై ప్రస్తావిస్తూ, రచయిత యం. యన్. శ్రీనివాస్ చెపుతూ, రిజర్వేషన్లు కులానికి, కులతత్వానికి నూతనంగా ప్రాణం పోసినదంటాడు.[7]

4. ఇంకొక ప్రధానమయిన విమర్శ ఏమిటంటే రిజర్వేషన్ల వల్ల సమానత్వ సూత్రానికి భంగం కల్గుతుందన్న అభిప్రాయం కూడా ఉంది.

పై విధంగా రిజర్వేషన్లపై అనుకూల–ప్రతికూల వాదాలు ఉన్నప్పటికినీ, ఇటీవలిగా ఉత్తరభారతదేశంలో చెలరేగిన అశాంతి ఒకదశలో చాలా తీవ్రస్థాయికి చేరుకోవడం జరిగింది. ఉద్యమాల రూపంలో కూడా వివిధ వర్గాలవారు తమతమ రీతుల్లో కొనసాగించినారు. ఈ సమస్యపై ఒకసాధారణ అంగీకారాన్ని కుదిర్చే విషయంలో దేశంలో అన్నిరాజకీయ పక్షాలు దాదాపు విఫలమయినాయనే చెప్పాలి. సూత్రప్రాయంగా రిజర్వేషన్లను దాదాపు అన్ని రాజకీయ పక్షాలు అంగీకరిస్తున్నప్పటికిని ఈ సమస్యపై ఆయా రాజకీయ పక్షాలు వాటి దృక్పథాలను గమనించడం సముచితం

రిజర్వేషన్లపై వివిధ భారత రాజకీయపక్షాల దృక్పథం

1. అఖిల భారత ఇందిరా కాంగ్రెసు, స్వరణసింగ్ కాంగ్రెసు ఈ అంశముపై సూత్రప్రాయముగా బలహీన వర్గాల సముద్ధరణకు రిజర్వేషన్ల విధానాన్ని బలపరుస్తున్నవి.[8]

2. అట్లాగే, వామపక్షాలయినటువంటి సి. పి. ఐ., సి. పి. యం.లు కూడా సైద్ధాంతికపరంగా అంగీకరించక పోయినప్పటికినీ, ప్రస్తుత సామాజిక దశలో ఈ విధానాన్ని బలపరుస్తున్నాయి.[9]

ఉదా :– బీహార్‌లో జరుగుతున్న రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమంపై తీర్మానిస్తూ 15, 1978 మార్చిలో సి. పి. ఐ. బీహార్ రాష్ట్ర మండలి ఇలా తెల్పింది.

"వివిధరంగాలలో ఉన్నటువంటి రిజర్వేషన్ల విధానాన్ని గురించి చర్చిస్తున్నప్పుడు, ఈ విధానం నేటికికూడా కనీస ప్రయోజనాలను సాధించలేదని రాష్ట్రమండలి అభిప్రాయపడుతున్నది అందువల్ల సాంఘిక అణిచివేత నుండి, భూస్వామ్య వత్తిడి నుండి నిమ్న జాతులను రక్షించడానికి రిజర్వేషన్ల కొనసాగుదల అవసరమని ఈ మండలి భావిస్తున్నది. అదే తీర్మాన ఉద్దేశ్యం కూడా" అని తెల్పడం జరిగినది.

3. అట్లాగే జనతా పార్టీలో బలీయ భాగస్వామ్య పక్షము అయిన ఒక మితవాద పక్షం జనసంఘం. దాని అభిప్రాయములచే దాదాపుగా ఏకీభవించేటువంటి సంస్థ ఉద్దేశ్యములు రిజర్వేషన్లపై ఈ క్రింది విధంగా అవగాహన కల్గి ఉంది.

"రిజర్వేషన్లను పదేండ్లకు మించి పొడిగించరాదన్న రాజ్యాంగ నిర్మాతల దూరాలోచన, దురాలోచన పరులైన రాజకీయ వేత్తలచే వమ్ముచేయబడింది. హింసా ఆందోళనలే కాదు– ఈ రిజర్వేషన్లను శాశ్వతం చేసినందువల్ల సమాజంలో నైతిక విలువలు నాశనమవుతున్నాయి. క్రమశిక్షణ దెబ్బతింటున్నది. కష్టపడకుండానే సౌకర్యాలు పొందడం వల్ల యోగ్యతా సూత్రం దెబ్బతింటున్నదని" భావించడం జరిగినది.[10]

4. అట్లాగే కొన్ని అతివాద వామపక్షముల అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి. మనదేశంలో ఉన్నటువంటి వర్గాలు రెండే రెండు. అవి బలహీన–బలవంత వర్గాలు. వాస్తవంలో వర్గ విభజనను ప్రభుత్వం ఆమోదించక అందరూ సమానమేనని ఒకవైపు పలుకుతూ, మరొక వైపు బలహీన వర్గాలపై అగ్రవర్ణాలకు అసూయాగ్నిని రగుల్చుతూ, బ్రిటిష్ పాలనలో కొనసాగిన వలస వాద సూత్రమయిన ''విభజించి పాలించు'' సూత్రమే ఈ ప్రభుత్వ రిజర్వేషన్ల విధానం అని చెప్పడం జరిగింది.[11]

5. ఇంకొక ప్రముఖ అతివాద వామపక్షముల అభిప్రాయం ఇలాఉంది.

''రిజర్వేషన్లు అనేవి ఆర్థిక అసమానతలు సమాజంలో ఉన్నంతకాలం ఉంటాయి. పాలకవర్గం తమదోపిడి నిరాటంకముగా కొనసాగించడానికి, సమాజంలో అణగద్రొక్క బడుతున్న పీడిత ప్రజానీకానికి భ్రమలు కల్పించి తమవైపు ఆకర్షించుకోవడానికి, ప్రజలలో దోపిడికి వ్యతిరేకంగా ఉన్న ప్రతిఘటనా శక్తిని, వారి పోరాటపటిమను, చైతన్యాన్ని నీరుగార్చడానికి, వివిధ కులాలమధ్య వైరుధ్యాలను పెంపొందింపచేసి తమను తాము కాపాడుకునే ప్రయత్నమే ఈ రిజర్వేషన్ల పాలసీ'' అని అంటారు.[12]

6. ఇంకొక బలీయమైన అభిప్రాయం ఏమిటంటే, ప్రభుత్వం ఒకవైపు రక్షణలను, సదుపాయాలను కల్పిస్తున్నప్పటికినీ, అవి పరోక్షంగా ఆయావర్గాలను సమాజానికి దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాయి. రక్షణపేరుతో ఆయా వర్గాలపై ''వివక్షత'' చూపించడం జరుగుతున్నది. అందువల్ల ఒకరకముగా ఈ పాలసీ ''రక్షణాయుతమయిన వివక్షత''గ అనిపిస్తుందంటారు.[13]

పై విధంగా రిజర్వేషన్లపై వాదోపవాదాలు, వివిధ రాజకీయ పక్షాల అభిప్రాయాలు ఎలా ఉన్నప్పటికినీ, రిజర్వేషన్ల సమస్య ఈనాటి సమకాలీన భారత సమాజంలో చాలా ఉద్రిక్తతను కల్గచేసిందనే చెప్పవల్సి వస్తుంది. కులం ఆధారంగా ఏర్పడినటువంటి రిజర్వేషన్లు, వాటిపై ఏర్పడిన వివాదం, సంఘర్షణ విశ్వవిద్యాలయాల్లో ప్రారంభమయి భారత గ్రామ సమాజంలోకి కూడా ప్రాకిందన్న నిజాన్ని మరట్వాడా విశ్వవిద్యాలయ అనుభవం చెపుతున్నది.[14]

అట్లాగే ఉత్తర భారతదేశంలోని బీహార్ రాష్ట్రములో రిజర్వేషన్ల ఉద్యమం చాలా తీవ్రస్థాయికి చేరుకున్నది. క్రమేపి అది వెనుకబడిన తరగతుల ఉద్యమంగా రూపు దాల్చింది. ఈ ఉద్యమ నాయకుడైన శ్రీరామ్ అవతార్ సింగ్ చెపుతూ ''రిజర్వేషన్లు కేవలం సదుపాయాల కొరకు మాత్రమే యేం పరిమితం కావడం లేదు. రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడంలో సాధనంగా ఉపయోగిస్తాం'' అని అంటాడు.[15] అంటే అచట రిజర్వేషన్లు ఎంతటి ఘర్షణను తెచ్చిపెట్టాయో సులభంగా ఊహించ వచ్చు.

ఈ రకంగా అతి క్లిష్ట పరిస్థితులు ఉత్పన్నమయిన ఈ రిజర్వేషన్ల సమస్యపై, ప్రశ్నావళి పద్ధతి ద్వారా ఒక విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు ఈ సమస్యపై ఏ విధంగా ఆలోచిస్తున్నారన్న దానిపై అభిప్రాయ సేకరణ చేయడం జరిగింది.[16] ఆయా పరిశోధనా ఫలితాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. భారతదేశంలో బలహీనవర్గాల సంక్షేమార్థం ఉన్నటువంటి రిజర్వేషన్ల విధానంపై కనీస అవగాహన కల్గియున్నవారు 69.41% ఉండగా, 27.06% మంది కనీస అవగాహన లేని వారు, ఏలాంటి సమాధానం చెప్పనివారు 3.53% మంది ఉన్నారు.

2. రిజర్వేషన్ల ''శాతంపై'' అభ్యర్థులకున్న ''గ్రహింపును'' పరిశీలిస్తే సమీప గ్రహింపుఉన్నవారే అత్యధిక శాతంలో (38.41%) ఉండగా ఏ సమాధానాన్ని చెప్పనివారు తరవాతి స్థానాన్ని ఆక్రమించారు. రిజర్వేషన్లశాతంపై స్పష్టమైన గ్రహింపు ఉన్నవారు 3.24% మాత్రమే ఉండగా, మిగతావారు తప్పుడు గ్రహింపును కల్గిఉన్నారు.

3. అట్లాగే ''రిజర్వేషన్ల కొనసాగింపు – పరిమితి''పై అభ్యర్థుల అభిప్రాయాలను పరిశీలించినట్లయితే (ఎ) 50%మంది 11–15 సం॥ వరకు మరియు తరువాతి కాలంలో కూడా కొనసాగవలెనని అభిప్రాయపడగ, కొనసాగేదశలో ఆర్థికపరమైన పునాది ఉండాలని ఈ అభ్యర్థులలో చాలామంది ప్రత్యామ్నాయంగా సూచించారు.

(బి) మరికొంతమంది 42.94% అభిప్రాయపడుతూ, యోగ్యతా సూత్రాన్ని దెబ్బతీస్తున్నదని, అసమర్థతను ప్రోత్సహిస్తున్నదని పరస్పర విద్వేషాలను రగుల్చుతున్నదని అభిప్రాయపడినారు.

(సి) మరికొంతమంది 7.3% మంది రిజర్వేషన్లు యథాతథస్థితిలోనే కొనసాగవలెనని, కనీస మానవ విలువల పరిరక్షణకు అవసరమంటు, బలహీన వర్గాలను సముద్ధరించడానికి, జాతీయ జీవనంలో భాగస్వాములుగా చేయడానికి ఈ పద్ధతి అవసరమని అభిప్రాయపడినారు.

అభ్యర్థుల సైద్ధాంతిక పూర్వాపర దృక్కోణాల నుంచి పరిశీలించినట్లయితే, వామపక్ష విద్యార్థులు ఈ విషయంలో వైరుధ్య భావాలను వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. దీర్ఘకాలికంగా బలహీన వర్గాల సంక్షేమానికి ఈ పద్ధతి ఏ మాత్రం పరిష్కారం కాదంటూనే, ప్రస్తుత వ్యవస్థలో ఈ పద్ధతి లోపభూయిష్టంగా ఉందని పేర్కొన్నారు. అయినప్పటికినీ వామపక్షానికి చెందిన కొంత మంది విద్యార్థులు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ఈ పద్ధతి కొంత కాలం పాటు కొనసాగితేనే బావుంటుందని తలంచినారు. అట్లాగే మితవాద పక్షాలకు చెందిన చాలా మంది విద్యార్థులు, వారిలో అగ్రవర్ణాలకు చెందిన వారు ఈ పద్ధతిని నిల్పివేయవల్సిందిగా భావించినారు. ఏ రాజకీయ సిద్ధాంత వైఖరిని

అవలంబించినప్పటికినీ, అటు వామ, ఇటు మితవాద అగ్రవర్ణాల వారు ఈ రిజర్వేషన్లను పెద్ద యెత్తున తిరస్కరించడం గమనించదగ్గ విషయం. ఈ యీ ఫలితాల ఆధారంగా తెల్పేదేమిటంటే, రిజర్వేషన్‌లు కొనసాగాలా వద్దా అన్న వితర్యాంశముపై తీసుకునే అభిప్రాయాలపై ఆయా అభ్యర్థులపై "కుల పూర్వపర ప్రభావం" ఉందనిపిస్తుంది.

పై రకంగా పరిశోధనా ఫలితాలు ఉన్నప్పటికినీ, సైద్ధాంతిక పరంగా, రిజర్వేషన్ల విధానాన్ని గురించి ఆలోచించినట్లయితే, ఆ విధాన ఫలితాలు కానీ, ప్రయోజనాలు కానీ కేవలం అక్షరాస్య, నగర ప్రాంత, బలహీన వర్గాల ప్రజలకే అందుబాటులో ఉన్నాయే తప్ప, లక్షలాది మంది నిరక్షరాస్య గ్రామీణ బలహీన వర్గాలపై కానీ, వారి సంతతిపై కానీ, ఈ రిజర్వేషన్ల విధానం యొక్క ప్రభావం కన్పించదు. ప్రయోజనాలు అందుతున్నట్లు కన్పించవు.

అట్లాగే రాజకీయపరంగా ఏర్పరిచినటువంటి రిజర్వేషన్లను గమనించినట్లయితే, ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు వెనుకబడిన తరగతులనుండే అయినప్పటికీ, వారుకూడా ఆర్థికంగా బలంఉన్నఅభ్యర్థులే ముందుకువస్తున్నారు. ఇంకా నిశితంగా పరిశీలించినట్లయితే, ఎన్నికల్లో నిలబడే వెనుకబడిన, హరిజన, గిరిజన అభ్యర్థులు — గ్రామీణ అగ్రవర్ణ, ధనిక వర్గాలకు అనుకూలంగా ఉన్నవారో, కనుసన్నల్లో మెదిలినవారో ఉండడము జరుగుతున్నది. అంతేగాకుండా ముఖ్యముగా హరిజన, గిరిజన అభ్యర్థులు నాన్ రిజర్వ్‌డ్ నియోజకవర్గములో పోటీచేస్తే గెలిచిన దానికంటే ఓడిపోయిన సంఘటనలే ఎక్కువ. అంటే చట్టబద్ధంగా రిజర్వేషన్లు బలహీన వర్గాలవారికి అందుబాటులో ఉంటున్నట్లు కనిపించినా, వాస్తవానికి నిజమయిన బలహీన, హరిజన, గిరిజన జాతుల ప్రజల ప్రాతినిధ్యం లభించడం లేదన్నమాటే. పరోక్షంగా ఈ అవకాశాలు మళ్ళీ సంప్రదాయ అధికారం చెలాయించే వర్గాలకే చెందుతున్నట్లుగానే కనిపిస్తుంది.

ముగింపు

భారతదేశంలో చారిత్రికంగా నిపరీతమయిన అణిచివేతకు గురిఅయిన బలహీనవర్గాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడానికి ఉద్దేశించబడిన రిజర్వేషన్లవంటి చర్యలు వాస్తవంలో విజయవంతం కాలేక పోతున్నాయన్నది సుస్పష్టము పైగా అనేక రకాలుగా సమాజంలో ఉద్రిక్తతలను కల్గచేస్తున్నాయి. అందువల్ల ఒక సమస్యకు పరిష్కారమార్గం ఆయా సామాజిక, ఆర్థిక రాజకీయ సమగ్ర స్వరూపంలో ఇమిడి ఉంటుంది. మలగేరీ, కాకాకలేలకర్ వంటి కమీషన్‌లు ఎన్ని నియమించినా చిత్తశుద్ధిలేని,స్పష్టమయిన నిర్దేశన మార్గం లేని సమాజంలో అవి కేవలం కాగితాల వరకే పరిమితమవుతాయి.

ఇంకా మౌలికంగా ఆలోచించినట్లయితే, రిజర్వేషన్ల విధానం ఒక సంస్కరణ వాద ప్రక్రియ. సామాజిక ఉపరితల సమస్య. మౌలిక సామాజిక స్వభావంలో అసమానతలు కొనసాగుతున్నప్పుడు, సామాజిక నిర్మాణ సంబంధాల్లో, వివిధ స్థాయిల్లో, వివిధ రంగాలలో అనేక రూపాలుగా అంతరాలు కొనసాగుతున్నప్పుడు, కేవలం కొన్ని అవకాశాలు కల్పించడం ద్వారానో, పరిమిత ప్రత్యేక సదుపాయాలు సంక్షేమం పేరుతో సమకూర్చడం ద్వారానో, రాజ్యాంగములో నిర్దేశించుకున్న సామ్యవాద రాజ్యస్థాపన కానీ, మానవజాతి అంతిమ లక్ష్యమయిన సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందా? అన్న ప్రశ్న తీవ్రంగా ఆలోచించదగినది. ముప్పది సంవత్సరాల స్వతంత్ర భారతదేశ చరిత నేర్పిన అనుభవాన్ని పరిశీలించినట్లయితే, సామాజిక సంబంధాల్లో మౌలికమయిన మార్పులు తీసుకురానంతవరకు, ఉపరితల నిర్మాణంలో రిజర్వేషన్ల వంటి ఎన్ని సంస్థాగతమైన మార్పులను ప్రవేశపెట్టినప్పటికీ, వాటి ఫలితం మరికొన్ని సమస్యలను సృష్టించేదిగా మాత్రమే ఉంటుందే కానీ పరిష్కారం సూచించేటట్లుగా లేదని బోధపడుతుంది.

సంప్రదింపు రచనలు

1 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ—వాల్యూం. XIII, నం. 43, 44. అక్టోబర్, 28, 1978. పుట. 1813.

2 భారతప్రభుత్వ ప్రథమ పంచవర్ష ప్రణాళిక. పుట. 634

3 భారత రాజ్యాంగము—రత్నా రివాంకర్. పుట. 186.

4 భారత రాజ్యాంగము – రచయిత రత్నా రివాంకర్. పుట. 191.

5 భారత రాజ్యాంగము – రచయిత రత్నా రివాంకర్. పుట. 38.

6 హరిజన, గిరిజన జాతుల నివేదిక, 1976, పుట. 33.

7 భారత రాజ్యాంగము – రచయిత రత్నా రివాంకర్. పుట. 15.

8 మెయిన్ స్ట్రీమ్ – వారపత్రిక. మార్చి 3, 1979. పుట. 6.

9 మెయిన్ స్ట్రీమ్ – వారపత్రిక. మార్చి 3, 1979. పుట. 6.

10 జ్యాగతి, 1978. దీపావళి ప్రత్యేక సంచిక. పుట 345 వ్యాస రచయిత హెచ్. వి. శేషాద్రి.

11 ఆలోచన – పక్ష పత్రిక, 15–2–1979. పుట. 2.

12 ఆయాపక్షీయులను పరిశోధకులు వ్యక్తిగతంగా కల్సి సేకరించిన అభిప్రాయము.

13 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, వాల్యూం. 13, నం. 2, జనవరి 14, 1978. పుట. 69.

14 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, వాల్యూం 13. నం. 36. సెప్టెంబర్ 9, 1978. పుట. 1537.

15 హిమ్మత్, పక్షపత్రిక, మార్చి 23, 1979. పుట. 18.

16 బి. జనార్దన్‌రావు, కాకతీయ విశ్వ విద్యాలయం. ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగంనకు సమర్పించిన పరిశోధనా వ్యాసము అయిన ''రిజర్వేషన్లు — విద్యార్థుల దృక్పథం'' అనే దాని నుండి గ్రహింపబడినది.

అ ధో జ్ఞా పి క లు

1 రిజర్వేషన్ల అవసరాన్ని ప్రత్యక్షంగా తెల్పినప్పటికినీ, అగ్ర కులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా 1917 లో రామస్వామి నాయకర్ నాయకత్వాన ''బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం'' బయలుదేరింది. అదే సంవత్సరములో మైసూర్ రాష్ట్రం లోని కొల్హాపూర్ రాజా, తాను కూడా బలహీన వర్గాల సంక్షేమానికై కొన్ని ప్రత్యేక సదుపాయములు కల్పించ డానికి సుముఖుడుగా ఉన్నట్లు నాటి గవర్నర్ మాంటేగ్ చేమ్సుఫర్డ్‌తో తెల్పినాడు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా 1920, 1921, 1925లలో బలహీనవర్గాల సంక్షేమ నిమిత్తమై వివిధ కమిటీలను నియమించినది. 1928 లో హర్టాగ్ కమిటీ, 1929 లో భారత కేంద్ర కమిటీ, 1930లో బొంబాయి రాష్ట్ర కమిటీ ము॥ వెనుకబడిన జాతుల సమస్యను కుణ్ణంగా పరిశీలించినాయి.

ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, వాల్యూం XIII, నం. 43,44. అక్టోబర్, 1978. పుట. 1813.

2 డాక్టర్ అంబేద్కర్ మాటలు. ''భారత ప్రభుత్వ ప్రథమ పంచవర్ష ప్రణాళిక'' పుట. 634.

3 రత్నా రివాంకర్—''భారత రాజ్యాంగము'' పుట. 186.

4 రత్నా రివాంకర్—''భారత రాజ్యాంగము'' పుట. 191.

5 ''భారత రాజ్యాంగము''—రత్నా రివాంకర్. పుట. 38.

6 హరిజన, గిరిజన జాతులపై కమీషనర్ నివేదిక 1976. పుట. 33

7 రత్నా రివాంకర్—''భారత రాజ్యాంగము'' పుట 15.

8 మెయిన్ స్ట్రీమ్ — వార పత్రిక. మార్చి 3, 1979. పుట. 6.

9 మెయిన్ స్ట్రీమ్ — వార పత్రిక, మార్చి 3, 1979. పుట. 6.

10 జాగృతి. 1978. దీపావళి ప్రత్యేక సంచిక. పుట. 345, వ్యాస రచయిత :— హెచ్. వి. శేషాద్రి, కర్ణాటక ప్రాంత ప్రచారక్.

11 ఆలోచన—పక్షపత్రిక. 15—2—1979 పేజి. 2.

12 పై అభిప్రాయాన్ని పరిశోధకులు వ్యక్తిగతంగా ఆయా పక్షీయులను కల్సి సేకరించి నటువంటిది.

13 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ. వాల్యూం 13, నం. 2, జనవరి 14, 1978. పుట. 69.

14 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, వాల్యూం. 13, నం. 36. సెప్టెంబర్, 1978, పుట 1537. వివరణ:— మరట్వాడా విశ్వవిద్యాలయ సమీప ప్రాంతమైన నాందేడ్, సానేఖడ్ ప్రాంతాలపై ఈ సమస్య ఘర్షణ ప్రభావంవల్ల హరిజన, ముహరుల-కామన్త, క్షత్రియ కులాల మధ్య ఘర్షణకు దారితీసి దాదాపు 71 గ్రామాల్లో 1012 కుటుంబాలు చాలా తీవ్రంగా నష్టపోయినాయని నివేదికలో తెల్పినారు.

15 హిమ్మత్ — పక్ష పత్రిక—మార్చి 23, 1979. పుట. 18.

16 ''రిజర్వేషన్లు—విద్యార్థుల దృక్పథము'' బి. జనార్దన్‌రావు. ఈ పరిశోధనా వ్యాసమును కాకతీయ విశ్వ విద్యాలయం, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగమునకు సమర్పించడం జరిగినది. ఈ పరిశోధనలో మొత్తం 170 మంది విద్యార్థుల అభిప్రాయ సేకరణ చేయడమైనది. వారిలో 31 మంది మెడికల్, 39 మంది ఇంజనీర్, 100 మంది యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఉన్నారు ఈ విద్యార్థులు కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్నవారు



ఈగలు ముసిరిన బెల్లం

శ్రీ చిలసంకూరి రామబ్రహ్మం

అదే చూడు సరిగ్గా
 ఎదుట బస్సు స్టాపులో
ముసిరిన ఈగల మాటున.

బారులలో వాలి తనివిదీరా సోమాలగ్రోలి
పేదప్రజల కందుబాటులోలేని పలావాది
హవిస్సుల భక్షించి తృప్తులై
సుగంధ తాంబూలాలసేవిస్తూ
గోల్డుఫ్లేకు సమిధల హోమధూమాలు పీలుస్తూ

యధావిధిగా సోమయాజులై
పారవశ్యంతో తూలుతూ సోలుతూ
యశః కాముకులై
ఆల్కహాలికులు
సామ్యవేదోక్త మంత్రపుష్పంబుల ప్రస్తుతింప
బస్సుస్టాపులో తక్షణంబు ప్రత్యక్షంబైన

చుట్టుముట్టి ఒకుమ్మడిగ అన్ని
చోట్లా వాల్తూ తోల్తే
పోక పీక్క తింటూ

"అరుణులు మంటలు ఆకలి
ఝుంఝుం తత్త్వం సోహం
రసోవై సః"

అని సామ్యగానాల రొదలు చేస్తూ
ముసిరిన బుత్విక్కుల మాటున
మసక మసగ్గా కనబడుతూ
బుత్విక్కులచే పీక్కుతినబడుతూ
అంతటా తానేయై అదుక్కుంటూ
తినకుండానే ఉంటున్న
యజ్ఞ పురుషుడు
అధునాతన భారత కథానాయకుడు
ఆధునిక కవిత్వపు బ్రహ్మతత్త్వం
అదే !
చూడు సరిగ్గా !

నిక్షిప్త క్షణాలు

శ్రీ పాశం వెంకటేశ్వర్ రెడ్డి

నీ కళ్ళ కుట్మలాలలో
 కుటీరాలేసుకుని నివసిస్తున్న నా కోరికలు
 ఆదరణలేని అనాధ బాలికల్లా
 కన్నీటి ప్రవాహంలో పడి కారిపోతున్నాయి !
 సముద్రంపై తేలియాడే హిమశిలల్లా
 నిశీధిని వీధుల వెంటబడి
 కొట్టుకుపోతున్న నా హృదయంలో
 కలలు గ్రుడ్లుపెట్టి వెళ్ళిపోయాయి !

రావలసిన వసంతం —
ఎడారుల్లో దారితప్పింది.
కూయవలసిన కోయిల —
ముళ్ళ డొంకల్లో ఇరుక్కుంది.

చూస్తున్నావా —

రాలిన పువ్వులకు
చెదలెలా సమాధులు కడుతున్నాయో !

కానీ,

కాలం రాల్చే క్షణాలను
ఎందుకలా నీ స్పర్శతో నింపి
నాకోసం నిక్షిప్తం చేస్తావు ?
ఎందుకలా నా జ్ఞాపకాలకు
సుమ గుచ్ఛాల్లా వ్రేలాడతావు ?
ఎందుకు నా హృదయ కమలంపై
హిమ బిందువులా మెరుస్తావు ?
కొమ్మల్ని విరగ్గొట్టుకునే ప్రమాదానికి సిద్ధమై
తన నిండా కాయలు భరించాలనే
వృక్షపు వెఱ్ఱితనం నా హృదయానిది –

ఒక్క అగ్నిపర్వతాన్ని దాచుకునే సంతృప్తికోసం
సముద్రం లాంటి కన్నీటిని స్వంతం చేసుకుంది !
నే కోల్పోయిన నీ పాట
పల్లవిని సంస్కరించుకునేందుకు
ఏ గుబుర్లలోనో దాక్కుని కూచే
ఎన్ని పక్షుల స్వరాలను వెంబడించింది !
విషం కక్కుతూ వెళ్ళిన కాలాన్నంతా
భద్రపరచి భద్రపరచి
చివరకు చిద్రుపలై పోతుంది –
నేలరాలేవరకూ
ఫలాన్ని కలగనే
తావి నిర్దాక్షిణ్యత నెరుగని మొగ్గలాగ !

నీరాజనం

శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య

ఇ మ్మహోత్సవ వేళ నా యెడద పొంగి
తెలుగు బెల్లలు కలిపి కీర్తింప దొడగె
వర్ణనాతీతమా నాటి వైభవములు
పుణ్యనదులు నిధులు మహాపురుష కథలు·

కొమ్మనామాత్యవర్యుని కూర్మి సుతుడు
ఘనుడు తిక్కన్న నేడు పుట్టిన దినమ్మె !
ఆ కవిబ్రహ్మ భారతీయాత్మతోడ
తన వరాల గంటమ్ము పట్టిన దినమ్మె!

చీలిక లడ్డుగోడలు సృ
జించి పరాయి మతాల పిచ్చి బ్రా
ల్మాలిన తెల్గుజాతి నొక
మాట నొకానొక బాటపై సము
ద్వేల గతి ప్రతోళి నడి
పించిన తిక్కన సోమయాజి కి
వ్వేళ నివాళు లెత్తెద ని
వేద్యముగా కపురంపు గుండెలన్.

రాజరాజ నరేంద్రు యాజకశ్రుతులలో
పులకించిపోయిన తెలుగునేల
గణపతీంద్రుని ఖడ్గకాంతి పుంజమ్ములో
తళ తళలాడిన తెలుగునేల
అనవేమ నరపాలు నౌదార్య గరిమలో
తెలుపులూరినయట్టి తెలుగునేల
కృష్ణరాయల దివ్యకీర్తి ధ్వజాలలో
కళలుల్లసిల్లిన తెలుగునేల

నాల్గు చెఱగులు కలిసి ఈనాడు వెలసి
అల పురాతనౌదార్య ధుర్యతను మెఱసి
కొలువుకూటమ్ము తీర్చెను తెలుగుతల్లి
భాగ్యనగర మణీమయ భద్రపీఠి.

సామంత రాగోల సాచివేయుటలోన
బ్రహ్మనాయని మించు ప్రౌఢు డెవడు
కలము ఖడ్గం బొక్క గతినడపిన కృష్ణ
రాయని మించిన రాజెవండు
తెల్లదొర తుపాకి డిల్లజేసిన టంగు
టూరిని మించిన ధీరుడెవడు
ఆంధ్రరాష్ట్రముకోస మాహుతంబై చన్న
శ్రీరాములను మించు జెట్టి యెవడు

కాశినాథుని మించి ఏదేశమునను
చేత నెంతున్న నం తిచ్చు దాత యెవడు
వారు తెలుగుజాతికి గర్వకారణమయి
నడపుదురు గాదె ! మము మహోన్నత పథాల.

తన ఆలాపనచే జగమ్మునకు
చైతన్యంబు చేకూర్చి యా
తెనుగుం బాసకు జుంటితేనియ రు
చిం దెప్పించి పోతన్నకే
యనుజుండో మతి గోపరాజుకు సహా
ధ్యాయుండొ గాన్షైన ధ
న్యుని త్యాగయ్యను గూర్చి పాడుకొని
సంతోషింతు నివ్వేళలన్.

ఊరకయేల చెప్పకొన
నుద్భట రుద్రట మమ్మటాది కా
శ్మీర విపశ్చి దగ్రణులు
మెచ్చగ సంస్కృతమందు కావ్యశో
భా రస చర్చలందు మన
పండితరాయ లొకండె చాలు నిం
కూరక మల్లినాథుల మ
హోన్నతిఁ జెప్పగ నేల మాటికిన్.

ప్రణయమ్ములో పడ్డ పతికి ఖడ్గము నిచ్చి
కలని కంపిన దొక్క తెలుగు పడుచు
వెనుజూపి వచ్చిన విభునకు పసుపిచ్చె
జలకమాడగ నొక్క తెలుగు చాన
దండెత్తి వచ్చిన దాయను వెంటాడి
త్రిప్పికొట్టిన దొక్క తెలుగు పొలతి
మల్కల దండుపై ఉల్కపోలిక దూకి
కలచి వైచిన దొక్క తెలుగు గరిత
ప్రాణనాథుని జయము గీర్వాణభాషఁ
గావ్య మొనరించె నొక తెల్గు కలువకంటి
నాడు మాత్రమె కాదు ఈనాడు గలరు
తెలుగునాట దుర్గాబాయి దేశముఖులు.

విశ్వ కోశము - విశ్వ ప్రకాశము

(44వ పేజీ తరువాయి)

సూచికయందు ''విశ్వప్రకాశ ఃవిశ్వః'' అని విశ్వప్రకాశము యొక్క ప్రక్కన దాని నిర్మాతనామము ''విశ్వః'' అని యున్నది. ఇకను వారాణసీ చౌఖాంబా వారి సంవత్సరములో ముద్రితమైన క్యాటలాగులో నిఘంటువులలో ''విశ్వప్రకాశః'' అని కర్తృనామ రహితముగ నొక గ్రంధముపేరు కనుపించుచున్నది. విశ్వప్రకాశ మని, విశ్వకోశమని, విశ్వనిఘంటువని పెద్దలు ఒక్క పుస్తకమునే పేర్కొనుట కలదు.

ఇది యిట్లుండ మేదినీ నిఘంటువు కడన తత్కర్త మేదినీకరుఁడు తాఁ గైకొనిన నిఘంటువుల పేళ్లలో ''శ్లో॥ అపి బహుదోషం విశ్వప్రకాశ కోశంచ సువిచార్య ... ॥'' అని యీ విశ్వప్రకాశములో పెక్కు తప్పులున్నట్లు చెప్పినాఁడు.

కావున పై ''విశ్వకోశము- విశ్వనిఘంటువు-విశ్వప్రకాశము'' లనుఁజూచినవారు ఆ మూడుపేళ్లు నొక్కనిఘంటువునకేనా ? లేక ఆమూడు నిఘంటువులు భిన్నకర్తృకములైన వేరు వేరు నిఘంటువులా ? విశ్వప్రకాశములో నున్న తప్పులతోసహా ''భారతి'' మూలమున దేశప్రజలకుఁ దెలుపుచు ప్రత్యేకించి నాకు జాబువ్రాసి తెలుపఁ గోరుచున్నాను. నా అడ్రసు — విక్రాల శేషాచార్యులు కలికివాయ పోస్టు, (వయా) సింగరాయకొండ. ప్రకాశంజిల్లా.

అధోజ్ఞాపికలు

1 ఈ త్రికాండశేషము. చెన్నపురిలో శ్రీ వావిళ్లవారిచేఁ బ్రచురింపఁబడినది.

2 వీరు సంస్కృతములో పురుషోత్తమదేవ రచితమైన ఈ త్రికాండ శేషమునకు, మేదిని కరకృతమైన మేదినీకోశమునకు, హారావళి నిఘంటువునకును, అజయుని కోశమునకును, తెనుగు టీకలు పీఠికలు రచియించినవి మద్రాసులో శ్రీ వావిళ్ల ప్రెస్సువారే ప్రచురించినవి. ఇకనుఁ దెనుఁగులో వీరే తూము రామదాస ప్రణీతమైన ఆంధ్ర పద నిధానమునకును టీక పీఠికలను రచియించిరి. ఈ టీక రారో శుక్లనామ సంవత్సరములో ... వారిచే ముద్రితమైనది. అమలాపురపు సన్యాసికవి రచించిన ''సకలాంధ్ర పారసంగ్రహ'' మను నిఘంటువుయొక్క ఏతద్రచితములే యైన టీకా — పీఠికలు అచ్చు ఐనదా ? తెలియదు. దీని టీకా — పీఠికలు వేరొక ప్రెస్సువా రచ్చువేసిరియుట.

కీ. శే. వేలూరి శివరామశాస్త్రిగారు

సగుణ బ్రహ్మ విద్య

ఉపాస్తిచేగాని ధ్యానముచేగానిస్వస్వరూపమును వికసింపజేయుటయే ఉపనిషత్తుల లక్ష్యము. ఇటులయ్యును అది కలుగజేయు లోపల పలుతెగల అలౌకిక రహస్యములతో పరిచితి కలిగించుటయు ఉపనిషత్తుల అవాంతర వ్యాపారము విద్యలకు అనగా ఉపాసనములకు చేతనను చక్కగా మేలుకొలిపి, చేతనలో నెలకొలుపుట పరమ ప్రయోజనము. సంపూర్ణమగు చేతనావస్థితికి ముందు సమత్వమును చిత్తశుద్ధియు వ్యాపకమగు చైతన్యముతో పరిచయము కలిగించును. వ్యాపకమగు చైతన్యబోధమునందు ప్రతిష్ఠ కలుగుట పయిమెట్టు నెక్కుటకు యోగ్యత కలిగించును. దానఁజేసి ఉపనిషత్తులలో సగుణ బ్రహ్మ విద్య పిదపనే నిర్గుణ బ్రహ్మవిద్య చెప్పబడెను.

శంకరులవారి నిర్గుణ బ్రహ్మవిద్యయే ఎల్లెడల ప్రాధాన్యము బడసియున్నది దానజేసి మాటలు చెప్పువారేగాని యీ విద్య లనుష్ఠించువారు కఱవు. సగుణ బ్రహ్మ విద్యవలన కలుగు ధృతియు శక్తియు వీనిమీద ఎవరికిని ఆస్థలేదు 'ఈవిశ్వమంతయు మాయ' అను నీమతమున ఉపాసనకు తావున్నను తత్త్వబోధమున తావులేదు. ఉపాసన బుద్ధిని స్వచ్ఛమొనరించునుగాని అజ్ఞానమును నాశన మొనరింపదు. ఇటులుతలచి సగుణ విద్యానుష్ఠానమునకు పూనుకొనకపోవుట అన్నిదేశములను చూపట్టుచున్నది. ఆ తత్త్వ జిజ్ఞాసకును ఆంతరశుద్ధి అత్యవసరము. తత్వవిచారము సత్యబోధ కలిగించును. కాని దీనికి ఏకాగ్రతయు బుద్ధికి ఔజ్జ్వల్యమును వలయును. ఉపాసన ఈ రెంటిని కలిగించును. ఇట్టి నైర్మల్యము లేనిచో విచార సంపన్నుడు కావచ్చునుగాని బ్రహ్మసంపన్నుడు కాజాలడు. సగుణబ్రహ్మోపాసన అంతరమును ఉద్దీపింపజేసి అభయమునందు ప్రతిష్ఠించును. చిత్తముయొక్క సూక్ష్మపరిణామము అదృశ్యము అలౌకికమునగు జగత్తును ప్రకాశింపజేయును. దానఁజేసియే ఉపనిషద్విద్యాగాంభీర్య మింత యెక్కుడు.

అన్ని ఉపనిషత్తులయు అభిప్రాయ మొకటికాదని ప్రాచీనాచార్యులెరుగుదురు. కొన్ని అద్వైతమునే చెప్పును ఉపాసనలను మాత్రమే కొన్నిచెప్పును. మఱికొన్ని రాముడే పరమతత్వమని లేక గోపాలుడు లేక నృసింహుడని చెప్పును. కర్మపూర్వకములగు ఉపాసనములను కొన్నిచెప్పును—వీనిలో ఒక మంత్రముతో తత్త్వప్రసంగము చెల్లు. ఇటులగుటచేసి దార్శనికులు తమతమ బుద్ధికౌశలముచే ఉపనిషత్తులను తమ మతమున కనుకూలముగా లగించుకొనిరి. కాని తేరిపాఱ జూచినచో ఈ మంత్రముల గూర్చి స్థిరమగు ఒక సిద్ధాంతమునకు వచ్చుట అసంభవము కాదు.

ఉపనిషదుపాస్తి కేవల దేవతాధ్యానముకాదు. మఱి బ్రహ్మ చైతన్యమును మేలుకొల్పి దానిలో నిన్ను నిమగ్నుని చేయుట ఉపాస్తికి ఫలము. ధ్యానము సాధకుని విక్షేపమును పోగొట్టి విరాట్ చైతన్య ప్రకాశము కలిగించును. చైతన్యము యొక్క యథార్థ జాగరణమును ఉపాస్తి కలిగించును. మనుజునకు ఆనందము దెస బోవుట నైజప్రవృత్తి. ఇదియే మనుజుని ప్రకృతరూపము కావున ఆనందము కలుగు వఱకు తృప్తిలేదు. అనావృతమగు సత్తాను భూతి మానవునకు కలుగవలెను—తృప్తితీరవలెను.

కర్మానుయాయులకు ఒక విశిష్టరూపమున్నది. దేశకాలములు, కర్తృత్వబుద్ధి—వీనిని పురస్కరించుకొని కర్మచేయవలసి యుండును. మానవులు వ్యక్తిత్వముచే ఉద్బోధితులై కర్మసంస్కారముచే ఆచ్ఛన్నులగుదురు. ఈ కర్మగ్రంథినుండి ఉపనిషత్తులు ముక్తి కలిగించును.

జ్ఞానము - ఉపాసన

మనోగతి యెప్పుడును వెలుపలికి. ఆత్మకేంద్రముకాని మనస్సు విషయములను చుట్టుకొని యుండును. ఉపాసనమునందును మనస్సు ధ్యేయమును గూర్చి పరుగిడును —ఆ ధ్యేయము ఆత్మాతిరిక్తమగు అనగా తన కంటే వేఱగు ఈశ్వరుడు కావచ్చును, ఈశ్వరుని ఏదోయొక పేరు కావచ్చును. శక్తిరూపమగు ఈశ్వర విగ్రహముగాని కావచ్చును· ఈశ్వరజ్ఞానము కావచ్చును. ఆత్మకేంద్రహీనతా రూపమగు మనస్సుకు స్వాభావికమగు ఈ వృత్తి ఉపాసనము నందును తొలఁగిపోదు ఉపాసనమునకు లక్ష్యము వ్యాపకమగు ఈశ్వరీయ రూపమయినను ఈశ్వర జ్ఞానము దాఁటి ఉపాసన నడవనేరదుగదా ! ఇచటవృత్తి యీశ్వర విషయమగుటజేసి, అది రమణీయమగుటజేసి సూక్ష్మ జ్ఞానముచే దివ్యభావముచే దివ్యశక్తిచే ప్రేరితమగును.

ఇచట జ్ఞానము విశేషాకారముగా నుండును. ఆత్మజ్ఞానమే నిర్విశేషము. కావుననే ఉపాసన సిద్ధించినను జ్ఞానము కలుగవలసియే యుండుట శేషించియే యుండును. ఏలనగా "ఆత్మావై ఇదగ్ం సర్వం" — ఇదియెల్లయు ఆత్మయే అను ఎఱుక ఉపాసన మందొదవదు. జ్ఞానము బాహ్యమును దేనిని అపేక్షింపదు. అది లోపలను వెలుపలను ఉన్న అఖండవస్తువు. ఇందు బాహ్యవృత్తి యనుమాట ఉండదు. ఇంతియకాక ధ్యానముచే ఆస్వాదింపఁదగినది ఏదియు నుండదు. ఇచట అసంసారియగు తాను జాగరిల్లును. ఈ జాగరణమున కొక విశేషరూపమున్నది. కర్తృత్వ భోక్తృత్వముల అవ

సానమే ఆరూపము. దీన ఇటీవలి ఆచార్యులు బ్రహ్మమునకు వృత్తి వ్యాపృత్వము నొప్పిరి. వృత్తిహీనమగు జ్ఞానము బ్రహ్మస్వరూపము. బ్రహ్మాకారవృత్తియు అవసన్నమగు పిదప బ్రహ్మస్థితి.

అశేష వృత్తులకంటె బ్రహ్మాకారవృత్తి భిన్నము. ఉపాస్య రూపమునుబట్టి ఉపాసనావృత్తి స్ఫూర్తమగును. బ్రహ్మమునకు రూపములేదు–బ్రహ్మబోధముచే బుద్ధి ఉద్బుద్ధమగుట బ్రహ్మాకారమై బ్రహ్మమై స్ఫూర్తమగును. అపుడో ఏ రూపమును ఉండదు. ఏలన బ్రహ్మము నీరూపము. బ్రహ్మాకారవృత్తి వేఱు వస్తువు.

ఉపాసన-జ్ఞానము

లౌకికకర్మగాని అలౌకిక కర్మగాని ప్రాణసంవేగముచే పొడమును. అలౌకిక కర్మభోగము సూక్ష్మమయినను అది జ్ఞానమయ సత్త్వనుగాని విజ్ఞానమయ సత్త్వనుగాని జాగరిల్లజేయజాలదు. దానజేసి ఉపనిషత్తులలో కర్మ ప్రశంసకానరాదు. ఆత్మజ్ఞానములేని మనుజుడు కర్మకేంద్రమునందే బంధింపబడి యుండును.

మానవునిలో ప్రాణము యొక్క స్థూలసంక్షోభములేని సూక్ష్మసంవేగమొక టున్నది. దానితో ఉపాసనారంభము. సత్యమునను సంధానము చేయగల సంవేదనము ఉపాసనము నందున్నది. అది మానవుని అంతరసత్త్వను ఉద్దీపింపజేసి జీవనమును మేలుతరమగు వెలుగుతో చెలిమి కలుగునటు లొనరించును. ఉపాసనచే ప్రాణములకు ఊర్ధ్వసంచారము, విజ్ఞాన సూక్ష్మవికాసము, దాన అలౌకిక జ్ఞానమును శక్తియు నిత్యము కలుగుచున్నను ఉపనిషత్తులు శక్తి కంటె జ్ఞానమునే ఎక్కుడుగా గ్రహించెను. జ్ఞానము జీవుని సత్యమున ప్రతిష్ఠించును–శక్తి ఐశ్వర్యమున ప్రతిష్ఠించును. ఎవని శక్తిచే విశ్వము విధృతమై అనుప్రాణితమో ఉపాసన మతనితో పరిచితి కలిగించును. మఱియు దివ్యజీవనముచే దివ్యజ్ఞానముచే దివ్యాను ప్రేరణముచే సాధకుని పయిమెట్టు కెక్కించును. మానవుని ఉనికిలోగల అన్నికోశములను విరాట్పురుషుని విశ్వలీలా ఛందముచే అనుప్రాణిత మొనరించును.

ఉపాసన పైమెట్టులో సాధకునిచేతన క్రమక్రమముగా విశ్వచేతనతో అభేదత పడయుచున్నటులు కనుగొనును. పిదప విశ్వచేతనా వలంబముచేతనే ఆ చేతననుగూడ నతిక్రమించి అతిమానస చేతన నెఱిగికొనును.

ఛందము యొక్క ఆకర్షణచే సగుణ బ్రహ్మ సంధానము. అపుడు జీవనోల్లాసమునందు అనంతములగు రూపములును ఛందములును ముఖరితములగును. కాని యింత విభూతి సంచారము కలిగినను చేతన తృప్తినొందదు. దాని చూపు ఎంతసేపును ఏకత్వము మీద. సత్త్వకు అనగా ఉనికికిగల విరాట్తత్త్వము భూతి కంటె స్వరూపానుభూతియే దొడ్డదికదా! ఉపాసనచే విజ్ఞానమున కవకాశము కలిగించి దానిగుండ సత్యముయొక్క విశ్వరూప సాక్షాత్కారము కలిగించినను జీవాత్మకును పరమాత్మకును ఏ మాత్రము వ్యవధానమున్నను ఉపనిషత్తులు ఊరకుండవు. అవి చరమ సత్యమునకు తీసికొని పోయిగాని సాధకుని విడువవు. ఉపాసనము మనల బ్రాహ్మశక్తిచే దీప్తిచే పూరించినను జీవేశ్వరుల తేడాను తీసివేయజాలవు, వానికట్టి యుద్దేశమును లేదు. ఏలనంగా దానికిగలశక్తి అంతమాత్రమే. ఉపాసనము దివ్యజీవన విభూతిని ఐశ్వర్యమును అపేక్షించును. దానజేసియే అపుడపుడు ఈశ్వర సంబంధమగు స్థితితో అభిన్నత కల్పించుకొనును — ఆ అభిన్నత శక్తితోగల అభిన్నత — కానిసత్తతో కాదు— ఉపాసన ఈశ్వరశక్తి సంవేగముచే జీవుని ఈశ్వరభావాపన్నుని జేయగలదు. కాని అతని నిరుపాధిక స్వరూపముతో సాధకుని పరిచితుని చేయజాలదు. ఈశ్వరుని జ్ఞానమునకును శక్తికిని అంతములేదు. ఒకహద్దు ఉన్నచో అతడు ఈశ్వరుడుకాడు. అతని ఉనికి ఎల్లెడను. దానికి సంకోచము ఉండజాలదు. అంతయు ఈశ్వరుని జ్ఞానము నందున్నది. అతడు ముక్తికి కారణము -- అనాది నిధనుడు—అవ్యయుడు. అతడు తన అప్రతిహతశక్తిచే విశ్వమును నియమించును. సాలెపురుగు దారము వలె సృష్టి అతనినుండియే వచ్చుచున్నది.

జీవేశ్వరుల వేఱిమి యీ జ్ఞానశక్తికి ఒకహద్దు అని ఉండుటయు లేకుండుటయు బట్టియే నిర్ధారితమగుచున్నది. జీవుని జ్ఞానమున కొక హద్దున్నది. ఈశ జ్ఞానమునకు లేదు.

ఈ హద్దుకలదని తెలియుటచె జీవుడు తన్ను క్షుద్రుడని తెలిసికొనును. ఈ యెఱుకయను కాలిగొలుసుచే అతడు సంసారమను చెఱలోనున్నాడు. అతనికీబంధమునుండి తప్పించుకొనుటలో నైసర్గికమగు ప్రవృత్తి కలదు. దానికొఱకే అతడీశ్వరునితో యోగము చెందగోరును. ఇతరమగు ఏప్రవృత్తియు అతనిని తృప్తిపఱుపదు. ఏలనగా ఇతర ప్రవృత్తులన్నియు జీవనము యొక్క ప్రాథమిక ప్రేరణమునుండియే ప్రసూతములు. ఈ ప్రేరణ స్వభావముయొక్క సహజసంస్కారము. దానితో ఉచ్చతర చేతనకెట్టి సంపర్కమునులేదు. ప్రాథమికప్రవృత్తి ప్రేరణచే జీవుడు ఒక విషయమునుండి మఱియొక విషయమునకు పరువిడుచుండును.

మానవుడనగా ప్రాణమును అన్నమయకోశమేకాదు — అతని సకలవిధములగు ప్రవృత్తులమూలమునందును ఆత్మవికాసమునకు వ్యాకులత కలదు. ఈ వికాస వేగము, ప్రాణకోశము నందును మనఃకోశమునందును విజ్ఞానకోశమునందును ఆనందమయ కోశము నందును ఉత్పన్నమగును. స్థూలవికాసముచే జీవునకు తృప్తిలేదు. సూక్ష్మవికాసము కొఱకతడు ఈశ్వరసంబంధము కోరును. ఉపాసనచే ఆ సంబంధము కలుగును. భావనాతిశయముచే ఈశ్వరశక్తి జ్ఞానములతో క్రమపరిచయము కలుగును.

ఉపాసన - విజ్ఞానము

విజ్ఞానరూపముగా ప్రాణరూపముగా వాగ్రూపముగా బ్రహ్మోపాసన మొనరించుటకు సాధనాక్షేత్రమున ఫలముకలదు. బ్రహ్మము విశ్వవిజ్ఞానమయము. విజ్ఞానము ప్రకాశించు స్వభావము

కలవస్తువు. బ్రహ్మరూపముగా విజ్ఞానోపాసనచే చిత్తము విజ్ఞాన ప్రకాశముచే వెలుగును. ఈ వెలుగులోనుండి బయలుదేరి విశ్వమంతయు వ్యాప్తమగును. ఈ కాంతిముందు విశ్వావరణము విడిపడును. చిదాకాశమున విశ్వమయమగు విజ్ఞానస్ఫూర్తిచే సాధకుడు తృప్తిసనును. ఈ విజ్ఞానప్రజ్ఞ నిరవచ్ఛిన్నము; అఖండము.

విజ్ఞానమునందేది ప్రకాశమో ప్రాణమునందది శక్తి. విజ్ఞాన వికాసముతోపాటు ప్రాణము శాంతమును వ్యాపకమును అనుచువచ్చును. చిత్త చాంచల్యము పూర్తిగ పోవగనే మహాప్రాణ సంచారముకలుగును. బర్గ్‌సన్ భాషలో ఈ మహాప్రాణము "Elan vital". మనుష్యుని క్షుద్రములగు సంకల్పములు వికల్పములు మహాప్రాణములో మునిగిపోయి చిత్తము ఈశ్వర సంబంధములగు సంకల్పముల కాధారమగును. అపుడు సంకల్పమాత్రమెల్లయు సిద్ధించును. మహాప్రాణప్రతిష్ఠ జరుగగనే వాక్కుయొక్క సూక్ష్మస్తరమున కవతారణ. అపుడువాక్కు ఛందస్సునకు వాహనమగును. ఛందోబద్ధమగు వాక్యమునుండియే మంత్రోత్పత్తి. ఛందోబద్ధమగు వాక్యమే శ్రుతి. అశరీరియగు ఈవాక్కు మహాశక్తి కాధారము. దీనిస్ఫూర్తిచే సిద్ధి. సృష్టి ఇట్టి వాక్కుచేతనే ఉద్భూతమైనది. సంకల్పము—వాక్కు—సృష్టి వీనిలో పరస్పరము సంయోగసూత్రము కలదు. సూక్ష్మప్రాణముల స్పందనముతో సంకల్పోత్పత్తి. సంకల్పము వాగ్రూపముగా పరిణమించి జగత్తును సృజించును. ఒకరివ్యథ కనుగొని స్వాభావికముగా వ్యథననుభవించునపుడు కలుగు మనోవికారము అంతర్వేదన మనజెల్లునుగాని అది ప్రేమకాదు. అదియేదేనగుగాక, అదిపరస్పరము సమవేదనము ఎంత పెంపొందించునో ఆఘాతము తగిలినంతనే అంత విచ్ఛేదము కలిగించును. అది జీవనసాధారణవృత్తి అది ప్రాణస్తరమునందు అనుభూతమగును. ప్రేమ ఆత్మనిష్ఠము. ఆత్మకేంద్రకము. ఆత్మోజ్జ్వల్యముచే అది ఉజ్జ్వలము. దాని వ్యాపకత్వమున కెందును సంకోచముండదు. అది సకల విరుద్ధావస్థలను దాటి తన ప్రాణముల నొడ్డివిషయము నుజ్జీవింపజేయును. ప్రేమ మృత్యుంజయము. దాని తాకున జీవనోత్సము మీది బండ ఉబికి పడును. జీవన మానందలహరిలో ఈదులాడును. ప్రేమ శక్తిమంతము—ప్రేమము విరోధమును తినివైచును. జీవనమునందలి చిరపురాతన జీవనమును నవీన మొనరించి విశ్వప్రాణమును సమృద్ధతర మొనరింపగలదు. ప్రేమ తనహృదయమును విప్పార్చి బ్రహ్మాండమును పిండాండమును సమస్తమును ఆలింగనము చేసికొని, మృత్యువులో జీవనమును—కుత్సితములోసుందరమును—అకల్యాణములో శివమును—జాగరిల్లజేయును.

ఉపనిషత్తులు చెప్పుసాధనలో ఒక స్వాభావికత ఉన్నది. అది— మన స్వరూపములో విరాట్‌స్పృహ. దాని పరిచయము పొందగలుగుచో సాధనమిగుల సుగమము కాగలదు. అపుడు స్పష్టమగు అనుభూతి కాగలదు. అపుడు మనము ఏ క్షుద్రాశయమునకును పాల్పడ జాలము. ఏలనగా అది అపుడు మన స్వభావమునకు సరిపడదు. మరియు విరాడనుభూతి మనస్వభావము. ఎప్పుడో ఒకప్పటి అనుభూతి కాదిది. విరాట్టయి పోవుటయే మన స్వభావము. ఉపనిషత్తులలోని క్రొత్తమాట ఇదియే. ఒకానొకమెట్టులో 'నేతి నేతి' అనునది ఉపనిషత్ సాధనమయినను దానిని అభావమూలకమగు సాధనయని యనరాదు. ఉపనిషత్తు ఈశ్వరుని విశ్వరూపమును చూపెను. గావున దాన విరాట్‌జీవనపు టాకర్షణ మున్నది ఈసాధన సర్వత్రబ్రహ్మమును బడయును. కాని ఏతావన్మాత్రమున సంతృప్తి కాదు. ఈబ్రహ్మదృష్టిచే మొదల బ్రహ్మాకర్షణమును, పరిణతిలో బ్రహ్మైక్యమును కలుగును. సాధకుడు అచట బ్రహ్మదృష్టినిదాటి బ్రహ్మముతో అభిన్నుడగును. సాధనలో ఈ పరిణతి చిట్టచివరది. తత్త్వానుభూతి యనగా నిది.

విషయమునందు బ్రహ్మదృష్టితో ఉపనిషత్ సాధన మొదలగును. బ్రహ్మదృష్టి నెలకొనుచో ఆత్మదృష్టియు నెలకొనును. బ్రహ్మదృష్టి వల్ల పదార్థముల ఆనందమయ స్వరూపము మనకు భాసించును. దివ్యదీప్తిచే సాధకుని అంతఃకరణము వెలుగును. విషయమునందుగాని అంతఃకరణమునందుగాని ఉన్న స్థూలభావము క్రమక్రమముగా నీరసించును. ఈ రీతిగా అన్ని విషయముల లోపలినుండియు బ్రహ్మ స్పర్శము సాధకుని పులకింపజేయును. ఇదికల్పన కాదు — ఇది ముమ్మాటికిని సత్యము. ఇది సాధకుల కనుభవము. ఈ యనుభవము కలిగినదనుచో సాధకుని అంతఃకరణము అతి స్వచ్ఛమాయె నన్నమాట. అటు తరువాత లోపల గూడ సాధకుడు బ్రహ్మదృష్టి చేయవలసియున్నాడు. అటు లొనర్చిన యెడలనే అంతఃకరణము సత్త్వశక్తిచే బలిష్ఠమగును. దానజేసియే ఉప

నిషత్తులు ప్రాణోపాసనమును, మన–ఉపాసనమును, విజ్ఞానోపాసనమును విధించెను. మఱియు తత్త్వములయు వాయ్వాకాశాగ్ని వరుణాదులయు ఉపాస్తిని చెప్పెను. దాని యుద్దేశమేమన అన్నిటిని బ్రహ్మమయ మొనరించుటయే. ఇట్టి ఉపాస్తులచే సాధకుడు జ్ఞానశక్తి సంపన్నుడగును. కేవలము ఆనంద సంచారమేకాక జ్ఞాన వికాసము గూడ (ఉపనిషత్తుల) ఉపాస్తుల ఉద్దేశము. తత్త్వబోధను కంటెవేఱుగా భావోచ్ఛ్వాసమున కుపనిష దుపాసనలలో తావులేదు. కావుననే ఒకొక్క ఉపాసన మొకొక్క విజ్ఞాన విశేషము లేక విద్య. ఈ విద్యలుఅనుభూతి సోపానములలో సత్యముయొక్క ఏదోఒకరూపమును ప్రకాశింపజేయును. ఒకొక్క విద్య కొకొక్క ఉపలబ్ధి కలదు. ఉపాస్తివల్ల స్థూలమునందు బ్రహ్మబోధ కలుగును. అది స్థిరపడిన పిదప సూక్ష్మమునందు బ్రహ్మబోధ కావలయును. ఈ రెంటను బ్రహ్మబోధ మేర్పడి నేరు తన్నినను ఇంకను సూక్ష్మానుభూతికి ప్రయత్నింపవలసియే యుండును. ఈ దెస అనేక లోకములు దాటి సగుణ బ్రహ్మానుభూతిలో మునుఁగుదుము. ప్రాణ మనో విజ్ఞానములపై నొక లోకమున్నది. జ్ఞానమయమును ఋతమయమును ఆనందమయమును అగు సత్తచే ఈ లోకము పరిపూర్ణము.

ఇచట ఉపాసనా ఫలము నిర్ణీతమగును. ప్రాణోపాసన చేసి ప్రాణశక్తి నుపార్జించి అటులొదవిన మహా ప్రాణశక్తిచే శాంతిని నొందుము. ప్రాణశక్తి శాంతమగుటజేసి వృత్తియు శాంతమగుచు వచ్చును. దీనికి ఫలమిదియేనా ? కాదు — విశ్వప్రాణ సంచారముచే స్వభావజాతమగు మన ప్రవృత్తియు శాంతతదాల్చి నిస్తరంగమగు విశ్వప్రాణ ప్రభావ మనుభవించి ఒకానొక సుఖము పడయును. ఉద్వేలమగు ప్రాణశక్తి శాంతమగుచో దానిశక్తి వృద్ధి చెందును. అటు పిదప జ్ఞానసాధనా మార్గము నేరుగా కన్పించును. ప్రాణోపాస మిందులకు ఆవశ్యకము.

ఈ రీతిగనే మన — ఉపాసనచే సూక్ష్మప్రాణమును సంకల్ప వికల్పములును శాంతములగుచు వచ్చును. సంకల్పముల శక్తియు గతియు అప్రతిహతములగును. సూక్ష్మ విజ్ఞానము ఉదయించును. అది విశ్వ విజ్ఞానముతో పరిచయ మొదవించును. ఈ శక్తులు లెస్సగా నియంత్రిత మొనరింపబడెనేని అంతఃకరణమునందు స్వచ్ఛతయు సూక్ష్మతయు నెలకొనుటతోపాటు విరాట్‌సత్తాస్ఫూర్తియు విశేషశాంతియు అనుభవమునకు వచ్చును. సూక్ష్మము కంటె సూక్ష్మతరమును, స్వచ్ఛము కంటె స్వచ్ఛతరమగు లోకముల ప్రకాశము కలుగును. ఊర్ధ్వలోకములు మానసానుభూతి వేద్యములు కావు. అవి స్వతః ప్రకాశములు. ఈ ఊర్ధ్వగతికి శేషసీమ సగుణ బ్రహ్మలోకమున సగుణ బ్రహ్మప్రాప్తి. సాధకుడు అపహతపాప్ముడై అచటికి బోవును. ఇచట సాధకునందు శాంతియుజ్ఞానమును వైరాగ్యమును ఐశ్వర్యమును పూర్ణములగును. ఇది దేవయానమార్గము.

పలు తెగలగు ఉపాసనలలో దహరాకాశోపాసన ఒకటి. ఇది అత్యంత సుఖకరమును ఫలదాయకమును. అంతఃప్రదేశములోని అంతర తమ ప్రదేశమున తెజోమయమగు అవకాశమొకటి కలదు. ఈ ఆకాశమున ప్రవేశించుమార్గము హృదయగుహ. ఇది ధ్యానమునకు ప్రశస్తమగు క్షేత్రము. యోగశాస్త్రమున భ్రూమధ్యమున ధ్యానించు తెఱ గొకటి ఉన్నది కాని హృదయాకాశమున ధ్యానము నిరుపద్రవమయినదియు అనాయాస సాధ్యమును అయియున్నది.

సిద్ధి స్వరూపము

సిద్ధిమార్గములు రెండు. ఉపాస్తిచే ఈశ్వరశక్తి నాకర్షించి స్వసత్తను పూర్ణ మొనరించుకొని యోగైశ్వర్యముల ననేకముల బడయుట ఒకటి. ఇది యోగమార్గము. ఈ మార్గమున శక్తియొక్క బహు విధములగు ఆవేగ మధకరించనగును. దివ్య విభూతి వికసింపనగును. దీనిచే సాధకుడు స్వతః ప్రవృత్తి నుండియు తదుద్వేగము నుండియు శాంతి నొందును. కాని యోగమున కిదియ ముఖ్యఫలము కాదు. ఈశ్వరజ్ఞానము తోడను, ఈశ్వర శక్తితోడను పరిచితియే ముఖ్యఫలము. ప్రకృతికి అధీనత్వమే జీవత్వము ప్రకృతి మీది కర్తృత్వమే ఈశ్వరత్వము. ఉపాసనాఫలముగా ఎపుడోఒకప్పుడు సాధకునిలో ఈశ్వరత్వావేశము కలుగును. ఉపాసనచే జ్ఞాన శక్తులును సాధకునిలో నిండారును. ఉపాస్తి సాధకుని విశ్వకల్యాణచ్ఛందముచే ఉద్‌బుద్ధుని చేయును. మఱి ప్రాణస్పందము తోడను, విజ్ఞాన స్పందము తోడను పరిచయము కలిగించును. అటు లయినను ఉపాస్తి ఛందోమయమగు ఈ జీవనపు కల్యాణమూర్తిని దాటజాలదు.

మానవుల అంతర్జీవనమందు ఛందమున్నది. ప్రకృతికి ఛందమున్నది. ప్రాణశక్తికి ఛందముతో నిగూఢమగు సంబంధమున్నది. సృష్టిఛందోవికాసమే. ఛందోబద్ధమగు ప్రాణసంచారము సృష్టినింత మధుర మొనరించెను. సృష్టిలో స్తరస్తరమందును ఛందఃప్రేరణ మంతర్నిహితమ్మై యున్నది. ఈ ఛందోధారయే సృష్టియొక్క సకలస్తరము లందును ప్రకాశించి సమగ్ర బ్రహ్మాండమును ఏకసూత్రముచే గ్రుచ్చుచున్నది. ప్రాకృత జగత్తులోనుండి వెలువడిన జీవనము గూడ ఛందః ప్రకాశమే. దానిపేరు ఉపనిషద్భాషలో అధిభూతము. ఇక అంతర్జీవనమునం దనుభూతమగు ఛంద మధ్యాత్మము. ఈ బహిః ప్రకృతికిని, అంతః ప్రకృతికిని గల ఛందమునం దొక రహస్సంబంధమున్నది. దానికి కారణ మీ యంతర్ బహిర్ జీవనములలో అనవచ్ఛిన్నమగు నొక జీవనధార ప్రవహించుటయే. గభీరమగు ఛందముల ఆంతరమునుండి ప్రకాశించు అనంత జీవనధార భేదబోధను తొలగించును. జీవనమున ఈ అధ్యాత్మ అధిభూతముల ప్రకాశము కంటె విడిగా మఱియొక గొప్ప ప్రకాశమున్నది. అది అధిదైవము. ఈ అధి దైవజగత్తు అధ్యాత్మాధిభూతములను సమన్వయ పఱచును. అచట చైతన్య సూక్ష్మతయు దీప్తియు సుఖమయమగు ప్రాణకంపనమును వ్యాప్తమ్మై యుండును. దాన అంతర్ జీవనము బాహ్య జీవనముతో ఏకమయిపోవును. ఈ అధిదైవ జీవనము స్వచ్ఛమును ప్రకాశశీలము నై యున్నది.

ఈ అధ్యాత్మము—అధిభూతము — అధి దైవము — అనునవి చైతన్యము యొక్కయే మూడు రూపములు. చైతన్య మొకటియే యయ్యు దాని ప్రకాశ మంతర్ జగత్తునందును బాహ్య జగత్తునందును వ్యాపించియున్నది. 'అంతర్ బహిశ్చ తత్ సర్వం వ్యాప్య

నారాయణః స్థితః'' — అంతర్ జగతి యందు విశేషించి నానావిధ క్రియలలో గుండ చైతన్య ప్రకాశము అధ్యాత్మము. బహిః ప్రపంచము నందు శబ్ద స్పర్శ రూప రస గంధములు భూతవస్తు సముదాయము — వీని లోపల నుండి చైతన్య ప్రకాశ మధిభూతము. ఇక అంతరిక్షమున సూర్యుడు చంద్రుడు గ్రహాదులు మొదలగు వాని గుండ చైతన్య ప్రకాశ మధి దైవము. అధ్యాత్మము విషయి- అధిభూతము విషయము. అధిదైవ మీ రెంటిని సమన్వయ పఱచును. సూర్యచంద్రాదులతో మన అంతర్బహిః ప్రపంచములకు పరస్పరము సాక్షాత్ సంబంధమును పరంపరాను సంబంధమును ఉండియున్నది. బుద్ధితో సూర్యునకు సంబంధమున్నది. మనస్సుతో చంద్రునకు సంబంధమున్నది. కంటితో తేజస్సునకు సంబంధమున్నది. ఘ్రాణముతో గంధమున కున్నది. ధ్యానమునం దొకానొక భూమికలో ఈ సంబంధ జ్ఞాన ముదయింపగలదు.

ఉపాస్తి అంతర్ బహిర్ జీవనములందు ఈ ఆధి దైవిక జీవనముతో సంబంధమును నెలకొలుపును. అది సాధని ధ్యాన సోపానము నుండి జ్ఞాన సోపానమున కెక్కించును. సమస్త విశ్వమును ఒక దివ్య రూపముగా కనిపింపజేయుట ఉపాసనకు ప్రత్యక్ష ఫలము. సాధకుడీ దివ్య రూపము లోపల నుండి ఈశ్వరతత్త్వపు విరాట్‌తత్త్వమును ధారణచేయుటకు సమర్థుడగును. సాధకుని అంతరము ఈశ్వర ప్రకాశముచే దీప్తమగును. ఈశ్వర శక్తిచే నిబ్బరమగును. ఈ యవస్థలో బ్రహ్మ ప్రతిష్ఠ కలుగును. కాని బ్రహ్మా భిన్నత మాత్రము కలుగజాలదు. ఉపనిషత్తుల దృష్టిలో ఇంతటి జ్ఞానము కూడా చరమ జ్ఞానము కాదు. జీవత్వ పరిధి కల వట్టు బ్రహ్మమునందు స్థితి కలుగదు. ఆరోహణ మార్గమున సుందర జీవన మెంత వికాస మొందినను, గంభీరమగు సూక్ష్మ జ్ఞానాధారము ఎంత దొరకినను సమస్త ప్రకాశమునుదాటి సత్యము 'స్వే మహిమ్ని ప్రతిష్ఠితమ్' — తన మహిమ మందే ఉన్నది. ఉపాసన దానిని పొందజేయజాలదు. భువరాద్యూర్ధ్వ లోకముల స్వచ్ఛతా శుభ్రతలను ప్రజ్ఞాబుద్ధులను ప్రకాశింపజేసినను ఉన్ముక్తమగు జ్ఞానము నది ప్రకాశింప జేయజాలదు. ఇచటనే ఉపాసనమునకు గల లాఘవము. ఉపాసనము సిద్ధించినపిదప బ్రహ్మాభిన్న భావన చేయవలసియున్నది. ఆ భావన విశ్వలీలా విశ్వ సృష్టుల స్పందనము నుండి మనలను విడిపించును. ఆ భావనయే అవిద్యను జీవబ్రహ్మ భేదమును ఊచముట్టుగా తొలగించగలదు.

సాధనలో రెండు దారులు — ఒకటి, సద్యోముక్తి, రెండు క్రమ ముక్తి. జ్ఞానశక్తుల అల్పత్వమును తొలగించుకొనుటయే ముక్తి. ముక్తని అవస్థ యిట్టిది—జీవావస్థయందలి అల్పత్వమును సంవేగమును దాటి దివ్య జీవనముగని 'దైవీ-సంపదను' బడయుట. అపుడు జీవనములోపల భాగవత మూర్ఛన ప్రకాశించును. బ్రహ్మచ్ఛందమునే అపుడు జీవనము లీలాయితమగును. మానవునందే జీవనధారాభివ్యక్తి శుష్కముకాలేదు- దానికింకను పై వికాసమున్నది. కావున ఈరీతిగా అలౌకికమగు ఆ మార్గమును సాధకుడు ఉపాసనచే కనుగొనును. ఇది దివ్యసిద్ధి. ఈమార్గమున యోగశక్తికి వికాసము. తపశ్శక్తిచే ఇచ్ఛ అప్రతిహతమగును. ఈ యవస్థా విశేషము గూడ ముక్తియే. ఏలనగా జీవునం దిచట అల్పతలేదు. కాని అవిద్య ఇంకను ఉండనే ఉన్నది తన మహిమలో తానున్న పిదపనే దేశకాల కర్మముల నుండి మనకు బంధము పోగలదు. సిద్ధులు మొదలగు శక్తు లిచట అకించిత్కరములు. ఆత్మవికాసము స్పందశూన్యము స్వప్రకాశము శివము శాంతము అద్వైతము.

విశ్వచ్ఛందము పైన ప్రజ్ఞాలోకము. అచటఛందము భాష స్పందము అంతర్హితము. అది వ్యక్తమూ కాదు, అవ్యక్తమూ కాదు. మఱి యీ రెంటికి అతీతము. అచట వివర్తము శాంతము. శక్తి నిర్వాపితము. విశ్వలీల స్తబ్ధము. ఇది సత్యము, ఇది మహిమ, ఇది అభయము. ఉపనిషద్విద్యచే ఈ అభయ ప్రతిష్ఠ.

శాంతి సంకేతం

శ్రీ అడ్డి రామకృష్ణ

లోకం కల్మషాన్ని చూడలేని సూర్యుడు
ముఖం చిట్లించి ఎర్రబారాడు
అదిచూడలేని కటికచీకటి రాక్షసుడు
అసహనంతో ఎగసితన్నాడు
ముక్కలైపోయాడు సూర్యుడు
భూమి బ్రద్దలైంది
మహోన్నత శిఖరాలన్నీ కూలిపోయాయి ...
ముక్కలైన సూర్యుడు చుక్కలై
చీకటి తలపై మినుకు మినుకు మన్నాడు
ఆ చుక్కల మధ్యనుండి
ఓరచూపులతో వంకరొంకరగ నవ్వుతూ
శాంతి పతాకలాగ
చల్లని చంద్రుడు ఉదయించాడు.

కలగూరగంప

మినీ కవిత

"అల్పాక్షరముల ననల్పార్థరచన" అని ప్రాచీన విమర్శకులు అన్నారు. అలాగే "Economy of words..." అని ఆధునిక విమర్శకులు అంటున్నారు· 'మినీకవిత'ను మనం సహృదయులమై అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతయినావుంది. అన్నిరంగాల్లో మార్పులు వస్తున్నట్లే కాలానుగుణంగా కవిత్వంలో కూడా మార్పులు వచ్చి తీరుతాయి. అలా ఆ మార్పులు వచ్చినపుడు వానిని సహృదయులైన విమర్శకులు నిర్మాణాత్మక దృష్టితో ఆలోచించి ఆ మార్పులద్వారా మహనీయమైన లక్ష్యాలను సాధించే అవకాశ మున్నదేమో పరిశోధించాలి

ఇది యంత్రయుగం. తీరికలేని ప్రజలు హడావుడిగా తమ తమ పనులకు వెళ్ళిపోతున్న కాలం. అలాంటివాళ్ళకు పెద్ద పెద్ద కావ్యాలను చదవాలంటే తీరికతోపాటు ఆసక్తికూడా కలగటంలేదు· కాని 'మినీ కవిత'ను చదవటానికి అంత పెద్ద సమయాన్ని వెచ్చించాల్సిన పని వుండదు. ఈ దృష్టితో చూసినా నేడు మినీకవిత చారిత్రక అవసరమనిపిస్తున్నది కవిత్వం చదివి సంతోషిద్దామనుకొనే కొత్తపాఠకులకుకూడా ముందు మినీకవితల్ని చదివించడం గనకచేస్తే వారుచక్కగా భావాస్వాద హృదయాన్ని పెంపొందించుకోగలరు.

'మినీ కవిత'ను సాధనంగా చేసుకొని మహత్తరమైన కథాకావ్య లక్ష్యాన్ని కూడా సాధించటానికి అలాంటి ఆసక్తిగలవాళ్ళు యత్నించవచ్చు చక్కగా 'మినీ కవిత' వ్రాసే సామర్థ్యం అలవడిన కవి తరువాత కథాకావ్యం వ్రాసినపుడు ఆ కావ్యం అనవసరపదాడంబరం లేకుండా, పటిష్ఠంగా, భావగాంభీర్యతతో వెలుగొందటానికి అవకాశమూవుంది. కథా కావ్యాలకన్న మినీకవిత గొప్పదనికాని, మినీ కవితకన్న కథా కావ్యాలు గొప్పవనికాని వాదింపబూనటం అనవసరం. కాలానుగుణంగా మనం కొన్ని ప్రయోజనాలు ఆశించాం కాబట్టి 'మినీ కవిత' కూడా బాగానే రావాలని, అందుకు సాహితీలోకం తగు ప్రోత్సాహం ఇవ్వాలని ఈనాటి ప్రముఖ విమర్శకులందరూ గుర్తించి తగురీతిలో ప్రచారం సాగించాలి.

రసంయొక్క అనుభూతిని పాఠకుడు పొందలేడనే ప్రధానమైన ఒక విమర్శ మినీ కవితను గురించి మనకు ఎక్కువగా ఈనాడు వినబడుతోంది. ఈవిమర్శ చేసేవాళ్ళు కవిత్వతత్వం పట్ల కొంత సనాతనమైన సంకుచితవైఖరిని అవలంబించి వున్నట్లుగా తోస్తున్నది. కవిత్వం ఏదేని ఒకరసాన్ని, లేక అనేక రసాలను చక్కగా పోషించగలగాలనేది వీరి దృఢాభిప్రాయం. ఏదో ఒక శృంగార రసప్రధానమైన కావ్యాన్నిగాని, మరో కరుణరస ప్రధానమైన కావ్యాన్నిగాని దృష్టిలోపెట్టుకొని కవిత్వమంతా అలాగే వుండాలని మొండిపట్టు పట్టడంవల్ల అసలు ఆధునిక కవిత్వమే పనికిరాదని చెప్పినట్లవుతుంది. ఇది అనాలోచిత విమర్శ. అసలైన పూర్వ విమర్శకుల్లోనే చాలామందిచెప్పిన అభిప్రాయాలు ఈ మినీ కవితను సమర్థించేవిగానే వున్నాయి. "రమణీయార్థ ప్రతిపాదక శబ్దమ్ కావ్యమ్..." "వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్..." మొదలైనవి ఇందుకు ఉదాహరణలు!

ఆమధ్య ఒక రాష్ట్రంలో కరువేర్పడింది. ఆహారం ప్రజలకు దొరకటంలేదు. అపుడు ప్రభుత్వంవాళ్ళు వివిధ పోషక పదార్థాల్ని తక్కువ పరిమాణంలో సంక్షిప్తీకరించి చిన్నిచిన్ని ప్యాకెట్లలో ప్రజల ఆకలిబాధను తీర్చగలిగారు. ఆ చిన్నిచిన్ని పొట్లాలు మనం రోజూ తింటున్న ఆహారంలోని అన్ని విలువలకన్న ఎక్కువగానే అందజేయగలిగాయన్నమాట. కాబట్టి మహాకావ్య ప్రయోజనాల్ని సమర్థులైనకవులు మినీ కవితల్లో సాధింప వచ్చునన్నమాట!

మినీ కవితకు ప్రధానంగా మూడు లక్షణాలున్నాయనుకుంటాను. ఒకటి – "సంక్షిప్తత." అనవసరమైనపదాలుగాని, భాషాడంబరంగాని వుండకపోవడం. రెండోది "నవ్యబంధురశైలి". ఒక మినీకవితలో కవివాడిన ఏదో ఒక శబ్దాన్ని తీసేసి మరింకో పదంతో మనం పూరింపలేనిది. ఒకవేళ అలాచేస్తే కవితలో అర్థం సహజంగా తగ్గిపోవడంగాని, ఒకోసారి పూర్తిగా సారహీనం కావటం కాని జరుగగలదన్నమాట. అంటే అంత ఖచ్చితమైన పద నిర్మాణం సమగ్రమైన మినీకవిత కలిగివుంటుందన్నమాట దీనినే నేను 'నవ్యబంధురశైలి' అంటున్నాను. మూడోది "చమత్కారం". చమత్కారమంటే అది ఏదో ఒక హాస్యానికి సంబంధించింది మాత్రమే అని అనుకోకూడదు. అలా అనుకుంటే చమత్కారం యొక్క అర్థాన్ని చాలా సంకుచితంగా ఆలోచించినట్లవుతుంది. చమత్కారమంటే – హృదయానికి సంబంధించిన ఒక ఆనందానుభూతి వలన కలిగే స్పందన.

చక్కని మినీ కవిత వ్రాస్తున్న వాళ్ళల్లో ఎక్కువమంది యువకవులే. యువకవులు మంచికవిత్వం వ్రాయటంలేదన్న ముసలి కవుల విమర్శకు తగిన సమాధానాలే అనేక వర్తమాన యువకవులు వెలయిస్తున్న మినీ కవితలు. "బ్రెవిటీ, నేటివిటీ, ఇండివిడ్యువాలిటీ వున్న ముక్కంటి కవులు వీళ్ళు. వెన్నే వీళ్ళకి వజ్రాయుధం. భాషా ఢమరుకం ధరించి భావతాండవాన్ని వరించి గంగామృతశైలితో ప్రవహించి పదార్థనారీశ్వరత్వం వహించి కావ్యత్రిశూలం ప్రయోగిస్తారు"[1] అని శ్రీ ఎవిర్వాయల్ మినీకవిత వ్రాస్తున్న నేటి యువకవుల్నిగురించి వ్రాశారు. లోక కల్యాణాన్ని కాంక్షించే సుగుణంకూడా మినీకవితలో వున్నదని ఆయన అభిప్రాయంబట్టిచూస్తే బాగానే స్పష్టమవుతున్నది.

మినీకవితా ప్రభావం సుప్రసిద్ధ రచయితల మీద బాగానే ప్రసరిస్తున్న దనటానికి నిదర్శనాలు అనేకం వున్నాయి 'జయ

'ప్రకాష్ నారాయణ్' మరణించిన సందర్భంలో కాళోజీ 'జేపీ!' అనే కవిత వ్రాశారు.

''పుటక నీది
చావు నీది
బతుకంతా
దేశానిది''[2]

ఈ పదిహేడక్షరాల కవితకు ప్రభావితుడై ఒక పాఠకుడు యెలా అన్నారో చూడండి. ఆయన పేరు ఎద్దుల సిద్దారెడ్డి.

''జేపీ ఘనత కంటె గొప్పది కాళోజీ కవిత —
కాళోజీ కవిత కంటె గొప్పది తెలుగు మినీ కవిత.''[3]

ఈపై రెండు సందర్భాలు దృష్టిలో పెట్టుకొని, శ్రీ కాశీపట్నం రామారావు ఆ తరువాత శ్రీశ్రీ గారిని గూర్చి వ్రాస్తూ.

''శ్రీశ్రీ కన్నా గొప్పది శ్రీశ్రీ కవిత్వం, ఆయన కవిత్వంకన్నా గొప్పది ఆయన అనుసరించిన మార్గం''[4]

అనే వాక్యంతో ముగించారు. ఈమూడు సందర్భాలు ఒకే పత్రికలో ఒక వరుసగా వచ్చాయి కాబట్టి ఇలా సక్రమంగానే అన్వయించటం జరిగింది.

కొందరు యువకవులు వ్రాసిన కొన్ని మినీ కవితల్ని ఉదాహరణ పూర్వకంగా పరిశీలించటం ప్రస్తుతం చాల ఉచితంగా వుంటుంది. 'చంద్రసేన్' అనే యువకవి వ్రాసిన కవిత పేరు ''కంటి తెలివి.''

''కన్ను తెరిస్తే జననం
కన్ను మూస్తే మరణం
రెప్పపాటే గదా ఈ ప్రయాణం.''[5]

ఇందులో పాదాలైతే మూడు. అక్షరాలైతే ఇరవయ్యయిదు. జననానికి మారుగా కన్నుతెరిచాడంటారు. అలాగే మరణానికి సౌమ్యంగా చెప్పటానికి కన్ను మూశాడంటారు. మనిషి పుట్టింది మొదలు చచ్చేదాకా ఉండేది జీవితం. జీవితాన్ని అశాశ్వతంగా, క్షణికంగా మన భారతీయులు భావించడం జరిగింది. క్షణికమని చెప్పటానికి మారుగా ఈ జీవితం రెప్పపాటేనని అనటంకూడా మనం వింటూనే వున్నాము. ఈ జనన మరణాల మధ్యగల వంద సంవత్సరాల జీవితాన్ని రెప్పపాటని మన సంప్రదాయజ్ఞు లెంత గొంతు చించుకుంటున్నా అందులో హేతువుగాని, ఒక ఆనందానుభూతి గాని త్వరగా ప్రజలకు అందదు. ఈ కవిత ద్వారా ఈ యువకవి ఆ రెంటిని ఒకేసారి పాఠకుడిలో కల్గిస్తాడు. కన్నుతెరవటం, కన్నుమూయటం అనే రెండు చర్యల మధ్యగల కాలం క్షణికమని నిరూపించాడు. సంప్రదాయానికి హేతుబలం కలగటమే గాకుండా దానివలన హృదయానందానుభూతి కూడా జోడింపబడింది. జీవితాన్ని ప్రయాణంతో పోల్చటం కూడా ఔచిత్యవంతమే అవుతుంది. ప్రయాణం అంటే సహజంగా రెండు ప్రదేశాల మధ్య జరగాల్సిన పని. ఇక్కడ జననం బయలుదేరిన చోటు. మరణం కొంత కాలానికి చేరుకునే చోటు. ఈ రెంటిమధ్య ప్రయాణం. అంటే ఆ చేరే ప్రదేశం నుండి మళ్ళా వేరే ప్రయాణం ఉండదని అర్థంకాదు. తిరిగి మరో ప్రయాణం ఆ చేరినచోటు నుండి మరో గమ్యానికి మొదలయ్యే టట్లే మరో జన్మ వుందనే విషయం కూడా భావుకులు ఊహించుకోవచ్చు. కళ్ళు తెరవటం, మూయటం అనే ప్రక్రియ వరుసగా సాగిపోతుందనేది అంతరార్థం. ఇలా సంప్రదాయ భావాన్ని నవ్యంగా రమ్యంగా ప్రత్యక్షం గావించిన కవి ప్రశంసనీయుడు మన విమర్శకులలో చాలమంది వస్తువుకుగాక వస్తుచిత్రణకు ప్రాధాన్య మివ్వాలని అనటం ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవటం మంచిది. శీర్షికకు పేరు పెట్టడంలో కూడా ఈ కవితలోని నవ్యతగా కనిపిస్తుంది. 'కంటి తెలివి' అనేది పేరు. మామూలు కన్ను చూడగలుగుతుంది, ఆ తరువాత ఆవార్త చేరితే మనసు ఆలోచిస్తుంది. తెలివి మనస్సుకు సంబంధించి వుంటుంది. కాని ఇక్కడ అది కంటికి ఆరోపింపబడటం రమ్యత. తెలివిగల కన్ను అంటే అసామాన్యంగా దర్శించే నేత్రం. అది మామూలుగా కనిపించే కన్నుకాదు. దివ్యదృష్టి అన్నమాట.

మరో యువకవి కె బాలరాజు వ్రాసిన కవిత — ''హ్యాము నిజం.''

''క్షౌరశాలలోని
మంగలి
త్రిప్పినట్లు తిరిగి
తల వెంట్రుకలు
తీయించుకున్నట్లు
నేటి ప్రజలు
ప్రజానాయకుల
వెంబడి తిరిగి
మానవత్వాన్ని
గొరిగించుకుంటున్నారు.''[6]

మంగలి క్షౌరం చేస్తుంటాడు. అలాగే నాయకుడు కూడా దేశానికి క్షౌరం చేస్తుంటాడు. జుట్టు తలకు సంబంధించి వుంటుంది. అలాగే మానవత్వం కూడా తలకు సంబంధించినదే. వెంట్రుకలు మనిషికి అందాన్నిస్తాయి. అలాగే మానవత్వం కూడా మనిషికి ఆభరణమే. మానవత్వాన్ని వెంట్రుకలతో పోల్చటం అంత బాగోలేదని ముందు అనిపించినా కాస్త ఇలాఆలోచిస్తే ఈ నూతనమైన పోలిక చాల అర్థవంతంగాను, ఔచిత్యభరితంగాను వుందని పిస్తుంది. క్షౌరశాలలో మనిషి ఎటు తిరిగినా వాడి జుట్టు కత్తిరింప బడుతున్నట్లే నాయకులు ప్రజలచేత ఏ పని చేయించినా ఈనాడది మానవత్వం ఖూనీ చేయడం కోసమే గదా! ఎవడైనా కష్టపడి పని చేసేవాడో సత్యం పలికేవాడో వుంటే వాడు తమ వునికికి ప్రమాదమని వాడి సున్నితమైన హృదయాన్ని జాగ్రత్తగా పరోక్షంగ దెబ్బతీసి ఆ బాధకు కారణం మానవత్వమేనని చెప్పి

మానవత్వానికి వాడిని దూరం చేస్తూ వుంటారు మన నాయకులు. ఇంత భావాన్ని కవి ఆ కవితలో ప్రోది చేశాడన్నమాట.

విహారి వ్రాసిన రెండు పాదాల కవిత పరిశీలించి చూద్దాం.

''పొయ్యిలో పిల్లుల్ని లేపుతుంటే
కడుపులో ఎలుకలు పారిపోతాయి.''7

పొయ్యిలో పిల్లుల్ని లేపటమంటే వంట చెయ్యటం. కడుపులో ఎలుకలు పారిపోవటమంటే ఆకలి తీరటం. వండే అన్నం సహజంగా తెల్లగా వుంటుంది. అలాగే పిల్లులూ ఎక్కువగా తెలుపుగానే వుంటాయి. ఎలుకలు నల్లగా వుంటాయి అలాగే ఆకలికి ఒక రంగు చెప్పాలంటే దానికి నలుపురంగే తగి వుంటుంది, దరిద్రం నుండి పుట్టుకొచ్చేది గనుక. పిల్లికి ఎలుకకు బద్ధవైరం. పిల్లిని చూస్తే ఎలుక పారిపోతుంది. అలాగే ఆహారం పడితే కడుపులో ఆకలి మటుమాయ మవుతుంది...ఎలుకలు కిచకిచమంటూ అల్లరి చేస్తాయి. అలాగే కడుపులో ఆకలిగా వున్నప్పడు కొన్ని వింత ధ్వనులు వచ్చే అవకాశమూ వుంది. పొయ్యిలో వేడి వుంటుంది. వేడి కృషికి ప్రతీక. కృషిచేసే వాడికి చలి వుండదు, ఆకలివుండదు ...ఎలుకలు గాదె క్రింద, పంట పొలాల్లో చేరి పండిన పంటంతా తినేస్తుంటాయి. దేశ సౌభాగ్యాన్ని మింగుతున్నవాళ్ళు ఎలుకలుగా అనుకోవచ్చు. వాళ్ళు నాయకులు కావచ్చు, అధికారులు కావచ్చు... అలాంటి వారెవరైనా కావచ్చు. వాళ్ళ నరికట్టాలంటే పొయ్యిలో వున్న పిల్లుల్ని నిద్రలేపాలి. అంటే చైతన్యం నింపుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్న ప్రగతివీరుల్ని వెన్నుతట్టి ముందుకురికే టట్టు చేయాలి. అప్పుడు ఎలుకల్లాంటి స్వార్థపరులు పలాయనం చిత్తగిస్తారు... ఈ రెండు పాదాల కవితలో ఇంత గంభీర భావాలున్నాయి. నిజంగా మినీకవిత వర్తమాన పాఠకలోకానికి ఒక వరం లాంటిదని చెప్పటానికి ఎలాంటి సందేహమూ అక్కర్లేదు.

నందిని సిధారెడ్డి వ్రాసిన కవిత ''అల.''

''ఎంత సిగ్గులేనిది
ఆడుకుని, వాడుకుని
నేలకి కసరి కొట్టినా ఈ కాయితం —
మళ్ళా గాలి పిలవగానే
గాల్లో లేచిపోతుంది
ఊహాల్లో ఎగిరే మనసూ
అంతే!
ఎంత
సి
గ్గు
లేనిది ? ?''8

ఈ కవితను ఇంకా తగ్గించటానికి అవకాశం లేకపోలేదు. మొదటి అయిదు పాదాలు మాత్రం వుంచేసి ''మనసు'' అని కవితకు పేరు పెడితే సరిపోయేది. అయినా—ఇందులో చక్కని భావాలు మాత్రం బాగానే ఇమిడివున్నాయి. చంచల స్వభావంతో ఎటుపడితే అటు తిరిగేవాణ్ణి 'గాలివాడు' అంటూ వుంటారు ప్రజలు. వాడి మనస్సు ఇక్కడి కాగితంలాగా స్థిరమైన గుణం లేనిదన్నమాట ఎవడే గాలి కబురు చెప్పినా నమ్మేస్తాడు. అలా వాళ్ళు రోజూ మోసంచేస్తున్నా మళ్ళీ మళ్ళీ ఆ గాలి కబుర్లే నమ్ముతూ వుంటాడు. ఇంకోరకంగా చెప్పాలంటే సిగ్గులేనివాడన్నమాట ... గాలి కబుర్లు నదిలాగా ప్రవహిస్తుంటాయి. దాని ఒక్కో అల స్థిరమైన మనసు లేనివాణ్ణి కష్టాల సుడిగుండాల్లోకి నెట్టివేస్తుంది. గాలి చంచల మైన కాగితాన్ని ముళ్ళ కంచెలపై వేసి చింపుతూ వున్నట్టు. ఒంటరి కాగితం బరువు బాధ్యతలుమాని గాలిలో వుంటే కొట్టుకు పోతుంది. అలాగే మనిషి ఏకాకిగామారి ఏ బాధ్యత లేకుండా ఎట్టి ప్రయత్నం చేయకుండా ఆగాలి కబుర్ల నదిలోపడితే వాడు ఒడ్డుకు తిరిగి రావటం జరగనిపని. మనస్సు గాలి భ్రమవలన ఊహల ఆకాశంలో ఎగిరిపోతున్నట్లు సంబరపడి స్వవినాశం కోరుకోకూడదని అంతరార్థం...ఊహలో ఎగురుతున్న కన్య మనసు కాగితం లాంటిది. అది ఓ గాలి క్రూరాడిచేత ఆడుకోబడి వాడుకోబడిందనుకుందాం. వాడా తర్వాత మోసం చేస్తాడని తెలిసినా ఆ తప్పటడుగునే అలా కొంతకాలంపాటు ఆ కన్య వేస్తూనే వుంటుంది. వాడు తనను పెండ్లిచేసుకోడని తెలిసినా వాడితోనే మరికొంతకాలం అలావుంటూ వుంటుంది అందుకు కారణం ఆ కన్యకు స్థిరమైన మనస్సు లేక పోవటం. కేవలం ఏదో శృంగారపు ఊహలపై ప్రయాణం చేస్తూ వుండే మనస్సు మాత్రమే అలా వర్తిస్తూ వుంటుంది. అటు తర్వాత కొంత కాలానికి పతనం తప్పదనే హెచ్చరిక ఈ కవితలో వుందని సహృదయులు గ్రహించవచ్చు.

కవిత్వాన్ని ఇలానే అన్వయించుకోవాలని నేను శాసించటం లేదు. ఎవరి అనుభవంబట్టి వారు ప్రత్యేక విభిన్న విషయానుభూతులు పొందవచ్చు. ఇలా సహృదయుణ్ణి విశాల దృక్పథంతో స్వేచ్ఛగా ఆలోచింపజేసే కవితనే ''**Multipurpose poetry**'' అనిఅంటున్నారు. ఇందుకోసం కవిత్వంలో ''**Auto principle**'' అని ఓ కొత్తపారిభాషికపదాన్ని ప్రతిపాదిస్తున్నాను పొరుగూరునుండి కొందరు స్నేహితులు మనవూరు చూట్టానికి వచ్చారనుకుందాం. మనం వీళ్ళకు వూరుచూపించాలని వాళ్ళను ఒక 'ఆటో' మీద ఎక్కించి తిప్పామనుకోండి. ఒకడు మనవూళ్ళో సినిమాహాళ్ళుచూచి సంతోషిస్తాడు. మరొకడు గుళ్ళు, గోపురాలు చూచి తృప్తిపడతాడు.ఇంకొకడు అందమైన పార్కులు మొదలైనవి చూచి ఆనందిస్తాడు. మరింకొకడు పీడితులు, తాడితులు వున్నపేటల్నిచూచి పరిష్కారం ఆలోచిస్తుంటాడు... ఇలా ఎవడికివాడు భిన్నంగా చూచినా ఇక్కడ ఒక ప్రధానమైన సూత్రంమాత్రం వాళ్ళందరిలో లేకపోలేదు. మన వూళ్ళోని విశేషాలనేది ముఖ్య విషయం. దాన్నే ఎవరికివారు తమ చిత్తవృత్తినిబట్టిఅనుభూతినిపొంది వైలక్షణ్యాన్ని ప్రదర్శిస్తారన్నమాట. అంటే కవిత్వంలో కూడా ఇష్టమొచ్చిన ఏదోఒక అనుభూతిని విశృంఖలంగా పాఠకుడు పొందటానికి వీలు లేదనిభావం. ఏదో ఒక ప్రధాన భావాన్నిమాత్రం తప్పకుండా పాఠ

కుడు ఆశ్రయిస్తూనే ఎవడికివాడు తన సహృదయతనుబట్టి విలక్షణమైన ఆనందానుభూతులు పొందవచ్చునన్నమాట. ఇలా "Multipurpose poetry"గా మినీకవిత భాసిస్తుందని చెప్పటానికి ఇంతకుముందు విమర్శింపబడిన కవితలన్నీ ఉదాహరణలే.

మినీ కవితకు గౌరవస్థానం కల్పించడానికేగాక నేటి విద్యార్థుల్ని భావిమేధావులుగా తయారుచేయటానికి కూడా దీనిని మన మాతృభాషా పాఠ్యగ్రంథాలలో ఆరవతరగతినుండియే ప్రవేశపెట్టవలసిన అవసరం ఈనాడెంతయినా వున్నది. మాతృభాషా బోధనా లక్ష్యాలలో ఈ క్రింద చెప్పబడేవి చాల ముఖ్యమైనవి. మన విద్యావేత్తలందరు ఈ విషయాలు జాగ్రత్తగా గమనించటం అవసరం.

1. అనవసర పదాడంబరంలేకుండా ఎక్కువభావం వచ్చేటట్లు జీవద్భాషలో మాట్లాడే నేర్పును విద్యార్థులలో కలిగించటం.

2. ఆసక్తి కరంగా సంక్షిప్తంగా స్పష్టమైన భావాలతో కూడిన రచనా వ్యాసంగాన్ని విద్యార్థులకు అలవాటు చేయటం.

3. అతి 'చిన్న' విషయంలోనుండి అగణితము, అగాధమైన లోతును అనంతంగా ఆవిష్కరింపగలిగే సదసద్వివేచక్షణా దక్షతను (విమర్శనాశక్తిని) విద్యార్థులలో పెంపొందింప చేయటం.

4. జీవితంలో సందర్భానుసారంగా గుర్తుచేసుకోటానికి గాని, ఇతరులతో మాట్లాడేటప్పుడు వినియోగించటానికిగాని కొన్ని కవితలు ముఖ్యమనుకొన్నవి విద్యార్థులచేత కంఠస్థంచేయించటం.

5. సరిక్రొత్త ఉపమానాల (పోలికల) ఔచిత్యం గ్రహించటంవలన విద్యార్థులు నవ్యానందానుభూతిని పొందగలిగేటట్లు చేయటం.

6. ప్రతి విద్యార్థికి సమకాలీన సాంఘిక విషయాల్ని ఎక్కువగా పరిచయమగునట్లు చేయుటం.

ఈ ఆరు లక్ష్యాలను మినీకవిత ఎలా సాధింప గలుగుతుందో క్రమంగా పరిశీలించటం అవసరం.

1. మినీకవితలోవున్న జీవద్భాషవలన విద్యార్థులలో జీవద్భాషలోనే రసవంతంగా మాట్లాడే అలవాటును కలిగింపవచ్చు.

2. మినీకవితలోని 'సంక్షిప్తత' తక్కువమాటల్లో ఎక్కువ భావంవుండేటట్లు విద్యార్థులలో రచనా నైపుణ్యం పెంపొందడానికే గాకుండా అదేవిధంగా మాట్లాడటానికికూడా దోహదం చేస్తుంది.

3. మన ప్రస్తుత విద్యావిధానంలో చదవాల్సిన పుస్తకాలు ఎక్కువ, "అవగాహన" చేసుకొనేవి తక్కువ. ఒకవిద్యార్థి ఎన్ని విషయాలు చదివాడన్నది కాక ఒక విషయాన్ని అతడు ఎంతబాగా, విశాలంగా "అవగాహన" చేసుకున్నాడనేదేముఖ్యంగా మనం గుర్తుపెట్టుకోవాలి. మినీ కవిత పరిమాణంలో తక్కువగావున్నా దాని ద్వారా విద్యార్థులు అనంతమైన అవగాహనను పెంపొందించుకొనటానికి ఉపయోగపడుతుంది. గోమాతను చంపటం అనేదే హింసాగుణంగా చూచేవాడికన్న చిరుచీమను చంపటంలోనే మహాఘోర హింసా గుణమున్నదని గ్రహించినవాడే ఉత్తమజాతికిచెందిన అహింసావాది. అల్పాక్షరాలలోనే అనల్పార్థాన్ని రాబట్టుకోవటం అసలైన గొప్ప మేధావి ప్రథమ లక్షణం. అలాంటి విశేషమైన శక్తిని మినీకవిత విద్యార్థుల్లో కల్గిస్తుంది.

4. మినీకవిత సహజంగా పది లైన్లకు తక్కువగానే వుంటుంది. ఇది విద్యార్థులకు నోటికి వచ్చేటట్లు చేయటం తేలికైన పని.

5. మినీకవితలోని సరిక్రొత్త పోలికలు నవ్యత, రమ్యత కలిగివుంటూ విద్యార్థుల్ని ఆలోచింపచేస్తాయి, వారిలో నూతనమైన ఆనందానుభూతిని రేకెత్తింపజేస్తాయి. ఏదైనా కొత్తరకం పిండి వంట అంటే కొంత ఉత్సాహం, ఆతురత తప్పకుండా కలిగి తీరుతాయి. దాని రుచి కూడా తర్వాత బాగుందనిపిస్తే ఆ అనుభూతి వర్ణనాతీతమవుతుంది.

6. మినీకవితలోని విషయం సమకాలీన సమాజాన్ని ఎక్కువగానే ప్రతిఫలిస్తున్నది కాబట్టి విద్యార్థులకు ఈ మినీకవితా పఠనం వర్తమాన సాంఘిక సమస్యల విజ్ఞానం కూడా అందజేయగలదు. ఇవ్వాల్టి పత్రికను ఈరోజే చదవాలి. మారుమూల పల్లెటూరికి పోస్టులో వచ్చే పత్రికలా నిన్నటి పేపరుతప్ప ఈరోజు పత్రికను ఈరోజే చదువుకొనే వీలులేనట్టి దుస్థితిలో మన విద్యా వ్యవస్థను వుంచకూడదు. ఇకనైనా ఈ విషయాలు మన విద్యాధికులు గమనించి ఎప్పుడు వస్తున్న ప్రక్రియల్ని అప్పుడే నిత్యనూతనంగా విద్యా ప్రణాళికలో చేరుస్తూ వుండాలి. మన ప్రభుత్వం, యూనివర్సిటీలు ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చే విద్యా కళాశాలలలో పనిచేసే అధ్యాపకులు, విద్యావేత్త లందరు మాతృభాషా పాఠ్య గ్రంథాలలో సమర్థవంతమైన మినీ కవితలు కూడ త్వరలోనే చేర్చటానికి పూనుకుంటారని ఆశింపవచ్చు.

మినీకవితను గూర్చి ఆరుద్ర చెప్పిన మాటలు అందరూ ఆలోచించాలి.

> "ఎన్ని 'గజాలు' రాశాడన్నది కాదు;
> ఎన్ని 'నిజాలు' చెప్పాడన్నది- ముఖ్యం."

అధోజ్ఞాపికలు

1 శ్రీ ఎమ్వీయల్ — "నరసింహావలోకనం" — పీఠిక.

2 శ్రీ కాళోజీ — ఆంధ్ర జ్యోతి, సచిత్ర వారపత్రిక — 26–10–1979.

3 శ్రీ ఎద్దుల సిద్దారెడ్డి —ఆంధ్రజ్యోతి, సచిత్రవారపత్రిక— 16–11–1979.

4 శ్రీ కాశీపట్నం రామారావు — ఆంధ్రజ్యోతి, సచిత్ర వార పత్రిక - 30–11–1979.

5 శ్రీ చంద్రసేన్ — నరసింహావలోకనం—పుట 53.

6 త్రిమూర్తుల మినీకవితా సంకలనం—"దివిటి"—పుట 30.

7 శ్రీ విహారి – "చలనమ్" – పుట 55.

8 శ్రీ నందిని సిధారెడ్డి – భారతి, నవంబరు 1979 – పుట 6.

[ఈ వ్యాసం వ్రాయటానికి కావలసిన పుస్తకాలను అందజేసిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ కార్యవర్గ సభ్యుడైన శ్రీ గుత్తికొండ సుబ్బారావుకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు.]

శ్రీ రావి రంగారావు

భావోద్యమాలు - వర్గతత్వం
ఒక సమాధానం

భావోద్యమాలకు కమ్యూనిజం ప్రాధాన్యం యివ్వలేదనడం ఒట్టివెర్రి. ఐతే అవి ఎలాంటి భావోద్యమాలు అన్నప్పుడే రావిపూడి వెంకటాద్రిగారితో అభిప్రాయభేదం వస్తుంది. సెప్టెంబర్ 'భారతి' కలగూర గంపలో వారి రచన చదివేక రాయాలనిపించిన విషయాల్ని ఇక్కడ రాయడం జరుగుతోంది.

పెళ్లి కుదిరితేగాని పిచ్చి కుదరదు. పిచ్చి కుదురుతే గాని పెళ్లి కుదరదు.

— ఆర్థిక వ్యవస్థ సక్రమమవుతే తప్ప వ్యక్తికి నిజమయిన స్వేచ్ఛరాదు.

– నిజమైన స్వేచ్ఛను మనస్సులో భావించి, దానికి రూపకల్పన చేయడం కన్నా ముందర సామాజికుల్లో దానికి ప్రచారంచేసి వాళ్లల్లో ముందుగా భావ విప్లవాన్ని కలిగిస్తే తప్ప తక్కిన ఆర్థికాది వ్యవస్థలు సర్దుకోవు.

ఈ రెండూ పరస్పర సహకారకాలు. అంతే తప్ప కేవలం భావ విప్లవం సంపూర్ణంగా జరిగేటంతవరకు సమాజ వ్యవస్థను మార్చవద్దనుకోవడం, దానికోసం ప్రయత్నించడం అశాస్త్రీయమనుకోవడం ఒక ఆధునిక మూఢాభిప్రాయంగా భావించాల్సి వస్తుంది. సమాజం మొత్తం వెంకటాద్రిగారి వాదాన్ని అంగీకరిస్తుందనే గ్యారంటీ లేదు. ఈమాత్రం హేతువాదులు ఇంతకుముందే ప్రపంచ చరిత్రలో ఎందరో కన్పించారు. వాళ్లవల్ల భౌతికంగా అధిక సంఖ్యాకులకు ఏమీ జరుగకపోగా ప్రపంచంలోని అన్ని మత వ్యవస్థలు వాళ్ల పరోక్ష ప్రభావంచేత ఇంకా ఇంకా బలపడ్డాయి! ఇది చారిత్రక వాస్తవం. ఇది ఇలా ఎందుకు జరిగింది మరి? ఎందుకంటే ఆచరణకు అసాధ్యమైన పార్శ్వన్నుంచి వాళ్లు సమాజ జీవితంలోకి దిగడానికి ప్రయత్నించడం మొదటి కారణం! రెండోది — అది ఆర్థిక వ్యవస్థలో కొందరికి ఇంకా దోపిడీ చేయడానికి పనికివచ్చే గొప్ప పరికరంగా తోడ్పడడం! వెంకటాద్రిగారే చెప్పినట్లుగా ఎందరో సాంఘిక విప్లవవాదులు కులతత్వంమీద, మూఢ మతాచారాలమీద దాడి చేసినప్పటికీ అవి పోలేదు కదా—మరి అవి ఎందుకు పోలేదు? వెంకటాద్రిగారన్న భావవిప్లవం రాకపోవడం వల్లనా?

ఈ ఘట్టంలోనే వర్గ దృక్పథాన్ని గూర్చి ఆలోచిస్తే సరియైన సమాధానం వస్తుంది. కులతత్వం, మూఢాచారాలు మొదలైన వన్నీ సమాజాన్ని ఇంకా ఇంకా మధ్య యుగాల నాటి, బానిస యుగాల నాటి స్థితికి మనిషిని కట్టివేయడానికి పనికివస్తున్నవి. అందుకని ఉత్పత్తి పరికరాలమీద, ఉత్పత్తి శక్తులమీద ఆధిపత్యం వుండేవర్గం ఎప్పుడూకూడా వాటిని పోషించడానికే ప్రయత్నిస్తాయి. అందువల్లే బౌద్ధమతంలో కూడా మనదేశంలో కులాలు వచ్చినయి. ఈనాటి క్రైస్తవంలోనూ కులాలువచ్చి నిల్చినయి. దేవుని విషయం చెప్పని బౌద్ధమతంలోనూ ఆ బుద్ధుడే దేవుడైనాడు! దీనంతటికీ కారణం ఆ తత్వాల్లో బలం లేకపోవడం కాదు. ఆ తత్వాలు పైపైన చట్టాన్ని మార్చడానికి ప్రయత్నించబోయి చివరకు తామే గోతిలో పడ్డవి. ఆయా భావ విప్లవవాదులకు చారిత్రక దృష్టి ఏమైనా ఉంటే ఈ వ్యవస్థలకు మూలంగా ఏది నిల్చిందో [అది ఆయా ఆర్థిక వ్యవస్థలే వాటికి మూలం అని ఏ సామాజిక శాస్త్ర, చారిత్రక గ్రంథాల్ని చూసినా తెలుస్తుంది] దాన్ని పరిశీలించి, దాన్ని మార్చడానికి మొదట ప్రయత్నిస్తే ఆ భావ విప్లవాలు సమాజంలో సత్ఫలితాల్నిస్తాయే గాని ఊరికే గాలిలో దారాలు పేనుతే అది బద్ధక వాదమే అవుతుంది కాని హేతువాదం ఎలా అవుతుంది? "ఆర్థిక వ్యత్యాసాలు సర్వరోగాలకు కారణం — ఆర్థిక విప్లవం (?) సర్వరోగనివారిణి అనే మూఢనమ్మకమే ఈవ్యాఖ్యానాలకు కారణం" [పుట. 71] అని అంటారు వెంకటాద్రిగారు. ఇలాంటి దృక్పథం — అంటే ఆర్థికాన్ని కాకుండా మరేవో సమాజంలో బలీయంగా వున్నవనే దృష్టి ఎంత అహేతుకమో, సామాజిక శాస్త్రాధ్యయనం వల్ల తెలుస్తుంది. మార్క్సిజం ఊరకే గాలిలో పుట్టలేదు. దాని పుట్టుకకు వెనుకన ఫ్రెంచి భౌతికవాదుల తత్వం, హెగెల్ గతి తర్కం, బాబూఫ్ కమ్యూనిజం - ఇంకా ప్రధానంగా డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, అనేక శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు నిల్చాయి. ఆ అధ్యయనం కొరవడి ఇక్కడి నుంచే, ఇప్పటి నుంచే ఆలోచించడం వల్లనే "మనిషిని మనిషిగాకాక ఒకమతంలోనో, కులంలోనో, జాతిలోనో అవిచ్ఛిన్నమైన భాగంగా చూడడం ఎలా అసమంజసమో ఒక వర్గంలో భాగంగా చూడడం కూడా అలాగే అసమంజసమని మనం గ్రహించాలి" [పుట. 71] అని రాయడం జరుగుతుంది. మనిషి రాబిన్‌సన్ క్రూసో కాడు! ఏ సామాజిక శాస్త్రవేత్తా దీన్ని అంగీకరించలేదు. ఇహాను 'ఆదమ్ – అవ్వ'లతో సృష్టి మొదలైందని విశ్వసిస్తేతప్ప ఇదిసాధ్యంకాదు. పరిసరాల ప్రభావం మానవుడి చైతన్యాన్ని నిర్ణయిస్తాయి.[1] సమష్టి మానవ చైతన్యం పరిసరాల ఆర్థిక వ్యవస్థను మార్చి దాని ద్వారా తాను స్వతంత్రుడు కావడానికి ప్రయత్నిస్తాడు. అంతేతప్ప వర్గాలున్నంత వరకు మనిషిని వర్గాలకు చెందినవాణ్నిగాతప్ప, మరోవిధంగా చూడడం అవాస్త విధానం అవుతుంది. వర్గ స్వభావం — వర్గచైతన్యాల మధ్య భేదాన్ని గమనించక

కళ్ళుమూసుకొని వర్గాలులేవు, మానవ సమాజం అంతా ఏకవర్గంగానే ఇప్పుడు మన్నుతున్నది అని భావిస్తే — ఈ హేతువాదంయొక్క — భావోద్యమంయొక్క అసలురంగు స్పష్టపడుతుంది. భూస్వామ్య నాగరకతవరకు మతాలు కులాలు ఉంచుకొని దోపిడీ చేసిన విధానమే — ఇప్పుడు మత రాహిత్యం, కులరాహిత్యం అనే ముసుగువేసుకొని 'స్వేచ్ఛ' అనే నేతిబీరకాయలాంటి నినాదంతో ప్రజల కళ్ళల్లోకారంకొట్టుతున్నది తప్ప మరేమీకాదు. వెంకటాద్రిగారు అలాంటివారయినా కాకపోయినా చరిత్రలో ఇలాంటి తీయటి నినాదాన్ని స్వార్థపరులు, పీడకులు వాడుకోవడం ఇతఃపూర్వం చూడనేచూశాం ఇప్పుడూ చూస్తూనేవున్నాం. ఫ్రెంచివిప్లవంలో వచ్చిన బ్రహ్మాండమైన నినాదత్రిపుటి "సమత, సౌభ్రాత్రం, స్వేచ్ఛ"ల గతి ఏమయిందో చరిత్ర ప్రాథమిక విద్యార్థులకు కూడా తెలుసును పీడకుల చేతికి మరోరాతిని ఈ భావోద్యమకారులు ఇస్తున్నారనే బాధతప్ప అసలు సమాజంలో మౌలిక స్వరూపంయొక్క మార్పుకు భావోద్యమాలు పనికేరావని అనడంలేదు. ఈ మాట మార్క్స్ ఏంగెల్స్‌ల మూలదృష్టికి వ్యతిరేకమైందికాదు. కాని చిక్కల్లా "సంపదకంటే ముందుగ భావాలు (సామాజిక విప్లవ భావాలు) సంఘపరం కావాలి. అప్పుడే మనుష్యులకు కావలసిన నిజమైన వ్యవస్థ — మానవవాద వ్యవస్థ సాధ్యమవుతుంది." అని అనడం (ఒకవేళ ఇది అమాయికత, అజ్ఞానం కాకపోతేమాత్రం) ఇప్పటికే ఈ భావోద్యమాలు పీడకులచేతి ఆయుధమైనవనడానికి గుర్తు. అదెన్నడూ అయ్యేదేకాదు. ఇంతశక్తివంతమూ, ఆచరణ సాధ్యమూ అయిన మార్క్సిజమే జాతీయ వాదానికి దిగజారి రష్యా, చైనా/వియత్నాం కంపూచియాల/మధ్య ఏ అసహ్యమైన విరోధాల్ని కల్గిస్తున్నదో మనకు కనబడుతూనే వుందికదా! అలాంటిది ఏ వ్యవస్థా లేకుండా, ఆర్థిక మానసిక స్వేచ్ఛలకు సరియైన చారిత్రక దృక్పథం ఉన్న ప్రణాళికేలేకుండా[2] ఊరకే స్వేచ్ఛ — స్వేచ్ఛ— భావవికాసం అని మైకుల్లో, పత్రికల్లో ప్రచారంచేస్తే మీరను కొనే మానవవాద వ్యవస్థసాధ్యమవుతుందా? "స్వేచ్ఛఅంటే యేమిటో అవగాహన చేసుకోకుండానే, స్వేచ్ఛకోసం పరితపిస్తాం. బానిసత్వం కోసం పోరాడుతూకూడా అదే స్వేచ్ఛ అని భ్రమిస్తాం." (పుట74) అని వెంకటాద్రిగారన్న మాటలు ఎంతో మంచివి. ఈ "ట్రేడ్ సయికిల్స్"మధ్యన, ద్రవ్యోల్బణాలు — ఆర్థికమాంద్యాలు—ప్రచ్ఛన్న యుద్ధాల నడుమన కూర్చుని వాటి నివారణను నివారించడానికా అన్నట్లుగా 'ఆర్థిక విప్లవం (?) సర్వరోగనివారిణి' అనే వాదాన్ని మూఢనమ్మకంగా రాస్తూ భావోద్యమాలపై ఆలోచించడం ఒత్తి పగటికలే కాని మరేమీ కాదు.

"మానవసమాజాన్ని మొత్తాన్ని ఒక్కదానిగా కాక ద్వంద్వాలుగా విభజించే చారిత్రక తత్వం యింకా యెన్నాళ్ళకొనసాగాలి?... ఈ ద్వంద్వాలలో తప్ప మానవుణ్ని మనం చూడలేమా?"(పుట71) అని రచయిత అమాయకంగా రాశారు. మానవసమాజాన్ని ద్వంద్వాలుగా చూడ్డం కాదుకదా, రెండు పార్శ్వాలుగా ఉన్న ఏక మానవ సమాజాన్నే మార్క్సిస్టులు చూసింది. మానవసమాజ చరిత్ర నడవడానికి ఈ ద్వంద్వాలు అవసరమనే వాళ్ళెన్నడూ భావించలేదు. వాళ్ళు చెప్పింది "మోనిజమ్." మంచి భావవాదులూ, మంచి భౌతికవాదులూ చరిత్రను మోనిస్టు దృక్పథంతోనే చూసినట్లుగా వాళ్ళల్లో ప్రఖ్యాతులు, పండితులూ చెప్పారు.[3] వెంకటాద్రిగారు పొరబడ్డది గతితర్కంలో రెండుగా చెప్పబడ్డ వాద — ప్రతివాదాల విషయం కావచ్చును కాక ఈనాటివరకు సమాజంలో కన్పించే ఇరువర్గాల అస్తిత్వాన్ని మార్క్సిజం పదే పదే చెప్పడాన్ని సరిగా అవగాహన చేసికోలేక వారీ నిర్ణయానికి వచ్చి ఉండవచ్చు. వర్గాలుగా విభాజ్యమయి మానవసమాజం కనిపిస్తున్నప్పుడు కూడా మార్క్సిస్టులు వాటిని గమనించ వద్దనడం వర్గ దృష్టిని కలిగి ఉండవద్దనడం హేతువాదం అవుతుందా? "ద్వంద్వాలలో తప్ప మానవుణ్ని చూడలేమా?" అనే వేంకటాద్రిగారి బాధను తొలిగించడానికే మార్క్సిజం ప్రయత్నిస్తున్నది. మానవుడి ఆంతర — బహిర్జీవితాల్లో పూర్ణయోగాన్ని, (సమన్వయాన్ని), అతని ఆధ్యాత్మిక — భౌతిక జీవితాల్లో పూర్ణయోగాన్ని, అతని అవసరాలు — స్వేచ్ఛల నడుమన పూర్ణయోగాన్ని సాధించడం కోసరమే ఒక చారిత్రక దశలో (పారిశ్రామిక యుగారంభంలో) కమ్యూనిజం ప్రభవించింది. అది మానవుడికి సంపూర్ణ స్వేచ్ఛను కల్పించడంకోసమే ప్రణాళికను సిద్ధం చేసింది. కమ్యూనిస్టు రాజ్యవ్యవస్థ కోసరం దాని ప్రణాళికలో దోపిడీ ఆర్థిక వ్యవస్థానిర్మూలనం ఉన్నట్లే మత నిర్మూలనం కూడా వున్నది[4] దానికది నాయకుల్ని దైవ స్వరూపంగా భావించదు. దాన్నదిగా మతంగా మారిపోవడాన్నీ అంగీకరించదు.[5] వాళ్ళకు ఆచరణకున్న ప్రాధాన్యం నాయకుడికిలేదు. "తమచరిత్రను తాము సృష్టించుకోగల మనుష్యుల్ని సృష్టించే ప్రయత్నం ఇంతవరకు జరగలేదు." (క్రీగీతనాది)అని వెంకటాద్రిగారనడం ఎంతటి చారిత్రక సత్యమో పాఠకులే నిర్ణయించుకోవాలి. వైఫల్యంపొంది జాతీయ ప్రభుత్వదిశగ శరవేగంతో పయనిస్తున్నప్పటికీ రష్యా చైనాల్లో ఆ ప్రయత్నం జరిగిన విషయాన్ని గమనించలేక పోవడం చారిత్రకజ్ఞాన అంధత్వంకాక మరేమవుతుంది?

హిట్లరు దేవతామూర్తి కావడానికి కారణం భావ విప్లవం, భావవికాసం అనే అతివ్యాప్తి పట్టిన సిద్ధాంతాల ప్రచారం లేకపోవడంకాదు. అది వెర్రితలలు వేసిన జాతీయతావాద ప్రభావంవల్ల జరిగింది. "పైగా మార్క్సిస్టు వ్యాఖ్యానాలకు విరుద్ధంగా పెట్టుబడిదారీ రాజ్యాలమధ్య అంతర్జాతీయ ఐక్యత కన్పిస్తున్నది కదా! యెందువల్ల?" అన్న ప్రశ్నకు సమాధానం ఇంగితజ్ఞానం వల్లనని. వాళ్లకు వెంకటాద్రిగారికన్నా ఎక్కువ చారిత్రక దృష్టి ఉండడం వల్ల — పెట్టుబడిదారీ విధానం ముద్దుబిడ్డలుగా ప్రభవించిన సామ్రాజ్యవాదం, ఫాసిజంలు దాని నెత్తిన్నే కొరివిపెట్టగా కొత్తగా ఈ కమ్యూనిస్టుపిశాచం. (!) రావడం వల్ల — పెట్టుబడిదారీ స్వార్థంలో కొంత లౌక్యం, కొంత పట్టువిడుపు విధానాలు రావడం వల్ల—; అదే జరుగకుంటే తోటి పెట్టుబడిదారీ రాజ్యమైన జర్మనీపైకి దండెత్తే వాళ్ళేకాదు వాళ్ళు — అందునా ఒక కమ్యూనిస్టు దేశంతో కలసి!

''...తత్వశాస్త్రాన్ని వర్గపరంగా విభజించడంవల్ల సరైన శాస్త్రీయ అవగాహన లేకపోవడం వల్లనే'' అన్నారు రచయిత. ఏదో పాలసీ పెట్టుకొని మార్క్స్, ఏంగెల్స్‌లు అలావిభజించారా?! ప్రాచీన భావవాదులూ, ఫ్రెంచి భౌతిక వాదులూ ఎందుకు ఈ విషయాన్ని (అంటే చరిత్రగతికి మూలమైన శక్తిని) గమనించలేకపోయారో అనే విచారణలో, సామాజిక ఆర్థిక శాస్త్రాలు ఆధారంగా ఫ్రాంసు, బ్రిటన్‌లలో జరిగిన బూర్జువా విప్లవాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయడంచేత వర్గ దృష్టిని తీసుకోవడం జరిగింది మార్క్స్‌కు.[6] అంతేతప్ప వాళ్ళు తత్వశాస్త్రాన్ని వర్గపరంగా విభజించకపోగా వర్గాలుగా రెండు శత్రుకూటాలుగా విడిపోయివున్న మానవ సమాజంలో శాశ్వతంగా వర్గరాహిత్యాన్ని (ఏక వర్గాన్ని) సాధించడం కోసంగాను శ్రమించారు. వాళ్ళు పాలసీతో తత్వశాస్త్రాన్ని నిర్మించలేదు. వాస్తవ లోకంలో చరిత్ర గతికి సంబంధించిన శాస్త్రీయ సూత్రాల్ని వాళ్ళు కొనుక్కొన్నారేతప్ప అదే శాశ్వత సత్యంగా వాళ్ళు చెప్పలేదు. కమ్యూనిజమే శాశ్వతం కాదన్న కొటేషన్ రచయితే ఇచ్చారు కదా! కాని ఈ వాదాన్ని కాదనడానికి మరో శాస్త్రీయ దృష్టిని వివరించడానికి బదులు — నినాదాలనీ, ద్వంద్వాలనీ, భావోద్యమాలు అనవసరమన్నారని అనడం అనవసరం. శ్రీ వెంకటాద్రి రాతలో ముఖ్యమైన అంశాలు — స్వేచ్ఛ, మౌఢ్య నిరాకరణం, వర్గదృష్టి తప్పనడం, సంపద కంటే భావాలు ముందు సంఘపరం కావాలనడం అనేవి. కమ్యూనిస్టులు సామాజిక సంబంధాలకు మూలంగా ఆర్థిక వ్యవస్థను చూస్తారు.[7] ఇవేళ మనకూ ఇది అనుభవంలో ఉన్న విషయమే. ఆర్థిక స్వాతంత్ర్యంలేని కుటుంబంలోని భార్యాపిల్లల నుంచి అదివున్న కుటుంబ సభ్యుల వరకు కుటుంబ విలువల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో గమనించండి విశ్వనాథవారి ధర్మారావు, రంగారావుల నుంచి కొడవటిగంటి కుటుంబరావుగారి నవలల్లోని కథల్లోని పాత్రలదాకా పరిశీలనచేస్తే ఆర్థిక వ్యవస్థ మారుతున్నకొద్దీ సామాజిక చట్టంలో — దాని విలువల్లో, రూపంలో—ఎలాంటి మార్పులు వస్తున్నవీ అర్థమౌతుంది. వ్యవస్థలో ఎంతో కుళ్ళు కన్పిస్తున్న ఈ రోజుల్లో దాన్ని బాగుచేయడానికి ముందే ''ఏతత్వమయినా వ్యవస్థీకరణ పొందితే మతంతో సమానమైపోతుందని'' వాపోవడం నిజంగా ఈ వ్యవస్థని, మానవులను బాగుచేయడం కోసం అన్నట్లుగా అనిపించదు. పోగా దాన్ని సాధించడంకోసం చేసే ప్రయత్నాలను మూకల కల్లోలాలుగా భావించడం ఒట్టి అహంకారంతప్ప మరేమీకాదు. 'మానవ చైతన్యం — అది మానసిక చైతన్యం' అనే వ్యక్తి మనస్సులోకి చైతన్యం పరిసరాల ప్రభావంవల్ల కల్గుతుందని భావించలేకపోవడం దేవుడులేడని అంటున్నా పరోక్షంగా దిగజారిపోయిన ఆస్తికులతోనే సామ్యాన్ని పొందుతాడు. మానవుడు పూర్ణస్వేచ్ఛనిపొందాలంటే భారతదేశంలో ఎట్లాంటి సామ్యవాదం రావాలో ఆలోచించడంపోయి, అశాస్త్రీయమైన, ఆధునిక మౌఢ్యాలతో కూడుకొని పీడకుల వ్యవస్థకే ఇంకా బలం చేకూర్చేటటువంటి కుహనా భావోద్యమాలను పట్టుకోవడం మానవద్రోహం. రాజ్యవ్యవస్థయొక్క అవసరమేలేని సమాజాన్ని స్థాపించడానికి మార్క్స్ సిద్ధాంతం దారి చూపింది. ఈనాటి కమ్యూనిస్టులు, భారతదేశంలో కూడా దారి తప్పారు. ''ఆనాడు మార్క్స్ ప్రతిపాదించిన వర్గ సంబంధాలు యిక్కడ లేవు.'' అన్న వెంకటాద్రిగారి వాక్యం మూల ఉద్దేశ్యం ఏదైనా దాని అభిధార్థం కొంత నిజం. ఈ జాతిజనులపై మార్క్స్ చేసిన వ్యాఖ్యానాలు కొన్ని ఉన్నవి.[8] వాటిని వీళ్ళుపట్టించుకోలేదు. జాతీయతను వీళ్ళు నిరసించే విధానం గర్హనీయమైంది. దేవుడు, మతం అనే చట్రానికి లోబడకుండా వున్న ఆధ్యాత్మిక వాదాన్ని అది సమాజంలో వేరూని ఉన్న విధానాన్ని కూడా బేరీజు వేసికొంటూ అహంకారాలు విడిచి మార్క్సిస్టులు ఉద్యమించవచ్చు నిక్కడ. మన దేశంలో జాతీయత ఫాసిజం వైపుకి కాకుండా, ప్రాంతీయవాదం వైపుకి పదేపదే మళ్ళుతుంటుంది. దాన్ని అంతర్జాతీయతా లక్ష్యానికి మళ్ళించడానికి మార్క్సిస్టులు పునర్విచారణచేయాలి భావోద్యమం, హేతువాదం, — పెట్టుబడిదారీ వ్యవస్థకు పోషకాలుగా లేనంతవరకు ఆ వాదాల్ని కూడా మనసూర్తిగా మార్క్సిస్టులు చేబట్టాలి. మానవునికి స్వేచ్ఛ ఒక అవసరం అయ్యేదశ రావడానికి భౌతికంగా ఏవి అడ్డంకులో అవి వెంకటాద్రిగారి లాంటి వాళ్ళకు కూడా తెలియలేదంటే అది నిజంగా కమ్యూనిస్ట్ ఉద్యమంలోని ప్రచార లోపాన్ని తెలుపుతుంది. ఆ మేరకు భావోద్యమం అవసరమే! అంతేతప్ప అది పూర్తయ్యేవరకు పీడక వర్గాలు అట్లాగే ఏలుతుండేటందుకుగాను మేధావులు ప్రయత్నించకుందురు గాక!

[వెంకటాద్రిగారు మార్క్స్, ఏంగెల్స్‌ల కరెస్పాండెన్స్ సంగతి ఊరకే గాలిలో—ప్రస్తావించారు. దాన్లోంచి ఏమీ కోట్ చెయ్యలేదు. అందుకని దాన్నిక్కడ ప్రస్తావించడం లేదు. ప్రధాన గ్రంథాలైన మేనిఫెస్టో, దాస్ కాపిటల్, ఆంటీ డ్యూరింగ్ మొదలైన సర్వగ్రంథాలు వర్గ దృష్టిని నింపుకొన్నవి కదా - కింది జ్ఞాపికల్లో ఆ విషయం కొంత చూడవచ్చు.]

అధోజ్ఞాపికలు

1 Life is not determined by consciousness, but consciousness by life.—Selected works Vol. 1. Marx - Engels. P. 25.

ఇదే గ్రంథంలో 503వ పేజీ కూడా వివరణ కోసం చూడవచ్చును.

2 'రేడికల్ హ్యూమనిస్ట్ మేనిఫెస్టో' (Roy రాసింది) చదివే ఈ వాక్యాలు రాయడం జరుగుతున్నది.

3 Therefore the most consistent and most profound thinkers were always inclined to monism. Every consistent idealist is a monist to the same extent as every consistent materialist ... both one and the other equally

well understood the worthlessness of the dualist outlook on the world...''

(క్రింద గీతలున్నచోట ఇటాలిక్ అక్షరాలున్నవి.)

The Development of the Monist View of History.
— G. Plekhanov P. 12.

4 "But Communism abolishes eternal truths, it abolishes all religion ... " (Selected works. Vol. 1, P. 125) అన్న వాదానికి జవాబు చెప్పాల్సిన అవసరం లేదంటూ అదే పు. లోని 4,5 పరిచ్ఛేదాల్లో మతం ఎలా వచ్చిందో చెపూ్త అది ఎలా పోతుందో సూచించాడు.

5 1905–7ల మధ్య రష్యాలో మార్క్సిజాన్ని లూనాషార్స్కీ వంటివాళ్లు దైవీకరించి మతంగా మార్చే విఫల ప్రయత్నం చేశారు. దాన్నక్కడి ప్రజలు వమ్ము చేశారు ఈ విషయాల్ని ప్లెఖనోవ్ రాసిన Materialismus Militaus పుస్తకంలో చూడవచ్చును.

6 1852లో రాసిన లేఖలో ఇలా ఉంది.

"...And now as to myself, no credit is due to me for discovering the existence of classes in modern society or the struggle between them. Long before me bourgeois – historians had described the historical development of this class struggle and bourgeois economists the economic anatomy of the classes" (Selected works P. 528).

7 చూడు. అదే. పే. 503.

8 'వలస విధానం వ్యాసావళి' పుట 94 నుంచి 102 వరకు గాని పై పుస్తకంలోని 494 పుట నుంచి 499 పుట వరకున్న ఆంగ్లమూలాన్ని కాని చూడు.

శ్రీ ముదిగొండ వీరభద్రయ్య

కావ్యానందం అంటే?

12, 1979 'భారతి'లో కాశీభొట్ల సత్యనారాయణగారు 'కావ్యాత్మ అనుశీలనం' కావిస్తూ చెప్పిన వ్యాసం చివర భావాలతో ఏకీభవించలేకపోతున్నా. వారు "శరీరం లేకుండా ఆత్మ చరిస్తే దయ్యమంటారు. కావ్యానందతత్త్వాన్ని ఆలంకారికంగా ఛందోమయంగా దర్శించాలి'' అన్నారు.

వారు ఛందస్సును శరీరంగా చిత్రించారు. మరేమో ఆలంకారికులు (భరతుడు) "ఇతివృత్తంతు కావ్యస్య శరీరం'', (భామహుడు) "సహితార్థశబ్దం (శరీరం) కావ్యం''. (ఆనంద వర్ధనుడు) "విశిష్టార్థ ప్రకాశమవు శబ్దం కావ్యశరీరం''అనీ అన్నారు. విజ్ఞానియైన కండరపుష్టిగల మనిషి శరీరానికి దుస్తులు ఎలాంటివో ఛందస్సు అలాంటిది. శబ్దం కావ్యశరీరం. అర్థం దాని ఆత్మ. శ్రీశ్రీ "ఛందస్సుల సర్పపరిష్వంగాల్ని వదిలి'' కవిత్వంరాయాలన్నది వృత్తాల్నీ, జాతుల్నీ, ఉ. జాతుల్నీ దృష్టిలో ఉంచుకొని అని మనం గ్రహించాలి. కాని గేయం విషయంలో కాదు ఎందుకంటే తానే గేయాల్లో (మాత్రాబద్ధ) రాశాడు కాబట్టి· లేదా తొందర పడి అన్నాడని గ్రహించాలి. ఎందుకంటే గేయం ఏ ఛందస్సు నేర్వని వాళ్లకూ్కడా సహజంగా (పల్లీయులకి) ఉబికి వస్తుంది. దాన్నే మనం చదువరులం సంస్కరించి మాత్రాబద్ధంగా, కళావంతంగా తీర్చిదిద్దుకున్నాం. ఆ గేయం అంటే పాట మినహా ఏ కవిత్వం పామర జనాన్ని చేరుకోలేదు. చేరుకున్నా ఏదన్నా, దానికి గేయ లక్షణాలు ఏవో కొన్ని తప్పనిసరిగా ఉంటాయని నమ్మాలి. అది ఏనాటికి తిరుగులేని ప్రక్రియ దాన్ని ఆధునిక కాలానికి అనువుగా మార్చుకోవాలీ పాడుకోవాలి. కాని జాత్యుపజాతి వృత్తాలేమాత్రం స్వీకరణీయాలుకావు భావాన్ని బంధిస్తాయి కాబట్టి. అందమైన భావమనే ఆత్మను (కావ్యతత్త్వాన్ని) శబ్దం అనే శరీరంతో ఏ స్వీటు ఆకృతిలోనైనా అంటే పొడుగూ, పొట్టీ, లావూ, సన్నం ఆకృతిలోనైనా దర్శించవచ్చు. అలాంటిదే నేటి వచన కవిత అది బెల్ బాటం లాంటి దుస్తులకు చెందిందనుకోవాలి.

'దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా' వంటివి ప్రబోధ వాక్యాలనీ, శల్యావశిష్టమైనదనీ రాసి కవిత కాదన్నారు· 'ఆనందరూపకమైన కవితాత్మను రసమయంచేసి ఔచిత్యవంతంగా ధ్వనింపజేసినవాళ్ళే కవులౌతారన్నారు.' కావ్యానందతత్త్వాన్ని ఆలంకారికంగా దర్శించాలి నిజమే. కాని ఎప్పుడు అలంకారాల ప్రసక్తి వస్తుంది? శబ్దాలు భావాన్ని వ్యక్తం చేయలేని స్థితిలో, మరీ విస్పష్టమైన ప్రకటన సమయంలో, శోభాయమానంగా చెప్పాల్సివచ్చినపుడూ, అలంకారాల ప్రయోగానికి అనుకూల్యత ఉన్నప్పుడూ మాత్రమే అని గ్రహించాలి. అది ఔచితిమంతంగా ఉండాలి. కాని మాట ఎత్తితే ఆలంకారికంగా రాయాల్ననడం సబబుకాదు. మీరే అన్న 'ఔచిత్యవంతం' అన్నపదం గురజాడ మహాకవి దేశభక్తి' గేయాన్ని బాధిస్తుంది· అక్కడ అలంకారాలకు ఏమాత్రం తావులేదూ. అవి అలా వాచ్యార్థంలో చెప్పాల్సిందే ప్రబోధ కవిత్వం ఒకటుందనేది తెలుసుకోవాలి· అవసరమైనచోట ప్రబోధ కవిత్వంలో కూడా అలంకారాలు చోటు చేసుకుంటాయి, అదే గేయంలో

దేశమనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్
నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్.

ఇంకా 'ఆకులందున అణిగి మణిగి...' మొదలైన చరణాలుకూడా ఆలంకారికంగానే చెప్పబడ్డాయి. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా...' గేయం, 'జనగణమన అధినాయక జయహే...' గేయం 'దేశభక్తి'

గేయం లాంటివే భావావేశం ఉన్నప్పుడు అలంకారాలు వాడాల్సిన అవసరంలేదని ఆధునిక విమర్శకా పితామహుడు కట్టమంచి రామలింగారెడ్డిగారు అన్నారు. డా. సి. నారాయణరెడ్డిగారు 'ప్రబోధ కవిత్వం' అని ప్రత్యేక విభాగంచేసి ఆ. ఆం. క. త్య. థీసిస్‌లో రాశారు.

కొలంబస్ కనుగొనక పూర్వం భూమీ నదులూ పర్వతాలూ వృక్షాలు ఉన్న ఆ ప్రాంతం దేశంకాదు. యూరోపియన్లు నివాసం చేసి దాన్ని దేశం చేశారు. ఇంత అన్వేషణాత్మకమైన సైంటిఫిక్ దృక్పథంతో ఉన్నా భావావేశంతో ఉన్న మాటల్ని విన్నప్పుడూ, 'ఏ వగ్న నాట్య నవయౌవ్వన విలాసవతి' ఇవ్వలేని ఆనందం ఇస్తున్నప్పుడూ వారు శల్యావశిష్టమైన కవిత అన్నారంటే పాఠకలోకం ఎంత నొచ్చుకోవాలి? కాబట్టి వెనకాముందు ఆలోచించి కాలానుగుణంగా సత్‌విమర్శలు చెయ్యాలి.

శ్రీ పాటి దశరథరెడ్డి

అభిమన్యుని వయస్సు గురించి

పద్మవ్యూహంలో ప్రవేశించేనాటికి అభిమన్యుని వయస్సు 36 సం॥లే. 'భారతి' 1979 డిసెంబరు మాసపత్రికలో శ్రీ ఆ. వెం. సానకేశ్వరరావుగారు అభిమన్యుడు పద్మవ్యూహంలో ప్రవేశించేనాటికి 48 సం॥లని తేల్చినారు (కలగూరగంప శీర్షికలో). అభిమన్యునికి ఆనాటికి 36సం॥ యున్నవి. కాని 48 సం॥ లేవని ఈ క్రింది నిదర్శనములనుబట్టి నిర్ధారింపవచ్చు.

వారు మాద్రేయులకు అభిమన్యునకు 20 సం॥ అంతర మున్నదని సూచించినారు. కాని మాద్రేయులకు అభిమన్యునకు సుమారు 34 సం॥ ల అంతరమున్నది. దీనిని ఈ ఆధారములతో చూపవచ్చు

యుధిష్ఠిర భీమార్జున యములు క్రమంబున దొల్లి షోడశ పంచదశ, చతుర్దశ, త్రయోదశ వర్షజాతులై శతశృంగంబు నందుండి హస్తినాపురమునకు వచ్చి యందు గౌరవులం గలసి యస్త్ర విద్యలం గఱచుచు పదమూడేండ్లుండి యుపుడు ధృతరాష్ట్ర నియోగంబున వారణావతంబునకు జననీ సహితంబుగ బోవ నమకట్టి ... . హృదయులై (ఆదిపర్వము. ష. ఆ. 142 వచనము.)

దీనినిబట్టి ఇప్పటికి మాద్రేయులకు 26 సం॥లనియు అప్పటికి ద్రౌపదీ స్వయంవరము కూడా కాలేదనియు స్పష్టమగుచున్నది. ద్రౌపదీ స్వయంవరము తరువాతనే సుభద్రార్జునుల స్వయంవరమైనది.

వారణావతరంబున పాండవులు లక్క గృహదహనమున తప్పించుకొని తిరుగుచు వ్యాసోపదేశంబున శాలిహోత్రాశ్రమమున నుండి, ఆ తరువాత ఏకచక్రపురమున ఒక బ్రాహ్మణుడి ఇంటనుండి ద్రౌపదీస్వయంవరము గురించి విని మరియు ద్రుపదుని గుణములను విని ద్రుపద రాజ్యమునకు

> పాండు నందనులు జననీ సహితంబుగ బనవరతంబు రాత్రుం బగళ్ళును బయనంబు ...... (ఆ. సప్త. 37)

ద్రుపద రాజ్యమును జేరి ద్రుపదునిచే ద్రుపదుని గృహంబునకు గొనిపోబడిరి.

> వీరు కుంతీ మహాదేవులని ... . . నెట్టిపుణ్యమో (ఆ. సప్త. 240)

> ఆ తరువాత ద్రుపదుడు తన పుత్రిక నిచ్చి

> ఇట్లు వేల్పిముందఱ ...... పాణిగ్రహణంబు సేయించిన (ఆ. సప్త. 286)

ఇట్లు పాండవులు ద్రుపదపురంబున నఖిల రాజ్యవిభవ సమన్వితులై

> ఒక్క సం॥ మున్న .... (ఆది. అష్ట. 9)

దీనినిబట్టి మాద్రేయుల వయస్సు ఇప్పటికి కనీసం 13+13+1=27 సం॥ అని తెలియుచున్నది.

ఆ తరువాత యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రుని, విదురుని, భీష్ముని, కురుముఖ్యుల మాటలు విని .. .. హస్తినాపురం బేతెంచె. (ఆ. అష్ట. 62)

మరియు దుర్యోధనాదులతో కలసి యెప్పటి యిట్టుల రాజ విద్యా వినోదంబులచే

> నేను సంవత్సరంబులున్న... . ఇట్టులనియె, (ఆది. అష్ట. 64)

అప్పటికి మాద్రేయుల వయస్సు 13+13+1+5=32 సం॥ అని తెలియుచున్నది. పిమ్మట పాండవులు అర్ధరాజ్యమును గైకొని, ధర్మజు నభిషిక్తుడై ఖాండవ ప్రస్థమున జేరి ... ... (ఆది. అష్ట 68)

ఆ తరువాత నారదోపదేశంబుచే ద్రౌపది ధర్మజుని ఇంట నున్నపుడు బ్రాహ్మణుడి గోరక్షణార్థమై అర్జునుడు అస్త్రములకై ధర్మజుని ఇంట ప్రవేశించి గోవును రక్షించి సమయభంగము (నియమ భంగము ద్రౌపది ఒకరి ఇంటనున్నపుడు మరొకరు ఆ ఇంటిలో ప్రవేశింపరాదు) కలిగించిన కారణమున అర్జునుడు నియమానుసారము ఒక సం॥ తీర్థయాత్రలకై బయలుదేరెను. ఆ తీర్థయాత్రలలో అర్జునుడు యతివేశంలో ద్వారకకు చేరి సుభద్రచే సకల పరిచర్యలు గావించుకొని (భోజనోపచారములు) ఆ పిమ్మట ఆమెను పెళ్ళాడి సుభద్రతో సహా ఇంద్రప్రస్థపురిని జేరెను. అప్పటికి మాద్రేయులవయస్సు సుమారు 34సం.వచ్చిన సుభద్రను ద్రౌపదీదేవి

పంకజాక్షి నీ పతి ప్రతిపక్ష వీరవిజయుడయ్యెడు నీవును వీరపుత్ర
జనని వగుమని దీవించె సంతసంబుతోడ వసుదేవపుత్రి నా
ద్రుపద పుత్రి. (ఆది ప అష్ట. 212)

ఆ తరువాత అభిమన్యుని జననము జరిగిన దనుటకిది తార్కాణము.

ధన్యుల కా సుభద్రకు శతక్రతు సుతున కుదయించె స
మా న్నయంగుడు పుత్రు డభిమన్యుడు.........
... ...
పాండవ వంశకర్త్యె (ఆదిపర్వము అష్ట. 224.)

దీనినిబట్టి అభిమన్యుని జననమునకు మాద్రేయులకు 34 సం॥ అంతరము తప్పనిసరియని తేలుచున్నది.

తదనంతరంబున
ద్రోణుండు పాండవులకు నెయ్యుండయ్యును
దొల్లి యాజోపయాజుల వరంబున ... ...

ఇట్లింద్రప్రస్థ పురంబున ఇరవదిమూడేండ్లు రాజ్యంబుసేసి
పాండవులు పాపద్యూత పరాజితులై .. ..
... ... బోయిరపుడు ... ...
ద్వాదశ సంఖ్యయైన వర్షములు
కానలోనుండి బాలుపడుచు (సభాపర్వము 217)

ఇప్పటికి అభిమన్యునకు 23 ఏండ్లు యుండవచ్చునని తెలియుచున్నది.

మరియు

ద్వాదశ వర్షంబులు అరణ్యావాసం బొనరించి ఒక వత్సరము అజ్ఞాతవాసమును గడుపుటచే అప్పటికి అభిమన్యుని వయస్సు 36 సం. అజ్ఞాతవాసమైన పిదప భారతయుద్ధము జరిగినది. అందు 13వ దినమున అభిమన్యుడు పద్మవ్యూహమున ప్రవేశించి ఘోర యుద్ధమొనర్చి మోసముచే చంపబడెను.

ఆ యుద్ధములో ద్రోణుడన్న మాటలు

బాలుం డొక్కడిట్లు ప్రౌఢజనులన్......
... ... యోధుల కాశ్చర్యంబుగన్.
(ద్రోణపర్వము 201)

దుర్యోధనుని మాటలు

గురు నుపేక్ష తెలిసికొనలేక యా కుఱ్ఱ తనదు విక్రమునని తలచు
పిమ్మట
.........చావగొట్టవలయు (ద్రోణపర్వము 204)

దుశ్శాసన సుతుండు......... అభిమన్యు డందె స్వర్గాను
భూతి (ద్రో. ప. 273)

ఈ విధముగా తల్లిదండ్రుల వయస్సులో దాదాపుగా సగము వయస్సు గలిగినవాడు కావున అతనిని అందరును బాలుడనిరి.

అప్పటికి అభిమన్యుని వయస్సు 36 సం॥

మాద్రేయులు	36 + 34 = 70
అర్జునుడు	36+35 = 71
భీముడు	36+36 = 72
ధర్మజుండు	36+37 = 73

[ఒకరికంటె నొకరు ఒక్కొక్క సం॥ పెద్దవారు]

ఈ విధముగా అభిమన్యుని వయస్సు 36 సం॥ అని విశదముగా తెలియుచున్నది.

. శ్రీ దామెర మురళి

తెలుగు సాహిత్యం గురించి ...

తెలుగు సాహిత్యం, సాహిత్యవేత్తల గురించి ఇతర భారతీయ భాషలలో రచనలు ఎంత పరిమిత ప్రమాణంలో వెలువడినా హర్షణీయమే. ఆంధ్ర సాహిత్యం, సాహిత్యవేత్తల గురించి ఇంగ్లీషులో పరిచయాత్మక, పరిశీలనాత్మక వ్యాసాలు వ్రాస్తున్న కొద్దిమంది రచయితల్లో శ్రీ డి. ఆంజనేయులు పేర్కొనదగినవారు.

మన సాహిత్యాన్ని గూర్చి ఇంగ్లీషులో వ్రాసేటప్పుడు రచయితలు ఎంతో శ్రద్ధ పాటించవలసి వుంటుంది. ఇంగ్లీషులో వెలువడిన ఆ రచనలను ఆధారంగా ఇతర సాహిత్యవేత్తలు తెలుగు సాహిత్యపు సత్తాను బేరీజు వేసుకొంటారు. ప్రత్యేక సందర్భాల్లో పత్రికలకు వ్యాసాలు వ్రాసేటప్పుడు అవసరమైన పుస్తకాలు దొరకని కారణంగా, అందుబాటులోవున్నా చదివే శ్రమ తీసుకొనని కారణంగా ఆ వ్యాసాలు అసమగ్రంగా, తప్పులుకలవిగా తయారయ్యే అపాయము దాపురిస్తుంది. వ్యాసకర్త అభిప్రాయాలు అందరికీ ఆమోద యోగ్యంగా ఉండకపోయినా, సత్యానికి దూరంగా వుంటే, అతని నిజాయితీని శంకించవలసివస్తుంది.

కేంద్ర సాహిత్యఅకాడమి ఇంగ్లీషులో ప్రచురించే ద్వైమాస పత్రిక 'ఇండియన్ లిటరేచర్' (చిరునామా : సాహిత్య అకాడమి, రవీంద్ర భవన్, 35 ఫిరోజ్ షా రోడ్డు, న్యూఢిల్లీ. సాంవత్సరిక చందా రు. 12/లు.) ఈ పత్రిక నవంబరు–డిసెంబరు 1979 సంచికలో 1978వ సంవత్సరములో వివిధ భారతీయ భాషలలో (ఇండో – ఇంగ్లీషుతో సహా) వెలువడిన సాహిత్య రచనల గురించి 18 సమీక్షాత్మక వ్యాసాలు ఉన్నాయి. Telugu, the uneventfulness (పుటలు 158–169) అనే పేరుతో శ్రీ డి. ఆంజనేయులు 1978లో జరిగిన తెలుగు సాహిత్య కృషిని సమీక్షించారు.

ఎంత గొప్ప రచనలైనా 1978 వ సంవత్సరములో మరే సంవత్సరములో వెలువడినా, వాటిని ఈ ప్రత్యేక సందర్భంలో పేర్కొనుట అప్రస్తుతం. 1977 ఫిబ్రవరిలో వెలువడిన రాళ్ల పల్లి అభినందన గ్రంథం – 'అనంతరాగం'ను ప్రస్తావించటం ఈ దృష్ట్యా అనవసరమే. ఇక 1978 లో వెలువడిన ''రాళ్లపల్లి పీఠికలు'' పై ఆంజనేయులుగారి అభిప్రాయం చూడండి :

"For all his deep and multi – faceted scholarship, Anantha Krishna Sarma did not leave any major or substantial work–creative or critical. All his prefaces and forewords, lying scattered in the books of many authors, old and young, have also been collected in a volume, entitled "Rallapalli Peethikalu (The Prefaces of Rallapalli). Ranging from the southern school of Telugu literature, and the devotional compositions of the Talapaka poets to the poetry of Vidwan Vishwam and C. Narayana Reddi, it presents a veritable treasure house of literary gems." (పుట 169)

శాలివాహన గాథా సప్తశతీసారము, వేమన, నాటకోపన్యాసములు, సారస్వతాలోకము – రాళ్ళపల్లివారి ఈ రచనలను చదివి వుండినా వాటి గురించి తెలిసికొని వుండినా వ్యాసకర్త పై విధంగా మొదటి వాక్యాన్ని వ్రాసివుండేవారు కాదు.

''రాళ్ళపల్లి పీఠికలు'' కూడా అనంతకృష్ణ శర్మగారి విమర్శనా దృక్పథాన్ని వివరించటంలో మనకు చాలా సహాయకారి అయిన గ్రంథం. సుమారు 60 సంవత్సరాలు తెలుగు విమర్శకు అంకితం చేసిన విమర్శకశిరోమణి రాళ్ళపల్లివారు ''సృజనాత్మక లేక విమర్శక క్షేత్రాలలో ఎటువంటి ప్రధానమైన, విలువైన రచనలను'' ప్రసాదించలేదని వ్రాయటం ఆంజనేయులుగారికి తెలుగు విమర్శ గురించి తెలిసింది చాలా తక్కువ అని తెలియచేస్తుంది.

శ్రీ డి. ఆంజనేయులు కొన్ని పుస్తకాల గూర్చి వెల్లడించిన అభిప్రాయాలను చూడాలి. ఒక ఉదాహరణ :

"That doyen of Andhra biographers, G. Venkata Subbaiah, has added the Life of Unnava Lakshminarayana, the Gandhian patriot and nove – list, to his list of 20 odd – titles in this genue." (పుట 168).

వీరు పేర్కొన్న పై పుస్తకం 1977 జనవరిలో వెలువడింది. కాన పైవ్యాసకాల పరిధిలోకి రాకూడదు పోనివ్వండి. వ్యాసకర్త పైపుస్తకం గురించి ఇచ్చిన సమాచారం అంతాతప్పులే. పై పుస్తకం పేరు ''సంఘ సంస్కర్త ఉన్నవ'' ఈ పుస్తక రచయిత వ్యాసకర్త భావించినట్లుగా ప్రఖ్యాత జీవిత చరిత్రకారులు, సుమారు 20 జీవిత చరిత్రలు రచించిన శ్రీ గొట్టిపాటి వెంకట సుబ్బయ్యగారుకాదు. వారి మనుమలు, అదేపేరుకలిగిన జి. వెంకట సుబ్బయ్యగారు. పుస్తకం అట్టవెనుక మనుమలైన జి. వెంకట సుబ్బయ్యగారి ఫోటో కూడ ఉన్నది.

శ్రీ ఆంజనేయులు కనీసం పుస్తకాన్ని చూస్తైనా వుంటే ఈ అక్షమ్య అపరాధం చేసివుండేవారు కాదు.

61 పుటలు కలిగి 5 రూపాయలకు లభించే ఈ పుస్తకం దేశి బుక్ డిస్ట్రిబ్యూటర్స్, నారాయణగూడా, హైదరాబాదు–29 లేదా కాంగ్రెసు ఆఫీసురోడ్, విజయవాడ–2 దగ్గరలభించును.

డి. ఆంజనేయులుగారి బహుశ్రుత పాండిత్యానికి మరో మచ్చు తునక. "Yelchuru Narayana Rao, another devotee of Sri Sri, now teaching Telugu in one of the American Universities, has produced a useful work on Aasu Rachana (Extempone Writing), which, he maintains is superior to other, more deliberate, forms of composition." (పుట 167).

వెల్చేరు నారాయణరావుగారు వ్రాసిన పుస్తకం పేరు ''తెలుగులో కవితా విప్లవాల స్వరూపం'' శ్రీ డి. ఆంజనేయులు పేర్కొన్నట్లు వెల్చేరువారు 'ఆశు రచన' మీద ఎట్టి పుస్తకమూ వ్రాయలేదు. కాని వారి సిద్ధాంత వ్యాసమైన ''తెలుగులో కవితా విప్లవాల స్వరూపం'' లోని మొదటి అధ్యాయం – ఆశు సాహిత్యం. ఆంజనేయులుగారు 'ఆశు రచన'కు వాడిన ఇంగ్లీషు సమానార్థకం కూడ సరియైనది కాదు. వెల్చేరువారు Oral literature లేదా Folk literatureకు వాడిన తెలుగుపదం ఆశుసాహిత్యం. అన్నింటికంటె ఘోరమైన విషయం ఏమిటంటే వెల్చేరువారు ఆశు సాహిత్యాన్ని లిఖిత సాహిత్యం కంటె గొప్పదని భావించారని ఆంజనేయులుగారు పేర్కొనటం ఆంజనేయులుగారు వెల్చేరు వారి పుస్తకం పేరు కూడ తెలిసికొనకుండా, తమ మిడి మిడి జ్ఞానంతో ఆ పుస్తకంపై అమూల్యమైన అభిప్రాయాన్ని వెల్లడించడం దారుణమైన సంగతి. ఆశు సాహిత్యం – లిఖిత సాహిత్యం వీటి రచనా విధానాల భిన్నతను సూచిస్తూ డా. వెల్చేరు నారాయణరావు గారన్న మాటలివి : ''ఆశు సాహిత్య ప్రక్రియలనన్నిటినీ సమర్థంగా విశ్లేషించి వాటికి అనువైన సాహిత్యశాస్త్రం ఇంకా రాయవలసి వుంది. లిఖిత రూపంలో ఉన్నది ఒక్కటే సాహిత్యమనే అభిప్రాయానికి గురి అయి తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా పరమ ప్రాచీనమైన, జాతీయమైన సంప్రదాయాన్ని అలక్ష్యంచేత మనం విస్మరించామనీ, నన్నయ్యకన్నా ముందు నుంచీ వస్తున్న ఆశుసాహిత్యం, లిఖిత సాహిత్యం కన్నా రచనా సూత్రాలలో భిన్నమైనదనీ, ఈ రెండింటికీ స్థితిలోనూ గతిలోనూ కూడా గుర్తించవలసినంత తేడా వుందనీ చూపించడం ఈ దీర్ఘచర్చ వలని ప్రయోజనం.''

(తెలుగులో కవితా విప్లవాల స్వరూపం – పుట 27. మొత్తం పుటలు 292. వెల రు. 20/-లు. పంపిణీదార్లు : విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ–4.)

వ్యాసకర్త కొంతమంది వ్యక్తుల రచనలను గొప్ప చేసి చెప్పటం, కథానికల ఊసుకూడ ఎత్తకపోవటం, అభ్యుదయ, విప్లవ రచనల ప్రస్తావన తీసుకురాకపోవటం, 1978లో వెలువడి ఆధునిక సాహిత్య వికాసానికి దోహదం చేస్తున్న పత్రికల గురించి వ్రాయక పోవటం మొదలైన ఎన్నో లోట్లను ఎత్తిచూపవచ్చును.

తెలుగు సాహిత్యం గురించి సదవగాహన కలిగి, ఇంగ్లీషులో సమర్థవంతంగా వ్రాయగల రచయితలు ఒంటాబయటా లేకపోలేదు. వారంతా చేతులు ముడుచుకొని కూర్చున్నప్పుడు ఆదరాబాదరా వ్రాసే డి. ఆంజనేయులు వంటివారి రచనల ద్వారానే తెలుగు వెలుగు మసక మసకగా ప్రసరించక తప్పదు.

శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

లేఖలు

మాయపొర

నాడు సాంప్రదాయ కవిత కిచ్చిన కావ్య గౌరవాన్ని, నేడు ఆధునిక కవితలకు యిస్తున్న 'భారతి' కాలంతోపాటు కాలు కదుపుతున్న 'తెలుగు భారతి'కి దర్పణం పడుతున్నది. అందుకు మరోసారి నా కవితా పుష్పాంజలులు.

కలగూరగంపలో ఆధునిక సాహితీ కోవిదులు, అతిరథ, మహారథులు సాహితీ చర్చలు సాగించటం ముదావహమే. కాని వ్యక్తిగత ఆరోపణ ప్రత్యారోపణా విల్లంబులు సారించటం వాంఛనీయ పరిణామంకాదు. వ్యక్తిదూషణా విషవలయంలో చెప్పదలచుకున్నవిషయం మరుగున పడిపోయి ఆవేశ కావేషాలు మాత్రమే మిగులుతాయి.

ఇక 'భారతి' జనవరి 1980 సంచికలో సూరిగారు ప్రస్తావించిన విషయం. వారు గురజాడ అప్పారావుగారిని గురించివ్రాస్తూ ''కమ్యూనిస్టులు కొందరు'' (బహుశః అందరు కాదని వారి అభిప్రాయమేమో) ''ఊరికే డబ్బా వాయించకుండా వుంటే (పాపం) అప్పారావుగారిని తక్కువ చేయటానికి ఇందరు ముందుకు వచ్చేవాళ్లు కాదని ఈ లేఖకుడి నమ్మకం'' (బహుశః ''కొందరు'' 'ఇందరు'' అన్న పదాలను సూరిగారు ప్రాసకొరకు వాడినట్లున్నారు.)

సూరిగారి నమ్మకం ప్రకారం ''తాజ్‌మహల్ అతి సుందరమైన కట్టడమని'' కమ్యూనిస్టులంటే, కాదని వాదించటానికి చాలామంది ముందుకొస్తారన్నమాట గురజాడ అభిప్రాయాలతో కాని, ఆయన సాహితీ సౌందర్యం విషయంతో కాని విభేదించిన విమర్శకులు గుడ్డి కమ్యూనిస్టు వ్యతిరేకతతో దివాంధులుగ మారినవారుగా చిత్రించారు సూరిగారు. (పాపం) ఆయన అలా అనుకుని వుండకపోవచ్చు కాని జరిగిన పరిణామం మాత్రం అదే. ''నిర్దేశించిన భావాలను వాక్యాలు సరిగా బట్వాడా చెయ్యనందువలన'' సూరిగారు తాము నిర్దేశించుకున్న ''పర్పస్'' తామే ''డిఫీట్'' చేసుకున్నారు.

అయినా నాకు తెలియ కడుగుతాను. వేమనను వెలుగులోనికి తేవటం, గురజాడ స్మృతిని, వీరేశలింగంగారి స్మృతులను మరుగున పడకుండా కాపాడటం అటు బ్రౌన్ దొరగారు, ఇటు కమ్యూనిస్టులు చేసిన, చేస్తున్న కృతజ్ఞతవ్యంగాని నేరాలన్నమాట. సూరిగారి అవగాహనలో ఎంత దట్టమైన మాయపొర ?

శ్రీ పులిచేరి రామమోహనరావు

అప్రాచ్యపు భాష

ఆగిపోయాయనుకున్న అప్రాచ్యపు భాషణలు మళ్ళీ జనవరి సంచికలో గోచరించాయి.

ఇద్దరి (ఎంత చదువుకున్నా—ఒకవేళ) మూర్ఖత్వాన్ని 'భారతి' పాదాల కాగితాలకే కాక దాని అభిమానులకు సైతం కంపు గొట్టిస్తున్నారు

మూర్ఖత వాదనల్లోనూ తెలివైన మొండి పట్టుదల లుంటాయి. కేవలం వ్యక్తిగతంగా తిట్టుకునే సాహిత్య శ్రోతగాళ్ళ కలం ఇంత అసహ్యాన్నీ, కంపునీ కక్కుతుంటే ప్రతినెలా 'భారతి' చందాదారుల చేతుల్లోకి సరఫరా చేయడం ఆరోగ్యానికి మంచిదికాదు.

పిచ్చి ముదిరిన ఇద్దరి కలాలకు రోకళ్ళలాంటి విమర్శనా పూరితమైన మందలింపులు 'భారతి' సంపాదకులు చేయకపోయి నట్లయితే ఆ పనికి మేమే పూనుకోవాల్సి వస్తుంది.

అప్పటికీ ఆగకపోయినట్లయితే 'చందా' కట్టడం ఆపడం ఉత్తమమని భావించాల్సి వస్తుంది.

డా. యం. మురళీధర్

డా. కే. వి. వెంకన్నా పవార్

ఔ చి త్య వి చా ర ం

శ్రీ కేతవరపు రామకోటిశాస్త్రి ''కావ్యంయొక్క సాపేక్ష విలువ సిద్ధాంతం'' పేరున 1979 నవంబరు 'భారతి'లో ఒక వ్యాసం వాసేరు. అందులో ఆయన ఏదో కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం గాని, పాత దానిని వివరించడం గాని చేయలేదు. అందులో ఆయన చేసిందల్లా వస్తు విలువ సూత్రాల్ని మక్కీకి మక్కీ కావ్యానికి అన్వయించబోవడం ఒకటి. క్షేమేంద్రుడి ఔచిత్య లక్షణ వివరణను వదలి దానిని ''రెలిటివ్ విలువ రూపం''గా నెల కొల్పాడంటూ ప్రతిష్ఠిత సాహిత్య సూత్రాలను గంద్రగోళపరచడం ఒకటీను.

కావ్యం విలువ అది తయారు కావడానికి పట్టిన శ్రమ కాలాన్ని పట్టి వుంటుందంటారు శ్రీ శాస్త్రిగారు తమ వ్యాస ప్రారంభ వాక్యంలో. అంటే కుక్షింభరుడైన ఒక వేదజడుడు రాజును మెప్పించడానికై రోజుల తరబడి శ్రమించి తయారుచేసిన

''భోజనం దేహి రాజేంద్ర ఘృతసూప సమన్వితం'' అన్న అనుష్టుప్ శ్లోకభాగం, మరో కవిక్షణంలో పూర్తిచేసిన ఉత్తర భాగం ''. ...శరచ్చంద్ర చంద్రికా ధవళందధి'' అనే దానికన్న విలువ గలదిగా చెప్పాలి.

ఇటువంటి చిక్కే వస్తునిర్మాణంలోనూ వుంది. ''దోనె చెయ్యబోయి సోల చేశాడు'' అనే సామెత వుంది. ఆవిధంగా కొన్ని వారాలు శ్రమపడి తయారుచేసిన ఆ ''సోల''కు దోనె విలువ వుంటుందా? ఉపయోగం విలువకాదు మనకు కావలసింది. పని కాల వినియోగరీత్యా? ఉండదు. అందుచేతనే వస్తువు విలువ దాని నిర్మాణానికై సామాజికంగా అవసరమయ్యే శ్రమనుపట్టి వుంటుం దని ఆర్థిక శాస్త్రవేత్తలు మార్క్సుకు కూడా ముందే—చెప్పేరు. దానినే మార్క్సు ఇల్లా చెప్పేడు :

''ఒక సరుకు విలువ దానిలో ప్రక్షిప్తమై వున్న శ్రమ పరిమాణాన్ని పట్టి నిర్ధరించబడుతుంది. సందేహంలేదు. కాని, ఈ పరిమాణాన్ని సామాజిక పరిస్థితులు నియతపరుస్తాయి.''

ఇది వస్తువు విలువను నిర్ణయించడానికి సంబంధించినది. కళలు, సాహిత్యం మొదలైన వాని విలువకు ఆ కొలబద్దలు పని చెయ్యవు. వస్తువు విలువ భౌతికావసర పరిపూర్తిని పట్టి వుంటుంది. కావ్యం విలువ మానసికోత్తేజాల వికసనసుపట్టి వుంటుంది. ఇక్కడ మనం మాట్లాడేది కావ్యగ్రంథంయొక్క బజారు విలువను గురించి కాదని మరవకూడదు.

ఒక కావ్యంలోని ఏ అంశం మనిషిలో భావోద్దీపనం కలిగి స్తుందనే విషయంమీద చర్చలు అనాదిగా సాగుతున్నాయి. కొందరు కావ్యరూపం అన్నారు. మరి కొందరు కావ్య వస్తువన్నారు. ఈ ఉభయులూ మళ్లీ సూక్ష్మపరిశీలనకు పూనుకొని గుణం, రీతి, అలంకారాలను ఒకరు విశ్లేషిస్తే, వేరొకరు వక్రోక్తి, ధ్వని, రసాదుల్ని విశ్లేషించేరు. మనిషి అన్నప్పుడు శరీరం, ప్రాణం రెంటినీ అవినాభావంగా ఆలోచించినట్లే కావ్యాన్ని కూడ వస్తురూప సమైక్యత తోనే పరిగణించాలనేది ఆధునిక మతం అయినా అలవాట్లు,ప్రయోజనాలు, స్వభావాలు ఒక పట్టున సర్దుకోవు. ప్రతి దశలోనూ అటూ ఇటూ గుంజుడు చూస్తూనే వుంటాం.

ఈ ఘట్టంలో క్షేమేంద్రుడు కావ్యలక్షణంగా ఔచిత్యాన్ని తెచ్చేడు.

అలంకారాలు అలంకారాలే.

గుణాలు గుణాలే.

రససిద్ధిగల కావ్యానికి

ఔచిత్యమే ప్రాణం.

అంటాడాయన. అలంకారాలు, గుణాలు, రససిద్ధీ వున్నా ఔచిత్యం కూడా వుండాలంటారాయన. ఆ పట్టికకు మరొక అంశం చేర్చాడాయన. ఇది కావ్యరూపం, వస్తువు రెంటినీ కూడ ఆశ్రయించే లక్షణం.

ఔచిత్యం అంటే—''దేనికేది అనురూపమో అది'' అన్నారు. ఫలితంగా ఈ ఔచిత్యం దేశకాల సంబాధితం అవుతూంది. వస్తు రూపాలలోగల ఇతర అంశాలకూ దీనికీ వున్న తేడా అది.

అనాఘ్రాతం పుష్పం...నజానే భోక్తారం కమిహ సముపస్థాస్యతి విధిః ॥ అన్న కాళిదాస శాకుంతల శ్లోకంవుంది. ఇక్కడ స్త్రీని భోజ్యవస్తువునుగా, అనుభవించదగిన దాన్నిగా, పురుషుణ్ణి భోక్తనుగా అనుభవించే వాణ్ణిగా చెప్తున్నాడు. ఇది పితృస్వామిక, ఫ్యూడల్ దశలతోవున్న సమాజాలతో ప్రచలితంగా వున్న భావం. ఆ కాలానికి అది అనురూపం. కనుక దానిలో ఔచిత్యం వుంది.

అయితే మనం వున్న ఈనాడు సమాజంలో స్త్రీ స్థానం ఎంత దిగువనున్నా ఆమెను అనుభవైక భోగ్యవస్తువునుగా చెప్పడం అనౌచిత్యమే అవుతుంది.

ఆలాగే అసంశయం క్షత్ర పరిగ్రహక్షమా ... సతాంహి సందేహ పదేషు వస్తుషు ప్రమాణమంతఃకరణ ప్రవృత్తయః— శ్లోకం తీసుకుందాం.

కాళిదాసు కాలంనాటి సామాజిక నిర్మాణ స్వభావం రీత్యా తటపటాయించవలసిన ఘట్టాల్లో మంచివాళ్లు తమ మనోదండి ప్రకారం చేసెయ్యొచ్చు. వాళ్ల మనస్సు తప్పుదారి తొక్కదు అనే విశ్వాసం వుంది. ఆ సమాజానికి అది ఉచితమైన భావం.

కాని, ఈ భావాన్ని కువలయానందకారుడు ఆత్మప్రత్యయాలంకారంగా తోసేశాడు.

ఈనాడైతే మనం దానిని దురహంకారమాత్రంగా వర్ణిస్తాం. ఈనాడా భావం ఉచితం కాదు.

అంటే ఔచిత్యం ఒక లక్షణం మాత్రం.

క్రోధం ప్రభో సంహర సంహరేతి అన్న కుమార సంభవ శ్లోకంలో ''భవనేత్ర వహ్ని'' అనడంకన్న ''రుద్రనేత్ర వహ్ని'' అనడం ఉచితం అని క్షేమేంద్రుడు చెప్పడంవలన ఆయన ఔచిత్యానికి ఇచ్చిన ప్రయోజనం అర్థం అవుతుంది. కావ్య విలువ రూపాలకు అది రెలిటివ్ విలువనిస్తూంది గాని అదే రెలిటివ్ విలువకాదు. ఈ విషయాన్ని గ్రహిస్తే శ్రీ శాస్త్రిగారి వ్యాసానికి మూలమే లేకుండా పోతూంది. మిగిలిన రెండు మూడు పేజీల విషయమూ కేవలం ఆకాశ తాండవమే తప్ప వేరుకాదు.

అ వం తి

కీ. శే. శివరామశాస్త్రిగారు

కీ. శే. వేలూరి శివరామశాస్త్రిగారి కృతుల్ని సమీక్షించి పిహెచ్. డి. పట్టాన్ని శ్రీ జంధ్యాల మహతీశంకర్‌గారు పొందారంటే నా మది సంబరపడింది. దీనికి ముఖ్యకారణం నాకు వేలూరి వారి కృతులతోనూ, వ్యక్తితోనూ కించిత్పరిచయం కావచ్చు. స్తుతిని

9

కూడ నిండగా తలదాల్చే మహామనీషి ఆయన. వారి కృతులు పున ర్ముద్రితాలు కావలసి ఉన్నవి.

కళాత్మక విలువలకు ప్రాధాన్యమివ్వక సంఖ్యాబలానికి ప్రాధాన్యతనిచ్చే ఈనాడు ఆయన కృతుల్ని సమీక్షించే వారుండడం సంతోషించ దగిందిగా భావిస్తున్నాను.

ఉమ్మిటి

'భారతి' జనవరి '80 సంచికయందు ఇప్పగుంట మూల దేవగిరి లేఖను చూచుట తటస్థించినది. వారు పాఠకుల ముందొక శ్లోకమునుంచి దాని తృతీయ పాద పాఠమును కోరిరి. నా సంకలనము నందున్న శ్లోకములలో వారు కోరిన పాద మీ రీతిన ఉన్నది.

''భారతః పఞ్చమో వేదః
సుపుత్రః సప్తమోరసః।
దాతా పఞ్చ దశం రత్నం
జామాతా దశమో గ్రహః॥''

పి. నరసింహపాత్రుడు,
9-42-25,
రాజా హైస్కూల్ వద్ద,
కొత్తపేట, విజయవాడ-1.

చార్మినార్

శ్రీ మెతుకు మనోహరరెడ్డిగారు ('79 డిసెంబర్ 'భారతి') రచించిన వచన కవిత 'మా ఇంటి ముందరి నుండి పోయేత్రోవ' పట్టణాలకూ, పల్లెటూళ్ళకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. అయితే, 'హైదరాబాదులో ప్రేమకు చిహ్నమయిన చార్మినార్' అను పాదంలో విషయం తప్పగా చెప్ప బడిందని నా భావన. ఎందుకంటే, చార్మినార్ 1590వ సంవత్స రంలో హైదరాబాదు పట్టణ ప్రజలను దుర్భరబాధలకు గురిచేసిన ఒక మహా ఘోరమైన అంటువ్యాధిని (ప్లేగ్) తుదముట్టించి నందుకు విజయ చిహ్నంగానూ, భగవంతునికి కృతజ్ఞతా సూచకం గానూ కట్టబడిన స్మారక సౌధమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు ప్రచురించి, ప్రస్తుతం పదవ తరగతికి పాఠ్య పుస్తకంగా ఉంచిన ఆంగ్ల వాచకపు 113వ పుటలో 17, 18 గీతలలో స్పష్టంగా చెప్పబడింది.

శ్రీ శంకరగంటి రంగాచార్యులు

సైదు కాలువ విమర్శ

చాలా రోజుల్నుంచి సిధారెడ్డి, అంజయ్యల వివాదం చదువు తున్నాను. నదిలా ప్రవహించాల్సిన ఈ విమర్శ సైదుకాలువగ మారిపోయి కుళ్ళువాసన వేస్తోంది. చూడగా చూడగా వీళ్ళిద్దరికీ సైద్ధాంతిక విషయాల్లో 'ఏబీసీడీ'లు కూడా రావని తేలోంది. శివారెడ్డినే కేంద్రంగా చేసుకొని రాయడమెంత మూర్ఖత్వమో, శేషేంద్రనూ, శివారెడ్డినీ ఒకేగాట కట్టేయటం కూడా అంత మూర్ఖత్వమే. శివారెడ్డి కవిత్వంలో కొన్ని భావకవిత్వ లక్షణాలున్నా మొత్తంమీద ఆయన విప్లవానికి అనుకూలుడు. కాబట్టి మార్క్సిజం ముసుగేసుకోవాల్సిన అవసరం ఆయనకు లేదు. శేషేంద్ర ఖచ్చితంగా మార్క్సిజం ముసుగేసుకొని మార్క్సిస్టులనే పొడవదలచుకొన్న వాడని ఆయన కవిత్వాన్నిబట్టి సులభంగా చెప్పొచ్చు. మార్క్సియ అవగాహన ఉన్న ఏ సాహిత్యవేత్తైనా సరే, ఈ విషయాన్ని 'ఈజీ'గా గ్రహిస్తాడు.

శ్రీ ఎల్లా శివరామయ్య

మహాకవి

ఈమధ్య కృష్ణశాస్త్రిగారు చనిపోయిన పిమ్మటనే ఆయన పూర్తి పేరుముందు 'మహాకవి' కొత్తగా చూసినట్లు అనిపించింది. గురజాడవారికి కూడ తన జీవితకాలంలో 'మహాకవి' బిరుదు వున్నట్టులేదు. కాని ప్రస్తుతం జీవిస్తున్న కొంతమంది కమ్యూ నిస్టు రచయితల పేర్లముందు 'మహాకవి' కనిపిస్తూంది.

గురజాడ, కృష్ణశాస్త్రిగార్లకు తమ జీవితకాలంలో మహా కవి బిరుదు వుందా? పై రాసిన కమ్యూనిస్టు సోదరులకు 'మహా కవి' బిరుదు ఎవరు ఎప్పుడు ఎక్కడ ఇచ్చేరు? వ్యక్తిమాత్రంగా వారికి కాక ఈ సజీవ మహాకవుల వలన సమాజానికి కాని కనీసం సాహితీ రంగానికైనా ఒనగూరినదేమిటి? సోషలిస్టు సమాజం రావాలనే వారు ఈ మహాకవి బిరుదుని సహించవచ్చునా? ప్రగతి అభ్యుదయవిప్లవం—చాటేవారికి మహాకవులు అవుసరమా? ఏ కవి అయినా 'మహాకవి' అయే మార్గాలేవి?

ఇలా ప్రశ్నలు వేసుకుపోతూవుంటే ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. ఈ బిరుదుల వ్యవహారంలో పరిశోధన జరు పుదాం అంటే సాక్ష్యాధారాలు ఏమీ దొరకడంలేదు. సాహితీరంగంలో వున్న తెలుగువారంతా సహకరిస్తేకాని పరిశోధన దుర్లభం. కనుక తెలుగు సాహితీరంగంలో వున్నవారందరూ మా సందేహాలకి సమా ధానాలు వుంటే నేరుగా మాకు తెలియచేయమని కోరుతున్నాము.

అధ్యక్షుడు, 21స్ట్ సెంచరీ రైటర్స్, 26-3-22, దాసన్నపేట, విజయనగరం 531202.

జైమిని భారత విషయము

1980 ఫిబ్రవరిలో 'కలగూరగంప'లో 'అశ్వత్థామకు సమాధానము' అనే అంశాన్ని విద్వాన్ వి. విశ్వనాథమయ్యగారు వ్రాయగా చూచాను. పిమ్మట కొన్ని విషయాలు 'భారతి' పత్రికా ముఖంగానే వెల్లడించదలచాను.

(1) బోపదేవుడు భాగవతాన్ని వ్రాశాడా? అనేది నిజంగా పరిశోధించి తెలుసుకొనవలసిన అంశము. ఇది ఈనాడు లభించితే లోకానికి మరికొన్ని విషయాలు అర్థమవుతాయి. జైమినిభారతం తోడను, ఆంధ్రమహాభాగవతంతోడను దీనిని పోల్చి పరిశీలించ వచ్చును. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో "జైమినిభారతము–సంశోధనాత్మక పరిశీలనము" అను అంశంపై పరిశోధన నేను చేయుచుండగా ఈ ప్రస్తావన నిసరాలేదు. శ్రీ మల్లాది గార్య నారాయణశాస్త్రిగారి సంస్కృత వాఙ్మయ చరిత్రనుబట్టి యిది మాత్రం అసంగతమని తెలియును. ఈ విషయంలో నాకును ఉత్సాహమున్నది. శ్రీ విశ్వనాథమయ్యగారిని, శ్రీ కె. విశ్వేశ్వర రావుగారిని, దీనిని తెలుపవలసినదిగా కోరుచున్నాను. ఈ లోపల నేనును పరిశ్రమించి పరిశోధింతును. నాకును ఉపయోగపడగలదు. తంజావూరు లైబ్రరీ గ్రంథసూచికలో ఈ గ్రంథములేదు

(2) "ఆంధ్రసాహిత్య చరిత్ర"లో శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు "జైమిని భారతంలో అశ్వమేధపర్వం మాత్రమే కాన వచ్చుటచే ఈ పర్వమే వ్రాయబడినదని అనుకొనవచ్చును" అని వ్రాశారు. శ్రీ విశ్వేశ్వరరావుగారి లేఖనుబట్టి జైమినికృత సౌప్తిక పర్వం లభిస్తున్నట్లు గ్రహించవచ్చును ఈ రెంటికి తోడుగా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సంస్కృత అకాడమీలో "Catalogue of Manuscripts in the India office Library, London" అను తాళపత్ర సూచినిబట్టి సంస్కృత జైమిని భారతములోని ఆశ్రమవాస పర్వముకూడ లభించుచున్నట్లును, అందలి కథ "సీతావిజయము" అను పేరును కలిగి యున్నట్లును పేర్కొనబడి; అందలి ప్రారంభపు, చివరి శ్లోకములు కూడ ఉదహరింపబడినవి. ఆ తాళపత్రము ఎందు నూటయేబదికి మించి పత్రములున్నట్లు తెలియవచ్చుటలేదు. దీని విషయములో పరిశ్రమించవలెనని ఇండియా ఆఫీస్ లైబ్రరీ అధికారికి–దాని ఛాయా చిత్రమును పంపమనికోరుతూ లండన్‌కు కనీసం పది ఉత్తరములు వ్రాసితిని మలొక భవనములోనికి గ్రంథాలయమును మార్చుచున్నట్లు జాబు వచ్చినది. కాని తరువాత జవాబు రాలేదు. ఇది సాహిత్య జిజ్ఞాసువులకు తప్పక ఉపయుక్తము కాగలదు.

డాక్టర్ ముదిగొండ వీరేశలింగము

'నీడలు' లేని శ్రీ శ్రీ

అక్టోబరు 'భారతి'లో టి. ఎల్. సమీక్ష, ఫిబ్రవరి సంచిక లోని గోదావరి శర్మ వ్యాఖ్యానం చదివిన తర్వాత నా అవగాహనకు అందిన కొన్ని విషయాలు సాహితీ విజ్ఞుల ముందుంచుతున్నాను

శ్రీశ్రీ మహాప్రస్థానం తర్వాత వచ్చిన కవిత్వానికి చాలా భాగం శ్రీశ్రీ ప్రభావత్వం అనే అపప్రథ వ్యాపించి, మహాప్రస్థానం తరువాత రెండు దశాబ్దాలు పైబడి వెలువడిన అతిప్రతిభావంతమైన కావ్య సామగ్రిని ఎందుకూ పనికిరాకుండా చేయడానికి కొన్ని కావ్య విమర్శలు వెలువడుతున్నాయి. ఈ రెండు దశాబ్దాల కాలంలోను ఎన్నో మహత్తర కావ్యాలు వెలువడినాయి. అభ్యుదయోత్తరమైన ఈ కావ్య సృష్టి కంతటికి సరిపడు ఒక ఉత్తమమగు నామకరణం చేయలేకపోవడం మూలంగా ఈ సాహిత్యాన్నంతటిని కూడా శ్రీ శ్రీ నీడ ప్రక్కకే తీసుకెళ్ళవలసి వచ్చింది. అభ్యుదయోత్తర కవిత్వం అని, శ్రీ శ్రీ తరువాత కవిత్వం అని, ప్రయోగవాద కవిత్వం అని అనవలసి వస్తోంది. ఈ కవిత్వానికి, శ్రీశ్రీకి అసలు ఏమాత్రం సంబంధం లేదు అభ్యుదయ కవిత్వంతో — అంతకంటె సంబంధం లేదు. ఎందుకంటే ఈ కవిత్వం తీసుకున్న విషయం వేఱు, అభ్యుదయ కవిత్వం గ్రహించిన విషయం వేఱు.

మఱి, ఈ కవిత్వాన్ని ఏమని ఉదహరించుకొనవలెను? ప్రయోగవాదమన్న పేరు కూడా సరియైనది కాదు. ఆ సాహిత్యం యొక్క తత్వానికి సంబంధించినదికాదు. కేవలం ప్రవృత్తికి సంబంధించినది మాత్రమే. సంబంధించిన పేరును మనం నిర్ణయించితే తప్ప ఈ సాహిత్యానికి విలువ ఏర్పడదు

ఈ సాహిత్యానికి 'చైతన్యవాద' మని వ్యవహరించు కొనవచ్చును. ఈ పేరు అన్ని విధములుగా అభ్యుదయ కాలం తరువాతి చింతనా ప్రధానమైన కవి ప్రవృత్తిని సూచిస్తున్నది. అభ్యుదయ కవిత్వంలో విప్లవం, అట్టహాసం, భర్త్సన, జల్పనం, ఆక్రందన, ప్రకంపనం, ఆక్రోశనం, ఛేదనం, తాడనం, ఉద్వేగం, విమర్దన, అభిశంసన, అభ్యవకర్షణ, హెచ్చరిక, నిరసన, పీడన, పోరాటం, ప్రతిక్రియ, ప్రతీకారం, హింస, అసహనం, అవహేళన, శ్రమ, మురికి, వికృతి, అధిక్షేపణ–మున్నగునవి కావ్య విషయాలుగా చలామణి అయినవి. కాని తదుపరి వచ్చిన చైతన్యవాదంలో కవులు దీనికి పూర్తిగా భిన్నమైన విషయాలను చేపట్టారు. అవి — అన్వేషణ, చింతన, జిజ్ఞాస, ఆత్మావలోకనం, సమదర్శనం, పర్యాయవలోకనం, పరీక్షణ, వివశత, మానవత్వం, విశ్వకాంక్ష, సృష్టి, నాస్తిక్యం, ఆస్తిక్యం, విరతి, నైరాశ్యం, వ్యాపకత్వం, జాగరూకత మున్నగునవి. ఇవి — ఏ దృష్టితో చూచినను అభ్యుదయ వాదానికి వ్యతిరేకమైనవే గాకుండా పైపెచ్చు ప్రతిక్రియాత్మకమైనవి (రియాక్షనరీ) కూడా.

ఈ విధంగా, పూర్తిగా శ్రీశ్రీకి భిన్నమైన విషయాలను గ్రహించిన కవులు శ్రీ శ్రీ అనుయాయులు (ఉపగ్రహాలు) ఏ విధంగా కాగలరో నాకు అర్థం గావడం లేదు. అభ్యుదయ కవిత్వంపై పూర్తిగా ధ్వజమెత్తింది ఈ చైతన్యవాదమే! చైతన్యవాదం అభ్యుదయవాదుల 'జడం' నుండి 'చైతన్యం' వైపుకు ప్రసరించింది; అభ్యుదయవాదుల సమిష్టికి విసుగెత్తి, 'వ్యక్తి' వైపుకు పరుగిడింది; అభ్యుదయవాదుల విప్లవం నుండి విసుగెత్తి 'విశ్లేషణం' వైపుకు దృష్టి సారించింది; అభ్యుదయవాదుల–మర్దనం, తాడనం, అట్టహాసం,గర్జనలు మున్నగువాటి నుంచి - అసహ్యంతో– చింతన, పర్యవేక్షణ, ఆత్మావలోకనం వైపుకు ప్రసరించింది.

ఇన్ని కోణాల గుండా శ్రీశ్రీ కంటె భిన్నంగా వ్యవహరించి నప్పుడు ఈ ధోరణిలో వ్రాసిన దిగ్దంతుల వంటి కవులను శ్రీశ్రీ నీడలుగా, అనుయాయులుగా భావించడం అపచారమేగాక, అసల్ప ప్రతిభావ్యుత్పత్తులతో సాగిన ఒక మహాకావ్య యుగాన్ని అవహేళన చేయడమే అవుతుంది. ఈ నిరసనాత్మకమైన వ్యత్యస్త నిర్ణయంలో వున్నప్పుడు ఈ యుగంలో వెలువడిన 'యుగే యుగే', 'మధూలిక' మొదలైన మహాకావ్యాలను తృణీకరించడంఅవుతుంది

ఆంధ్ర సాహిత్యంలో కవులుగా గుర్తింపబడిన సి. నారాయణ రెడ్డి, దాశరథి, దుర్గానంద్, కుందుర్తి మొదలైన కవులపై శ్రీశ్రీ ప్రభావం పడివుండవచ్చు. ముందుతరం కవుల ప్రభావాలు తప్పనిసరిగా తరువాత వారిమీద పడతవి శ్రీ శ్రీ విషయంలో — అతని 'ప్రభవ' మొదలైన కావ్యాలు వ్రాయడం మూలంగా - అతనిపై—అతని ముందున్న భావకవుల ప్రభావం పూర్తిగావుందన్న విషయం అవగతమౌతుంది. అంతమాత్రంచేత అతనిని కృష్ణశాస్త్రికి అనుయాయుడు అని, కృష్ణశాస్త్రి ప్రభావం శ్రీశ్రీపై ముద్రగలదని అనడం భావ్యమా ? ఆ మాదిరిగానే కృష్ణశాస్త్రి పద్యాలు వ్రాసినంతనే పెద్దన్నకు నీడగా పరిగణించడమూ భావ్యం కాదు. ఆ విధంగానే రచయితలమీద శ్రీశ్రీ ప్రభావం వున్నప్పటికీ, వారు స్వల్పకాలంలోనే తప్పుకొని తమ స్వతంత్ర కంఠాలను తమ వ్యక్తిత్వ నిరూపణతో ఎన్నో కొత్త కావ్యాలను వెలువరించారు.

ప్రారంభదశలో రచయితకు 'సృజనాత్మక శక్తి' – ఒక ఆలంబనగా వుంటే చాలును. "మెనీ ఆర్ కాల్డ్ బట్ ఫ్యూ ఆర్ ఛూసెన్" అని సామాన్యోక్తి. "ఈవెన్ ఎమాంగ్ ది ఛూసెన్ ఫ్యూ ఓన్లీ వన్ విల్ బి ది లీడర్." అందరూ ఉద్యమాలకు ఊపిరి పోయలేరు. ఆంగ్లంలో వచన శైలికి పేరుపడ్డ రచయిత ఆర్ ఎల్. స్టీవెన్సన్ "టు పే ది సెడులేస్ ఏప్" అంటూ తన రచన అనుకరణతో ఎలా ప్రారంభమైనదీ చెబుతాడు. కీట్స్ కవితా సాధనలో మిల్టన్, షేక్స్పియర్ కవుల ప్రభావం నుంచి బయటపడి, కవిగా తనదైన ఓ రీతిని సాధించుకోవడానికి ఎంత ప్రయత్నం చేసాడో అతని లేఖల ద్వారా మనకు తెలుస్తున్నది. ఒక కవిగాని, రచయితగాని పూర్వ రచయితల ప్రభావంనుంచీ, ప్రతిభావంతులైన సమకాలీకుల ఛాయల నుంచీ తన్ను తాను రక్షించుకొని తనదైన వ్యక్తిత్వముద్రను—భాషమీద, ప్రక్రియమీద, శిల్పంమీదచూడగలిగితే గాని, రచనలోని సృజనశక్తి నిరూపణ కాదు.

రచయితకు లేక కవికి ప్రగాఢమైన అనుభూతి, భావనా తీవ్రత, చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధి అండగ ఉండాలి. ప్రతి ప్రక్రియలో ఒక వింత, ఒక నడక, ఒక సంచలనం, అనల్పమైన భావ స్ఫూర్తి, అపారమైన ధ్వని శక్తి, అమోఘమైన ఓజస్సు ఉండాలి

గేయాత్మకమైన; అభ్యుదయతత్వాన్ని భావ కవిత్వాన్ని ఒక సుదీర్ఘ కావ్యంలో పద్యాత్మకంగా సంగ్రహింపజేసి 'మధూలిక' మహాకావ్యాన్ని అందించిన దుర్గానంద్ గణనీయుడు. ఆ విధంగానే, కుందుర్తి వచనతత్వాన్ని ఎక్కువగా స్వీకరించి, స్పష్టమైన రీతిలో మానవ వికాసాధ్యాయాన్ని ప్రవేశపెట్టాడు. నారాయణరెడ్డి గేయాత్మకమైన కావ్యాలు వ్రాసి శృంగారరసాన్ని నూతన కావ్యధోరణిలో వెలువరించి, ఒక మార్గాన్ని నిర్దేశించుకున్నాడు. ఈ విధంగానే అనేకమంది కవులు శ్రీశ్రీనుండి వేఱయిన ఒక సాహిత్య మహాకావ్య కాననాన్ని సృష్టించి తెలుగు కవిత్వంలో ఒక వినూత్న అధ్యాయాన్ని సృష్టించారు. ఈ చైతన్య వాదంలో వెలువడిన కవిత్వం అధికశాతం ఆలోచనకు సంబంధించింది. అభ్యుదయ కవిత్వంలో ఆవేశమే వుంది. ఆవేశం చెప్పడానికి 'ప్రాస' అవసరం అవుతుంది. అందువలన అభ్యుదయ కవిత్వం అంతా కూడా ప్రాస, వేగము గలిగినది. అంటే ఓజస్సు- దానిలో ముఖ్యభాగం. కొట్టుట, చీల్చుట మొదలైనవాటికి పరవళ్ళుత్రొక్కే నడక, ఈ లెలవంటి పదప్రయోగం ఉండితీరాలి. ఇవి ఈకవిత్వంలో ఉన్నాయి.

ఇక, భావకవిత్వంలోని ఆత్మసమర్పణ నిరీక్షణ, వేదనను వ్యక్తీకరించుటకు హృదయ స్పందన కావాలి దానికి 'లయ' అవసరమైయున్నది. అందువలననే భావకవిత్వాలు అన్నీ లయాత్మకమైన కవిత్వాలు. ఇకపోతే, చైతన్యవాదులకు ఆలోచన, చింతన ప్రధానం కాబట్టి చైతన్యవాదంలో వేగము, ప్రాస, లయ — ఇవేమీ అక్కఱ లేకపోయినవి. వచనం మాదిరి గీతమే సరిపోతుంది. అందువలన వచనంలోని అనేక విధములైన నడకలను తరువాత వచ్చిన చైతన్యవాదుల కావ్యాలలో అసంఖ్యాకంగా చూస్తాం. ఆలోచనకు ప్రాధాన్యతను కల్పించిన కావ్యాలలో మొట్టమొదటిది—'అంతర్గొశాలు' (1956), పిమ్మట 'తెలంగాణ', 'సినీవాలి'.

అందువలన—ఈ కావ్యాలతో ఈ కాలాన్ని మనం పరిచయం చేసుకున్నప్పుడు ఈ యుగమంతా శ్రీశ్రీకి భిన్నమై, వేఱే ఒక సుదీర్ఘ ఇతిహాసాన్ని, సృజనాత్మకమైన పంథాను నిర్ణయించుకొని, మనముందు నిరంతరాయమానమైన చైతన్యధారను కన్పఱిచారు. ఈ విషయాన్ని సమీక్షకులు, ముఖ్యంగా టి. ఎల్. గ్రహించితే ధన్యుణ్ణి.

శ్రీవాసవ్య

గ్రంథ విమర్శలు

సౌందర్యలహరి

[శ్రీ శంకర భగవత్పాదుల సంస్కృత మూలమునకు రావినూతల శ్రీనాథరావుగారి ఆంధ్రానువాదం. డెమ్మీసైజు 18+40 పుటలు. వెల 3 రూ. లు. ప్రతులు దొరకుచోట్లు— (1) శ్రీ రావినూతల శ్రీనాథరావు, బి. ఏ., బి. ఎల్., కేరాఫ్ శ్రీ రావినూతల శ్రీరాములు, ఇంటి నెం॰ 2/2, కోట, కల్యాణదుర్గం—517561 లేక శ్రీజానమద్ది హనుమచ్ఛాస్త్రి, ఎం॰ ఏ., గాంధీనగరం, కడప—516001]

మహేశ్వరుని అవతారమూర్తి అని ప్రఖ్యాతిపొంది అద్వైత మత స్థాపకులై, ప్రస్థాన త్రయానికి భాష్యాలు రచించిన శంకర భగవత్పాదులు కొన్ని స్తోత్రాలు కూడా రచించారు. వాటిలో సౌందర్యలహరి మిక్కిలి పేరు పొందినది. అమృత ప్రవాహంవలె నిరాఘాటమై మధురాతి మధురమైన వారి రచన ఏ కొద్దిమంది మహాకవులకో గాని సాధ్యమయేదికాదు. బ్రహ్మవిద్యలో భగవద్గీతకెంత ప్రచారం ఉన్నదో, స్తోత్రగ్రంథాలలో సౌందర్యలహరికి అంత ప్రచారం ఉన్నది. తెలుగులో భగవద్గీతకు ఎన్ని పద్యానువాదాలున్నవో, దీనికిన్నీ అన్ని అనువాదాలు కానవస్తున్నవి. దీన్ని అనువదించి తమ కవితకు సార్థక్యం చేకూర్చుకోవాలని చాలామంది ఆంధ్రకవుల అభిప్రాయం. సౌందర్యలహరికి చాలా అనువాదాలు రావడానికి అదే కారణం కావచ్చు. అట్టి అనువాదాలలో ఇది ఒకటి.

ఈ అనువాదం 1980లో ప్రకటితమయినా, దీనిపై స్వర్గీయులు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, స్వామీ శివశంకరస్వామి మున్నగువారి అభిప్రాయాలు ప్రకటించబడినందున రచన చాల ఏళ్ల క్రిందటనే జరిగినట్లు తెలుసుకోవచ్చును. స్వర్గీయులవే కాక—ఇప్పుడున్న సుప్రసిద్ధ విద్వత్కవులు—మహాకవి గడియారం వేంకటశేష శాస్త్రిగారు, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు, కళాప్రపూర్ణ డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు, కవిరత్న యామిజాల పద్మనాభస్వామిగారు మున్నగువారి సదభిప్రాయాలు కూడా ఇందులో చేర్చబడి ఉన్నవి.

అనువాదం సరళంగానే సాగింది. శ్లోకంలోని భావం చెడిపోకుండా చిన్న పద్యంలో ఇమిడ్చేశక్తి యీ కవికి ఉన్నది. కొన్నియెడల రెండు శ్లోకాలకు కలిపి ఒక పద్యం చెప్పడం, శ్లోకభావం వ్యక్తం చెయ్యడానికి ఎక్కువ పాదాలుగల తేట గీతులను వాడడం, మంజరీ ద్విపదలను చెప్పడం కానవస్తున్నది. తేటగీతుల, మంజరుల రచన సులభంగా సాగినట్లు వృత్తరచన జరగలేదేమో అని అనిపిస్తున్నది. అనువాద పద్ధతికి రెండు ఉదాహరణలు—

మూలం—

''శివః శక్త్యాయుక్తో యది భవతి
శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో నఖలు కుశలః
స్పందితు మపి,
అత స్త్వామారాధ్యాం హరిహర
విరించాది భిరపి
ప్రణంతుం స్తోతుం వా కథ మకృత
పుణ్యః ప్రభవతి''

అనువాదం—

శక్తియుతుడైన ప్రభవింప శక్తుడగును
గాక శివుడైన స్పందింప గలుగడనుచు
హరిహర విరించనులు గొల్చునట్టి నిన్ను
నకృత పుణ్యుండు గొలువంగ నర్హుడగునె ?

సౌందర్య లహరిలోని తొలి శ్లోకానికి గల అనువాదం ఇది. మూలంలోని పెద్ద వృత్తంలోని భావం సమగ్రంగా ఒక తేటగీతిలో చక్కగా ఇమడ్చబడినది. రచన కూడా పొందికగా సాగింది. గీత పద్య రచన, మంజరి రచన సాగినంత సరళంగా వృత్తరచన సాగినట్లు కానరాదు. వృత్తాలు వ్రాయడానికి కొంత శ్రమపడినట్లు తోస్తున్నది. ఒక్క ఉదాహరణ --

మూలం---

''ధునోతు ధ్వాంతం న స్తులిత
దళితేం దీవర వనం
ఘనస్నిగ్ధ శ్లక్ష్ణం చికుర
నికురంబం తవ శివే,
య దీయం సౌరభ్యం సహజ
ముపలబ్ధుం సుమనసో
వసం త్యస్మిన్ మన్యే తల
మథనవాటీ విటపినామ్''

అనువాదం—

'దళితేందీవరవాటి కోపమము స్నిగ్ధ శ్లక్ష్ణమున్ సౌరభో
జ్జ్వలితా కృష్ణమహేంద్ర నందనవనీ
క్ష్మాజాత పుష్పాళియై
వెలయన్ కేశకలాప మిద్ది జననీ!
వేవేగ పోకార్చుతన్
విలసత్ధ్వాంతము మాకు దివ్యకరుణా
విర్భూత విజ్ఞానమై.''

సౌందర్యలహరిని తెలిగించడం కష్టసాధ్యమైన పని. మూల భావాలను తెలుగు పద్యాలలో ఇముడ్చడం క్లిష్టమే! ఆ క్లిష్ట కార్యాన్ని సాధించిన శ్రీనాథరావుగారు ధన్యులు!

దీని పీఠికలో — పద్మశ్రీ మహాకవి .డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులుగారు సౌందర్య లహరీ కర్తృత్వాన్ని గురించీ, గూఢాభిప్రాయాలను గురించీ, ఏతద్రచనను గురించీ విపులంగా చెప్పారు. విద్వాంసులు గ్రహించదగిన విషయాలెన్నో అందులో ఉన్నవి. భారతీయ తత్త్వాన్ని బాగా అవలోకన చేసిన డాక్టర్ ఇల పావులూరి పాండురంగారావుగారు ''శంకరుని భావ సౌందర్య లహరి యిక్కడ కావ్య సౌందర్య లహరిగా అవతరించింది'' అని దీనిని ప్రశంసించారు. ఈ అనువాదాన్ని మూలంతో కూడా ప్రకటించడం మెచ్చదగినది.

"ఆంగీరస"

తెగిన చుక్కలు

(కథల సంపుటి)

[రచయిత:రామాచంద్రమౌళి, ప్రచురణ:సాగర్ పబ్లికేషన్స్, 4–7–1068, ఈసామియా బజారు, హైదరాబాదు – 27, పేజీలు : 140, వెల :7 రూపాయలు.]

ఈ పుస్తకంలో మొత్తం 15 చిన్న కథలున్నాయి. వీటిలో గొప్ప స్పీడుగల పరుగు వుంది. ఆవేశం, ఆవేదనా వున్నాయి. వర్తమాన సమాజంలోని ఎక్స్‌ప్లాయిటేషన్‌ని ఎత్తిచూపే కొన్ని చిత్రణలు వున్నాయి. అవి ఎంతో సహజంగా వున్నాయి.

కొన్నిజీవిత వాస్తవాలను గమనించి ఉద్వేగంపొందిన రచయిత తను ''ఆవేదనకి లోనయి, ఆ బాధని యధాతథంగా పాఠకులకి అందించారనాలి. అక్కడితో ఆ బాధ్యత తీరిపోయిందనుకోరాదు — సమస్యలు అద్దంలోలాగా ప్రతిబింబింపబడ్డాయిగాని వాటిపరిష్కారం గురించిన ఏ విధమయిన ప్రయత్నమూ కనపడదు; అందువలన సమగ్రత లోపించిందనక తప్పదు.

ఈ కథలలో మంచి ఎత్తుగడా, మలుపులూ, అచ్చెరువు గొలుపగల ముగింపులూ విశిష్టమయిన స్థానాన్ని సంపాదించుకోలేక పోయాయి. విషయాలు సూటిగా, వాడిగా, వేడిగా విశ్లేషింపబడినాయి. కాని జీవితం కేవలం కొన్ని కోణాల్నించి మాత్రమే అసమగ్రంగా చిత్రించబడిందనాలి. కొన్ని సంఘటనల్ను మాత్రమే ప్రాతిపదికగా చేసుకుని ఈ కథలు రూపు దాల్చాయి—

కేవలం సంఘటనా వివరణా, ఆవేశంతో కూడిన నినాదాల ముగింపులూ శక్తిమంతమయిన పరిపుష్టమయిన కథానికను రిప్రెజంట్ చేయజాలవు. అందువలన స్పందన కలిగించగల వస్తువిశ్లేషణతోపాటు కథన విషయికమయిన మవులిక లక్షణాల్ని కూడా, సామాజిక ప్రయోజనాన్నాశించి పీడిత తాడిత ప్రజానీకానికి అందమయిన భవిష్యత్తూ ఆనందకరమయిన న్యాయమయిన బ్రతుకులూ కావాలంటూవున్న ప్రజా సాహిత్యపు—కథానికలూ పాదుపుకొన గలిగినప్పుడే అవి శక్తిమంతమయినవి అవుతాయి. ప్రతిభాశక్తి లేని సాహిత్యం పేలవమై నిర్వీర్యమై తన లక్ష్యాన్ని సాధించజాలదు. నిరంతరం సాగుతూవున్న దోపిడీ అరికట్టబడాలన్న చేతన ప్రజల్లో ఉద్దీపన చెందాలంటే, ఆ లక్ష్యం గలిగిన ఏ సాహిత్యమూ ప్రతిభని విస్మరించటానికి వీలులేదని చెప్పకతప్పదు. అందువలన హింసనీ, ద్వేషాన్నీ పురిగొల్పి అభ్యుదయకరం అనే ముద్రవేయించుకుంటున్న ఈనాటి ప్రజాసాహిత్యం అనబడేది విషయ ప్రాశస్త్యాన్ని మాత్రమే గాక ప్రతిభనీ కథన చాతుర్యాన్నీ కూడా సంతరించు కొనవలసిన అవసరం వుంది. ఈ విషయం కథానికకు కూడా వర్తిస్తుంది.

— అందువలన, మంచి ఉద్దేశ్యం గలిగిన ఈ కథలూ, గొప్ప కథలు అనిపించుకొనాలంటే, ఒక ముందు మాటలవారి సర్టిఫికెట్లతో గాక – మరింత పుష్టినీ, సమగ్రతనూ, సార్వజనీనతనూ, సార్వకాలికతనూ సంతరించుకోవలసిన అవసరంవుందనాలి. అందుకు ఇంకా ప్రయత్నం జరగాలి. అప్పుడే, హేతుబద్ధమయిన, లోపరహితమయిన, నిశ్చితమయిన చారిత్రాత్మకమైన, చైతన్యోద్దీపకమయిన పోరాట మార్గాన్ని సాహిత్యం చూపగలుగుతుంది. సార్థకతని సాధించుకో గలుగుతుంది. యువ రచయితల నిరంతర కృషి అందుకు చాలా అవసరం.

పఠితని సీరియస్‌గా చదివించి నేర్పుగా తమవెంట తీసుకుపోగల ఈ కథల సంపుటిని వేసిన ప్రచురణకర్తలు నిత్యజీవితంలో అన్నిటి ధరలూ ఆకాశాన్ని అంటుతున్నాయో అని గొప్పగా గోల పెట్టారు; కాని కేవలం 140 పేజీలున్న ఈ పుస్తకానికి 7 రూపాయల ధర పెట్టటానికి ఏ మాత్రం సంశయం చూపలేదు!

చాలావరకు ఎక్కడా అచ్చుతప్పులు లేకుండా వుండటం ఈ పుస్తకానికిగల ఒక విశేషం. గెటప్, ముద్రణా బాగున్నాయి.

రచయిత తమ 'పరుగు' మాని, నిదానంగా నిలబడి ప్రయత్నించితే ముందు ముందు కొన్ని గొప్ప కథలు అందిస్తారని ఆశించే అవకాశాన్ని ఈ కథల పుస్తకం కలిగిస్తుందనవచ్చును.

కలిసి వచ్చిన కలిమి

(పిల్లల కథలు)

[రచయిత: నరిశేపల్లి లక్ష్మినారాయణ, ప్రచురణ: రచయితే. ప్రాప్తిస్థానం :రచయిత, 15/265, రోషన్నవీధి, గుంతకల్లు–2, పేజీలు : 50, వెల : 2 రూపాయలు.]

ప్రీతితో, ఒక రీతిలో పిల్లలకు ఒక నీతినిచ్చే కథలు వ్రాసే రచయితల 'జాతి'లో చేరాలని తమ అభిమతమనీ, వీటిని చదువక ముందూ, చదివాక కూడా ఇవి కథలు అన్న సంగతిని మరువవద్దనీ, పిల్లలకు విజ్ఞాన వినోద వికాసాలను అందించాలని తను అభిలషించానే గాని జాతీయ బహుమతుల్ని ఆశించలేదనీ పుస్తకానికి ముందు రెండు మాటలలో సెలవిచ్చారు రచయిత. అయినా — కష్టపడి సమకూర్చుకొన్న విత్తంతో ముద్రించిన ఈ చిరుపొత్తంలోని ఏ ఒక్క కథ వల్లనయినా ఎక్కడో ఒకచోట మీ చిత్తం ఏ మాత్రం

స్పందించినా తమ కృషి సార్థకమైనట్లేనని అభిభాషణ చేశారు. ఆ దృష్ట్యా చూడగా —

కృతకమయిన సంకర భాషలో వ్రాయబడిన ఈ కథలు పిల్లలకని వుద్దేశించబడినాయి గనుక చదివి అర్థం చేసుకోవటానికి వాళ్ళు కష్టపడక తప్పదు. ఈ కథలు కొంత వరకూ పిల్లలకి వినోదం కలిగించగలవే గాని విజ్ఞాన వికాసాల కోసం దీపం పెట్టి వెతికినా వృథాప్రయాసే అనాలి. పోతే ఇవాళా రేపూ బాలసాహిత్య కారులు కేవలం జాతీయ బహుమతుల గురించి గొప్ప ఆశతో వుండటంవలన రచయిత నిస్పృహలోని నాస్తవాన్ని అర్థం చేసుకొన వచ్చును. ఈ పుస్తకంలో ఎక్కడా ఎవరియొక్క చిత్తమూ స్పందించగల అవకాశాలు లేవు.

ఈ పుస్తకంలో అచ్చుతప్పులు బాగానే వున్నాయి. పిల్లల్ని ఆకర్షించగల లక్షణాలేవీ ఈ పుస్తకం గెటప్‌లోలేవు. వాళ్ళని అల రింపజేసి ఆలోచింపజేయగల విషయాలూ ఇందులో మృగ్యం. సరళమూ, ఆకర్షణీయమూ అయినశైలిగల బాలసాహిత్యం అవసరాన్ని ఇది స్పష్టం చేస్తుంది. మిగతా పుస్తకాలలాగానే బాలసాహిత్యంలో కూడా తామర తంపరగా పుట్టుకుని వస్తూన్న లక్ష్యశుద్ధిలేని అనేకమయిన పుస్తకాలలో ఇదీ ఒకటి అనవచ్చును.

ఈ కథకు ముగింపు లేదు

(కథా సంకలనం)

[రచయిత్రి: బాలాంత్రపు శారదా రావ్, ప్రచురణ: తెలుగు వెలుగు ప్రచురణలు, అమలాపురం-533201, పేజీలు : 52, వెల : 5 రూపాయలు.]

ఈ పుస్తకంలో ఆరు చిన్న చిన్న కథలున్నాయి. వాటిలో 'ఈ కథకు ముగింపు లేదు', 'ఏం చేసేది' అన్న — ఇంగ్లీషు నించి మూల రచనలను గొప్పగా ఖూనీ చేస్తూ రాసిన - అనువాదాలు. రచయిత్రి స్వంత రచనలయిన మిగతా నాలుగూ కథలు అన్పించు కోవటానికి అనర్హమయినవి అనక తప్పదు. భాష చాలా కృతకంగా వుంది. వస్తువులో వైశిష్ట్యం కానరాదు. కథా కథన కౌశల్యం అసలు లేదు. వాస్తవికత, సహజత్వాల కోసం వెతుక్కోవాలి. రచనలు అన్నీ సినిమాటిక్‌గా లూజు లూజుగా వున్నాయి.

'అందువలన అన్ని తరగతుల పాఠకుల్నీ ఆకట్టుకునేవిధంగా ఈ కథలు మలచబడ్డాయి' అని తమ ముందు మాటలో సర్టిఫికెట్ ఇచ్చిన సాహిత్య ఎకాడమీ సలహా సంఘ సభ్యులొకరు తమ పదవికి సార్థకతని కలిగించారు. అంతేగాక వారే కథలు వ్రాయడం కష్టమనీ, వాట్నే పుస్తకంగా వెయ్యటం అంతకంటే కష్టమనీ—కాగా ఈ పుస్తకానికి ముందుమాట వ్రాసిన తాము అందరికంటే ఎక్కువగా ఎంతో కష్టపడ్డామనీ అభిభాషించారు. వారే ఇంకొక మాటా అనగలిగి వుంటే నిజాయితీగా వుండేదిగాని అనలేకపోయారు. ఈ అన్నింటికంటే కూడా ఈ పుస్తకంలోని కథల్ని చదివి ప్రయోజనం పొందటానికి పఠిత చాలాచాలా చాలా కష్టము పడాలన్నదే ఆమాట. ఈమధ్య బంపర్గా అచ్చవుతూ స్ట్రెయిటుగా లైబ్రరీలలో చోటు చేసుకుంటూవున్న అనేకమయిన పుస్తకాల్లో ఇదీ ఒకటి కాగలదు. పుస్తకం అంతటా అచ్చు తప్పులు తప్పలేదు. పుస్తకం గెటప్పూ ఏమంత బాగాలేని ఈ పుస్తకం వెల 5 రూపాయలు కావటమే దీని విశేష గుణమని అనాలి. మరి దీని పరిమాణమో ? కేవలం 52 పేజీలే. కావున ఎవరికయినా ఆశ్చర్యం కలిగి దీన్ని కొనాలన్న ఆలోచనకి దూరంగా పారిపోవటం మాత్రం ఖాయం.

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

మా న వా ర ణ్యం

[జి. సి. కొండయ్య, రు. 14-00. ప్రతులకు : నవజనత పబ్లికేషన్స్, నెల్లూరు.]

జి సి. కొండయ్యగారు ఈనాడున్న ఆలోచనా పరులైన రాజకీయ ప్రముఖులలో ఒకరు. ఇతర రాజకీయ ప్రముఖులకులేని ఒక రచనాశక్తి ఆయన కుండటం ఆయన ఆలోచనా ధోరణిని వ్యక్తం చెయ్యడానికి ఒక వాహికగా ఉపకరించింది.

'మానవారణ్యం' వర్తమాన సామాజికరంగంలో ఆర్థిక వ్యవస్థ కల్పిస్తున్న సంక్షోభానికి, మారణ హోమానికి ప్రతీక. అనేకమంది సాధారణ రచయితలవలె జి. సి. కొండయ్యగారు కూడా నవల ముగింపులో మంచి జయించడం, చెడు పరాజయం పొందడం చూపించారు. అయితే ఇది భవిష్యత్సమాజంమీద ఈనాటి రచయిత కున్న ఆశావాదంగా మనం సరిపెట్టుకుంటే నవల పరమార్థం నెరవేరినట్లే. లక్ష్మీనారాయణ, వారి ఏజంటు దశరథరామయ్య ఈనాటి ధనస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబాలు. దశరథరామయ్య చేతిలో కీలుబొమ్మలుగా మారిన చంద్రంలాంటి పాత్రలు ధనానికి, అది అందించే సుఖాలకు అమ్ముడుపోతున్న ఆటబొమ్మలు. స్వసుఖంకోసం వీళ్ళు ఎన్ని హత్యలైనా, ఎంత బీభత్సాన్నైనా అవలీలగా, సునాయాసంగా నిర్వర్తించగలరు. సుందరమ్మను హత్యచేసిన చంద్రం, ఆ హత్యను పిచ్చివాడిమీదకు నెట్టిన దశరథరామయ్య, లక్ష్మీనారాయణలు ఈ మానవ మహారణ్యంలో లేడిపిల్లలను వేటాడే క్రూర మృగాలు. ఈ నవలలో పిచ్చివాడుగా మారిన చక్రపాణి, కొత్తగా రిక్రూట్ అయిన ఇద్దరు డి. ఎస్. పి లు, డ్రైవర్ రాఘవయ్య — రాబోతున్న ఒక ఆదర్శ సమాజానికి ప్రతిరూపాలు. ఎస్. పి. ఇంకా అస్తమించని గత వర్తమాన కాలాలకు, ఇంకా ఉదయించని ఒక అస్పష్ట మానవ వ్యవస్థకు మధ్య సంధికాలంలో కొట్టుమిట్టాడుతున్న పాత్ర.

ఈ నవలలో నేటి సమాజంయొక్క వికృతరూపం, ఈ సమాజపు ఇనప పాదాలక్రింద నలిగిపోతున్న అసంఖ్యాక జనానీకాల ఆక్రందనలు, అతిభయంకరంగా పరిణామం చెందిన ఆర్థిక వ్యవస్థయొక్క విలయతాండవం, ఆధునికత పేరుతో నిరంతరంగా ప్రవహిస్తున్న

క్షీణ సంస్కృతీ తీవ్రంగా ప్రదర్శింపబడ్డాయి. స్వాతంత్ర్యానంతర భారతదేశం ఏవైపుకు పోతున్నది? బుద్ధి జీవులను వేధిస్తున్న సమస్య. ఈ సమస్యకు అక్షర రూపాన్నిచ్చి చదివిన ప్రతివాణ్ణి ఆలోచించేటట్లు చేశారు రచయిత. ఇట్లాంటి నవలలు అచ్చువేసేటప్పుడు అచ్చుతప్పులు లేకుండా చూడటం ప్రకాశకుల కనీసధర్మం. లక్ష్మీనారాయణ 78వ పేజీనుండి శ్రీమన్నారాయణగా మారిపోవడం పాఠకుల్ని తికమకపెడుతుంది.

తుపాకిగొట్టం - హారతి పళ్ళెం

[జి. సి. కొండయ్య, రు.10-00, ప్రతులకు : నవ జనత పబ్లికేషన్స్, నెల్లూరు.]

స్వాతంత్ర్యోద్యమ కాలంనుంచి, స్వాతంత్ర్యోత్తర కాలం వరకూ భారతదేశ రాజకీయ, ఆర్థిక, నైతిక రంగాలలో వచ్చిన పరిణామ ఫలితాలకు అక్షరరూపం ఈ నవల. ఇంకొక రకంగా చెప్పాలంటే—ఆధునిక భారతదేశంలో అంతర్భాగమైన ఆంధ్రదేశ చరిత్రను కల్పితపాత్రల రూపంలో నవలీకరణ చెయ్యడం ఇందలి ఇతివృత్తం.

గాంధి సిద్ధాంతాలకు, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు, కమ్యూనిస్టు సిద్ధాంతంలో వచ్చిన విభేదాలకు రూపకల్పనగా ఈ నవల ద్రష్టవ్యం అవుతోంది విజయ, అరుణ్ పాత్రలు మితవాద, అతివాద కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ప్రతీకలు అరుణరావు ఆయుధ పోరాటంద్వారా మాత్రమే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభిస్తుందని కడవరకూ విశ్వసించాడు. ఈ అభిప్రాయం మీద ఎంతమాత్రమూ విశ్వాసంలేని వ్యక్తి విజయ. విజయ కమ్యూనిస్టు సిద్ధాంతాలను సక్రమంగా అర్థం చేసుకొన్న వ్యక్తిగా కనబడతాడు. వీరయ్య, వెంకటావులు గ్రామపెత్తనం వహించిన పెద్దలు నవల ప్రారంభంలో దొంగ కుంచాలతో కూరి కొలుస్తున్న వీళ్ళిద్దరూ కాలపరిణామంతోపాటు సంపూర్ణంగా కాకపోయినా కొంతవరకూ మార్పు చెందిన వ్యక్తులు. కొత్తగావస్తున్న భావ సిద్ధాంతాలపై వాళ్ళకు ఇష్టంలేకపోయినా సర్దుబాటు ధోరణిలో జీవించడం నేర్చుకొన్న పెద్దమనుషులు. వైస్ ఛాన్సలర్ రఘువీరరావు, డాక్టర్ ఈ నవలలో మరో రెండు ప్రధానమైన పాత్రలు. ఈ రెండు పాత్రలలో కనిపించేది సర్వసిద్ధాంతాలకు అతీతమైన మానవతావాదం. వాళ్ళిద్దరూ అరుణరావు ఉగ్రవాదాన్ని అంగీకరించరు. అరుణరావు తీవ్రవాది అని, అతను ఏనాడైనా అరెస్టు కావచ్చునీ, అంతకంటె ఘోరం కూడా జరగవచ్చుని తెలిసికూడా రఘువీరరావు తన కూతురు శారద ఇష్టప్రకారం అరుణరావుకు, శారదకు వివాహం జరిపిస్తాడు. అతను ఆశించే మానసిక స్వేచ్ఛకు, స్వాతంత్ర్య భావనకు ఇది చక్కని ఉదాహరణ చివరకు శారద—భర్త విప్లవసేనలో చేరి భర్తకు సేవచేస్తూనే పోలీసు కాల్పుల్లో మరణిస్తుంది. శారద కుమారుడు కిరుణరావు కూడా కాల్చి చంపబడతాడు. రఘువీరరావు గుండెపోటుతో మరణిస్తాడు. డాక్టర్ తన ఆజన్మ స్నేహితుని మరణంతో నిద్రమాత్రలుమింగి మరణిస్తాడు. ఇవన్నీ తెలిసిన అరుణరావులో ఆలోచన ఆరంభమవుతుంది. "ప్రతి రాజకీయ ఆర్థిక సాంఘికమార్పు పరిణామంలో ప్రజలు భాగస్వాములు కావాలి సంస్కరణవాదుల ననుసరించబడాలి. అప్పుడే శాంతికి ప్రయోజనకరమై అభ్యుదయాలకు పునాది నిలుస్తుంది" అన్న విజయ మాటలు అరుణరావుకు గుర్తుకొస్తాయి. "ప్రజల కొరకు ఉద్దేశించబడిన ఆ విధానాన్ని (ఉగ్రవాదం) ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వారిపై రుద్దటం సమంజసం కాదన్న యూరోపియన్ మార్క్సిస్టుల మరొక మార్క్సిస్టువాదం మనసులో మెరిసింది" అరుణరావుకి. అరుణరావు, విజయలు హోటల్లో మాట్లాడుతుండగా పోలీసులు తుపాకులు పేలుస్తారు. తుపాకిగుండ్లు కందకుండా వాళ్ళిద్దరూ పారిపోతారు. తుపాకిగుండ్లు మానవపురోగతిని ఆపలేవని, ప్రగతి సిద్ధాంతాన్ని హత్య చేయలేవని, మృత సమాజ శిథిలాల్లోంచి ఒకానొక మానవ వ్యవస్థ ఉద్బుద్ధమవుతుందని రచయిత ఆశావాదం ఈ నవల ముగింపులో కనబడుతుంది.

మనిషికి-మనిషికి మధ్య

[వెల : రు 5/. వి. రాజారామమోహనరావు, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ — 520 001.]

'మనిషికి మనిషికి మధ్య' నవలలో రంగారావు, లక్ష్మీపతి పెట్టుబడిదారీవర్గ మనస్తత్వానికి ప్రతినిధులు. అప్పారావు, కాంతం, శ్రీహరి మొదలైనవాళ్ళు రంగారావు, లక్ష్మీపతుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి శ్రమలేకుండా జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్న మనుషులు. జానకిరామయ్య నిర్లిప్త స్వభావం కలవాడు. సత్యం వర్గస్వభావాన్ని అర్థంచేసుకొని కష్టజీవులను సంఘటితశక్తిగా రూపొందించడానికి ప్రయత్నం చేసేవ్యక్తి.

కాకిరాయి త్రవ్వకం, అచ్చటి రోజువారీ కూలీల జీవిత విధానం, ఆ కూలీల మనస్తత్వం, వాళ్ళలోఉన్న మానసికబలం, బలహీనత ఇత్యాది విషయాలన్నింటినీ స్థూలంగా చిత్రించిన నవల ఇది. మనిషికీ మనిషికీ మధ్యనున్న ఆర్థిక సంబంధం బలవత్తరమైనదనీ, హార్దిక సంబంధాలు వర్గ సమాజంలో ఉండవనీ, మనిషికీ మనిషికీ మధ్య మానవతా సంబంధాలు నెలకొనడానికి సామ్యవాద సమాజం పునాదిరాయి వంటిదని రచయిత చెప్పాలనుకోవడం ఈ నవల పరమార్థం. కాకిరాయి త్రవ్వే ప్రదేశంలో కార్మికుల కష్టసుఖాలు, డబ్బు విషయంలో వారి ఏకాకి మనస్తత్వం, సత్యం ప్రబోధంతో వారిలో ప్రవేశించిన సంఘటిత మనస్తత్వం రచయిత చిత్రించిన విధం బాగానే ఉంది కాని ఈ విధమైన భావ సంఘర్షణ, నవల చివరలో రచయిత చూపిన తిరుగుబాటు మనస్తత్వం ఇప్పటికి కొన్ని దశాబ్దాల క్రిందటి ఇతివృత్తం. ఈరోజు సమాజం ఆ దశనుదాటి అనంతర దశలోకి ప్రవేశించిందని రచయితకు తెలియకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. పోగా నవలలో

గాఢమైన జీవితానుభూతిగాని, తీవ్రమైన మనస్తత్వ పరిశీలనగాని, పరిపూర్ణమైన సామాజిక శక్తుల అవగాహనగాని కనబడదు. రచయిత చిత్రించదలచుకొన్న జీవిత విధానంలో రచయితకు పెద్దగా పరిచయం లేకపోతే ఇట్లాంటి నవలలే వస్తవి. ఇది ప్రథమ బహుమతి పొందిన నవల.

స్మశానం దున్నేరు

[వెల : రు. 6/, డా॥ కేశవరెడ్డి, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ–520001.]

విశాలాంధ్ర ప్రచురణాలయంవారు 1979వ సంవత్సరంలో నిర్వహించిన నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల స్మశానం దున్నేరు. ఈ నవలలో భూస్వామి పెదరెడ్డి. అతని దళారి వెంకటాద్రి. ముప్ఫై కుటుంబాలు, ఒక రంపాల కుటుంబము ఉన్న హరిజనవాడ నవలకు ప్రధాన భూమిక. కథ ప్రధాన ఇతివృత్తం స్మశానాన్ని దున్నటం, దానిలో దొరికిన బంగారు నాణాల పంపకం. పెదరెడ్డి చెరుకు వెయ్యడానికని గవర్నమెంటు భూమి, తరతరాలుగా హరిజనులకు స్మశానంగా ఉపయోగపడుతున్న భూమిని త్రవ్వించడానికి మొదలుపెడతాడు. దాని పెత్తందారీతనం అంతా వెంకటాద్రికి అప్పచెబుతాడు స్మశానం త్రవ్వుతుండగా బంగారునాణాలు దొరుకుతాయి. ఆ పంపకంలో రంపాల వంశానికి చెందిన వీరభ దుణ్ణి తగాయిదావలన కొట్టి ఒక ప్రక్కన పడేసి తక్కిన హరిజనులంతా నాణాలను పంచుకుంటూరు. ఈ విషయం వెంకటాద్రికి వీరభద్రుడు చెబుతాడు. వెంకటాద్రి వీరభద్రుణ్ణి చావచితకబాది హరిజన కూలీల దగ్గర్నుంచి నాణాలు తీసుకుపోతాడు. వీరభద్రుణ్ణి గూడెం నుంచి బహిష్కరించమంటాడు. వీరభద్రుడికి వ్యాసముని పరిచయమవుతాడు. వ్యాసముని గతంలో పెదరెడ్డివల్ల చెయ్యని నేరానికి శిక్ష అనుభవించినవాడు. వీరభద్రుడి భార్యను, పిల్లలను చెరిచి, వీరభద్రుణ్ణి కొట్టి హరిజనులు పోతారు. వ్యాసమునివద్ద ప్రతిన తీసుకొని వీరభద్రుడు చచ్చిపోతాడు. అర్ధరాత్రి గూడెం యావత్తు దగ్ధం అవుతుంది. కేసు విచారణకు వస్తుంది. బంగారు నాణాల రహస్యం బయటపడుతుంది. వెంకటాద్రి పోలీసులతో బంగారు నాణాలు పెదరెడ్డి కిచ్చానంటాడు. పెదరెడ్డి అంగీకరించడు. చివరికి పెదరెడ్డి ప్రభావంతో వెంకటాద్రికి, వ్యాసమునికి, హరిజనులకు పది సంవత్సరాలు శిక్షపడుతుంది. శిక్షానంతరం వాళ్ళందరూ కలసి పెదరెడ్డిని చంపుతారు. ఇతివృత్త నిర్వహణలో రచయిత మంచి నేర్పుని ప్రదర్శించారు. హరిజనులలో ఇప్పటికీ మిగిలిఉన్న బానిస భావాలను, డబ్బుకోసం వాళ్ళు అమ్ముడుపోయే విధానాన్ని రచయితకు సూక్ష్మాంశ పరిశీలనతో కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. వెంకటాద్రిలాంటి దళారులు కూడ మార్పు చెందటం పరిస్థితుల ప్రభావం. సమాజంలో జరుగుతున్న దోపిడీలకు, దౌర్జన్యాలకు పీడితవర్గం ఒకటిగా నిలిచి పోరాడటమే పరిష్కారమార్గంగా సూచిస్తూ ఈ నవల ముగుస్తుంది. భావంలో ఏనాడో వచ్చిన తిరుగుబాటు ఆచరణాత్మక మవుతుందని నవల ముగింపు ధ్వనిస్తున్నది.

శతాబ్దాల నిశ్శబ్దం

[వెల : 7/, దశరథ్, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ - 520 001.]


విశాలాంధ్ర ప్రచురణాలయంవారు ఇచ్చిన మూడవ బహుమతి నవల 'శతాబ్దాల నిశ్శబ్దం.' ఈ నవలలో చంద్రారెడ్డి ప్రధానమైన పాత్ర. పిచ్చిరెడ్డి, శంభుడు చంద్రారెడ్డికి సంపూర్ణ బానిసలు. ఎన్నో తరాల నుంచీ మాదిగగూడెం చంద్రారెడ్డికి సేవ చేస్తున్నది. "నీ తాత దొర తండ్రికి ఊడిగంచేసి, నేను దొరకు చేత్తన్న. నువ్వు దొర కొడుకులకు చెయ్యాల్నాయె మరిగింతె" అని గంటయ్య కొడుక్కిచెబుతాడు. చంద్రారెడ్డి కుటుంబానికి ఊడిగం చెయ్యని మాదిగ ఆ గూడెంలో లేడు. యాదగిరి మాస్టారుగా ఆ గూడెం ప్రవేశించిన తరువాత అక్కడి పరిస్థితులు క్రమంగా మారటం మొదలు పెడతాయి. మాదిగ గూడెంలో హేతువిచారం ఆరంభమయింది. గూడెం మునుపటిలా లేదని చంద్రారెడ్డి తెలుసుకున్నాడు. తన స్వార్థానికి లచ్చిని, పోలయ్యను, పంతుల్ని, వీరన్నని దారుణంగా చంపించాడు. ఫలితంగా గంటయ్య చంద్రారెడ్డిని వెనుకగా కత్తితో పొడిచి చంపుతాడు.

చంద్రారెడ్డి ఒక వ్యవస్థకు ప్రతినిధి. గంటయ్య మరో వ్యవస్థకు ప్రతినిధి. పంతులు యాదగిరి అణగునవున్న వాళ్ళను పైకి తెద్దామనే ప్రయత్నంలో హత్య చేయబడ్డాడు. గంటయ్య యుగయుగాలనుంచీ తన జాతికి జరుగుతున్న ఘోర అన్యాయాలకు కారణభూతమైన వ్యవస్థకు మూలస్తంభమైన మనిషిని చంపి పగ దీర్చుకొన్నాడు. ఈనాడు సాగుతున్న దోపిడీ విధానం ఇంకా ఎంతోకాలం సాగదని చెప్పడం ఈ నవల మూలతత్త్వం.

శ్రీ టి. ఎల్. కాంతారావు

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.

BHARATI April 7th, 1980 Regd. No. H/VJ-70



"సాంప్రదాయ సిద్ధమయిన
భారతీయ ఔషధాలకి
ప్రత్యేకమయిన శక్తివుంది.
ఉదాహరణకి,
అమృతాంజన్."

ప్రకృతిలో లభించే అత్యంత
శక్తివంతమయిన పది మూల
ఔషధాలతో అమృతాంజన్ తయారు
చేయబడుతోంది. అంటే అమృతాంజన్
చాలా శక్తివంతమయినది.

అందుచేత అమృతాంజన్
తలనొప్పులకు, జలుబులకు,
వంటినొప్పులకు, బెణుకులకు
శీఘ్రంగానూ, నిశ్చయంగానూ
ఉపశమనం కలిగిస్తుంది.
అంతేకాదు అమృతాంజన్
సురక్షితమయిన బాధా నివారిణి.

అమృతాంజన్ :
80 సంవత్సరాలకు పైబడిన
నమ్మకమైన దివ్య
ఔషధము

AM-2148

అమృతాంజన్

తలనొప్పులకు .జలుబులకు.
వంటినొప్పులకు.బెణుకులకు

